# బతుకాట

డా॥ వి.ఆర్.రాసాని



అమెరికావారి 'తానా'
అవార్డు పొంది,
నవ్యాంధ్రప్రదేశ్ డిగ్రీ మొదటి
సంవత్సరానికి పాఠ్యాంశంగా
వున్న విశిష్ట నవల.

అమెరికావారి 'తానా' అవార్డు పొంది,

నవ్యాంధ్రప్రదేశ్ డిగ్రీ మొదటి సంవత్సరానికి పాఠ్యాంశంగా వున్న విశిష్ట నవల.

# బతుకాట



డా॥ వి.ఆర్. రాసాని

విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్

విజయవాడ

**BATUKAATA** - Dr. VR RASANI'S

ప్రచురణ నెం. : 2350/593

ప్రతులు : 2000

ప్రథమ ముద్రణ : సెప్టెంబరు, 2015

టైటిల్ డిజైన్ : గిరిధర్

© రచయిత

**వెల : ₹ 150/-**

**ప్రతులకు**

**విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్**
33-22-2, చంద్రం బిల్డింగ్స్
చుట్టుగుంట, విజయవాడ-520004
ఫోన్ : 0866-2430302
Email : vphpublish@gmail.com

**విశాలాంధ్ర బుక్‌హౌస్**
విజయవాడ, విశాఖపట్నం,
అనంతపురం, గుంటూరు
తిరుపతి, కాకినాడ, ఒంగోలు
శ్రీకాకుళం, కడప, విజయనగరం

**హెచ్చరిక :** ఈ పుస్తకంలో ఏ భాగాన్నైనా పూర్తిగా కానీ, పాక్షికంగా కానీ కాపీరైట్ హక్కు కలిగినవారి నుండి లేక ప్రచురణకర్తల నుండి ముందుగా రాతపూర్వక అనుమతి పొందకుండా ఏ రూపంగా వాడుకున్నా కాపీరైట్ చట్టరీత్యా నేరం.

**ముద్రణ : విశాలాంధ్ర విజ్ఞాన సమితి ముద్రణాలయం - విజయవాడ**

# చదరంగంలో ఏ పావు ఎక్కడ?

**"ఈ** జగమంతా ఒక నాటక రంగం. స్త్రీ పురుషులందరూ ఇందులో పాత్రధారులే!" 'As you like it' అన్న నాటకంలో విలియం షేక్స్పియర్ చెప్పిన మాటలను తరచు చాలామంది ఉదహరిస్తుంటారు. నిజానికి ఈ భావన ప్రాచీన భారతీయులకేమీ కొత్త కాదు. ఈ జగత్తంతా ఒక నాటకమనీ, దానిని నడిపించేవాడు ఆ పరమాత్మ అనీ భావించి ఆయనను 'జగన్నాటక సూత్రధారి' అన్నారు. ఆయన సూత్రధారి అయినపుడు సహజంగా మనందరమూ పాత్రధారులమే. ఎవరి పాత్రను వారు నిర్వహించి వెళ్ళిపోతుంటారు. కొన్ని పాత్రలు అభిమన్యుని లాగా కొద్దిసేపే కనిపిస్తాయి. మరికొన్ని ధృతరాష్ట్రునివలె చివరికంటా ఉంటాయి. ఏ పాత్ర ఎంతసేపు కనిపిస్తుందనే దాన్ని నిర్దేశించేది కూడా దర్శకుడే.

మనతెలుగులో నాటకానికి 'ఆట' అన్నపేరు కూడా ఉంది. బొమ్మలతో ఆడించే నాటకం 'బొమ్మలాట' – 'తోలు బొమ్మలాట' లాగా. ఇప్పటికే పల్లెలలో నాటకాలు ఆడుతున్నప్పుడు "ఈరోజు ఆటేంటి?" అనో, "ఈరోజు ఏమాడుతున్నారు?" అనో అంటూంటారు. అందాకా ఎందుకు – సినిమాలు నాటకాలను త్రోసిరాజన్న ఈ కాలంలో కూడా "ఫలానా హాల్లో ఏ సినిమా ఆడుతోంది?" అని పట్నవాసులు కూడా అనడం మామూలే. ఈ 'ఆట' అన్న పదాన్ని తమిళ, మళయాళ, కన్నడ ప్రజలు కూడా వాడుతారు. 'కుదురై ఆట్టం' (గుఱ్ఱాల నాట్యం), 'మోహిని ఆట్టం', 'కూడియాట్టం', 'కోలాట'... ఈ విధంగా.

సినిమాలు రాకముందు బహిరంగ ప్రదేశాలలో ప్రజలకు వినోదాన్ని అందించే సాధనాలు నాటకాలు మాత్రమే. ప్రాచీన కాలం నుంచీ మనదేశంలో నాటకాలను రచించడం, ప్రదర్శించడం ఉన్నట్టిదే. విరాటుని కొలువులో బృహన్నల రూపంలో అర్జునుడు నర్తించినది నాటకంలో ఒక భాగమే. 'కాదంబరి', 'మృచ్ఛకటికం', 'అభిజ్ఞాన శాకుంతలం' వంటి సంస్కృత నాటకాలు సుపరిచితాలు. అయితే యక్షగానాలు, వీధినాటకాలు వంటివి తొలినాటి రంగస్థల నాటకాలకు పూర్వరూపాలు. వీధినాటకాల ఆవిర్భావం గురించిన కథ ఒకటుంది. ఏదో ఒక కారణం చేత ఒక ముని కొందరు బ్రాహ్మణులను శపించాడట

– "మీరు ఊరూరా తిరుగుతూ, వీధి నాటకాలు వేస్తూ పొట్ట పోషించుకుందురు గాక! మీకు పూట గడుస్తుందే కాని, ఆస్తిపాస్తులుండవు"అని. వారే "విప్ర వినోదులు" అన్న పేరుతో ప్రసిద్ధి కెక్కారు. 'వినోదాన్నందించే విప్రులు' కనుక వీరు 'విప్ర వినోదు'లయ్యారు. కూచిపూడి నాట్యకారులు వీరి సంతతి వారేనని చెప్తారు. అయితే విప్ర వినోదులు ఆడే 'యక్షగానం' వంటి నాటకాలలో పాత్రధారులందరూ వీధిబ్రాహ్మణులు కాగా, మిగిలిన వారు ఏ కులంవారైనా పాత్రలు ధరించేవారు.

ప్రత్యేకంగా నిర్మించిన వేదిక మీద నాలుగైదు గంటల పాటు నడిచే నాటక ప్రక్రియ 'యక్షగానా'లతో మొదలైంది. పౌరాణిక నాటకాలలో 'యక్ష, గంధర్వ, కిన్నెర, కింపురుష' అన్న పదాలు వింటుంటాం. ఇవన్నీ జాతులు. కిన్నెరలూ, కింపురుషులూ నాట్యంలో ప్రసిద్ధులైతే – యక్షులూ, గంధర్వులూ గానానికి ప్రసిద్ధి. అందుకే అలరించిన గానాన్ని 'గంధర్వ గానం' అంటాం. తొలుదొల్త యక్షులు ప్రారంభించిన కారణాన 'యక్షగానం' అన్న పేరొచ్చింది. ఈ యక్షగానాలన్నీ పౌరాణిక గాథల్ని ఆధారం చేసుకుని రాసినట్టివే. వీటిలో వచనం, పద్యం, పాట సమ్మిశ్రితంగా ఉంటాయి. ఈ యక్షగానాల రచన, ప్రదర్శనలు విజయనగర పాలకుల – మధుర తంజావూరులను ఏలిన నాయకరాజులు– ఆ తర్వాత తంజావూరును పాలించిన మహారాష్ట్రుల ఏలుబడిలో విస్తృతంగా జరిగాయి. శరభోజి, శివాజి వంటి తంజావూరు నేలిన మహారాష్ట్ర రాజులు తెలుగులో స్వయంగా యక్షగానాలు రచించి, ప్రదర్శింపజేసి ప్రాచుర్యం కల్పించారు.

తొలినాటి యక్షగానాలు ఈనాడు ఇంచుమించుగా అంతరించిన కళ. అయితే 'యక్షగాన' అన్న పేర పశ్చిమ కర్ణాటకలో, 'భాగవత మేలా' అన్న పేరుతో తమిళనాడులోని మేళత్తూరులో, ఇంకా కొన్ని ఊళ్ళలో బ్రతికేవుంది. కర్ణాటకలోని యక్షగానాలలో భాష కన్నడం కాగా, తమిళనాడులోని అన్ని యక్షగానాలలోని భాష తెలుగే. అలాగే మన ఆంధ్రదేశానికి సంబంధించినంత వరకు చిత్తూరు జిల్లాలో ఇప్పటికీ యక్షగాన ప్రదర్శనలిచ్చే వారున్నారు. వంశానుగతంగా వచ్చిన కళ కూడు పెట్టకపోయినా – నమ్ముకున్న కళను వమ్ము చేసుకోలేక కొనసాగించే కొన్ని కుటుంబాలూ ఉన్నాయి. ఈ కుటుంబాల వారు తిరుమల బ్రహ్మోత్సవాలకు వెళ్ళి వీటిని ప్రదర్శించడమే కాక, భజన బృందాల నేర్పరచి పాండురంగ భజనలూ, చెక్కభజనలు, కోలాటం వంటి వాటిని ఆడడం ఇప్పటికీ జరుగుతున్నదే. వీటిని బ్రహ్మోత్సవాలలో చూడవచ్చు. టీ.వీ. తెరపై తిలకించవచ్చు. ఈనాటి మన కూచిపూడి నాట్యరూపకాలన్నీ యక్షగానాల నుంచి పరిణతి చెందినవే. అటువంటివే కేరళలోని కథాకళి, మోహినీ ఆట్టం, కూడియాట్టం వంటివి.

ఇంక... తెలుగునాట రంగస్థల నాటకాలకు సురభి కంపెనీకి మూల పురుషుడైన

పనారస గోవిందరావుగారిని గురించి చెప్పుకుంటాం. ఈవంశస్థుల గురించి వారు ఇలా తెలుపుతారు. ఛత్రపతి శివాజి మహారాజు కొలువులో కొందరు సేనానులుగా ఉండేవారట. శివాజీ మరణానంతరం ఆ రాజ్యాలన్నీ తురకల వశమై అల్లకల్లోలం కావడం, వారి అకృత్యాలు భరించలేక వారు కుటుంబాలతో సహా దక్షిణాదికి వలస పోవడం జరిగిందట. అలా వలస పోయిన కుటుంబాలలో కొన్ని కర్నూలు, అనంతపురం వంటి రాయలసీమ జిల్లాలలోనూ, ఎక్కువ కుటుంబాలు చిత్తూరు, కడప జిల్లాల్లోనూ స్థిరపడ్డాయట. కాలక్రమంలో వారందరూ స్థానిక ప్రజలతో కలసిపోయి వారి ఆచార, వ్యవహారాలు, సాంప్రదాయాలు అలవర్చుకున్నారు. చాలామందికి మరాఠీ రాదు. ఇళ్ళలోకూడా తెలుగే మాట్లాడుతారు. అయితే కొన్ని అసలు పేర్లు తెలుగువే అయినా – వ్యావహారిక నామాలుగా మరాఠీ రూపాన్ని సంతరించుకుంటాయి. ఉదాహరణకి నాగరాజు 'నాగోజీ'గా, సిద్ధప్ప 'సిద్ధోజీ'గా, వెంకన్న 'వెంకోబరావు'గా – ఇలా మారతాయి.

చిత్తూరుజిల్లాలోని 'కుప్పం' సమీపంలో 'యామిగానిపల్లె' అన్న గ్రామం వుంది. అక్కడ రంగస్థల కళకే అంకితమైపోయిన కుటుంబం ఒకటుంది. వారి ఆదిగురువు 'అణ్ణావువటేరావు. ఆయన ఎప్పుడు పుట్టాడో తెలీదు కాని, 1867లో మరణించినట్లు ఆయన సమాధిమీది శిలాఫలకం చెప్తుంది. ఆయన కాలం నుంచి ఐదవతరం వాడైన సిద్ధప్ప అలియాస్ సిద్ధోజీ వరకు గల ఐదుతరాల కథే. డా॥ వి.ఆర్.రాసాని రచించిన 'బతుకాట' నవల ఇతివృత్తం. ఆ వంశంవారే ఆ నాటక బృందాలకు గురువులు. ప్రతి ఉగాదినాడు ఆ నలుగురి సమాధులున్న మామిడితోపుకి వెళ్ళి పూజలు జరిపి, ఆ తర్వాత గజ్జెకట్టడం సాంప్రదాయం. మొదటి నాలుగు తరాల కాలంలోనూ ఆ కుటుంబం వారు ప్రదర్శనలిస్తూ వివిధ ప్రాంతాల ప్రజలను అలరిస్తుండేవారు. వారిచ్చే డబ్బు, ఇతర సామగ్రితో వారి జీవితాలు ఏ చీకూచింతా లేకుండా సాగిపోతుండేవి.

సిద్ధోజీ తరం వచ్చేసరికి పరిస్థితులు నానాటికీ దారుణంగా దిగజారసాగాయి. నాటక సమాజాలలో పోటీలు వచ్చాయి. ఎదుటివాడిని దెబ్బతీయాలన్న కుట్రలు, కుతంత్రాలు, రాజకీయాలు అన్నీ చోటు చేసుకున్నాయి. నాటకాల పట్ల ప్రజల ఆదరణా తగ్గిపోయింది. పొయ్యిలో పిల్లి లేవని పరిస్థితులూ, ఏ పూట గింజలు ఆ పూట వెతుక్కోవలసిన దుర్గతి, కరువులు, కాటకాలు, గత్యంతరం లేక దుక్కిటెద్దును కూడా కసాయివాడికి అమ్ముకోవడం.... ఇవన్నీ మనసును కలచివేసే కఠిన వాస్తవాలు.

సిద్ధప్ప ఎద్దును కసాయివాడు లారీ ఎక్కించి దాని కాళ్ళను దుడ్డుకట్టతో విరగకొట్తాడు. కాళ్ళు విరిగిన ఆ పశువు కూలిపోతుంది. అలాచేస్తే లారీలో ఎక్కువ పశువులు పట్తాయి. ఒకదాని మీద ఒకటి పడేసి కుక్కుతారు. విరిగిన కాళ్లతో ఆ మూగజీవాలు చేసే ఆర్తనాదాలు

ఆ కసాయివాడిని తప్ప అందరి హృదయాలను కలచివేస్తాయి. బెంగుళూరు వెళ్ళే దాకా ఆ పశువులు ఆ నరకయాతన అనుభవించవలసిందే. చట్టాలెన్ని వున్నా, జీవకారుణ్య సంఘాలు ఎంత మొత్తుకుంటున్నా – ట్రక్కులలో తరలించే పశువుల దుర్గతి దేశమంతా ఇంతే! నవలలో ఈ ఘట్టాన్ని చదువుతున్నప్పుడు నాకు గతం గుర్తుకి వచ్చింది. పదేళ్ళ క్రితం నేను ఆంధ్రప్రభ వీక్లీలో 'చిత్తూరు జిల్లాలోని గ్రామదేవతలు' అన్న పుస్తకాన్ని సమీక్షించాను. అందులో గ్రామ దేవతలకు జంతువులను బలి ఇచ్చేముందు ఎంత క్రూరంగా, ఎంత కర్కశంగా హింసిస్తారో వర్ణించడం జరిగింది. దున్నపోతుల వంటి వాటి కాళ్ళు నరికేసి, విగ్రహం దగ్గరకి ఈడ్చుకెళ్తారట. మరెన్ని విధాలో హింసించి అప్పుడు మెడ నరికి బలిస్తారట. ఇటువంటివి చాలా వున్నాయి అందులో. ఆ పుస్తకం చదివాక కొన్ని రోజుల వరకు నా మనసు మనసులో లేదు. నేనంతటి వ్యాకులత పడిన సందర్భాలు చాలా అరుదు. బలియ్యదలచుకున్నప్పుడు ఒక్క వేటుతో తల నరికితేపోలా? చంపేటప్పుడైనా ఆ మాత్రం కరుణ చూపకూడదా? అంత దారుణంగా హింసించాలా? 21వ శతాబ్దంలో వున్న మన గ్రామాలలోని పరిస్థితి ఇది! మన ప్రజల 'భక్తి' ఇది!! చట్టాలున్నాయి – కానీ, మనుషుల మనస్సులో మార్పు రానప్పుడు – ఏ చట్టం ఏం చేయగలదు?

రాసాని గారి 'బతుకాట' నవల నిజంగా దృశ్యకావ్యం. ఆయన శైలి, కథనం ఎంతో ఉన్నతంగా ఉన్నాయి. పుస్తకం మొదలు పెట్టే చివరివరకు ఆపకుండా చదివిస్తుంది. త్రీ–డి సినిమాలు చూసిన ప్రేక్షకులకి మామూలు సినిమాలకీ, త్రీ–డి సినిమాలకూ గల తేడా అర్థమవుతుంది. త్రీ–డి చిత్రాలలో లోతు ఉంటుంది. అంటే.... దృశ్యం ఒక కాన్వాస్ మీద గీసిన బొమ్మలాగా కాకుండా, మన ముందరే జరుగుతున్నట్లుంటుంది. రాసాని గారి కథనంలో ఈ త్రీ–డి ఎఫెక్ట్ ఉంది. చదువుతుంటే ప్రతి సంఘటనా మన కళ్లముందే జరుగుతున్నట్లుంటుంది. ఆ పాత్రలను, సంఘటలనూ మౌనంగా చూస్తున్న పాత్ర అయిపోతాం మనం. ఈ అద్భుత శిల్పాన్ని కథనంలో ప్రవేశపెట్టడం – ప్రజ్ఞ, ఉపజ్ఞ ఉండి, బాగా చేయి తిరిగిన రచయితకే సాధ్యం. ఇన్ని విశిష్ఠతలు ఈ నవలకి ఉన్నాయి కనుకనే... ఇది 'తానా' వారి ప్రతిష్ఠాత్మక బహుమతిని పొందగలిగింది. ఆ పురస్కారానికి ఈ నవల అన్ని విధాలా అర్హత కలిగి వుంది. మంచి నవలను రాసినందుకే కాక, ప్రతిష్ఠాత్మకమైన గౌరవాన్ని కూడా పొందినందుకు రాసాని గారిని మనసారా అభినందిస్తున్నాను.

రాసాని గారి 'బతుకాట' నాటి రంగస్థల నాటకాలకు సంబంధించిన ఒక ఎన్సైక్లోపీడియా వంటిది. నాటకాలకు రంగస్థలం సిద్ధం చేయడం, రిహార్సల్స్, ప్రాంప్టింగ్,

ఆహార్యం, రాగం, తాళం... ఇలా ఒకటేమిటి – ప్రతి చిన్న విషయం కూడా ఎంతో వివరంగా తెలుపడం జరిగింది. ఈ కళారూపంలో పరిశోధన చేయదలచుకున్న వారికి ఇది గొప్ప రెఫరెన్స్ బుక్‌గా పనికివస్తుంది. పద్యనాటకాలూ, పౌరాణిక నాటకాల పరదా వెనక్కి పోతున్న ఈ రోజుల్లో ఈ వివరాల నన్నిటినీ గ్రంథస్థం చేయడం – కళారంగానికి గొప్ప సేవ చేయడమే. మరో విషయం... ఆదిగురువైన అణ్ణావు వటేరావు ఒక ఉత్తమ సాంప్రదాయాన్ని ప్రవేశపెట్టారు. వారూ తమ అనుభవాలను గ్రంథస్థం చేయాలనీ, పాత పుస్తకాలు పాడయిపోతే వాటిని తిరగరాయాలనీ ఆదేశించారు. వీటిని సిద్ధోజీ వరకు అందరూ పాటించారు. ఇందువల్ల తరతరాల వారి చరిత్ర తరువాతి తరాలకూ తెలుస్తుంది.

'బతుకాట' పేరుకి నవలే కాని, నిజానికి ఇది నిజమైన వ్యక్తుల జీవితగాథ అనిపిస్తుంది. నిజజీవితాలను కథాత్మకంగా మలచి, నవలీకరణ చేసినట్లు స్పష్టమవుతుంది. ఇది చాలా మంచి ప్రయత్నం – చాలా తక్కువ రచయితలు చేసిన ప్రయోగం.

ఈ 'బతుకాట' కొన్ని తెలియని విషయాలను, మరికొన్ని ఆసక్తికరమైన అంశాలను బహిర్గతం చేస్తుంది. 'సిపాయిల తిరుగుబాటు' అన్న పేర బ్రిటీష్‌వారు వ్యవహరించిన 'ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామం' 1857లో జరిగినట్లు మనం అనుకుంటుంటాం. కానీ, 1806లోనే దేశవ్యాప్తంగా సిపాయిలు తిరగబడి చాలామంది బ్రిటిష్ వారిని చంపివేశారట. చిత్తూరుజిల్లాలో ఈ అణ్ణావు వంశీయుడు ఇందులో పాల్గొన్నాడని ఈ నవల చదివితే తెలుస్తుంది.

తర్వాత భారతాంశాలతో వేసే నాటకాలలో ఈ బృందం వారు పోతరాజు విగ్రహాన్ని ముందుపెట్తారట. ఈ పోతరాజు పదహారణాల తెలుగు గ్రామదేవుడు. మరి పాండవులకీ, ఈ పోతరాజుకీ గల బాదరాయణ సంబంధమేమిటి? ఆ కథను కూడా వివరించారు రాసాని.

'బతుకాట' అంతా కష్టాలూ, కన్నీళ్ళతో కూడిన జీవిత చిత్రణం అనుకోనక్కరలేదు. సందర్భోచితంగా హాస్యాన్నీ ప్రవేశపెట్టారు రాసాని. 'సారంగధర' నాటకంలో సారంగధరుడు పావురాన్ని ఎగురవేస్తారు. అది అక్కడే చుట్టూ తిరిగి హార్మోనిస్టు బట్టతలపై రెట్ట వేసిందట. ఇటువంటివి మంచి రిలీఫ్...!

రాసాని నవలను చిత్తూరు మాండలికంలో రాశాడు. కొన్ని అర్థం కావనుకున్న మాటలకు బ్రాకెట్లలో ప్రచారంలో వున్న అర్థాలు ఇచ్చాడు. చిత్తూరు మాండలికాన్ని బాగా ప్రాచుర్యం చేసినవారు పులికంటి కృష్ణారెడ్డి, నామిని సుబ్రహ్మణ్యం నాయుడు వంటివారు. అంతటి సమర్థవంతంగానూ రాసాని ఈ మాండలికాన్ని వాడి, పాఠకులను ఒక వాస్తవలోకంలోకి తీసుకెళ్ళారు ఈ నవలలో. అలాగే 'మంచోడి బుద్ధి మాంసం దగ్గర

తెలిసినట్లు!' వంటి సామెతలను కూడా పాఠకులకు పరిచయం చేశాడు రాసాని.

'జీవన సమరం', 'బ్రతుకు పోరాటం' వంటి మాటలు అంటుంటాం, వింటూంటాం. పోరాటం అన్నా, సమరం అన్నా కేవలం సంఘర్షణకే పరిమితమవుతుంది. కానీ, 'బతుకాట' అన్నప్పుడు ఇందులో సంతోష సమయాలూ ఉంటాయి. సంఘర్షణలూ ఉంటాయి. ఈ రెండూ కలిసినదే 'బతుకాట' – చక్కని అచ్చతెలుగు పదం, ఇంతటి అర్థవంతమైన పేరు నవలకి పెట్టడంలోనే రచయిత ప్రజ్ఞ ప్రదర్శితమవుతోంది. అరుదుగా వచ్చే ఇటువంటి మంచి నవలను అందించిన రాసానిని మరోసారి మనసారా అభినందిస్తున్నాను.

అమెరికాలో నీగ్రో సంతతికి చెందిన రచయిత రాసిన 'రూట్స్' అన్న నవలకు నోబెల్ బహుమతి వచ్చింది. ఆ నవలలోని ఇతివృత్తం – గతించిన తరాలు స్వదేశం ఆఫ్రికాలోనూ, ఆ తర్వాత తెల్లవాళ్ళ చేతుల్లో బానిసలుగానూ పడ్డ పాట్ల గురించి, వారి బాధలు కళ్ళకు కట్టినట్లు రచయిత వర్ణించగలిగాడు. కనుకనే ఆ నవలకు నోబెల్ బహుమతి వచ్చింది. ఈ 'బతుకాట' కూడా ఇంగ్లీషులోకి అనువాదం చెందితే దానికి ప్రపంచ పరిగణన వస్తుంది అనడంలో ఎట్టి సందేహం లేదు. అలా చేస్తూ ఇది కూడా ప్రపంచ ఉత్తమ సాహిత్యంలో ఒక ఆణిముత్యం కాగలదు. ఆంగ్లానువాదం దిశగా ప్రయత్నించమని రాసాని గారికి సలహా ఇస్తున్నాను.

**– కె.ఆర్.కె. మోహన్**

# నా మాట

**"కావ్యేషు నాటకం రమ్యం!"** అన్నారు మన పూర్వీకులు.

నిజమే.... చర, స్థిర కళల సమాహారంగాను, సర్వకళల్లో మేల్బంతిగాను గణుతికెక్కింది నాటకం. వేదకాలం నుంచే ఈ నాటకం వుందంటారు పరిశోధకులు. అందుకే...

"Indian stage traces its heritage to the Vedas" అంటాడు Ikbal Kaul. మానవుడు భాషనేర్చిన తర్వాత ఆదిమంగా పుట్టిన కళ చిందులాంటిది. దాన్నే 'నృత్తం' అన్నారు. దాంతోపాటు పుట్టింది పాట. ఆ ఆటా పాటా కలిస్తేనే నృత్యమైంది. ఆ నృత్యం నాటక కళగా రూపుదిద్దుకొని ఉంటుందని ఊహించడానికి శాస్త్రపరిజ్ఞానంతో పనిలేదు. అలాంటి అతి ప్రాచీనమైన కళను అనాదిగా చూస్తూ, ఆనందించి తరించింది మానవ సమాజం. అలాగే కళనే వృత్తిగా కలిగిన కుటుంబాలూ ఎన్నో ఉన్నాయి. కూచిపూడి వారికి, సురభివారికి, ఒకప్పుడున్న దేవదాసీలకు, ఇంకా ఎన్నో ఇతర సమాజాల వారికీ జీవనాధారంగా కూడా మారింది నాటకం. 'వీధినాటకం' గా పిలవబడే ఈ జానపదకళతో కొన్ని రోజుల పాటు జరిగే ప్రత్యేకమైన ఉత్సవాలు కూడా ఎన్నో ఉన్నాయి. ఉత్తర భారతదేశంలో 'రామలీల', కేరళలో 'తెయ్యం', రాయలసీమ జిల్లాల్లో జరిగే 'భారత యజ్ఞాలు' చాలా రోజులపాటు ఎంతో దీక్షగా జరుపబడే ఇలాంటి ఉత్సవాలు. వీటిలో భారతోత్సవాలు వంటి సుదీర్ఘ సమాహార కళాజాతరలు ప్రపంచంలోనే లేవంటే అతిశయోక్తి కాదు.

చిత్తూరుజిల్లాలో ఎక్కువగా జరుపబడే భారతోత్సవాలు జరగని మండలం వుండదు. ఆమాటకొస్తే రాయలసీమలోనే ఈ వీధినాటకాలను ప్రదర్శించని పల్లె వుండేది కాదు. ఈ వీధినాటకాలనే జీవనాధారంగా స్వీకరించిన కుటుంబాలు చాలా ఉన్నాయి. కుప్పం మండలంలో కంగుంది, కొత్తెండ్లు, గుడిపల్లి వంటి ఎన్నో పల్లెల్లోని కుటుంబాలు ఈ కళకు రాజపోషకాలుగా వుండేవి. అయితే నేటి సాంకేతిక శాస్త్ర సౌకర్యాలతోను, సినిమాల ప్రభావంతోను, ఇబ్బడి ముబ్బడిగా వచ్చిపడిన టీవీ చానల్స్‌తోను, రీసెంటుగా విస్తరిస్తున్న అంతర్జాలంతోను, మానవజీవనంలో పెరిగిన వేగం ఫలితంగా నేడు కళలు కనుమరుగై పోతున్నాయి. వాటిని నమ్ముకొన్న జీవితాలు కకావికలమైపోతున్నాయి. ఇలా ఈ కళ

పూర్తిగా నశించిపోకముందే ఏదోరూపంలో రికార్డు చేయాలన్న తపనతోనే ఈ నవల రాయబడింది. దీనికి 2001లో అమెరికాలోని తెలుగువారి 'తానా' అవార్డు కూడా వచ్చింది. దీన్ని 2005లో ముద్రించగా తెలుగు విశ్వవిద్యాలయం ఎన్.టి.ఆర్. ఆడిటోరియంలో జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీత రావూరి భరద్వాజ ఆవిష్కరించారు. ఆ తర్వాత ఇది కన్నడంలోకి కూడా అనువదించబడి, ద్రవిడ విశ్వవిద్యాలయం ద్వారా ముద్రింపబడి మంచి పేరు తెచ్చుకుంది. ఇది అయిదు తరాల కళాకారుల విశిష్ట కథాంశంతో రాయబడింది. ప్రస్తుతం ఈ నవలను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం డిగ్రీ మొదటి సంవత్సరం విద్యార్థులకు 2015 నుంచీ పాఠ్యాంశంగా నిర్ణయించింది. తమిళనాడుకు 'గిరిగ' నృత్యసంస్కృతి వుంది. కర్ణాటకకు 'యక్షగాన' సంస్కృతి వుంది. తెలంగాణాకు 'పాట' సంస్కృతి వుంది. సీమాంధ్రకు 'నాటక' సంస్కృతి వుంది. ఈ కోణంలో సీమాంధ్ర సంస్కృతిని అందరికీ తెలియజేసే అవకాశాన్ని పాఠ్యాంశరూపంలో కలిగించిన ఆంధ్రప్రదేశ్ హయ్యర్ ఎడ్యుకేషన్ వారికి, తెలుగు పాఠ్యాంశ నిర్ణయ కమిటీ సభ్యులకు నా ప్రత్యేక ధన్యవాదాలు.

ఉత్తమ విలువలు కలిగిన పుస్తకాలను ప్రచురించే విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ వారు మొదటినుంచీ నన్ను ప్రోత్సహిస్తూనే వున్నారు. ఆ విధంగానే మొదట జయంతి పబ్లికేషన్స్ వారు ముద్రించిన ఈ నవలను ఇప్పుడు తిరిగి రెండవ ముద్రణగా ప్రచురించడం నిజంగా ముదావహం. ప్రచురణకు పుస్తకాలను ఎంపిక చేయడంలోనూ, వాటిని ప్రచురించే విధానంలోనూ నాణ్యతలోను విశాలాంధ్రకు ఒక ప్రత్యేకత కలిగివుంది. ఈ క్రమంలో రచయితలకు అండగా వుండి మంచి రచనల ప్రచురణకు ఎప్పుడూ ముందుండే సాహితీ మిత్రులు విశాలాంధ్ర జనరల్ మేనేజర్ శ్రీ హరనాథరెడ్డిగారికీ, పబ్లిషింగ్ హౌస్ మేనేజర్ శ్రీ టి.మనోహర్‌నాయుడుగారికీ, ఎడిటర్ శ్రీ గడ్డం కోటేశ్వరరావుగారికీ ఈ నవలను పాఠకుల ముందుకు తీసుకువస్తున్న సందర్భంగా నా మనఃపూర్వక ధన్యవాదాలు.

తిరుపతి,
5-10-2015.

**డా॥ వి.ఆర్. రాసాని.**

# బతుకాట

***All the World' is a stage, and***
***all the men and women merely players.***

**'As you like it'** Act 2nd.

**- William Shakespeare**

**అ**ది మార్చి మాసం కావడం చేత సాయంత్రం మూడు గంటలు కావస్తున్నా ఎండ వేడిమి ఇంకా తగ్గడం లేదు. ఎండేసిన అలసంద గింజల్లో నల్లపురుగు మాదిరి వాడబారిపోయి కనిపిస్తున్నాడు గురువు.

గొర్లను చెరువుకు తోలుకెళ్ళి నీళ్ళు తాపించుకొచ్చి, కొట్టం వెనకనున్న బండల పందిరికింద వాటిని కట్టేసి, గాట్లో అంత ఉలవపొట్టు పోసి, ఉసూరుమంటూ వచ్చి, కొట్టంలో వున్న అరుగుపైన నడుం వాల్చాడు.

దానిపక్కనే ఉన్నపశువుల కొట్టంలో నుంచి పేడవాసనను మోసుకొస్తున్న గాలి ఆ ఇంట్లో జొరబడి గోడలకు తగిలి పతనమైపోతోంది.

నెరిసిన తెల్లటి జుట్టు, వృద్ధాప్యంతో ముడుచుకుపోయి వేలాడుతున్న చర్మం, గుంట కళ్ళు, కాస్త వంగిన నడుము, ఎప్పుడూ ఏదో ఒకటి వదురుతూ వుండే వైనం...!

అతని భార్య పూర్ణమ్మ కూడా అక్కడే కూర్చొని బెత్తెడెత్తున ఒక చిన్న ఇనుప రోలులో వేసి వక్క దంచుకుంటోంది. వాళ్ళ కోడలు నీలమ్మ, కొట్టాని కావలనున్న చుట్టింటి కడపలో కూర్చొని మల్లెపూల మాల కూర్చుకుంటోంది. ఇంట్లో నీలమ్మ కొడుకు పదేండ్ల రఃవణ నిద్రపోతున్నాడు. నీలమ్మ సంకబిడ్డె రొమ్ము చప్పరిస్తోంది.

"ఏమ్ముండా కొడుకులో ఏమొ? వీళ్లు గురువులకిచ్చే మర్యాద యిదేనా? ఛీ! ఛీ! అన్నేకారి జనం... అన్నేకారి జనం! పిల్ల పిల్లోళ్ళంతా పెద్దొళ్ళయేగుందికి ఆచారాలు, కట్టుబాట్లు రానురాను గాలికొదిలేస్తా వుండారు. మిడిమేళం కొడుకులు... కొంతేగాలం కొడుకులు...తుః...! ఈ పండక్కు పెద్దలకు గుడ్డలుపెట్టి, కాయ, కర్పూరం యిచ్చి వారసత్వం నిలపతామని పతిగ్గెనె చేసి, ఆటేసి మెప్పిస్తా వుండ్లా? వాళ్ళందించిన విద్దే గదా... కూడు బెడతా వుండేది?! ఆ విద్దె అందించిన కూడు దినే గదా వీళ్ళు, వీళ్ళ నాయన గారు, తాతగారూ పెద్దోళ్ళయ్యిండేది? ఆ యింగితగ్యానం లేకపోతే యట్టా?తుః.... తుః...

అన్నేకారి జనం! అన్నేకారి జనం!! నా బొందిలో పాణముండంగా ఆ ఆచారం పోనిస్తానా?! ఈళ్ళకంతా... సిన్నబ్బుట్నుంచీ నాకు తెలిసిండే విద్దెలన్నీ నేర్పించిందెందుకు?

సెక్కభజన నేర్పించినా! పాండురంగ భజన నేర్పించినా... కోలన్న నేర్పించినా! ఊరికంతా 'గురువు' అనిపించుకున్నా! గురు వనిపించుకునిందానికి వీళ్ళిచ్చే మరేదిదేనా? చూస్తా.... అదీ చూస్తా! నా గొంతులో ఊపిరాడతా వున్నంతవరకూ ప్రతి సంవత్సరం తిరుమల బెమ్మోత్సవాలకు భజన యాత్ర సాగిస్తానే వుంటా... ప్రతి ఉగాదికీ ఆట ఆడిస్తానే వుంటా...వదల్నంటే వదల్ను...అంతే! ఎవురెన్ని సెప్పినా విననంటే వినను. సచ్చి దోరుగా లమైనా సరే... వదల్ను గాక వదల్ను! ఆః... ఈ అన్నేకారి జనానికి నేనే పిల్చి 'ఆటెయ్యండ్రా' అంటా అడుక్కోవాల్నా? ఏమైనాగానీ గాక – 'గజ్జెపూజ' జరిపించే తీరతా.. ఆః....!"

– గొణుక్కుంటూనే దక్షిణం వైపున్న మరో కొట్టంలోకి ప్రవేశించాడు. గోడకున్న స్విచ్‌నొక్కి బల్బు వేశాడు. ఆ వెలుగులో... ఓ మూలవున్న పాతకాలం నాటి ఓ పెద్ద భోషాణం హుందాగా కనిపిస్తోంది. ఆ పెట్టెను సమీపించి, దానిపైనున్న గుడ్డలు అవీ కిందికి తోసి దాన్ని కళ్ళకద్దుకున్నాడు.

"ఓ భోషాణమా! ఎన్ని సంవత్సరాల నించి మా నట్టింట్లో నిలిచిండావో ఏమో? ఎన్ని తరాలు.. కనీసం మూడు తరాల కయినా సాచ్చిగా వుంటావనుకుంటా!" అనుకుంటూ భోషాణం తెరిచాడు.

అందులోని ఆటవస్తువులు అతని కళ్ళను జిగేలుమనిపించాయి.

విగ్గులు, బాణాలు, విల్లులు, గదులు, కత్తులు, కటార్లు, రకరకాల పూసల దండలు, చెవి, నాసికాభరణాలు, భుజకీర్తులు అన్నీ ఆ వెలుగులో ధగధగ మెరుస్తున్నాయి. ఆ నకిలీ వజ్రవైఢూర్యాలే అతని నిధినిక్షేపాలు.

ఇంకా అందులో రుద్రాక్ష మాలలు, కిరీటాలు, గౌన్లు, అర్ధాలం పెట్టె, మద్దెళ్ళు, కొన్ని నాటకాల పుస్తకాలు, దస్తావేజులు, చిటితాళాలు వున్నాయి. ఎన్నో తరాల నుంచీ

కాపాడుకొస్తున్న నిధిని చూస్తున్నంత ఆశగా, భక్తిగా, మురిపెంగా వాటిని చూస్తూ ఓ మూలనున్న రెండు పాతబడిన మద్దెళ్లను పైకితీసి దుమ్ము దులిపి పక్కన పెట్టాడు. ఆ తరువాత అందులోని పుస్తకాల గుట్టను తీసి ముందరేసుకున్నాడు. వాటిలో ఎన్నో రాతప్రతులు, ముద్రిత గ్రంథాలు వున్నాయి. వాటిలో చాలా వరకు నాటకాలే.

ఒక్కో పుస్తకాన్ని చేతుల్లోకి తీసుకుని దుమ్ము దులిపి,, అట్ట తెరచి చదివి... భోషాణంలో మట్టసంగా పెట్టసాగాడు. వాటిలో ఒక ఫుల్‌కాలికో బైండు నోట్‌బుక్‌ని తీసుకుని అట్ట తెరిచాడు. 'తరతరాల గురువుల చరిత్ర' అన్న అక్షరాలు కొట్టొచ్చినట్టుగా కనిపించసాగాయి. అవి దట్టమైన బ్లూ ఇంకుతో ముత్యాల్లా తీర్చిదిద్దిన అక్షరాలు. వాటిని చూడగానే ఒకప్పుడు తన తండ్రి చెప్పిన మాటలు చప్పున గుర్తుకొచ్చాయి.

"నీ కెప్పుడన్నా తీరుబడి వున్నప్పుడు నీ చరిత్రా రాసుకో.... గురువులు రాసిందే బుక్కు సిరిగిపోతే అదంతా యింకో బుక్కులో రాసిపెట్టు."

–ఆ మాటలు అప్పుడే చెబుతున్నట్లు చెవిలో గింగురుమన్నాయి.

ఒక్కసారి తల పంకించి, నిట్టూర్పుతో ఉంకించి మరోపేజీ తిప్పాడు.

తన తండ్రి చనిపోయేముందు చెప్పిన మరో మాటా అతని గుండెల్లో ప్రతిధ్వనించింది.

"ప్రతి ఉగాది నాడు... మనోళ్ళను చేర్పించి ఈ చరిత్ర చెప్పు... ఈ ఊర్లో వుండే ప్రతి ఒక్కరికీ ఈ చరిత్ర తెలియాల!"

ఆ మాటలు అతని గుండెల్లోనుంచి పెల్లుబుకి, చెవుల్లోకి పాకి అవి మరోసారి గింగిర్లెత్తాయి.

అందులో వున్న ప్రతి అక్షరం అతనికి గుర్తే! ప్రతి సంఘటనా అతనికి ఎరుకే!

"యిప్పుడెందుకయ్యా.. ఆ పని పట్టుకున్నావ్?" రోటిలో వేసి దంచిన వక్కపొడిని నోట్లో పోసుకుని చప్పరిస్తూ గొణిగింది పూర్ణమ్మ.

"నీకెందుకే బోసడీకే... నీ పని నువ్వు జూసుకో!" కసురుకున్నట్టన్నాడు సిద్ధప్ప.... ఉరఫ్ గురువు.

"ఈ ముసిలోళ్ళు ఎప్పుడూ కొట్టాడుకున్నిట్టే మాట్లాడుకుంటారు. యేం ముసిలోళ్ళో, ఏమో?!" విసుక్కుంది నీలమ్మ.

సిద్ధప్ప పుస్తకం మూసిపెట్టి, వాటినన్నింటినీ భోషాణంలో వేసి మూతపెట్టాడు. రెండు చేతుల్తో తబలాను పట్టుకొచ్చి అరుగుపైన పెట్టాడు. అలాగే ఆ గది గోడపైన పెట్టివున్న సుత్తిని తీసుకుని ఎడమచేత్తో తబలా అంచుల్ని తడుతూ, కుడిచేత్తో దారాలను సరిచేస్తూ కూర్చున్నాడు.

# 2

"తదిగిణతోం... తదిగిణతోం..."

గుడిలో మద్దెల శబ్దం!

ప్రశాంతంగా వున్న ఆ ఊరి వాతావరణాన్ని విచ్ఛిన్నం చేస్తూ అది గాలిలోకి విజృంభిస్తోంది.

"తదిగిణతోం... తోం... తోం... తదిగిణతోం..."

అది పల్లీయుల చెవులకు ఛెల్లుమని తగులుతోంది! గుడిలో హార్మోనియమో, మద్దెలో మ్రోగిందంటే... ఇక ఆట కలాకారులకి రాత్రిళ్ళు పని తగిలినట్లే!

ఆటోళ్ళకు ఆ శబ్దం ఒక పిలుపు!

ఒక అభ్యర్థన..!

ఒక హెచ్చరిక...!!

"తదిగిణతోం.... తోం...... తోం..... తదిగిణతోం......"

ఆ శబ్దం అవిరామంగా, లయబద్ధంగా మ్రోగుతూ ఆ పల్లెలోని ప్రతి ఇంటి గుమ్మాన్ని తాకి, నట్టిళ్ళలోకి దూకి సౌమ్యంగా పలుకరిస్తున్నట్లుంది.

గుడిలో పిలుపుని మద్దెళ్ళ మీద ప్రసారం చేస్తోంది.

అది మొదట ఆటతాళంలోను, ఆ తర్వాత ఆదితాళంలోను వేగంగా వినిపిస్తోంది.

ఆ శబ్దం విని ఒకరొకరే అక్కడికి చేరుకోసాగారు.

గుడి మధ్యలో.... మద్దెళ్లను ముందరుంచుకొని అరవై ఏళ్ళు నిండిన గురువు ఆవేశంతో రొప్పుతూ అదేపనిగా వాయిస్తున్నాడు. వచ్చిన ప్రతి ఒక్కరూ వంగి గురువుకి నమస్కారంచేసి, హార్మోనియంను కళ్ళకద్దుకొని అక్కడే కూర్చోసాగారు.

ఆ వచ్చినవారిలో ఒకరు హార్మోనియం అందుకుంటే... మరిద్దరు తాళంచిప్పల్ని తీసుకుని వాయిస్తూ శ్రుతి కలిపారు. ఒకతను దరువందుకున్నాడు...

"పరాబ్రహ్మ పరాబ్రహ్మ పరమేశ్వర....."

మిగిలినవారూ వెనుక పాటలందుకున్నారు. దరువు రమ్యంగా సాగిపోతోంది.

నాటకం దరువులతో ఆ గుడి గుమ్మెత్తిపోతోంది.

ఎంతో నాజూగ్గా, మెల్లగా, చల్లగా, దూకుడు లేకుండా మద్దెల వాయిస్తూ వున్నాడు గురువు సిద్ధప్ప.

అలా ఆ గుడి కొంతసేపు మారుమ్రోగింతర్వాత మద్దెల కొట్టడం ఆపాడు గురువు.

ఒక్కసారిగా గాలీవానా వెలిసినట్టయింది.

గురువు ఏం చెబుతాడోనని ఆతృతగా, నిశ్శబ్దంగా అందరూ చూడసాగారు.

అందరినీ ఒక్కసారి పరకాయించి చూసి మొదలెట్టాడు గురువు.

"వొరే! ఉగాది పండగ యింగ పదయిదు దినాలే వుండేది. మీకు సీమ కుట్టినట్టు కూడా లేదు. యింకా గొమ్మునుండారే...! బుద్ధీ గ్యానమూ లేదంట్రా మీకు! సిగ్గూ శరమూ లేదంట్రా మీకు? మనం ఉగాదికి నాటకం వేయాల గదా?"

"ఊర్లో యాసం గట్టేవోళ్ళు శానామంది భారతం వొప్పుకోని బయటికి పోయిండారు గదా! మనం ఆటెట్టేసేది?" ఓ యువకుడు ప్రశ్నించాడు.

"ఏం రా పోతే? మనకి వగా తగా లేదా? మనం మొగోళ్ళం గాదా... మొల తాళ్లు గట్లేదా? ఊర్లో ఎవరుండనీ, ఉండకపోనీగాక... ఉగాదికి నాటకం యేసి తీరాల్సిందే! మర్చిపోయినారంట్రా బుడుపాతిక' (ఏమీ చేతగాక ఋణం తీర్చుకోవడానికే పుట్టిన) కొడుకుల్లారా....!"

నోటికొచ్చినట్లు తిట్టసాగాడు గురువు. అందరూ ఏదో తప్పు చేసినట్టుగా మౌనంగా తలలు వంచుకున్నారు.

"రేపు రేతిరి నించే వద్దిక (ప్రాక్టీసు)! కొంచెం సందకాన్నే అన్నాలు దినేసి ఈడ హాజరై పోవాల్సిందే!" గొంతు పెంచి అరచినట్లు చెప్పాడు గురువు.

గురువు మాటంటే ఆ ఊర్లో వేదవాక్కు!

ఒక శాసనం!

ఒక ఆజ్ఞ!

అందుకే అందరూ సరేనన్నారు.

"యింతకూ ఏం నాటకం యెయ్యాల అయవారా?" ఒకతను ప్రశ్నించాడు.

"చెప్తా.... అదిగూడా చెప్తా....!" ఒక్కక్షణం ఆలోచించాడు., ఆపైన చెప్పాడు.

"విరాటపర్వం"!

"నిష్ఠగా యిలాట పరం యేస్తే... వానొస్తుందంటారు గదా! సందేహం వెలిబుచ్చాడింకో అతను.

"అవును... ఆ కథ అట్టాంటిది! వానలు బడని కాలంలో బయటూర్లల్లో గూడా, చెరువుల్లో 'విరాటపర్వం' హరికథ జెప్పిస్తారు. నాటకమూ యేపిస్తారు. నిష్ఠగా కార్యం జరిగితే సెరువులు నిండాల్సిందే....!" ఆనందంగా చెప్పాడు గురువు.

"ఆటేసేటప్పుడు గనక వానబడితే యట్టా? మన ఆట బింద్దై పూడస్తా వుండ్లా?!" మరో అతను శలవిచ్చాడు.

"వాన పడాల్నే గానీ... మందేముంది? పడినాంక సూసుకొందార్లే... ముందు వద్దిక గానీ! ఉగాదికి మూడు రోజులు ముందు గజ్జెపూజ! ఆఁ..!" చెప్పాడు గురువు.

ఆ తర్వాత గురువుగారి కాళ్ళకు నమస్కారం జేసి ఒకరొకరే అక్కడినుండి వెళ్ళిపోయారు.

గురువు సంతృప్తిగా గాలి పీల్చుకున్నాడు.

అది యామిగాని పల్లె....

చిత్తూరు జిల్లాలోని 'కుప్పం' మండలంలో అదొక గ్రామం....

వాళ్ళు... ఆ ఊరి నాటక కళాకారులు !

## 3

"అది ఉగాదికి ముందు మూడోరోజు!

గజ్జెపూజ జరిగే రోజు!

ఆరోజు రాత్రి ఏడు గంటలకంతా భజన గుడి ముందర పందిరి తయారైపోయింది.

పందిరి మధ్యలో ఒక విద్యుద్దీపం దేదీప్యమానంగా వెలిగిపోతోంది. అప్పటికే ఊర్లోవున్న పిల్లా జల్లా, ముసలీ ముతకా, ఆడా మగా.... అందరూ అక్కడ చేరిపోయి వున్నారు. కొందరు తమ ఇండ్ల ముందరున్న గడపల పైన, అరుగుల పైన కూర్చొని చూస్తున్నారు.

పందిరి కిటువైపునొక బెంచీ, అటువైపునొక బెంచీ, వాటిపైన ఒకపక్క లచ్చుమయ్య మద్దెల ముందుబెట్టుకుని కూర్చోనున్నాడు. అతని పక్కనే తాళం చిప్పల్ని పట్టుకుని తిమ్మయ్య సిద్ధంగా వున్నాడు. మరోవైపు హార్మోనియంతో భద్రావతాయన ఎప్పుడో సిద్ధమైపోయాడు.

పందిరి కింద ఓ మూల వేసివున్న ఇనుప కుర్చీలో గుడిలో నుంచి తెచ్చిన ఒక శ్రీరాముల వారి పట్టాభిషేక పటం ఉంచబడివుంది. దానిపక్కనే ఒక నటరాజ పటం వుంచారు.ఆ పటాల ముందర ఒక స్టూలు వేసి, దానిపైన గజ్జెలు కుప్పగా వుంచారు. మరో వైపు పెద్ద డేకిసా నిండా వేయించిన శనగపప్పు, బెల్లం ముక్కలు కలిపిన బొరుగులు పోసి వుంచారు. పక్కనే గంధపు గిన్నె వుండనే వుంది.

"ఆఁ...... అందరూ వచ్చేసినట్టేనంట్రా?"

– అందరివైపు ఒక్కసారి చూసి అన్నాడు గురువు సిద్ధప్ప.

"వచ్చేసినారు అయ్యవారా?" భద్రావతాయన సమాధానంచెప్పాడు.

"సరే..... మేళం కట్టండి!" ఆజ్ఞాపించాడు గురువు.

ఆ మరుక్షణం లచ్చుమయ్య చేతుల్లోని మద్దెలదరువు "తరిగిడతోం.... తరిగిడతోం...." అంటూ ప్రారంభమై క్రమంగా స్పీడందుకొని, ఉరుములు ఉరిమినట్లు ఆ ప్రాంతాన్ని దద్దరిల్లచేస్తూ మ్రోగింది.

హార్మోనియం ఒకటిన్నర శ్రుతిలో ఆరంభమై క్రమంగా రెండున్నర నందుకుంది.

అయిదు నిముషాలు అలా గుమ్మెత్తించిన తర్వాత సిద్ధప్ప "గజాననా ఓం.... గజాననా ఓం... గజవదనా..." అంటూ ఆటతాళంతో అందుకున్న వినాయక స్తుతిని "పార్వతి తనయా గజాననా ఓం....పావనపుత్రా గజాననా ఓం.... మూషిక వాహనా గజాననా ఓం..." అంటూ ధృతగతిలో పాడుతూ దరువును ఆదికెక్కించారు.

అతడు తాళం చిప్పల్ని ఎంత వేగంగా వాయిస్తూ పాటను పాడుతున్నాడో – అంతే వేగంగా మిగిలినవాళ్ళూ "గజాననా ఓం..." అంటూ తాళాన్ని దూకిస్తున్నారు.

ఆ పాట పూర్తయిం తర్వాత వరుసగా సరస్వతీ స్తుతి, నటరాజ స్తుతి సాగించి ఆపారు.

పదిరోజులుగా గుడిలో సిటింగ్ రిహార్సల్స్ చేసిన ఆటగాళ్ళు ఆరోజు నుంచి స్టాండింగ్ రిహార్సల్స్ చేయబోతున్నారు. రంగస్థలంపైన ఎలా పాడాలో, ఎలా ఆడాలో అభ్యాసం చేయడానికి అక్కడ నాంది పలకబోతున్నారు. అందులో భాగంగా 'ఆట' రోజు కాళ్ళకు కట్టుకోబోయే గజ్జెల్ని కూడా నటులు ఓం ప్రథమంగా ఆరోజు ధరించబోతున్నారు. ఆ సందర్భంగా వాటికి పూజా పునస్కారాలు చేయబోతున్నారు.

అదే... గజ్జెపూజ!

పటాలకు, గజ్జెల గుత్తులకు పసుపునీళ్లు చల్లారు. కుంకుమబొట్టు పెట్టారు. గంధం నీళ్ళు చల్లి ఆ గంథంతో నొసటన బొట్లు పెట్టుకున్నారు. పటాల ముందరున్న దీపాంతిలో వత్తి వేసి, నూనె పోసి దీపం వెలిగించారు. ఊదుకడ్డీలు వెలిగించారు. ఆ కడ్డీల నుంచి వస్తున్న పొగ వంకర టింకరగా, చారలు చారలుగా పైకెగసి సువాసనల్ని గుభాళిస్తూ గాలిలో కరిగిపోసాగింది.

అందరూ నిలబడి భక్తి ప్రపత్తులతో చూస్తున్నారు.

గురువు కొబ్బరికాయ కొట్టి, కర్పూర హారతిచ్చి, ప్రజలవైపు తిరిగాడు. నటులందరూ హారతిని కళ్ళకద్దుకొన్న తర్వాత ప్రజలందుకున్నారు.

కొట్టిన కొబ్బరిచిప్పల్ని పగులగొట్టించి, కొబ్బరి తీసి ముక్కలు చేయించి, ఆ ముక్కల్ని బొరుగుల్లో పోయించి కలియబెట్టించాడు. ఆ బొరుగుల్ని మొదట ఆటోళ్ళకు, ఆ తర్వాత ప్రజలకు ప్రసాదంగా పంచి పెట్టించాడు. ఆ తంతుపూర్తవడానికి దాదాపు అరగంట

పట్టింది. ఆ తర్వాత గురువు ఒక్కొక్క గజ్జెల గుత్తినే చేతుల్లోకి తీసుకుని, వంగి గురువుగారి కాళ్ళకి మొక్కి దూరంగా జరిగి తమ కాళ్ళకు గజ్జెలు కట్టుకోసాగాడు.

అది పూర్తయింతర్వాత లచ్చుమయ్య మద్దెల కొట్టడం ప్రారంభించాడు. భద్రవతాయన హార్మోనియం వాయించసాగాడు.

మొదట భద్రావతాయనే “పాండావులిదుగో వచ్చిరీ; పంచా పాండవులిదిగో వచ్చిరీ; ద్రౌపదితో పంచపాండవులు వచ్చిరీ....” అన్న దరువును హార్మోనియం మీద వాయించాడు.

ధర్మరాజు వేషధారి ఆ దరువును ఆదితాళం, తోడిరాగంతో అందుకొని “పంచ పాండవులు వచ్చిరీ, పదిరెండు వత్సరంబులు వేంచేయు వనవాసము గావించి మోదము మించి, పంచ పాండవులిదుగో వచ్చిరి....” అంటూ పెద్ద గొంతుతో ఆలపించసాగాడు.

మిగిలినవాళ్ళు అతనివెంట వెనుక పాటందుకున్నారు.

దరువు తాళం తప్పిన చోట సరిదిద్దుతూ పాట మరిచిన చోట ‘అటాని’ (ప్రాంప్టింగ్) ఎత్తిస్తూ అభ్యాసం చేయించసాగాడు... గురువు.

# 4

“**ఆ**రోజు ఉగాది – అదే... ఆంధ్రుల సంవత్సరాది!

ఊరు ఊరంతా ఆనందంతో, ఉత్సాహంతో ఓలలాడుతున్న రోజు!

ఆ రోజుకోసం... రెండు రోజుల ముందే ప్రతి ఒక్కరూ ఎఱ్ఱమన్ను తెచ్చి, నీళ్ళతో తడిపి పెచ్చులు ఊడిపోయిన గోడలకు వేసి, ఇంటికప్పుల్ని సరిచేసుకుని, సున్నం పూసుకున్నారు. అరుగులకు, గడపలకు ఎఱ్ఱమట్టి పూసి అలంకరించారు.

ఆరోజు ఉదయాన్నే అందరూ తలస్నానాలు చేసి, కొత్తబట్టలు కట్టుకున్నారు.

అందరి ముఖాల్లోనూ ఆనందం తొణికిసలాడుతోంది.

ప్రతి గుమ్మమూ పచ్చటి తోరణాలతో, పసుపు కుంకాలతో..... విరగబూసిన చెనిగచెట్ల కొండ్రలా అనిపిస్తోంది. పల్లెవీధి విరగకాసిన కందిచెట్ల సాలులా కనిపిస్తోంది.

ఉత్తర, దక్షిణంగా వ్యాపించివున్న ఆ ఊర్లో పడమటి వరుసలో దక్షిణం వైపు చివరనున్న రాశింటి నానుకొని మోకాటెత్తున్న రాతి రూపంలో వీధిగంగమ్మ వెలసి వుంది. ఆ రాతినీ పసుపు కుంకాలతో అలంకరించి వున్నారు.

ఆ గుడికి కొన్ని అడుగుల దూరంలో ఓ చింతచెట్టు! దానికింద గజం పొడవు వెడల్పులతో, జానెడు లోతుతో వున్న రెండు ‘ముగ్గురాళ్ళు’ పెద్ద తాబేటి చిప్పల్లా వున్నాయి. ఒక్కో రోటిలో వీధిగంగమ్మ పరిమాణంలో నునుపుదేలిన నల్లటి రెండు ‘రుబ్బురాళ్ళు’ వున్నాయి.

కొందరు పండుగ అవసరానికి ముగ్గుపిండికోసం మెత్తటి పిండిరాళ్ళను, కనికరాళ్ళను ఆ రోళ్ళలో పోసి ఆ రుబ్బురాళ్ళతో రుబ్బకొని వెళ్ళిన చిహ్నాలు కనిపిస్తున్నాయి. అదే వరుసలో ఉత్తరంవైపు నున్న చివరి ఇల్లు... సిద్ధప్పది.

ఆరోజు ఉదయాన తలస్నానంచేసి గురువుల తోపు నుంచి కోసుకొని వచ్చిన మామిడి మండల్ని ముందరేసుకుని, మనవడు రంవణ సాయంతో ఒక్కొక్క ఆకునే దారానికి కట్టి తోరణాలు తయారు చేసి యింట్లో గుమ్మాలకు అలంకరించాడు సిద్ధోజీ... అప్పుడే ఒక కంచుతట్ట నెత్తుకొని వీధిలో పోతూ కనిపించాడు..... కదిరయ్య.

"యాడరో పోతాండావు కదిరీ....?!" పలుకరించాడు సిద్దప్ప.

"మా నాయన గుంత కాడికి పోతావుండా అయ్యవారా! అయిదేండ్లయి పాయ గదా మా నాయన కాలమైపోయి... ప్రతి ఉగాదికీ గుంతకాడికి పొయ్యి గుడ్డలు పెట్టి, కాయ కర్పూరం యిచ్చి రావాల గదా! అందుకుని పోతావుండా!" చెప్పాడు కదిరయ్య.

"సరేబ్బా! బిరీన తిరుక్కోనిరా...! మనమూ గురువుల తోపుకు బొయ్యి రావల్ల గదా! ఏడెనిమిది మందన్నా పోతే బాగుంటుంది.".

"అట్టేలే... వొగ్గెడివిలో వచ్చేస్తా....!" అక్కడినుండి వెళ్ళిపోయాడు కదిరయ్య.

తోరణం కట్టడం ముగిసింతర్వాత.... ఆ ముందురోజు కుప్పంనుంచి తెచ్చుకున్న అయిదు కొబ్బరికాయల నుంచి నాలుగు కొబ్బరికాయలు, నాలుగు తెల్లటి మల్లుపంచలు, పై గుడ్డలు -, కర్పూరం, ఒక నీళ్ళ చెంబు ఒక బుట్టలో పెట్టుకుని మనవడు రవంణను వెంట దీసుకుని ముగ్గురాళ్ళ కాడికొచ్చి నిలబడ్డాడు సిద్ధప్ప. అది గమనించిన నలుగురైదుగురు ఆటోళ్లు అక్కడ పోగయ్యారు.

"వొరే లచ్చుంగా! అట్ట కూతెయ్యంరా! యింకా ఎవురన్నా వస్తారేమో రానీ!" మద్దెలకొట్టే లచ్చుమయ్యతో అన్నాడు సిద్ధప్ప.

అక్కడికి వస్తున్న అతను అలాగే నిలబడి "గురువుల తోపుకు పోవాల.... ఆటోళ్ళంతా రంద్రోయ్ రండీ!" అంటూ గట్టిగా మూడుసార్లు కూతేశాడు. ఆ కేక ఆ పల్లె గుండెల్ని చీల్చుకొని వాకిళ్లు దాటుకుని, నట్టిళ్ళలోకి దూరి చప్పబడిపోయింది.

ఆ కేక విన్న మరికొందరు అక్కడికి చేరుకున్నారు.

చివరన కదిరయ్యా వచ్చి వాళ్ళతో కలిశాడు.

అందరూ కలిసి 'గురువుల తోపు'కు బయలుదేరారు.

ఊరికి దక్షిణాన కూతవేటు దూరంలో వున్న 'గురువుల తోపు' అనబడే ఓ చిన్నమామిడి తోటకు చేరుకున్నారు.

అది పేరుకు మామిడి తోటయినా అందులో మామిడిచెట్లు ఎక్కువగా లేవు. ఎకరా విస్తీర్ణంగల ఆ ప్రదేశంలో ఓ పది మామిడిచెట్లు, ఓ నేరేడు చెట్టు, ఓ మోడుబారిన చింతచెట్టు, ఓ సీమరాల చెట్ల గుంపు, రెండు ఊడగచెట్లు మాత్రమే వున్నాయి. ఆ తోపుకు చుట్టూ కొన్ని బలుస చెట్లు, కలబంద పొదలు బలుసుకొని కంచెలా వున్నాయి. ఆ కంచె మధ్యలో తోపుకు తూర్పువైపున ఒక మోస్తరు దారి ఏర్పాటు చేయబడివుంది. ఆ దారి నేరుగా తోపులో నైరుతి వైపున్న ఓ పెద్దమామిడి చెట్ల కిందికి చేరుకుని అంతమై పోతోంది. ఆ తోపులోకంతా ఆ చెట్టే కాస్త పెద్దదిగా కనిపిస్తోంది. ఆ చెట్టు కిందనే వరుసగా నాలుగు బండరాళ్ళు భూమిలో నిలువుగా పాతిపెట్టబడి వున్నాయి. వాటి మధ్యన దాదాపు మూడడుగుల ఎడంవుంది. వాటి పై భాగాలు వృత్తాకారంగా మలచబడి వున్నాయి. వాటిలో కొన్ని రాళ్ళమీద ఏవో కొన్ని పేర్లు, తారీఖులు చెక్కబడివున్నాయి. ఒకప్పుడు అది విజలాపురం జమీందార్ల నుంచి సిద్ధప్ప పూర్వీకులకు ఈనాముగా సంక్రమించిన తోపు.

ఆచెట్టు నీడలో ఆ ప్రాంతం చాలా చల్లగా, హాయిగా వుంది. ఆ చెట్టుకింద వున్న బండరాళ్ళ దగ్గర కాస్త పలుచగా సన్నటి గరికపోచలు తప్ప మరే చెట్లు చేమలు లేవు. ఆ ప్రదేశమంతా రాలిపోయి, వరుగులా ఎండిపోయి వున్న మామిడాకులు తప్ప ఇంకేమీ కనిపించడం లేదు.

ఆ మామిడి చెట్టులో మాత్రం అక్కడక్కడా ఆకులు అతుక్కుపోయి, చలిచీమల్లాంటి ఎఱ్ఱటి బ్రాహ్మణ చీమల గూళ్ళు, కొమ్మలకు వేలాడుతున్న మామిడికాయల గుత్తుల్లాగా గాలికి ఊగుతూ కనిపిస్తున్నాయి.

ఆ మామిడి చెట్టులో అక్కడక్కడా ఒకటీ అరా మామిడి పిందెలు నోరూరిస్తూ కనిపిస్తున్నాయి. కానగచెట్లు కింద రాలిన కానగపూలు జానెడెత్తులో, పరచిన మెత్తటి తివాచీలా అనిపిస్తున్నాయి.

ఆవేళ సిద్ధప్ప వెంట బయలుదేరిన కళాకారులందరూ ఆ గురువుల తోపులోకి వెళ్ళి, గురువుల్ని స్మరించుకుంటూ నిలబడి వున్నారు. వారి గుండెల్లో ఓవైపు ఏదో చెప్పరాని బాధ, భయం! తమ పూర్వీకులు ఎంత గొప్పవారోనన్న భావం, భక్తి!

ఓ చెట్లో కూర్చొని ఓ కోకిల "కుహు కుహుః....." అంటూ మధురంగా కూస్తోంది.

మామిడి చిగుళ్ళనుంచీ, పిందెల నుంచీ వస్తున్న కమ్మటి వాసనను తనలో విలీనం చేసుకుని, చెట్ల ఆకులతో గుసగుసలాడుతూ సరాగాలు పోతూ వీస్తోంది గాలి.

ఒక్కో బండ దగ్గర ఒక్కో పంచె, పైగుడ్డ పెట్టాడు సిద్ధప్ప. ఆ ప్రాంతంలో ఎక్కడ చూసినా కనిపిస్తున్న ఎఱ్ఱటి బ్రాహ్మణ చీమలు (కరెంటు చీమలు, గింజర గోతులు)

అప్పటికే నేలపైన దించివున్న గంపలోకి ఎగబడుతున్నాయి. గుంతల దగ్గర పెట్టిన బట్టల మీదకీ ప్రాకసాగాయి.

తన కాళ్ళకి ఎగబడి కుడుతున్న ఆ చీమల్ని తుడుచుకుంటూ "తూ్c.... ఏందబ్బా ఈ సెట్టుకింద గింజర గోతులు ఇట్టా తిరగతావుండాయి?" అంటూ అక్కడినుంచి కాస్త వెనక్కి నడిచి నిలబడ్డాడు కదిరయ్య.

అందరూ అలాగే చీమల్ని తుడుచుకుంటూ పక్కకు వెళ్ళి నిలబడ్డారు. వాళ్ళు కదిలినప్పుడు వాళ్ళ కాళ్ళకింద పడిన ఎండిన మామిడాకులు నలిగిపోతూ పటపటమని శబ్దం చేశాయి.

ఆ నాలుగు బండరాళ్ళ దగ్గర నాలుగు కొబ్బరికాయలు కొట్టాడు గురువు సిద్ధప్ప.

కాళ్ళకు, చేతులకు ఎగబడుతున్న గింజర గోతుల్ని తుడుచుకుంటూనే కర్పూరం వెలిగించి మొక్కుకుని "అందరూ మొక్కుకోండి!" అంటూ వెనక్కివచ్చి నిలబడ్డాడు. ఆ తర్వాత ఒక్కొక్కరే వెళ్ళి మొక్కుకున్నారు.

నాలుగో బండరాయి దగ్గర నేల కాస్త ఉబ్బెత్తుగా వుంది. మిగిలిన బండరాళ్ళ దగ్గర నేల చదునుగా వుంది. ఆ ప్రదేశం నుంచి బ్రాహ్మణ చీమలు బారులు కట్టి, లావుగా వున్న ఆ మామిడిచెట్టు మొదలు పైన పాకుతూ కనిపిస్తున్నాయి. అందులో కొన్ని బారులు చెట్టుపైకి పాకుతుంటే మరికొన్ని చెట్టు కిందికి పాకుతున్నాయి. చెట్లోకి వెళుతున్న ప్రతి చీమ ఏదో తెల్లటి ఎరను నోట కరచుకొని బిజీగా తిరుగుతున్నట్లు ఒకదానివెంట ఒకటిగా అవి ఎంతో క్రమశిక్షణ పొంది కవాతు చేస్తూ వెళుతున్న సైనికుల్లా కనిపిస్తున్నాయి.

ఆ తర్వాత అందరూ ఆ చెట్టుకింద నుంచి వెళ్ళి చీమలు లేని మరో ప్రదేశంలో నిలబడ్డారు.

ఆ రాళ్ళను చూస్తూ సిద్ధప్ప – "కొంచేపు యిక్కడే కూసోండ్రా!" అంటూ భక్తి పారవశ్యంలో మునిగిపోయాడు.

అందరూ అక్కడే కూర్చున్నారు.

కూర్చున్నాక భద్రావతాయన బండరాళ్ళవైపు చూస్తూ "అవును గురువా! నాటకాల్లో సైనికుల మాదిరి నిటారుగా నిలబడి ఉండాయే – నిలువు రాళ్లు..... ఏమిటివవి?" విచిత్రంగా ప్రశ్నించాడు.

"వాటి గురించి తెలీదా?" లచ్చుమయ్య ప్రశ్నించాడు.

"నేను ఎప్పుడో సిత్తూరు నుంచి భద్రావతికి వలసపోయింటి! ఆడ అయిదేండ్లుండి బతకలేక ఈ ఊరికొచ్చినోన్ని – వాటి గురించి నాకు సరిగా తెలీదే!" అన్నాడు భద్రావతాయన.

"భద్రావతి నించి వచ్చిందానికే గదా నీకు 'భద్రావతాయన' అని పేరొచ్చిండాది!" అన్నాడు కదిరయ్య.

"నిజమే! ముందు.... ఆ బండల గురించి తెలుసుకోవాలని ఉండాదబ్బా!" అన్నాడు భద్రావతాయన.

"అదేగదా.... గురువు ఇంక చెప్పబోతాడు!" చెప్పాడు కదిరయ్య.

వారి సంభాషణ విన్న సిద్ధప్పకి నోట్‌బుక్‌లో తాను చదివిన గురువుల చరిత్ర గుర్తుకు రాసాగింది.

"అవి పేరుకు బండరాళ్ళే అయినా అవి నాలుగు తరాల చరిత్రకు గుర్తుగా నిల్చిన రాళ్ళు!"

చూడు భద్రావతాయనా – అవి నాలుగు తరాల గురువుల్ని పూడ్చి, తలలదెగ్గిర నాటిన నిలువరాళ్ళు!

భద్రావతాయనతో పాటుగా అందరూ ఆసక్తిగా వినసాగారు.

"మా తాతముత్తాతలే ఆగురువులు! ఆ మాటకొస్తే మన వూరికే మూల పురుషులు! నాలుగు తరాల నుంచి నాటక కళను మనూరికి అందించిన మహానుభావుల గుంతలే అవి! ఈ గుంతలున్నాయి కాబట్టే ఈ స్థలాన్ని గురువుల తోపుగా పిలుస్తున్నారు" అన్నాడు సిద్ధప్ప.

"వొరే చూడంర్రా... ఆ మొదటిరాయి! ఆ రాయి దెగ్గిరే మనకు, మన నాటక కళకు మూలపురుషుడైన అణ్ణావు వటేరావును పూడ్చిండేది!" అంటూ తిరిగి ప్రారంభించాడు.

అందరూ ఆ బండవైపు చూశారు. ఆ బండమీద 'అణ్ణావు వటేరావు' అన్న అక్షరాలు అస్పష్టంగా గోచరిస్తున్నాయి. దుమ్ముతో పూడుకుపోయిన ఆ అక్షరాలు ఎప్పుడో వందేళ్ళ క్రితం చెక్కబడినవి. ఆ పేరుకింద 'మరణం 1867' అని మాత్రమే వుంది. పుట్టిన సంవత్సరం తేదీతో పాటు మరణించిన తేదీను లేదు.

సిద్ధప్ప తిరిగి మళ్ళీ చెప్పసాగాడు.

"మా నాయన నాకు చెప్పిండే విషయాలు, రాసి పెట్టిండే విషయాలు మీకు చెబుతున్నాను

ఆ విషయాల్లో కొన్ని మానాయనకు వాళ్ళ నాయన, వాయనకు వాళ్ళ గురువు సెప్పినవే... ఎప్పుడో కొన్ని వందల సంవత్సరాలప్పుడు – మన వంగిశం ఆరంభమ యిండేది పూనా దగ్గర యాడనో వొగ సిన్న గ్రామంలో నంట – మన పూర్వీకులు శివాజీ మహారాజు ఆస్థానంలో సేనాపతులుగా, దండనాయకులుగా వుండేవాళ్ళంట! ఆ శివాజీ

మారాజు సచ్చిపోయింతర్వాత రాజ్జెం తురకల పాలై పోయిందంట! వాళ్ళు పెట్టే బాధలు భరించలేక, ఆడ బతకలేక శానా కుటింబరాలు ఈ దచ్చిన దేశం వచ్చేసినాయంట! అందులో ఆరె కాపులు, ఆరె మరాటోళ్ళు గూడా వున్నారంట! వీళ్ళల్లో కొందరు అట్టా దిగబడి ఉత్తరదేశం పోతే – రెండు మూడు కుటింబరాలు మాత్రం యింకా దచ్చినంగా వచ్చి ఈడ స్థిరపడినాయంట! ఈడ యేదో అట్టా యిట్టా కాలం గడస్తావుంటే పదేండ్ల వయసుకే పెండ్లి సేసుకున్నాడంట ఈయప్ప. ఈ సంవత్సరం గూడా నోటు పుస్తకంలో రాసి పెట్టిండారు. యింకా దాంట్లో శానా యిసయాలు రాసిండారులే...!"

"యిప్పుడా పుస్తకం వుండాదా గురువా?" మధ్యలో ప్రశ్నించాడు లచ్చుమయ్య.

"వుండాదబ్బా! దాంట్లో సంగతే గదా సెప్తుంట!" అని తిరిగి చెప్పసాగాడు.

"అయన్నీ నాకు బాగా గ్యేంవనమే! వొగిధంగా మనం నాటకంలో కత నేర్చినట్టు అంతా కంఠోపాటమే.....! ఆ సంవత్సరం ఏలూరు కోటలో పెద్ద తిరుగుబాటు జరిగిందంట. తెల్లదొరలు మన సైనికులకు గెడ్డం వుండగూడదనీ, చెవుల్లో కుండలాలు, నొసటన నామంగానీ, బొట్టుగానీ వుండగూడదనీ శాసనం చేసినారంట!".

"ఎందుకు?" మరో అతను ప్రశ్నించాడు.

"ఎందుకేముండాది? మన మతమంటే వోళ్ళకు పట్టదు గదా. పైగా ఈ మతమే వీళ్ళను వొగిటిగా వుండేటట్లు చేస్తావుండాదని వోళ్ళ భావన."

"ఆహాఁ! సరే..... యింక సెప్పయ్యవారా!" అన్నాడతను.

"అప్పుడు ఆ తెల్లోళ్ళు పెట్టిండే సట్టం సయించలేక – దేశం మొత్తం మీదుండే సిపాయిలకంతా సమాచారం అందించి, వొగదినం సరిగ్గా అర్ధరాత్రి దేశంలో సైనికులంతా వొక్కసారిగా తిరగబడాలనుకున్నారంట! రహస్య పత్రాలు ద్వారానే అన్ని నిర్ణయాలు అయిపోయి 'సరే' నంటే 'సరే....' ననుకున్నారంట! అయితే ఈ యిసయం సుట్టుపక్కలుండే రైతులకు ఆ ముందుదినం రాత్రే ఎట్లనో తెలిసిపోయి పల్లెల్లో నుంచి జనాలు కత్తులు, కటార్లు ఎత్తుకోని కోటలో సైనికులకు అండగా దూకేసినారంట! యింక యట్టా బట్టబయలై పోయిండాది గదాని – ఆ సైనికులు అప్పటికప్పుడే ఆ అర్ధరాత్రి తిరగబడి దొరికిన తెల్లోళ్ళను దొరికినట్లే నరికేసినారంట!

యింకేముండాది? కొందరు తెల్లోళ్ళు ఎట్టనో తప్పించుకోని అర్కాడుకు బొయ్యి సైన్యాన్ని తీసుకొచ్చి అణిసేసినారంట...! దీనికింకో ముఖ్య కారణం కూడా వుందంటలే! తెల్లోళ్ళు మింద వీరపోరాటం జేసిన మైసూరు నవాబు టిప్పుసుల్తాన్ను అన్నేయంగా ఉరిదీసేసినారంట. జనాలకు ఆ కోపం గూడా ఉన్నిందంట్లే! ఈ తిరుగుబాటు జరిగిండే

సంవత్సరం 1806, తేదీ జూన్ 11 అంటా నోడుసులో రాసినట్టు గ్యేవనం! మనకు తెలిసి మొట్ట మొదటగా నిజ్జంగా జరిగిండే నిజమైన సోసంత్ర పోరాట మిదేనంటలే. అద్దో! ఆ తిరుగుబాటు సమయంలో ఈ 'వటేరావు' వోళ్ళ నాయన మంచె మిడిపాయంలో వుండి ఆ సైన్యంలోనే వున్నాడంట. ఆయప్ప ఆ తిరుగుబాట్లోనే ఎట్టో తప్పించుకుని ఈ కుప్పం వచ్చేసి స్థిరపడి పోయినాడంట.

మల్ల సరిగ్గా యాభై ఏండ్లకు ఉత్తరదేశంలో యిదే మాదిరి సైనికుల తిరుగుబాటు జరిగిందంటలే! వటేరావ్ వోళ్ళ నాయన ఎప్పుడు సచ్చిపోయినాడో తెలీదు. ఈ వటేరావుకు రెండు పెండ్లిండ్లు.... అందువల్ల గంపెడు సంతానమైందంట! వోళ్ళను సాకేదానికి వరుంబడి ఏదీ లేదంట! 'ఇంక ఈ సంసారమెట్టు యేగేదిరా దేముడాంట' యోచ్చన చేసినాడంట. ఆయప్పకు సిన్నప్పట్నుంచీ కొంచెం ఆటపాటలు పాడేది, సిరి సాపలల్లేది వచ్చునంట! అందువల్ల తాటాకు మట్టలకు, మడిసి తలమాదిరి రంగులేసి, వాటినే రాముడుగా, రావణుడిగా సెప్పి రామాయణం కథ పాడి అందర్నీ మెప్పించి, వాళ్ళిచ్చే దాంతో బతుకీడ్చినాడంట. అట్ల మన ఆటకు నాంది పలికినోడు ఓం ప్రథమంగా మనకు ఆదిగురువైనోడు ఈయప్ప! పల్లెనిండా ముక్కాలు భాగం వుండేది ఆయప్ప సంతు సంతే...! ఆ తర్వాత మన వాళ్ళతో బాటుగా మెల్లిమెల్లిగా మిగిలిన కులాల వాళ్ళు వచ్చి చేరిపోయినారంట. అట్ల ఈ పల్లె ఎదిగిండాది.".

– అంటూ వటేరావు గురించి చెప్పాడు సిద్ధప్ప.

అందరూ ఎంతో ఉత్సాహంగా వింటున్నారు.

వాళ్ళ కెదురుగా కనిపిస్తున్న రెండో బండ పైన అక్షరాలు ఇంకాస్త స్పష్టంగా కనిపించసాగాయి. దానిపై 'ఆటోకు కోటేశ్వర్రావ్ : జననం 1826 : మరణం ఉగాది 1902 అనివుంది.

ఆ రాయిని చూపించి దాని చరిత్ర గురించి చెప్పసాగాడు సిద్ధప్ప....

"ఆయప్ప ఆటోకు కోటోజీ... వటేరావు బామర్ది! వటేరావు కూతుర్నే మనువాడినాడు. ఈయప్ప మామందించిన తాటాకు బొమ్మల నాటకాలనే యింకొంచెం మార్చి, ముందర జంఖానా కట్టి బొమ్మలు ఆడించినాడంట. ఇవన్నీ శివాజీ కాలంలోనే ఈళ్ల పూర్వీకులు ఆడేవోళ్ళంటలే! వీటికి 'జంఖండీ నాటకా'లంటా పేరు పెట్టి ఊరూర తిరిగి ప్రదర్శనాలిచ్చి దుడ్డు సంపాదించినాడంట. అబ్బుటికి పల్లెల్లో శ్యానా మొరటుగా ఆడే కురవంజీ నాటకాలు, ఈది నాటకాలు చూసి, వాటిని గూడా నేర్చుకోని ఈ బొమ్మల ద్వారా ఆడి, ఆడించేవోడంట. ఈయన ఆటలంటే జనాలు యిరగబడి చూసేవోళ్లంట. వాళ్ళిచ్చే దాంతో పొట్ట గడవక శ్యానా అగసాట్లు బడతా వున్నాడంటలే!

ఇట్టా వుంటే 1870లో ధాతు కరువొచ్చి జనాల్ని సంపిందంట. కరువుకు తిండిలేక శ్యానామంది సచ్చినారంట. అప్పుడు పెండ్లాంబిడ్డల్ని పస్తులుంచలేక అందర్నీ కూడగట్టుకోని పాండురంగ భజన, చెక్కభజన నేర్పించి పల్లెపల్లెలోను వాటిని ప్రదర్శించి దుడ్డు దస్కం సంపాయించి యింటికి పంపిస్తా, అట్టే తిరుమల యాత్ర సాగించినాడంట.

ఈయప్ప భజనేసే దాంట్లో భలే మొనగోడంటలే! ఒక తూరి తిరుమల్లో యెంగట్రవం౹ణ సాం౹వికి జరిగే బెమ్మోత్సవాల్లో ఈ భజనలేస్తే భక్తులు దుడ్డూ దుగ్గానం బాగా సాయం జేస్తారంటా కాలినడకన భజనోళ్లను దీసుకుని కొండకు బయలుదేరినాడంట. ప్రతి భజనోడు కాళ్ళకు గజ్జెలు కట్టుకోని, నడుముకు ఎఱ్ఱటి వస్తరపు గుడ్డ జుట్టుకోని సేతిలో ఎఱ్ఱటి జండా బట్టుకోని పాండురంగ భజన యేస్తా – అప్పుడప్పుడూ మూరడు పొడుగుండే చెక్కలు వాయిస్తా – చెక్కభజన జూపిస్తా పోతావుంటే ఈ యామిగాని పల్లె నించి కుప్పం దాకా దారిపొడుగునా తిరణాల సాగినట్టుగా జనం సేరిపోయి, తోచింది యిస్తా వచ్చినారంట. అట్టా వోళ్ళ భజన బృందం మంగాపురం దారింటీ కొండెక్కి ఎగవ తిరుపతి సేరుకోని, ఆడ గుడి ముందర భజనకు నిలిచిందంట.

"రంగూ జండాల భజన రంజమైన రంగని భజన –

ర యాముని పోవుచున్నదే... పండారి జేర – పవలముగా పోవచున్నదే...."

అంటా రంగని భజన యేస్తావుంటే, జనాలు దేవుని చూసేది మానేసి ఈ భజనలే సూస్తా ఎక్కడోళ్ళక్కడ నిలబడిపోయినారంట. ముందు గుడిముందరుండే రోడ్డు శానా యిరుకు. దానికితోడు జనాల గుంపు, అట్ట కొంతసేపు చెక్కభజన, కొంతసేపు కోలాటం యాస్తా ఎక్కడోళ్ళనక్కడే నిలబెట్టేసినాడంట గురువు. దుడ్డు రాల్తా వుందంట సూడు... కాసుల వర్షమే కురిసిందంటలే! ఆ భజన సూసేదానికి జనాలు యిరగబడి చస్తావుండ్రంట. అది చూసేదానికి వోళ్ళకు రెండు కండ్లు సాలక పాయనంట. యిక్కడేమో జరిగిపోతా వుండాదని జనం తన్నుకోని నిలబడిపోయినారంట. దాంతో రోడ్డు బంధై పూడిసిందంట. 'యిదేమిరా యిట్టయిపాయ?" అనుకుంటా దేవస్థానంవోళ్లు ఎంత ప్రయత్నించినా జనాన్ని పక్కకు పంపించలేకపోయినారంట.

యింకేముండాది – విషయం పెద్దాఫీసరుకు తెలిసిపోయిందంట. ఆయప్ప అగ్గిమీద గుగ్గిలమైపోయి భజనేసే వోళ్ళనందర్నీ జైల్లో యేయించాలనుకున్నాడంట. ముందు వోళ్ళు ఏం చేస్తావుండారో, యట్ట జేస్తావుండారో సూడాలనుకోని – కమ్మీల పైకెక్కి అర్ధగంట సేపు చూసి నిలువు గుడ్లేసుకోనుండిపోయనంట. ఆ భజన పాటలు వినను వినను ఆయప్పకు వొళ్లే తెలీలేదంట. భజన మధ్యలో ఎఱ్ఱ దుస్తుల్తో రుద్రాక్ష దండలేసుకోని,

చేతల్తో తాళం చిప్పలు వాయిస్తా గొంతెత్తి పాడతా, అడుగేస్తా భజన ఏయిస్తా వుండే ఈయప్పను చూసి –

'వీడెవుడ్రా బాబూ.... అపర అన్నమాచార్య మాదిరుండాడే! యింతటి భక్తుడికి, యింతటి కళాకారుడికి అపకారం చేస్తే దేవుడు ఊరికే వుండునా....?' అనుకోని ఆయప్పను పిలిపించి వివరాలడిగి తెలుసుకున్నాడంట. తెలుసుకోని అందరినీ మహాద్వారం గుండా నేరుగా పంపించి దేవుడి దర్శనంచేయించి, కావలసినంత ప్రసాదాలిప్పించి, ఉచితంగా ధర్మసత్రాల్లో రూములిప్పించి ఉత్సవాలయిపోయిందాకా భజనలు ప్రదర్శించండని గుడ్డలు, దుడ్డు దుగ్గాణం యిప్పించినాడంట. అనాక 'అయ్యా కోటేశ్వరర్రావ్! ఈ గుడికి అందరూ భక్తితోనే వస్తారు. వాళ్ళందరికీ భజనేసి, నీ పాటల ద్వారా దేవుడి గురించి కీర్తించి, భక్తి పెల్లుబికేటట్ల జెయ్యి. యిదే మాదిర్తో ప్రతి సంవత్సరం బ్రహ్మోత్సవాల్లో భజన సాగించు. నీకు అన్నీ ఉచితంగా భోజనాలు, వసతి శాశ్వతంగా కల్పించే ఏర్పాటు జేసిపోతా... మీ ఊరినుంచీ ఏ భజన బృందం వచ్చినా ఈ ఏర్పాట్లు అందేటట్లు రూలు జేసిపోతా...!' అని చెప్పి పంపినాడంట. ఇంక అప్పట్నుంచీ ప్రతి సంవత్సరం ఆయప్ప భజన యాత్ర సాగిస్తా వచ్చినాడంట.

ఇట్టుంటే కడపజిల్లాలో రాయచోటి దగ్గర స్థిరమైపోయిండే యింకో గుంపోళ్ళున్నారంట. వాళ్ళల్లో 'వనారస సంజీవరావు' అనే ఆయన – తమ పూర్వీకులందర్నీ ఏరి నాటకాలాడించే ఉద్దేశంతో యట్లో ఈయప్ప అడ్రస్సు తెలుసుకోని పిలిపించినాడంట. అప్పటికే కోటోజీ జంఖండీ నాటకాలాడించి, తెల్లదొరల మెప్పు పొంది ఈనాములు గూడా పొందిన్నాడంట... యింకా యిజలాపురం షావుకారు, జమీందారు ఆయప్ప గొప్పతనానికి మెచ్చి ఈ గురువుల తోపును ఈనాముగా రాసిచ్చి నారంటలే...!

అట్ల ఆ ట్రూపులో జేరి కొద్దిరోజులు ఆ పాతనాటకాలే ఆడిస్తా సంసార మీడస్తా వచ్చినాడంటా. సంజీవరావుకు పదిమంది కొడుకులంట. వాళ్ళల్లో పెద్దోడు రామయ్య. కొంతకాలం ఆ నాటకాలు ఆడించినాడంట. అంతేగాకుండా దానిద్వారా యింకా ఎందరికో బతుకు తెరువు కల్పించినాడంట. ఆ తర్వాత ఆయప్ప మధ్యలోనే అయిస్సుతీరకనే సచ్చిపోతే – ఆయప్ప తమ్ముడు వెంకన్న ఆ కళను సేతబట్టినాడంట. ఆ ట్రూపులో ఈ కోటేశ్వరరావు భలేపేరు తెచ్చుకోని 1902లో ఉగాదినాడు కాలమై పోయినాడంట. ఈయప్ప సచ్చిపోతే సచ్చిపోతా ఆయప్ప బావమరిది అణ్ణాపు తుక్కోజీని పిల్చి 'హొరే తుక్కా! నేను సచ్చిపోతా ఈ ఉగాదినాడు తప్పకుండా నాటకం వేయండి. బెమ్మోత్సవాలకు ఎగువ తిరుపతికి భజనయాత్ర సాగించండి. నేను మా నాయనగారి, తాతగారి యిసయాలన్నీ హొగపుస్తకంలో

రాసిపెట్టిండా... నువ్వా ఆ చరిత్ర యింకో పుస్తకంలో రాసిపెట్టు... అందులో నీ చరిత్రా రాసుకో...!" అని మాట తీసుకున్నాడంట.

ఆయప్పకు మొగపిలకాలెవురూ లేనందున ఆ తుక్కోజీనే మన ట్రూపు బాధ్యతల్ని తీసుకోమన్నాడంట.!"

"ఓహోఁ... భజన యాత్ర ఉగాది నాటకాల యెనక యింత కతుందన్నమాట!" అతనికి అడ్డు తగుల్తూ అన్నాడు కదిరయ్య.

"అంతేగదా! యిట్ట యేదో వొగ కారణం లేకుండా అట్లా సాంప్రదాయాలు పుట్టవే! 'యివి యట్ట పుట్నాయబ్బా?' అని శ్యానా దినాలుగా నాక్కూడా బలే అనుమానంగా వుండె. యిప్పుడు దీరె ఆ అనుమానం!" చెప్పాడు లచ్చుమయ్య.

"పతి సంవత్సరం ఏదో సెప్తావుండే గానీ... ఇంత యిలావరిగా (విపులంగా) ఎప్పుడూ సెప్పలేదే అయ్యవారు!"

"అరె! వుండండయ్యా సామీ.... ఆయన్ను పూర్తిగా సెప్పనీ... యిన్నిరోజులకెట్టో యిలేవరిగి సెప్తావుండాడు. సెప్పనీ... నువ్వు సెప్పు గురువా!" మరో అతను అన్నాడు.

"ఆ తుక్కోజీ రావే మా తాత! యిద్దో ఆడుండే మూడో రాయి ఆయన్దే!" అంటూ ఆగాడు సిద్ధప్ప.

అందరి దృష్టీ ఆ బండపైన నిలిచింది. ఆ బండపైన 'అణ్ణావు తుక్కోజీరావు. జననం ఆగస్టు 12 : 1856; మరణం జనవరి 22; 1906' అన్న అక్షరాలు స్పష్టంగా కన్పించాయి.

తిరిగి ప్రారంభించాడు సిద్దప్ప –

"ఈయనా కొన్ని దినాలు రాయచోటి వాళ్ళ ట్రూపులో పంజేసినాడు. అక్కడ వెంకప్ప దత్తపుత్రడయిన వనారస గోవిందరావు సహచర్యంతో మంచి ఆటగాడుగాను, పాటగాడుగాను పేరు తెచ్చుకోని, ఏవో భేదాభిప్రాయాలొచ్చి తిరిగి కుప్పం వచ్చేసినాడంట. యింక అప్పట్నుంచీ ఇక్కడ భజనలు, జంఖండీ నాటకాలు అవీ నేర్పించి అందరికీ గురువై మంచి పేరు తెచ్చుకున్నాడంట. ఆయనా బెమ్మోత్సవాలకు యాత్ర సాగించడం మాత్రం మానలేదంట. ఆ తర్వాత చాలా ఏళ్ళకు వనారస గోవిందరావు వొగనాటకం తయారు చేసి ప్రదర్శించాలనుకొని తమ తుక్కోజీని గూడా పిలిపించినాడంట. అది 1895వ సంవత్సరంగా రాసిపెట్టిండారు. అప్పటికి మా నాయనకు రెండేండ్ల పాయమంట. ఆ నాటకం పేరు 'కీచక వధ'. అందులో ఈయప్ప ఏదో యేసికం (వేషం) యేసి అందర్నీ మెప్పించినాడంట. ఆ నాటకం గూడా బెమ్మాండంగా రక్తి కట్టిందంట. దాంతో గోవింద రావు కీర్తి దేశమంతా పాకిందంట. ఆయప్పే సురభి నాటకాలకు మూలపురుషుడంటలే!

ఆ తర్వాత 'రాప్తాటి సుబ్బదాసు' అనే నాటకాలాయన దెగ్గిర ఎన్నో నాటకాలు రాయించి గోవిందరావు ఆడించినాడంట. అట్ల వొగపక్క వాళ్ళ ట్రూపులో వేషాలేస్తానే, యింగోపక్క మనూర్లోను నాటకాలేయిస్తావున్నాడంట. తండ్రి యెనకింటీ వుండి మా నాయన గూడా వేసాలేస్తా వున్నాడంట. మా నాయన క్కూడా మంచి గాత్రసుద్ధి, తాళజ్ఞానం వుండేదిలే! అట్ల 1906లో యాభై ఏండ్ల వయసప్పుడు... మా తాత నాటకం ఏస్తానే, పాట పాడతానే గుండె ఆర్టు ఫేలు అయిపోయి స్టేజీమీదనే బడి ఊపి రొదిలేసినాడంట మహన్నభావుడు. ఆయప్ప సచ్చిపోయేటప్పుడు.. కోటేజీ ఆయనకేది సెప్పి సచ్చిపోయనో అదే మాట సెప్పి, గురువుల చరిత్ర రాయమని మాట దీసుకోని పోయినాడంట. అద్దో అప్పుటికి పల్లె గూడా శ్యానా పెరిగిండాదంట. ఆ తర్వాత వోళ్ళందర్నీ కూడగట్టుకోని మా నాయన గురుపీఠ మెక్కినాడంట."

ఒక్కక్షణం ఆగి, అక్కడున్న నాలుగో రాయిని చూపించి – "మహన్నభావుడు మా నాయన – సచ్చి ఏ లోకానుండాడో... నాకు తండ్రే గాకుండా గురువు, దైవం! మాతా కోరికను కడదాంక అనుసరించినోడు!" అన్నాడు.

ఎంతో ఉత్సాహంగా అటువైపుకు చూశారు అందరూ.

ఆ బండపైన 'అణ్ణావు వెంకోబరావు. జననం 12 మే; 1887; మరణం 22–02–1950 అన్న అక్షరాలు కొట్టొచ్చినట్టు కనిపించసాగాయి.

సిద్ధప్ప హృదయంలో తండ్రి పట్ల ఎంతో గౌరవభావం నిండిపోయి వుంది. తన్మయత్వంతో చెప్పుకుపోతూనే వున్నాడు.

"మా నాయన్ను అందరూ ముద్దుగా 'వెంకోజీ' అని పిల్చేవోళ్ళు. మా నాయనంటే అందరికీ భలే గౌరవం. మనూర్లో వాళ్ళనందర్నీ ఒక్క తాటిపైన నిలబెట్నోడు మా నాయన. అందరికీ భజన కీర్తనలు నేర్పించినోడు... నాటకాలు నేర్పించినోడు.. మా తాత తిరుమలకు యాత్ర సాగిస్తే.... మా నాయన ఉత్తరాదిలో వుండే పండరి పురానికి కాలినడకన పాండురంగ భజన యాత్ర సాగించినోడు. గోవిందరావు కోరిక మేరకు అప్పుడప్పుడు సురభి నాటకాల్లో వేషాలు కూడా కడతానే వున్నాడు. మా నాయనతో బాటు నాటకాలాడి నోళ్ళెంతోమంది సినిమాల్లో గూడా జేరినారంట. మా నాయనకూ సినిమావోళ్ళ నించీ పిలుపొచ్చింది. కానీ, ఆ కాలానికి నాటకం వాళ్ళను ఎంత గౌరవించినా, బంతి బాహ్యులు గానే చూసేవాళ్లు. ఆ కారణంగా సినిమాల్లో చేరితే యింకా చెడ్డపేరు రావచ్చుననుకోని, తరతరాలనుంచీ పెంపొందించుకోని, అందివ్వబడిన నాటకమే సర్వస్వంగా భావించు కున్నాడు. 1937లో గోవిందరావు జన్మదిన ఉత్సవాలకు కోస్తాలో ఏలూరు దగ్గరుండే పోలసాని పల్లెకు పోయివచ్చినాడు.

మా నాయనకు చిన్నవయస్సులోనే పెండ్లాయనంట. నేను మా నాయనకు యిద్దరాడ బిడ్డెల తర్వాత పుట్టాను. నా పుట్టిన తేదీ ఏప్రిల్ 19, 1912. అంటే మా నాయన పెండ్లి చేసుకున్న ఆరేండ్లకు నేను బుట్నా.. ఎప్పుడూ భారత నాటకాల్లో మునిగుండే మా నాయన... పెద్ద ఆపితి జరిగి సచ్చిపోయ! సచ్చిపోతా వటేరావు కోటోజీకి ఏం జెప్పినాడో.... కోటోజీ తుక్కోజీకి ఏం జెప్పినాడో – తుక్కోజీ మా నాయనకు ఏం జెప్పినాడో – ఆ యిసయం నేను నా కొడుక్కూ సెప్పేట్టుగా కూడా మాట దీసుకోని సచ్చిపోయ. ఇంక అబ్బుట్నుంచీ మీకు నేను గురువునై మిమ్మలనందర్నీ వొగటిగా జేసి, మా నాయన దెగ్గిర నేర్చిండే విద్దెలన్నీ మీకు నేర్పించినా! మీరూ ఇది గుర్తుంచుకోండి.... ప్రతి ఉగాదికీ ఈ తోటలో కొచ్చి, ఈ చరిత్ర చెప్పించుకోని గురువుల్ని తల్చుకోండి. ఆరోజు రేతిరే నాటకమూ ఆడండి. ఇంకా పాండి... పోదాం!"

– పైకి లేచి నిలబడ్డాడు సిద్ధప్ప

అతనితోబాటు అందరూ పైకి లేచారు.

తమ పూర్వీకుల గొప్పతనాన్ని తల్చుకుంటూ, గురువు సిద్ధప్ప పైన అభిమానాన్ని కురిపిస్తూ యింటిముఖం పట్టారు అందరూ.

## 5

"**అ**నుకున్న ప్రకారం ఆరోజు రాత్రి ....

భజన గుడి ముందరున్న పందిరిని విద్యుద్దీపాలతో అలంకరించారు. ఆరోజు పగలు నాలుగ్గంటల నుంచే అదేపనిగా పాడుతున్న లౌడ్‌స్పీకర్‌లో "వినుడి వినుడి రామాయణ గాథ వినుడీ మనసారా!" అన్న పాట గాలిలో కలిసి పోయి తెరలు తెరలుగా వినిపిస్తోంది. అప్పటికే చుట్టుపక్కల పల్లెల నుంచి కూడా కొందరు ప్రేక్షకులు వచ్చి కూర్చున్నారు. ప్రజలతో వీధి కిటకిటలాడుతోంది. తొమ్మిది గంటల రాత్రికి గాని 'మేళం' కట్టడం జరగలేదు.

నాటకం ప్రారంభమైంది.

కొన్ని వందల కళ్ళు తమ చూపుల్ని రంగస్థలం పైకి సంధించాయి.

మొట్టమొదట నటులు గురువుగారికి పూలమాలలు వేసి, పాదాభివందనం చేసి గౌరవించి

"ఆదిగురువు అణ్ణావు వటేరావుకీ... జై!

రెండో గురువు ఆటోకు కోటేశ్వరరావుకీ.. జై!

మూడో గురువు అణ్ణావు తుక్కోజీరావుకీ... జై!

నాలుగో గురువు అణ్ణావు వెంకోబరావుకీ....జై!

విద్దె నేర్పిన ఇప్పటి గురువు సిద్ధోజీరావుకి జై... అంటూ జయ జయ ధ్వానాలు పలికారు.

సిద్ధప్ప హృదయం ఆనందంతో పొంగిపోయింది. వెళ్ళి హార్మోనియం పక్కన కూర్చొని తాళంచిప్పుల్ని వాయిస్తూ 'విరాటపర్వం' నాటక పుస్తకం చేతపట్టుకొని, 'అటాని' ఎత్తిస్తూ నాటకం చూడసాగాడు. నటులు అద్భుతంగా దరువులు పాడుతుంటే – తన నాటక వైభవమంతా అతని కళ్లముందు కదిలింది. జీవితంలో చిన్నప్పట్నుంచీ ఎదురయిన ఎన్నో జయాలు, అపజయాలు, గౌరవాలు, అవమానాలు అన్నీ అతనికి గుర్తుకు రాసాగాయి.

గతమంతా ఒక్కసారి రంగుల రాట్నంలా గిర్రున తిరిగింది. ఒక్కొక్క సంఘటనే అతని కళ్ళ ముందర రూపు కట్టసాగింది.

* * *

"అది 1922వ సంవత్సరం!

అప్పటికి సిద్ధోజీకి పదేండ్లు నిండాయి.

దేశం మొత్తంమీదా గాంధీ శాసనోల్లంఘన ప్రభావం ప్రబలంగా వున్న రోజులవి. యావద్భారత దేశమూ గాంధీ బోధనలతో సముద్రంలా ఉప్పొంగి, తెల్లదొరల పాలనను ముంచెత్తడానికి పెల్లుబుకుతోంది. దేశమంతటా అల్లకల్లోలంగా వుంది. ఎందరో మహానుభావులు జైళ్ళకెళ్ళారు. మరోవైపు అల్లూరి సీతారామరాజు రగిల్చిన మన్య విప్లవంతో ఆంధ్రదేశం అట్టుడికిపోతోంది. కానీ, వాటి ప్రభావం యామిగానె పల్లెమీద ఏమాత్రం ప్రసరించలేదు. అసలు స్వాతంత్ర్యం అంటే కూడా తెలియని జనాలు – ఆంగ్లేయుల వల్ల తమకెలాంటి అన్యాయం జరుగుతోందో కూడా తెలుసుకోలేని పరిస్థితి వాళ్లది.

వెంకోజీ చుట్టింటి ముందరున్న కొట్టంలో కూర్చొని తుంగచాప అల్లుకుంటున్నాడు.

అది ఒక పెద్ద కొట్టం! ఒక మూల ధాన్యం నిలువ వుంచె పెద్దవాడ (గాదె)లున్నాయి. ఒక్కొక్క వాడ కుంభకర్ణుడి ఉదరంలా ఉబ్బెత్తుగా కనిపిస్తోంది. వాటికి పక్కగా ఓ విసుర్రాయి పొందేయబడి వుంది. ఆ వైపున మాత్రమే గోడ వుంది. తూర్పు, పడమరల వైపున గోడలు లేవు గానీ, నడుమలెత్తు అరుగులున్నాయి. దక్షిణం వైపున మిగిలిన సగభాగం రెండు గదులుగా వుంది. ఒకవైపున గదిలో బట్టలు, యింకా ఏవేవో కొన్ని సామాన్లు వున్నాయి. రెండో గదిలో కొన్ని సామాన్ల మధ్య ఓ పెద్ద భోషాణం పెట్టె వుంది. ఆ గదిలోనే ఓ ట్రంకుపెట్టె, నడుములెత్తుతో, వెదురు దబ్బలతో అల్లిన గాదెలాంటి బుట్ట,

అందులో కొన్ని బట్టలు, దక్షిణం వైపునున్న ఓ దండెం కట్టెకు వేలాడుతూ కొన్ని మాసిన బట్టలు, కొన్ని దుప్పట్లు, ఆ భోషాణం పెట్టె పైన బాగా మురికి పట్టి వున్న ఒక పరుపు. అదే స్థితిలో వున్న రెండు దిండ్లు. ఆ పక్కనే గోడకు ఆనించి నిలబెట్టబడివున్న ఓ మూడు సిరిచాపలు వున్నాయి.

ఆ కొట్టానికి తూర్పు వైపున ఓ సపారిలాంటి మరో చిన్న కొట్టం. అందులో వంటగది, కొట్టాని కుత్తరాన ఆ కొట్టమంత బండ్ల పందిరి, అందులో రెండు పశువులు కట్టివేయబడి వున్నాయి. ఆ పందిరిచుట్టూ గోడలా మనిషెత్తున బండలు నాటబడి చుట్టింటికీ, కొట్టానికీ మధ్యనున్న సందుకు నేరుగా అందులోకి దారి వుంది. ఆ దారిని వెదురు ఊచలతో అల్లిన తడికెతో మూసివుంచారు. ఆ సందు అలాగే దక్షిణంవైపు వీధిలో కలిసిపోతోంది.

మధ్యకొట్టంలో ఉత్తర దిక్కున, వాడలకు పడమటి వైపున మనిషెత్తులో అడ్డంగా ఒక వెదురు కొయ్య అమర్చబడివుంది. దానికి మధ్యలో అంగుళం, అంగుళం దూరంలో ఒక్కోదాన్ని చొప్పున దారాల్ని వేలాడదీశాడు. అవి నేల వరకు వ్రేలాడుతున్నాయి. వెంకోజీ నెలక్రితం చెరువులో నుంచి కోసుకొనివచ్చి ఆరబెట్టిన బారెడు పొడవు తుంగపోచల్ని ముందరేసుకున్నాడు. అల్లేటప్పుడు విరగకుండా వుండటానికి వాటిపైన నీళ్ళను చిలకరించి పదును చేసుకున్నాడు. ఆ తర్వాత ఒక్కొక్క తుంగపోచనే ఆ దారాలకు మధ్యన పైనుంచి అడ్డంగా వుంచి, ప్రతి దారాన్ని జాగ్రత్తగా చిక్కుపడకుండా ఒక చుట్టు చుట్టి తీయసాగాడు. దానికింద మరో తుంగపోచని వుంచి అలాగే దారాల్ని చుట్టి వదులుతూ ఆ పోచలతో చాప అల్లసాగాడు. అప్పుడప్పుడూ అతని భార్య బూసమ్మ పోచలందిస్తూ సహకరిస్తోంది. సిద్ధప్ప చాపలల్లడంలో తండ్రి నేర్పరితనాన్ని తిలకిస్తూ అరుగుపైన కూర్చోనున్నాడు. అతని అక్కగార్లిద్దరూ వంటింట్లో అగచాట్లు పడుతున్నారు.

పనులు లేని కాలంలో తుంగచాపల్ని, గూడచాపల్ని అల్లి – వాటిని అమ్ముకొని, ఆ డబ్బుతో సంసారం సాగించడం అతని పని. అతనికి వంశానుగతంగా సంక్రమించిన రెండు ఆస్తులున్నాయి. ఒకటేమో – రెండెకరాల పొలం. గురువుల తోపయితే, రెండోది – బొమ్మల్నాడించడం, నాటకాలు వేయడం! అయితే బొమ్మల నాడించడం పోయింది కానీ, నాటకాలు మాత్రం అప్పుడప్పుడు వేస్తూనే వున్నాడు. చాపలల్లడం కూడా వాళ్ళ పూర్వీకుల నుంచి అబ్బిన విద్యే! నేడు ఆ విద్యే ఆ కుటుంబానికి ఆధారమైంది.

“బూసీ! ఈ సాపతో పది సాపలైతాయి. రేపే కుప్పం సంత! ఆ సంతకు బొయ్యి ఈ సాపలు అమ్ముకోని రావాల!” అన్నాడు అల్లుతూనే.

“మనకింక సాపలు పొయ్యేది సంతల్లోనే గదా! పల్లెల్లో మనం యాడ తిరగతాం....?” అంది బూసమ్మ.

"కుప్పం సంతలో మిగిల్నివి యిజలాపురం సంతలోనన్నా అమ్మక రావాల! ఆడా మిగిల్నివి చుట్టుపక్కలా, కల్లుపల్లె, గాంధీపురం నుంచి శంకరాపురం వరకు, అటు లింగాపురం వరకు వుండె పల్లెల్లో తిరిగి యట్టో వొగట్ట అమ్మక రావాల. లేకంటే జీవనం గడిసేదెట్ట?"

"ఉండే అయిదెకరాల భూమిలో మూడెకరాలు యిప్పటికే అమ్మక తినేస్తిమి. యింక వుండె రెండెకరాలతో ఆడబిడ్ల కెట్ల పెండిండ్లు జేయాల? యిట్టా వుండేదమ్ముకుంటా బోతే బతుకు తెల్లారినట్టే! అనాక (తర్వాత) కడాన ఉడుబోతు పిందె మాదిరి ఓకే ఒక మొలక.... మొగపిల్లోడు... వాడికేం మిగిల్చినట్టు?" నొప్పిగా చెప్పింది బూసమ్మ.

"అదీ నిజమే! అందరికంటే కడాన బుట్నోడు.... వాడి గతేం గావాల?" మురిపెంగా కొడుకువైపు చూశాడతను.

"మీ వంశకర్త వటేరావు వొగడే గదా! వంటిచెట్టు వనమైనట్లు ఈ ఊర్లో ముక్కాలు భాగం ఆయప్ప సంతు గాదా? అదురుష్టం బాగుండాలే గానీ, వొగ దొడ్డి వెయ్యి దొడ్లు గాదా? వొగ సంతు వెయ్యి సంతుగాదా? మన వంగిశమూ పెబలం (ప్రబలం) గావాలంటే వోడు సుఖంగా వుండాల గదా! వాడు సుఖంగా వుండాలంటే.... వాడికింతో, అంతో చేకూర్చిపెడితే గదా!"

"చేకూర్చి పెడతా...! కన్న అగసాట్లు బడయినా సరే సమకూర్చి పెడతా! కానీ, 'వొగ కన్ను కన్నూ గాదు – ఒక బిడ్డ బిడ్డే గాదు' అంటారు. వాడి అదురుష్టం యెట్టుండాదో ఎవుడు సూసినాడు?"

ఆ వేళ వాళ్ళ హృదయాల్లో బిడ్డల భవిష్యత్తు ఒకసారి అగమ్యగోచరంగాను, మరోసారి ఏదో సన్నని వెలుగు ప్రసరిస్తున్నట్టుగాను అనిపించింది.

"అమ్మా! పొట్టాడ దంచిన సద్దలు యింక రెండు దినాలకే వచ్చేట్టుండాయి అంతే"

వంటింట్లో నుంచి పొగకు కళ్ళు నులుముకుంటూ వచ్చి వాళ్ళ సంభాషణ కడ్డు తగిలింది చిన్న కూతురు సుధేష్ణ.

"ఆ తూరుపు పక్కనుండే వాడ తురుం (ధాన్యం తోడుకోవడానికి గాదెకి కింది భాగంలో ఏర్పాటు చేసిన రంధ్రం) మూత తీసి సద్దలుగంపకు పట్టమ్మా!" అంది బూసమ్మ.

ఆ మాటతో తురుంబిల్ల తీసి, గుడ్డ లాగేసింది. మీట నొక్కగానే – ఒక్కసారిగా నీటిపంపులో నుంచి కిందికి దూకే బావినీళ్ళలా.... వాడలోని సజ్జలు నేలపైకి జల్లున దూకసాగాయి.

బూసమ్మ మాట్లాడుతూనే వెంకోజీకి తుంగపోచల్ని అందిస్తోంది. అతను చాప

అల్లుతూనే వున్నాడు. వాడలో నుంచి సజ్జలు మెల్లగా దూకుతున్నాయి. కింద ధాన్యపు కుప్ప పుట్టకోమలా, చిన్న కొండలా పెరుగుతూనే వుంది. ఆ కుప్పలో నుంచి తెల్లటి పురుగులు కదుల్తూ చుట్టుపక్కలకు పాకుతున్నాయి. సుధేష్ణ ఒక ఇనుప జల్లెడ తీసుకుని కొన్నికొన్నిగా ఆ కుప్పలోని సజ్జల్ని అందులో పోసుకొని జల్లించి, ఆ ధాన్యంలోని పురుగుల్ని, చెత్తను వేరుచేసి పక్కన పోస్తోంది. సుధేష్ణ కంటే పెద్దదయిన రేణుక వంటగదిలో కూర్చొని ఊదల బుర్రతో ఊపిరి ఊదుతూ, పొయ్యి మంటేస్తూ కూర్చోనుంది.

అలా చూస్తూండగానే వాడలో నుంచి కొంతసేపు జారిన ధాన్యం సన్నగా దూకి ఆగిపోయింది.

"అమ్మా... వాడలో సజ్జలు అయిపోయినట్టుండాయే!" అంది సుధేష్ణ.

ఆ మాట విన్న బూసమ్మకు, వెంకోజీకి గుండె జల్లుమంది.

"యింకా తొలేటి వానలే బడలే... అప్పుడే సజ్జలైపోతే ఇంకా నాలుగయిదు నెలలు యట్ల గడవాలరా భగవంతుడా?" వెంకోజీ మనసు వాపోయింది.

ఏదో తెలియని బ్రహ్మాండమైన సమస్య తమపైన దాడి చేయడానికి అదృశ్యరూపంలో సమాయత్త మవుతున్నట్లనిపించిందతనికి.

"అసలు ఈ సంవత్సరం వానలు సక్కరమంగా కురిసి, సేన్లు బాగా పండితే నాలుగయిదు నెల్లు గడుస్తాది. లేకుంటే వచ్చే ఏడు కరువే గదా.... యట్టబ్బా జీవనం గడిసేది?" బూసమ్మ దిగులు పడింది.

భవిష్యద్దాకాశంలో ఏవేవో కారుమబ్బులు కమ్ముకొస్తున్నట్లు, ఏదో తెలియని అంధకారం ఆవహించబోతున్నట్టు అనిపించిందామెకు.

'తురుం నిల్చిపోయింటే సచ్చీ బతికీ వాడలో అరమూట కంటే ఎక్కువుండవు. అవి ఎన్ని దినాలకొస్తాయి? ఒక నెలకొచ్చునేమో!" అనుకున్నాడు వెంకోజీ.

"అంతలోపల యట్లో వొగట్ట యింగోమూల ధాన్యం సూడయ్యా! లేకంటే బిడ్డలు పస్తులుండాల్సి వస్తాది!" హెచ్చరించింది బూసమ్మ.

పందిరి కొట్టంలో ఎద్లు చొప్పదంట్లు నముల్తున్న శబ్దం స్పష్టంగా వినిపిస్తోంది. రాబోయే ఆహార సమస్య ఆ ఎద్దుల్లా, తన మెదడును కట్టెపుల్లను చేసి నములుతున్నట్లని పించిందతనికి..

"అమ్మీ సుధేష్ణా.... పొయ్యిలోకన్ని కట్టెపుల్ల లెత్తకరా!"

– లోపల్నుంచే అరిచింది రేణుకమ్మ.

"వొరేబ్బా సిద్దూ! యింటెనక్కి పొయ్యి రెండు చీల్చిండే కట్టెలు దెచ్చి అక్క కియ్యి!" జల్లించిన ధాన్యాన్ని చేటతో గంప కెత్తుతూ సుధేష్ణ అంది.

"సరేక్కా!" అంటూ అంతవరకూ గయోపాఖ్యానం నాటకాన్ని చదువుకుంటూ కూర్చొనివున్న సిద్ధప్ప లేచి పెరట్లోకి వెళ్ళాడు.

సుధేష్ణ తన కుడిచేతి గాజుల్ని తీసి పక్కనపెట్టి, వాడ రంధ్రంలో చేయిపెట్టి వాడలో మిగిలివున్న ధాన్యాన్ని తోడసాగింది.

సిద్ధప్ప పెరట్లో నుంచి పొయ్యిలోకి అనువుగా చీల్చిపెట్టిన కట్టెల్ని చేతుల్తో ఎత్తుకొని వంటింట్లో వేసి వచ్చి, మళ్ళీ అదే అరుగుపైన కూర్చొని మధ్యలో ఆపేసిన నాటకాన్ని తిరిగి చదువసాగాడు. సిద్ధప్ప విజలాపురంలో వున్న అప్పర్ ప్రైమరీ ఎలిమెంటరీ స్కూల్లో ఏడు వరకు చదువుకున్నాడు. సిద్ధప్ప బాగా చదివేవాడే.... కానీ, హైస్కూలుకు వెళ్ళాలంటే కుప్పం వెళ్లాలి. కుప్పం అక్కడికి దాదాపు అయిదు మైళ్లు దూరంలో వుంది. అంతదూరం పంపి చదివించే స్థోమతు లేక ఆపేశాడు వెంకోజీ.

సుధేష్ణ ఆయాసపడిపోతూ ఎలాగో వోలాగు మరికొన్ని సజ్జల్ని తోడింది. ఆపాటి పనికే విశాలమైన ఆమె పాలభాగం పైన సంధ్యవేళ ఆకాశంలో మిణుకుమిణుకుమంటూ కనిపించే నక్షత్రాల్లా సన్నని స్వేదబిందువులు పొడసూపాయి.

"ఇంక సాల్లేమ్మణ్ణీ... అవి అయిపోయినాక సూసుకుందాం! ఎలకలు పోకుండా వాడకు మల్లా 'మెత్తెయ్యి!" అంది బూసమ్మ.

ఆ మాటతో సుధేష్ణ ఆ ప్రయత్నాన్ని మాని, లేచి గొడ్ల చావడిలోకి వెళ్ళి ఓ పిడచ పేడకడి తీసుకొని పెరట్లోకి వెళ్ళి దాని నెత్తిన అన్ని నీళ్ళుచల్లి పిసికి ముద్దచేసి తీసుకువచ్చి అంతకుమునుపు తీసివున్న మెత్తలోని గుడ్డను తీసి రంధ్రంలోకి తురిమి, దానిపైన తెచ్చిన పచ్చిపేడను అతికించి, అరచేతితో సాపు చేసింది. తిరిగి పెరట్లోకి వెళ్ళి శుభ్రంగా చేతులు కడుక్కొని వచ్చి, ఆ వాడల పక్కనున్న రెండు రోకళ్ళలో ఒక రోకల్ని తీసి పక్కనపెట్టింది. జల్లించిన పురుగుల్ని, చెత్తను తీసుకెళ్ళి పెరట్లో వున్న చెత్తకుప్పలో పోసివచ్చి కుదురుపెట్టి, గంపలో వున్న సజ్జల్ని కొన్నికొన్నిగా రోట్లోపోసి, పక్కనపెట్టిన రోకలితో దంచసాగింది.

అలా సుధేష్ణ సజ్జలు పొట్టూడ దంచుతుంటే... లోపల్నుంచి రేణుకమ్మ వచ్చి, అక్కడే కూర్చొని మిగిలివున్న సజ్జల్ని జల్లించసాగింది. పొట్టూడిన సజ్జల్ని తోడి పక్కనపోసి, మరోవాయ రోట్లో పోసుకుని దంచడంలో నిమగ్నమై వుంది సుధేష్ణ. వాడలో నుంచి తోడిన సజ్జల్ని జల్లించడం పూర్తిచేసి, సుధేష్ణ పొట్టూడదంచి పక్కన పోస్తున్న సజ్జల్ని కొన్నికొన్నింటినే చేటలోకి తీసుకుని చెరగి మరో గంపలో పోయసాగింది రేణుకమ్మ.

అలా అక్కాచెల్లెలిద్దరూ సజ్జల్ని పొట్టూడదంచి, చెరగి శుభ్రంచేయడం పూర్తయ్యేసరికి వెంకోజీ చాపల్లడం కూడా పూర్తిచేసి దారాల చివర్లను ముడివేసి, చురకత్తి తీసుకుని వాటి కొసల్ని కత్తరిస్తూ అరుగుపైన కూర్చొన్నాడు.

సుధేష్ణ జల్లించిన పురుగుల్ని బయట పారబోసి వచ్చి, చెరగిన పొట్టును చేటలోకి తీసుకుని కుడితిలో పోసి, ఎడ్లకు పెట్టింది. ఆ పొట్టును కలిపిన కుడితిని ఆబగా తాగసాగాయి గొడ్లు. సుధేష్ణ రోకల్ని తిరిగి యథాస్థానంలో పెట్టి కుదురును కొమ్ముకు తగిలించింది.

ఇంతలో.... ఓ నలభైయేళ్ళ వ్యక్తి యింటి ముందరికి వచ్చి నిలబడి, "ఏమమ్మా పాపా! వెంకోజీ యిల్లు యిదేనా?" అని అడిగాడు.

"ఆ!... యిదేన్నా!" అంది అక్కడే నిలబడివున్న రేణుకమ్మ.

ఆ వ్యక్తి "ఉస్సబ్బ!.....!" అనుకుంటూ లోపలికి వచ్చి "నమస్కారమన్నో...!" అన్నాడు.

"ఆ!.... ఏమప్పా – నువ్వెవరు? ఎందుకొచ్చినట్టు?" దారాల్ని కత్తిరించడం పూర్తిచేసి చాపను పరిశీలిస్తూ అన్నాడు వెంకోజీ.

"ఏం లేదన్నా! మా వూరు పలమనేరు... నాపేరు సుబ్బరాయుడు. నీతో పనుండి వస్తిని!" ఎంతో వినయంగా చెప్పాడా వ్యక్తి.

"పలమనేరేనా.... లేదా పక్క పల్లేమన్నానా?"

"పలమనేరు దెగ్గిర.... లింగాపురమని... ఆ ఊరులే!"

"సరే! రా... కూసో!" అంటూ అల్లిన చాపను అరుగుపైన పరచి ఆహ్వానించాడు.

అతను వచ్చి చాపపైన కూర్చున్నాడు.

"నీళ్లేమన్నా తాగతావా?"

"ఆc.... తాగతాన్నా.... కొన్ని యిప్పించు!"

"అమ్మణ్ణీ! అన్ని మంచినీళ్ళు తీసుకరామ్మా...." పురమాయించాడు వెంకోజీ.

అక్కడే వున్న రేణుకమ్మ లోపలికి వెళ్ళి ఒక చెంబుతో నీళ్ళు తెచ్చియిచ్చింది.

ఆ వ్యక్తి గటగట సగం నీళ్ళు తాగి చెంబు తిరిగి యిచ్చేస్తే – ఆ చెంబు తీసుకొని రేణుకమ్మ లోపలికి వెళ్ళిపోయింది.

"ఆc.... వచ్చిన పనేమో చెప్పప్పా సుబ్బరాయుడూ!" అడిగాడు వెంకోజీ.

"ఏమీ లేదన్నా.... మా ఊళ్ళో పిలకాయలంతా వొగ నాటకం నేరవాలని అనుకోని గురువు కోసం నన్ను పంపించినారు. కుప్పంవచ్చి మంచి గురువుకోసం అడిగితే చానామంది నీపేరే సెప్పినారు. అందుకని నేరుగా నీ దెగ్గరికి వస్తి! నువ్వొప్పుకుంటే.... ఎన్ని దినాలు – నెలపాటు అంతే .... నీకు తెలిసిన నాటక యిద్దె మాకూ అట్ట నేరిపిస్తే చాలు..... మా వోళ్ళ మునాస (ఇంట్రెస్ట్) తీరిపోతుంది!" అంటూ వచ్చిన పని చెప్పాడు.

"నెలపాటా? యట్టబ్బా.... నాకూ ఇల్లూ, సంసారము అన్నీ వుండాయి గదా?!"

"నీకు వీలుబడినప్పుడల్లా వస్తువులేన్నా! యింటి క్కావల్సివన్నీ మేము ఏర్పాటు చేస్తాంలే....!"

"ఏమి ఏర్పాట్లు... యట్టనుకున్నారు?"

"ఏం లేదన్నా.... మేమంతా రైతులమే... ఏదో పిలకాయల మునాస! మాకు 'ఆట' పూర్తిగా నేర్పించి, మాచేత ఆటేపించేస్తే – వొగ మూటొడ్లు, యాభై రూపాయలు సంబలం యిస్తామన్నా! యింకా మిరపకాయలు, సింతపండు, దనేలు ఇట్టాంటివి వుండనే వుంటాయిలే.

"సరే...!నేను దుడ్డు కోసం రానబ్బా... ఏదో నాకు నా పూర్వీకులు నుంచీ అందిన యిద్దె మీకూ నేర్పిస్తాను. అదే నాకు సంతోషం!"

"యింతకీ ఎప్పట్నుంచీ రావాల?"

"వచ్చేసోమారమే బాగుంటుందన్నా! ఆ దినం పొద్దున్నే వచ్చేస్తే.... ఆ తర్వాత అన్నీ మేం సూసుకుంటాం. యిందా చార్జీలకు దుడ్డు!"

జేబీలో నుంచి ఓ పదిరూపాయలు తీసి అతని కందించాడు సుబ్బరాయుడు.

"మల్లియ్యొచ్చు లేబ్బా.... దుడ్డుదేముంది గానీ!" అంటూనే ఆ పదిరూపాయల్నీ తీసి జేబులో వేసుకున్నాడు వెంకోజీ.

"సరే... యింక – వస్తాన్నో... శ్యానా పండ్లు అట్లే వుండిపాయ!" అతను పైకి లేచాడు.

సుబ్బరాయుడు సెలవు తీసుకొని వెళ్ళిపోగానే –

"ఏం బూసీ! దేవుడు సూడు – ఎంత సల్లంగా సూసినాడో! నువ్వ అట్ట ధాన్యం అయిపోయిందంటివో, లేదో – యిట్ట మనల్ను తారాడతా (వెదుక్కుంటూ) వచ్చి దుడ్డు సేతిలో యేసిపోయిరి! ఇంట్లో గింజలై పోయేగుందికి మళ్ళా యింట్లో ధాన్యంచేరుతుంది! దేవుడు ఏదో వొగ దారి సూపెడతానే వుంటాడు!" ఆనందంగా అన్నాడు వెంకోజీ.

"అంతేలే.... మనం మహన్నభావుడు ఆ పరమాత్ముడ్ని నమ్ముకున్నోళ్ళం.... ఆయనకు మాత్రం తెలీదా?"

"ఆ సీనువాసున్ని నమ్మి సెడినోడులే.... నమ్మక బాంవుకున్నోడులే!"

తిరిగి వచ్చి అరుగుపైన కూర్చున్నాడు.

"అప్పా!అప్పా ఈసారి యాడన్నా నువ్వ నాటకం యేస్తే....నన్నూ పిల్చకపో నాయనా... నేను యాసం గడతా!" అన్నాడు సిద్ధప్ప.

సిద్ధప్ప ఉత్సాహాన్ని చూసి వెంకోజీ హృదయం ఆనందంతో పొంగిపోయింది.

అంతేగాకుండా....

తన తర్వాత గురుపీఠ మెక్కి సిద్ధప్ప తన వారసత్వాన్ని నిలపడమే గాకుండా, నాటక కళను ఎంతో ఉన్నత స్థితికి తీసుకుపోయినట్లు, లోకం అతనికి బ్రహ్మరథం పడుతున్నట్లు – అతనికి భవిష్యత్తు మనోఫలకం పైనదృగ్గోచరమై అదృశ్యమైపోయింది.

"ఏం వేషం వేస్తావు?"

– అడిగాడు

"ఏం వేషమైనా యేస్తాను"

ఆ మాటల్లో ఆత్మవిశ్వాసం కనిపించింది.

"అదే... ఏం వేషం?"

క్రిష్ణలీలల్లో బాలకిష్టు డేషం, హరిశ్చంద్రలో లోహితాసు డేషం....."

"నా బంగారే!! అట్టే యేద్దువుగానీ.... దినొమ్ము రాత్రి భజన గుళ్ళో వద్దిక జరగతాది గదా... ఆడికి వచ్చి ముందు తాళమేసేది, ఎనక పాట పాడేది నేర్చుకో... దరువులు వాటిచ్చుగా అవే వస్తాయి.".

ఆ విధంగా సిద్ధప్ప సహజంగానే చిన్నప్పుడే నాటక కళ వైపు ఆకర్షితుడైపోయాడు.

# 6

**"తూ**ర్పున.... పేడనుగ్గుల సెగ మీద ఎఱ్ఱగా అరకాగిన జాతి పశువుల పాడి నుంచి తీసిన వెన్నముద్దలా బంగారు వన్నెతో చల్లగా ఉదయిస్తున్నాడు సూర్యుడు.

ఆ ఉదయభానుడి తొలికిరణం ఆ పల్లెను తాకకముందే... కుర్వకోటప్ప, బాలమ్మ లేచిపోయారన్న వార్త దావానలంలా వ్యాపించింది.

సంక్రాంతి రోజుల్లో.... రేయంతా శూన్యంగా వున్న ఆకాశం పొద్దుపుట్టే సమయానికి దట్టమైన పొగమంచును హఠాత్తుగా వర్షించి ప్రకృతిని గజగజలాడించినట్లుగా... ఆ వార్త ఆ ఊరిని గజగజలాడించింది.

మొదట ఆ ఊరి ఆచారి యింట్లో, చక్రవాకి పక్షుల విరహాగ్ని ధూమంలా ప్రారంభమైన ఆ పొగమంచు బాణవేగంతో, బల్జ గంగులయ్య యింట్లోకి దూసుకెళ్ళి వాళ్ళ ఇంటిని వంటినే కాదు..... వాళ్ళ గుండెల్నీ వణికించింది. వృద్ధాప్యంలోకి అడుగుపెడుతున్న ఆ దంపతులు ఆ వార్త విని నట్టింట్లో నిలువునా కూలబడిపోయారు.

ఆ రాత్రి భజన గుడి ముందర పంచాయితీ జరిగింది. ఊరి పెద్దలందరూ వచ్చి గుడి ప్రాంగణంలో కూర్చొన్నారు... ఊరి ప్రజలు వాళ్ల కెదురుగా వీధిలో నిలబడ్డారు.

మరికొందరు ఇండ్ల ముందున్న అరుగులపైన, బండలపైన కూర్చొని చూస్తున్నారు. యింకొందరు నేలపైనే కూర్చొనున్నారు. ఊరిపెద్దల మధ్యన గురువు వెంకోజీ కూర్చోని వున్నాడు. అందరూ ఏదేదో లోకాభిరామాయణం మాట్లాడుకుంటున్నారు.

"యింకేం కానీబ్బా.... యిట్టే వుంటే యట్టా? రేతిరైపోతా వుండ్లా?" అన్నాడో పెద్దమనిషి.

"పగలు మాటలు పనికి చేటు – రేతిరిమాటలు నిద్దరకు చేటు!"తెల్లారితే అందరూ వోళ్ళ వోళ్ల పన్లకు బోవాల! పోకపేతో కడుపాత్రం తీరేదెట్టా? మాటలాపేసి పని కానీండప్పా... పని కానీండి!" మరో అతను హెచ్చరించాడు.

"యిప్పటికే కొందరు తూగతా వుండారు. గానీబ్బా సామీ.... బిన్నే కానీండి!" యింకో వ్యక్తి యాష్టపోయాడు.

అప్పటికే... ఓ మూల గంగులయ్య దీనంగా నిలబడి వున్నాడు. అతని ముఖంలో దైన్యం, అవమానం కొట్టొచ్చినట్లు కనబడుతున్నాయి. కానీ, మరోవైపున నిలబడి వున్న కోటప్ప ముఖంలో 'ఈ ఊరే గాదు. ఈ లోకమే ఏకమైవచ్చినా నన్నేమీ చేయలేరు!" అన్న ధైర్యం, గర్వం ప్రస్ఫుటమవుతున్నాయి.

"వొరే మిడిమేళం నా కొడకా... వొగరి మంటికి పోయేవాళ్ళమా... సంటికి పోయేవాళ్ళమా? మన్ను పిసుక్కోని బతికేటోళ్ళం... వొగ అన్నె మెరుగం, వొగ పున్నె మెరుగం! అట్టాంటి మా కడుపును కాల్చను నీకెట్ట బుద్ధి బుట్టెరా లంజాకొడకా...!"

"పసరు బాము లాంటోళ్ళు.... లోక మెరగనోళ్ళు! అంతకుమించి నోట్లో నాలుక లేనోళ్ళు.... యిట్టాంటోళ్ళ బిడ్డెను లేపకొచ్చేదానికి ఈ కొంతేగాలం నాకొడుక్కి యట్ట బుద్ధి బుట్టేని...?!

కొందరు మనసులోనే కోటప్పను తిట్టిపోయసాగారు.

"వొగరేంది నాకు సెప్పేది?యిద్దరూ మొనుసు బడినాము. పొయ్యి గుల్లో పెండ్లి సేసుకోనొచ్చేసినాము... అందువల్లా వచ్చే కష్టమో, నష్టమో మేమే అనుభోగిస్తాము (అనుభవిస్తాము) ఈళ్ళేంది నాకు సెప్పేది? సూస్తా.... అట్టా, యిట్టా గాదని ఎక్కువ మాట్లాడినారో – వొగ నాక్కొడిక్కి కూడా కులముండనీను....బరముం (గౌరవం) డనీను. మెట్లతో కొట్టి పారేస్తా... అంతే!" మనస్సులో దృఢమైన నిర్ణయం చేసుకుంటూ నిలబడి అందర్నీ తృణీకరించి చూస్తున్నాడు కోటప్ప.

సభలో గుసగుసలు ప్రారంభమయ్యాయి. "ఇద్దరిదీ వొగే కులమన్నా అయి సచ్చింటే యట్టోవొగట్ట యాగొచ్చు. వోడిదో కులం, దాందో కులమే – యిప్పుడెట్ట యేగేదబ్బా...?!"

"కలిగ్గెమే (కలియుగమే) అట్టయిపోయిండాది. మడుసులకి వొగ కులంలా – గోత్రంలా– పెద్దాసిన్నా తేడాలే... ఎక్కువ మాట్లాడితే వాయి వరసలే లా...!"

"రాను రాను ఊర్లో పిల్లోళ్ళు భలే బరితెగించి పోతావుండారబ్బా! పిల్ల పిల్లోళ్ళకు పెండిండ్లు జేస్తే ఈదిలోనే పని బట్టేసినట్టుండాది యవ్వారం!".

"ఏం కులాలో, ఏం గోత్రాలో పొండబ్బా! అన్నీ మడుసులు బెట్టుకున్నవే గదా...! తెల్లోళ్ళతో పోరాడతా వుండే గాంధీవోడు ఏమంటా వుండాడు? 'మనం కులాలు, మతాల పేరుతో కొట్టుకోబట్టే గదా తెల్లోడు మన దేశానికొచ్చేసి పెత్తనం చెలాయిస్తా వుండాడు!' అంటా ఊరూవాడా ఉపన్నాసాలిచ్చేస్తా వుండాడు."

"ఆయప్ప మహన్నభావుడు, గాంధీవోడు ఆ పరమాత్ముడి అవతారం అంటప్ప! లేకుంటే సిరిసంపదలన్నీ వొదిలేసి, గోసిపాత మాత్రమే కట్టుకోని అయిధం బట్టకుండా, ఆగడాలు, ఆగింతాలు లేకుండా తెల్లోళ్ళ నొక ఆట ఆడిపిస్తా వుండాడా?"

"ఆయప్పే కడాకు కడజాతోళ్ళు మనమూ అందరూ వొగిటే... కులాల్లేవు, గిలాల్లేవు పోండి!" అనేస్తా వుండాడు గదా! అదంతా పేపర్లో యేసిండారని ఆచార్లు సెప్తా వుండ్లా...?!"

"ఎన్నో తరాల నించీ వస్తావుండే కులాలు ఆచారాలు మనం వద్దనుకుంటే మాత్రం మాసిపోతాయంట్రా ముఠాల్నాకొడకా! కులమనేది మన నొసటన దేముడు పొడిసుండే పుట్టుమచ్చ మాదిరి! అది కంటికి కనిపించదు. కాబట్టే అంత సులభంగా పోదు. అది మన తలరాత మాదిర్తో మడిసితో బాటు పోవాల్సిందే – ఈ అన్నేకారి లోకంలో!"

"అవునబ్బా! కులం పోగోట్టుకోని ఊర్లో యట్ట బతకొచ్చు? కాబట్టి వీళ్ళను కులానికు, పల్లెకు యెలేసేస్తే సరిపాయ!"

"ఏమోబ్బా... అంతా మనమనకున్నిట్టేనా? గురువు ఎట్ట సెబితే అట్ట గదా! మనూర్లో గురువుల మాట ఎప్పుడయినా జవదాట్నారా జనాలు? వాళ్ళ మాట వేదవాక్కు గదా పల్లెల్లో...!'

"ఆఁ... అదీ సూద్దాం!"

ఎవరి అభిప్రాయాలు వాళ్ళు వ్యక్తం చేస్తున్నారు. చర్చించుకుంటున్నారు.

"ఓరి మీ పాసుగాల! మీ గోల కొంచెం ఆపండ్రా!" ఉరిమాడు ఆచారి.

ఆ మాటతో సభలో చర్చలు, గుసగుసలు ఆగిపోయాయి.

"ఆఁ... యింకేం కానీండబ్బా! పొద్దు పోతావుండ్లా....?" అన్నాడో పెద్దమనిషి.

"ఎవరో వొగరు ముందు అట్టనండీ... అనాక అదే సాగతాది యవ్వారం!"

మరో పెద్దమనిషి సూచించాడు.

వెంకోజీ మౌనంగా తలవంచుకొని కూర్చున్నాడు. పంచాయితీలో అలా కూర్చోవడం అతని అలవాటు.

"ఏం లేదబ్బా! కుర్వకోటప్ప, బల్జోళ్ళ బాలమ్మను తొడక్కపోయి గుళ్ళో పెండ్లి చేసుకోనొచ్చేసి నాడంట! ఇది సూసి ఊర్లో వుండే మిగతా కోరపిలకాయలంతా అదే యారవ పట్టుకుంటారు. అందరికీ అదే ఆటయిపోతాది! కాబట్టి యట్లో వొగట్ట ఈళ్ళను దండించాల్సిందే!" యింకో పెద్దమనిషి ప్రారంభించాడు.

"దండించే దేముండాది? యిద్దర్నీ పల్లెనుంచి యెలేసేస్తే సరిపాయ!"

"ముందు ఇది నిజమో, కాదో కోటప్పను, గంగులయ్యను అడగండి?"

"అవును... అదీ నిజమే! అడగండబ్బా?!"

"ఎవరికి వాళ్లు సలహాలిచ్చేస్తున్నారు. మాట్లాడేస్తున్నారు. ఎదుటి విషయం మనది కానప్పుడు ఆ వ్యక్తులు మనకు సంబంధించిన వాళ్ళు కానప్పుడు యిష్టం వచ్చినట్లు మాట్లాడ్డానికి అందరూ మొనగాళ్లే, పెద్ద మనుషులే.... యిదేనేమో లోకం తీరు!" తీవ్రంగా ఆలోచిస్తున్నాడు వెంకోజీ.

"ఏం గంగులయ్యా! ఇది నిజమేనా?" ఓ పెద్దమనిషి ప్రశ్నించాడు.

"ఏమో నాయనా.... అన్నెం పున్నెం నాకు తెలీదు. అందరూ అంటావుంటే నేనూ యింటా వుండా!" దీనంగా అన్నాడు గంగులయ్య.

"అమ్మ ముసిలోడా... ఏ కులమైతేనేం – కానీ కట్నమూ, కర్చు లేకుండా త్యారకు (ఊరకనే) అల్లుడొచ్చేస్తాడని – ఎవురికీ తెలీకుండా వోడితో పంపించేసి మళ్ళా ఏమీ ఎరగనట్టు మాడ్లాడతా వుండావా?" జనాల్లోంచి ఓ కంఠం గొణిగింది.

"అయితే రేతిరి నీ కూతురు ఎక్కడ పోయిండాదో, యేం జేసిండాదో గూడా నీకు తెలీలా?" ప్రశ్నించాడు ఆచారి.

"... ... ... ..." మౌనంగా నిలబడ్డాడు గంగులయ్య.

అతని హృదయంలో అవమానాల నెగళ్ళు రగులుకొని గుండెను కాల్చేయసాగాయి.

"నిన్నే గంగులయ్యా.... సెప్పు?" గదమాయించాడు ఒకతను.

తల కొట్టేసినట్టయింది గంగులయ్యకు.

"పొరుగూర్లో నాటకమని చెప్పి, అందరితో బాటు పోయింది. ఆ తర్వాత ఏం జరిగిందో నాకు తెలీదు. పాప మాత్రం యింకా యింటికి రాలా! ఈ ముండాకొడుకు మమ్మల్నిట్ట తలదించుకునేట్టు జేస్తాడని అనుకోలా...!" వస్తున్న దుఃఖాన్ని నోటికి తుండుగుడ్డ నడ్డుపెట్టుకొని ఆపుకోసాగాడు.

"అంతేలే.... ముసిలోడు అంతకంటే ఏం చెబుతాడు?" సభలో మరో కంఠం గొణిగింది.

"యింక అసలోన్ని అడగండబ్బా?" మరో వ్యక్తి అరిచాడు.

"నువ్వూరికే వుండరా దర్భేసి (దౌర్భాగ్యపు) నా కొడకా! మేం అడగతా వుండాం గదా పెద్ద మడుసులం....?!" కసురుకున్నా డాచారి.

దాంతో గతుక్కుమన్నాడా వ్యక్తి.

"ఏమిరా కోటా? ఇది నిజమేనా?" కోటప్పను ప్రశ్నించాడు ఆచారి.

"ఏదీ...?" కాస్త తల ఎగరేసి అన్నాడు కోటప్ప.

అతని తల బిరుసుతనానికి కోపం తన్నుకొచ్చింది ఆచారికి.

"అంతా జేసి – మద్దిస్తంలో ఏమీ తెలీనట్ల మాట్లాడతావురా తలగెరివి నా కొడకా! ఇది మద్దిస్తం.... ఈడుండేది పెద్ద మడుసులు... ఆగి యోచ్చన చేసి మాట్టాడు.... ఆఁ...?!"

రెండు వడ్డించి తిరిగి అడిగాడు.

"బల్జోళ్ళాయమ్మినేం జేసినావ్... అది సెప్పు?"

"ఏం జేసినా.... పెండ్లి జేసుకున్నా.... అంతే!" ధైర్యంగా చెప్పాడు.

"అదీ గురువా! యింక నీ యిష్టం.... ఏం జేస్తావో, ఏమో?!"

విచారించడం వరకే తన పని, న్యాయం చెప్పడం మాత్రం నా పని కాదన్నట్లు ఆపైన మౌనం వహించాడు ఆచారి.

అంతవరకూ మౌనంగా వింటున్న వెంకోజీ ఓ క్షణం దీర్ఘంగా ఆలోచించి, ఒక నిట్టూర్పు విడిచి, "నువ్వే విచార్న జేస్తివి గదా ఆచారి.... ఏం చేద్దామంటావ్?" అన్నాడు.

"యిట్టా పనిచేసిందానికి కోటప్పకు అయిదువేలు తప్పేసి, గంగులయ్య కూతుర్ని వాళ్ళింటికి పంపించెయ్యడమే! దానికొ్కాదంటే యిద్దర్నీ ఊరికి ఎలేసేయడమే...!"

"అట్ట జేసిందానివల్ల బల్జోళ్ళ బిడ్డెకు న్యాయం జరుగుతుందంటావా?"

"ఆచారం ప్రకారం అపరాదం (తప్పు) దుడ్డు సగం ఊరికి ఖర్చు పెడతాం గదా! ఆ మాదిరిగానే ఈ అపరాధంలో సగం దుడ్లు పల్లెకు, సగం దుడ్లు ఆడబిడ్డెకు యిస్తాం....సరిపోతుంది. అంతే!"

"ఆ బిడ్డె కిచ్చే దుడ్డుతో ఆమె పోగొట్టుకునింది తిరిగియ్యగలమా?"

"అదీ.... అదీ...." నీళ్లు నమిలాడు ఆచారి.

"చెప్పు... తీసియ్యగలమా?"

"అది గాదైవారా..... రెండు సేతులు కలిస్తేనే గదా చప్పుడినిపిస్తాది?! అట్టే ఈ తప్పులో ఇద్దరికీ సమాన భాగముండాలా?"

"ఉంది కాదనలే...!"

ఏం చెయ్యాలో మరోసారి దీర్ఘంగా ఆలోచించాడు వెంకోజీ. ఆలోచించి చివరకు చెప్పాడు.

"జరిగిందేదో జరిపోయింది. గాంధీ మహాత్ము దంతటోడే కులాలొద్దంటా వుండాడు. రాబోయే కాలంలో అన్ని కులాలు ఏకం కాబోతాయి. అందుకని వాళ్ళ భవిష్యత్తు నెందుకు పాడు జెయ్యాల? వాళ్ళ నట్టే వదిలేస్తే మంచిదేనేమో! వోళ్ళ పెండిండ్లు వోళ్ళు జేసుకున్నారు. వాళ్ళ బాగోగులు వాళ్ళే సూసుకోవాల్సి వుంది."

ఒక్క క్షణం ఆగి, గాలి పీల్చుకున్నాడు గురువు.

అక్కడ.... అంతవరకూ ఇళ్ళు అడ్డంగా ఉండడం వల్ల కనిపించకుండా వుండి, అప్పుడే ఇళ్ళ మీదుగా ఆకాశంలోకి పయనిస్తున్న చంద్రుడు తన చల్లని కిరణాలతో ఆ పల్లెను తడిపేస్తూ కనిపించసాగాడు.

"ఏందబ్బా – ఈ గురువు ఇట్లనే....?!"

గుసగుసలు ప్రారంభించారు సభికులు.

తిరిగి అన్నాడు వెంకోజీ – "తెలిసో, తెలీకో తప్పు జేసినారు. అట్లని వాళ్ళను సంపలేం గదా!"

"అయితే.... వీళ్ళని జూసుకొని ఊర్లో వుండే పిల్లోళ్ళంతా కులాలు, గోత్రాలు గ్యెవనించకుండా వీళ్ళ మాదిరి చేసే దానికి వెనకాడరయ్యావారా?" అన్నాడాచారి.

"వోళ్ళను ఊరికి వెలేయాల్సిందే....!" ఓ కంఠం గాండ్రించింది.

"ఎలేయడమే గాదు... ఎవురినీ కలవనీకుండా జేయాల!"

మరో కంఠం ఘీంకరించింది.

"ములాజే పన్లే!" యింకో కంఠం సకిలించింది.

"వాళ్ళ కెవురూ సహకరించకూడదు... అంతే!" మరో గొంతు ఓండ్రించింది.

"మనూరి కొచ్చే మంగలోడు వోళ్ళకు పంజెయ్యగూడదు, సాకలోడు ఉతక్కూడదు, మాదిగోడూ వోళ్ళ సెప్పులు కుట్టరాదు!" యింకో స్వరం బెకబెకలాడింది.

"వోళ్ళను కన్నోళ్ళు గూడా వోళ్ళతో కలవరాదు...!" యింకో గొంతు విరగబడింది.

"ఊర్లో ఎవ్వరూ వోళ్ళతో మాట్లాన్ను గూడా మాట్లాడగూడదు... ఆఁ...!!'

– మరో స్వరం పైకి లేచింది.

"ఈ దెబ్బతో పెండ్లి జేసుకోనొచ్చినోళ్ళే గాకండా, వోళ్ళని కన్నోళ్ళు సచ్చిరి – హీఁ....హీఁ....హీఁ...!!" మరో కంఠం కిచకిచలాడింది.

ఇలా ఎవరికి వాళ్ళు ఆర్డర్లేసేస్తున్నారు. అంతా గోల గోల...!

ఆవేళ... తమతో గతరోజు వరకూ కలిసి జీవించినవాళ్ళే ఆ యువజంటకు పరాయి వాళ్ళయిపోయారు.... కాకులయిపోయారు.

ఆ వేళ.... కాకుల గుంపులో తగులుకున్న కోకిలలే అయినారు వాళ్ళు.

"హేయ్ః....! అందరూ నోర్లు ముయ్యేండేహె... పెద్దాయన చెప్పనీ!" గట్టిగా అరిచాడు ఆచారి.

గోల గప్‌చుప్!

అందరూ గురువు ఏం చెబుతాడోనని ఆతృతగా ఎదురు చూడసాగారు.

వెంకోజీ ఒక్కసారి సభను తిలకించి నింపాదిగా చెప్పాడు -

"అందరి అభిప్రాయమే నా అభిప్రాయం! వీళ్ళని ఊరికి వెలేస్తున్నాను!"

అక్కడినుంచి లేచి తన యింటివైపు నడిచాడు.

అందరూ ఎవరి ఇళ్ళకు వాళ్ళు వెళ్ళసాగారు.

ఆ విధంగా ఆరోజు మద్దిస్తం ముగిసింది.

కానీ.... ఆ మరునాడు పొద్దు పుట్టేటప్పటికి - ఇంకో వార్త గూడెం గుండెను గుచ్చేసింది. ఊరు ఊరే గగ్గోలైపోయింది..... అల్లకల్లోలమైపోయింది.

ఎవరికి వాళ్ళు గురువుల తోపుకు పరుగెత్తసాగారు!

అక్కడి దృశ్యం చూసి అందరి గుండెలు గుగ్గిళ్ళు ఉడికినట్టు ఉడికిపోయి, మెత్తబడి పోయాయి... గుండెలు నీరై కడుపులు చెరువులై పోయాయి!

అక్కడ... ఓ మామిడి చెట్టుకొమ్మకు రెండు శవాలు వ్రేలాడుతున్నాయి.

అవమానం భరించలేక గంగులయ్య, అతని భార్య పంచాయితీ ముగిసిన మరుక్షణమే గురువుల తోపుకు వెళ్ళి ఆ చెట్టుకు ఉరిపోసుకుని శవాలయ్యారు.

# 7

**"ఈ** అనంత విశ్వం అంచున నిలబడి, రోజుల వుండల్నిదిగమింగుతూ మరికొన్ని వాయనాల్ని పూర్తి చేశాడు కాలపురుషుడు.

ఆ యేడు వర్షాలు సరిగా పడలేదు.

జూన్ మాసంలో ప్రారంభమైన తొలేటి వానలు సరిగా పడలేదు.

పైసలు రాల్చని పిసినారిలా.... మేఘాలు అప్పుడు కొన్ని చినుకులు, అప్పుడు కొన్ని చినుకులు చొప్పున రాల్చుతున్నాయే గానీ - కుంభవృష్టి కురవలేదు.

రైతులు... నానా తంటాలుపడి దుక్కి దున్నుకున్నారు.

తర్వాతిమాసంలో ఆరుద్ర దాటింతర్వాత ఓ పదును వర్షం పడింది.

రైతులు భూమిలో గింజలు వేసేశారు. గింజలు వేసిన పదిరోజులకు ఓ మోస్తరు వర్షం పడింది. గింజలన్నీ మొలకలొచ్చి పదిరోజులకే పచ్చదనం, వెన్నెల కుప్పల్లా... భూమిని చీల్చుకుని కుప్పల కుప్పలుగా రాసాగింది. భూమంతా పచ్చదనాన్ని చిగురించింది– ఉత్తర కార్తె గడిచిపోయింది.

అంతే....!

ఆపైన వర్షపు చినుకు నేలరాలలేదు.

వచ్చిన మొలకలు వచ్చినట్లు ఎండిపోసాగాయి. వేరుశనగ మొలకలు ఎండి వరుగులైపోయి, గాలికి పొట్టులాగా లేచిపోతున్నాయి. అప్పటికే జానెడెత్తు పెరిగిన సజ్జ జొన్న కర్రలు ఎండిపోయి అలాగే నేలకు వరిగిపోయాయి. ఇక మేత దొరుకుతుందో, దొరకదో.... అన్నట్లు పొలాల్లో పడి పశువులూఎండిన వరుగుల్నే ఆబగా తింటున్నాయి. రైతుల ఉత్సాహం నీరుకారిపోయింది. నిస్పృహ నిండిన గుండెలతో,దైన్యం ఆవరించిన వదనాలతో తిరుగాడుతున్నారు రైతులు.

వెంకోజీకి తన రెండెకరాల పొలంలో వేసిన సజ్జ పంట కూడా ఎండిపోయి సగం శక్తి కోల్పోయినట్టయిపోయింది.

"అన్నేకారి వాన... మోసం జేసెనే! ఈసారి తిండికి దాన్నె మెట్ల? ఎదిగిన ఆడబిడ్డలు యింట్లోనే వుండిపోయిరి... వాళ్ళకు పెండిండ్లు జెయ్యాల! ఈ తూరి వానలు బాగాపడితే వొగబిడ్డె కన్నా నానా కష్టాలు పడయినా సరే – పెండ్లి జెయ్యాలనుకుంటి! అంతా తల్లకిందులయిపోయ... ఉల్టాసీదా అయిపాయ! అసలు ఈ దాన్నెం కొనాలంటే ఎంత అప్పు జేయాల్నో! ఆ అప్పు తీరాలంటే ఎన్ని ఏండ్లు బట్టునో...?! పోనీ, ఈ నాటకాల ద్వారా ఏమన్నా నెట్టుకొద్దామనుకుంటే అందులో ఏమీ గిట్టుబాటు కావడంలా... యింగెట్టబ్బా ఈ సంసారం యేగేది?"

ఒకరోజు ఉదయాన కొట్టంలో నేలపైన కూర్చొని, అరుగుకు ఆనుకొని తీవ్రంగా ఆలోచిస్తున్నాడు వెంకోజీ, ఎండిన అనప గింజల కూరలోకి కారం నూరుకుంటూ రోటిదగ్గర కూర్చొని వుంది బూసమ్మ.

అక్కా చెల్లెండ్లిద్దరూ, ఊరి ముందరున్న గిలకబావి నుంచీ నీరు తోడుకు వచ్చి పెరట్లో వున్న తొట్టిలో పోయడంలో నిమగ్నమై వున్నారు.

సిద్దప్ప ఆడుకోవడానికి ఎప్పుడో వీధిలోకి వెళ్ళిపోయాడు.

"ఏమయ్యా! నీకు సెప్తావుంటే మతికెక్కలా...? యింట్లో గింజలు తుత్రాగా (పూర్తిగా) అయిపోయినాయి. అడుగూ బొడుగూ ఊడ్చితే రెండు దినాల ధాన్యం దొరికింది. అవి అయిపోయే లోపల యట్టో వొగట్ట సమకూర్చుకోవాల గదా! బిడ్డల్ను పస్తులుంచతామా... వొగేల అట్టా ఎన్నిదినాలని ఉంచతాం..."

నూరుతున్న కారంతో బాటు అతనిపైనా కారాలు మిరియాలు నూరింది.

"వొసే బూసీ! యట్టో వొగట్ట జేస్తాలే... నువ్వూరికే వుండు!"

పేదవాడికి సహజంగా వుండే కోపం ముంచుకొచ్చిందతనికి.

"ఆఁ... ఊరికే ఉండక యగరతా వుండానా? ఉండేది సెప్పినా అంతే...!" రుసరుసలాడుతూ మూతి మూడు చుట్లు తిప్పింది. దాంతో ఆమె చేతుల్లోని బండరోకలి రోటిలో వేగంగా తిరుగుతూ శబ్దం చేయసాగింది బడబడమని.

"తుఁ... నీ యబ్బడాలా... నీతో యెప్పుడూ వొగిటే రోదనే! నిద్దర లేసినప్పట్నుంచీ 'అది లేదు, ఇది లేదు' అంటా పేణం తీస్తావ్. నాకుమాత్రం తెలీదా? బిడ్డల్నేమన్నా సంపుకుంటానా? వాళ్ల కోసరమే గదా యిన్ని కష్టాలు బడతాండా...!" మొర్సుకున్నాడు వెంకోజీ.

"ఓయమ్మో! ఏదన్నా నోరు తెరిస్తే సాలు – యిగల బడతాడమ్మా ఈ మొగోడు! యింట్లో వున్నంతసేపు రంపుకు రాగదీస్తానే వుంటాడు. యింకెట్టమ్మా ఈ మొగోడితో యేగేది? ఈ సంసార మేగేదెట్టా? ఆడ యాడన్నా బడి సచ్చేది మేలుగా వుండాదే తల్లీ... ఇట్టా ఆడదానిగా బుట్టే కంటే ఆడ యాడన్నా వొగ అడివిలో సెట్టయి పుట్టేది మేలుగా వుందేయమ్మా... తల్లీ!" అంతమాత్రానికే కళ్ళనీళ్ళు పెట్టుకొని యాడవసాగింది బూసమ్మ.

ఆ కలకంఠి కన్నీరు చూసి అతని మనసు అయిసుముక్కలా కరిగిపోయింది.

"తుఁ..." అనుకుంటూ పైకి లేచి, పైగుడ్డ విదిలించి భుజాన వేసుకుని వడ్డీల బుడ్డయ్య నాయుడింటికి బయలుదేరాడు.

అప్పుడే నీళ్ళ బిందెను మోసుకొచ్చిన రేణుకమ్మ – తల్లి కంట్లో నీళ్ళు చూసి "ఏమైందమ్మా?" అంది కంగారుగా.

"ఏం లేదులే... నువ్వు బో తల్లీ!" అంటూ పైటతో కళ్ళు తుడుచుకుంది బూసమ్మ.

అతను వెళ్లేటప్పటికి వడ్డీల బుడ్డయ్య మడి దగ్గరకి పోవడానికి సిద్ధంగా వున్నాడు. ఆ యిలాకాలో యింతో అంతో నీళ్ళ ఆదరువు వుండే బావి అతని దొక్కటే! అయినా కరువు కారణంగా మడి సేద్యం గాక, చెరుకు వేశాడు.

అతన్ని చూస్తూనే "ఏమిరో నాటకాలోడా... యిట్టొస్తివి?" అంటూ పలకరించాడు.

ఎప్పుడు కనిపించినా వెంకోజీని 'నాటకాలోడా....' అని ఎద్దేవా చేస్తూ అనడం

అతని కలవాటయితే – దాన్ని పట్టించుకోకుండా మామూలుగా వుండడం వెంకోజీ అలవాటు. నాటకాలేసే వాళ్ళ కలాంటి చిన్నచిన్న వ్యంగ్యాస్త్రాలు, అవమానాలు ఎదుర్కోడం సహజమే! వాటిని సహించడమూ సహజమే!

"నీతో పనుండే వస్తన్నా..." వినయంగా చెప్పాడు వెంకోజీ

"ఏం పనబ్బా?!"

"దుడ్డు కొంచెం వడ్డీకి, సాయం జేస్తావేమోనని!"

"వోరినీ అసాధ్యం గూల.... నా దెగ్గిర యిప్పుడు దుడ్డేదిరా – నా బుస పత్తిరి!"

"అయ్యో అట్టంటే యట్టన్నా.. యింట్లో శానా యిబ్బందిగా వుండాది!"

"ఓర్నీయమ్మా జిగుడా! నీకేమిబ్బందిరా నా కొండే! ఎప్పుడూ ఏదో వొగ నాటకం యేస్తానే వుంటావు... నేరిపిస్తానే వుంటావు! వచ్చిన వరుంబడి అంతా ఏం జేస్తావుండావు?"

" చూసేవాళ్ళ కట్టే అనిపిస్తాదన్నా.... నాటకాల్తోనే సంసారాలు గడస్తాయా యాడన్నా?"

"అట్టాంటబ్బుడు నాటకాలు మానేసి యింకేదన్నా సూసుకుంటే ఏమి?"

"అయ్యో... అదీ సెప్తివా? మా వంగిశంలో తరతరాల్నించీ వస్తావుండే కళన్నా అది.... దాన్నొదిలేస్తే యట్టా?!"

"యింకా దాన్ని నమ్ముకొని పస్తులుంటావా?"

"పస్తులుండనీ, పర్లాకిలి బట్టిపోనీ గాక – ఆ కళను మాత్రం వదల్నన్నా!"

"సరే నీ యిష్టం... ఎంత గావాల?"

"ఏడు వందలన్నా!"

"ఆఁ... ఏడు వందలా? నువ్వెట్ట తీరస్తావూ?"

"యట్టో వొగట్ట తీర్చేస్తాలేన్నా!"

"సరే..... బాండు కాగితం రాయించుకోనిరా! మా నాయన పేరు తెలుసు గదా... వడ్డీల రెడ్డన్న. నూటికి నెలకు ఒకటన్నర రూపాయ వడ్డీ... తెలుసు గదా?!"

"సరేన్నా...!" వెంకోజీ అతని దగ్గర సెలవు తీసుకొని వీధిలోకి వచ్చాడు.

మామూలుగా బాండ్లు రాసే నారాయణప్ప దగ్గరకు వెళ్ళి, బాండు రాయించుకొని దానికి తగినన్ని స్టాంపు లంటించి, సంతకం చేసి తీసుకెళ్ళి బుడ్డయ్య కిచ్చాడు.

బుడ్డయ్య బాండు తీసుకుని, యింటి లోపలికి వెళ్ళి, డబ్బు తీసుకువచ్చి, సంవత్సరం లోపల యిచ్చేయమంటూ డబ్బిచ్చి పంపించాడు.

ఆ డబ్బును ఆశగా తీసుకొని జేబులో కుక్కుకొని ఇంటిముఖం పట్టాడు – పదే పదే జేబు తడుముకుంటూ వెంకోజీ.

అది అతని జీవితంలో మొట్టమొదట చేసిన అప్పు!

# 8

**"ఓ**రబ్బా! మద్దేనం పెచ్చెరువు (పెద్దచెరువు) కు గొడ్లను తోలకపోయి నీళ్ళు దాపకొచ్చి కట్టెయ్యి.... నేను కుప్పం సంతకు బొయ్యొస్తా!" ఆరోజు ఉదయాన పదిగంటలకే చొక్కా వేసుకుని చేతిసంచి సంకలో పెట్టుకుని, మోపులా కట్టిన సిరిచాపల్ని నెత్తిన పెట్టుకొని, కుప్పం సంతకు బయలుదేరుతూ అన్నాడు వెంకోజీ.

అంతవరకూ అరుగుపైన పడుకొని వున్న సిద్ధప్ప – "సరే నాయన.... పోయ్‌రా!" అంటూ పైకి లేచికూర్చున్నాడు.

బూసమ్మ 'సాదు చుక్క' తయారు చేయడానికి పిడికెడు రాగులు పొయ్యిమీద కాగుతున్న ఒక పెంకులో పోసి, వాటిని మాడ్చుతూ కూర్చొని వుంది. రేణుకమ్మ, సుధేష్ణ ఇద్దరూ కొట్టం మధ్యలో రాగురాయి పొందేసి, రాగులు విసురుకుంటూ కూర్చోనున్నారు.

ఇంతలో... నాటకాల్లో వేషాలు వేసే బలిజ బంగారప్ప అటువైపుకొచ్చాడు.

"అత్తా! అయ్యవారుండాడా?" పలుకరిస్తూ వచ్చి అరుగుపైన కూర్చున్నాడు.

"ఏమి సామి యిప్పుడొస్తివి? మా నాయన సంతకు బోయినాడే...!" ముసిముసిగా నవ్వుతూనే, రాగులు విసురుతూనే పలుకరించింది రేణుకమ్మ.

అతనికి పాతికేళ్ళుండవచ్చు – కోరమీసం, గిరిజాల జుట్టు, చామనఛాయ! ఎప్పుడూ సౌమ్యంగా అనిపించే కళ్ళు.... మంచి స్ఫురద్రూపి బంగారప్ప! ఈ మధ్య అతను తరచూ వెంకోజీ యింటికి రావడం... అవీ, ఇవీ కబుర్లు చెప్పి వెళ్లడం ఎక్కువైంది.

వాళ్ల పరిచయం చాలా విచిత్రంగా జరిగింది. పోయిన ఉగాదినాడు వేసిన నాటకంలో మంచి కంఠస్వరం వున్నవాడు గనుక అతన్ని ద్రౌపది పాత్ర వేయమన్నాడు గురువు

నాటకం రోజు... వేషాల గదిలో... ఏడు రంగుల్ని కలగాపులగం చేసి గదిమధ్యలో ఒకచోట కుప్పపోసినట్టుగా వేషాలు కనిపిస్తున్నాయి.

కదిరయ్య వేషం వేసుకోవడం పూర్తిచేసి, పచ్చరంగు గౌను తొడుక్కుని వెనుకదారాలు బిగించమన్నాడు పక్కనున్న వాడితో. అతనలాగే చేశాడు.

"ఆ దారాలు కనిపించకుండా... యెనక డాలుగుడ్డ కట్టన్నా!" అన్నాడు.

పక్కనే వున్న లచ్చుమయ్య వేషాల కుప్పలో నుంచి తళతళ మెరుస్తున్న ఒక పొడువాటి పచ్చగుడ్డను తీసి, దానికున్న దారాల్ని భుజాల కిందుగా తీసి ముడులు వేసి డాలుగుడ్డ కట్టాడు.

ఒకతను పెద్ద మీసాలని చేతుల్లోకి తీసుకుని దానిమధ్యలో వున్న కమ్మిని ముక్కు రంధ్రాల్లో పెట్టి అమర్చుకుంటున్నాడు. మరో అతను అద్దంలో చూసుకుంటూ పొరక

పుల్లతో నొసటన శివలింగపు ఆకారాన్ని దిద్దుకుంటుంటే – మరో అతను శ్రీపద్మాలు చిత్రించుకుంటున్నాడు. యింకో అతను పగిలిన అద్దపు ముక్కలో ముఖం చూసుకుంటూ.... కళ్ళకు కాటుక దిద్దుకుంటున్నాడు. పూసల దండల్ని కంఠంలో కట్టుకుంటూ కనిపిస్తున్నాడు మరో అతను. తలకు విగ్గు అమర్చుకుంటున్నాడింకో అతను. ఇలా ఎవరి పనుల్లో వాళ్ళున్నారు.

ముఖానికి అర్దాలం పూసుకుని వేషం వేసుకున్నాడు బంగారప్ప. చీర కట్టుకోవడానికి చెరగు దీసి నడుముకు చుట్టూ చుట్టుకున్నాడు. ఒక కొసను డ్రాయర్ నాడాల లోపల జారిపోకుండా కట్టుకున్నాడు. కానీ, అతనికి కుచ్చిళ్ళు పోసి చెక్కుకోవడం చేతకాలేదు.

"ఏమన్నా.... నాకు చీర కడతావా?" అన్నాడు పక్కనే వున్న కళాకారుడితో.

"ఈడుండే వోళ్ళకు ఎవరికీ తెలిదే...!" అన్నాడతను.

ఇక గత్యంతరం లేక అందుబాట్లో వున్న సిద్ధప్పను పిలిచి, "వొరే... మీ యక్కనో, ఎవర్నో ఒకర్ని తీసుకరారా... చీర కట్టాల!" అని పురమాయించాడు.

సిద్ధప్ప నేరుగా వెళ్ళి రేణుకమ్మను పిల్చుకొచ్చాడు.

భజన మందిరం ముందర వేసుకున్న పందిరికి, గుడి ప్రాంగణానికి అనుసంధానం చేసి రంగస్థలం ఏర్పాటు చేశారు. గుడిప్రాంగణమే గ్రీన్‌రూమ్! ఆ గదిలో రెండు హారికెన్ లాంతర్లు వెలుగుతున్నాయి. ఆ వెలుగులో విగ్గులు, గౌన్లు, రకరకాల వేషాల సామాగ్రి.... నిగనిగ మెరుస్తూ కనిపిస్తున్నాయి. ఒకతను ఒక చిన్న అద్దం చేతబట్టుకొని ముఖం చూసుకుంటూ, పొరక పుల్లతో కాటుక దిద్దుకుంటున్నాడు. యింకో అతను తలకు విగ్గు పెట్టుకొని పిన్ను వేసుకుంటున్నాడు. మరో అతను ఆడవేషం వేసుకుని పక్కనున్న స్టూలు మీద చీర పైకెత్తి మడిచి పట్టుకొని కూర్చొని బీడీ తాగుతూ పొగను గాలిలోకి వదుల్తున్నాడు.

ఆ గదినంతా ఒక్కసారి కలియచూసి, చీర చుట్టుకొని, తంటాలు పడుతున్న బంగారప్పను సమీపించి – "ఏంది సామీ... ఈ అవతారం? యేసికం యేసేవోడికి సీర కట్టుకోను చేతకాకపోతే యట్టా?" అంటూ నవ్వుతూ అంది రేణుకమ్మ.

"ఏం జేసేదమ్మీ? ఈ పడుబాట్లు మేమెప్పుడన్నా పడింటే గదా!" అంటూ చేతులు పైకెత్తి నిలబడ్డాడు.

రేణుకమ్మ కాస్త బిడియపడుతూనే చీర చెరగును సరిచేసింది. ఆ ప్రయత్నంలో ఆమె చేతివ్రేళ్ళు అనేకసార్లు అతని నడుము చుట్టూ తగిలి గిలిగింతలు పడ్డాడు. తన్మయత్వానికి గురయ్యాడు. మొదటిసారిగా వయసు ఆడదాని స్పర్శలోని మాధుర్యం అతన్ని ఆవహించింది. తమకంతో ఆమె ముఖంలోకి చూడసాగాడు.

గుడిలోపల సన్నగా  వెలుగుతున్న నూనెదీపపు వెలుగులో సీతారాముల విగ్రహాలు వాళ్ళనే చూస్తున్నట్లు మసకగా కనిపిస్తున్నాయి.

'రేణుకమ్మ వ్రేళ్ళతో కుచ్చిళ్ళు పోసి, ఆ కుచ్చిళ్ళు జారిపోకుండా కుడిచేత్తో గట్టిగా పట్టుకొని, అతని డ్రాయర్ నాడా లోపలికి చెక్కింది. అలా చెక్కినపుడు ఆమె చేతివ్రేళ్ళ స్పర్శ బలంగా అతనిపొట్టపైన, బొడ్డుపైన తగిలి తట్టుకోలేని తన్మయత్వానికి గురై సన్నగా మూలిగాడు. ఆ సవ్వడి విన్న రేణుకమ్మ అదే అవస్థకు గురై – క్షణకాలం పాటు ఆ చేతిని వెనక్కి తీసుకోవడం మరచిపోయింది. ఎవ్వరూ గమనించని విధంగా బంగారప్ప తన రెండు చేతులతో ఆ కుచ్చిళ్ళలోని ఆమె చేతిని అలాగే గట్టిగా పట్టేసి, ఒక్కసారి నొక్కాడు.

దాంతో.... చేతిని విదిలించుకుని వెనక్కి తీసేసుకొని, సిగ్గుతో యింకా అక్కడ నిలబడలేక వచ్చేసింది రేణుకమ్మ.

అప్పటికా గ్రామానికి కరెంటు లేదు. పెట్రోమాక్స్ లైట్ల కోసం ప్రయత్నిస్తే అవీ దొరకలేదు. ఆ కారణంగా రంగస్థలం పైన రెండు కాగడాలు వెలిగించారు. ఆ కాగడాల వెలుగులో నాటకం ప్రారంభమైంది.

రంగస్థలానికి దగ్గరగానే కూర్చుంది రేణుకమ్మ. రంగస్థలం పైకొచ్చిన ప్రతిసారీ బంగారప్ప చూపులు, రేణుకమ్మ చూపులు ఎన్నోసార్లు కలుసుకున్నాయి.

ఇక అప్పటినుంచీ మూగప్రేమలు, మౌనభాషలు, చూపుల సంకేతాలు మొదలయ్యాయి.

అదంతా గుర్తుకు వచ్చి రేణుకమ్మ ముఖంలోకి ముసిముసిగా నవ్వుకుంటూ చూశాడు బంగారప్ప. ఆ విషయం అర్థమైనట్లు రేణుకమ్మ ఒక్కసారి అతని కళ్ళలోకి చూసి ఒక చిరునవ్వు నవ్వి, తన పనిలో తాను మునిగిపోయింది.

ఇంతలో – "అమ్మణ్ణీ... వొగరిట్ట రండి!" అంటూ వంటగదిలో నుంచి కేకేసింది బూసమ్మ. ఆ మాటతో సుధేష్ణ అక్కడినుంచి లేచిపోయింది. సిద్ధప్ప ఎప్పుడో వీధిలోకి వెళ్ళిపోయివున్నాడు.

అదే అదనుగా భావించిన బంగారప్ప – "రేణీ! గొడ్లు నీళ్ళు తాపడానికి నువ్వు రా పెచ్చెరువుకు... నీతో మాట్లాడాల!" అన్నాడు.

"నాతో ఏమ్మాట?" అంది కాస్త సీరియస్‌గా ముఖంపెట్టి రేణుకమ్మ.

"నువ్వు రా... చెబుతాను!" అన్నాడతను.

ఆమె మౌనంగా తలదించుకుంది.

ఇంతలో... తిరిగివచ్చి కూర్చొని రాగులు విసరడంలో తానూ ఒక చేయి వేసింది సుధేష్ణ.

విసర్రాయి గరగరమని శబ్దం చేసుకుంటూ రాగుల్ని పిండిపిండి చేస్తూ వేగంగా తిరుగుతోంది.

"వస్తానమ్మి! మీ నాయనుండా డేమోనని వస్తిలే... వస్తా!" అంటూ ఒక్కసారి కన్నుగీటి మరీ వెళ్ళిపోయాడతను.

'ఈయప్ప నాయనుండుంటే అసలు వచ్చుండడు. లేదు కాబట్టే వచ్చినాడు...ఏం తెలివో దొంగ తెలివి!" అనుకుంది రేణుకమ్మ.

బూసమ్మ మాడ్చిన రాగుల్ని రోట్లో పోసి బండరోకలితో నూరసాగింది.

ఆసక్తిగా చూస్తోంది సుధేష్ణ.

ఆమె నూరుతున్నప్పుడు వస్తున్న బడబడ శబ్దం – విసర్రాతి హోరులో కలిసిపోతోంది.

అలా నూరగా నూరగా... నల్లటి మైనంలా తయారవుతున్నాయి రాగులు.

అందులోకి అంత సాంబ్రాణి, రెండు గొంటొక్కలు వేసి మరీ నూరసాగింది. నూరగా నూరగా అది పల్చటి ద్రవంలా తయారయింది. ఆ ద్రవాన్ని శుభ్రంగా కడిగిన ఒక చిప్పలోకి తోడుకోసాగింది.

అది సాదు చుక్క గదమ్మా! బలే తయారుజేస్తివే! యట్ల చేస్తారు దీన్ని?" రాగులు విసురుతూనే సుధేష్ణ అడిగింది.

"ఆడదన్నాక అట్టాంటి చిట్కాలన్నీ తెలిసిపెట్టుకో నుండాలమ్మా! రేపు నీకు పెండ్లయి బిడ్డలు పుడితే యట్టా.... ఎవరు జేస్తారు?" సాగదీస్తూ అంది బూసమ్మ.

ఆ మాటకు సిగ్గు ముంచుకొచ్చి సుధేష్ణ మౌనంగా వుండిపోతే – రేణుకమ్మ అందుకుంది...

"ముందు యట్ట జేస్తారో చెప్పమ్మా?!"

"ఏం లేదమ్మా! రాగులు గానీ, బియ్యంగానీ ఈ మాదిర్తోనే మాడ్చేసి నూరాల! అట్ట నూరనూ నూరనూ జిగట మాదిరయిపోయి సాదేర్పడతాది. దాన్ని వొగ చిప్పలో యేసుకొంటే.... అది ఆరిపోయి కీలు (తారు) మాదిర్తో అతుక్కుపోతుంది. అనాక మనకెప్పుడు కావాలన్నా వొగసుక్క నీళ్ళు ఏలితో అట్ట యిడిసి సాదితే మనకు కావల్సినంత వస్తాది. దాన్ని నొసట్న బెట్టుకుంటే సరిపాయ!" వివరించింది బూసమ్మ.

"దాంట్లో యింకేమన్నా యేస్తారా?" ఉత్సాహంగా అడిగింది సుధేష్ణ.

"ఏమీ యెయ్యరు గానీ – మంచి వాసన కోసరమని వొక గొంటొక్క అంత సాంబ్రాణి పొడిచేసి నూరుకుంటారు.... అంతే!"

"యింక దేంతోనన్నా కూడా జేస్తారా?" రేణుకమ్మ ప్రశ్నించింది.

"జెయ్యకేమి తల్లీ.. జేస్తారు... అదే కొమ్మాకుండ్లా – దాన్ని ధాన్యానికి బదులుగా మెత్తగా ఉడకబెట్టి నూరుకోని కూడా తయారు చేసుకోవచ్చు!" చాదు ద్రవాన్ని చిప్పలోకి తోడడం పూర్తిచేసి దాన్ని గోడకున్న గూట్లో పెడుతూ అంది బూసమ్మ.

అప్పటికి రాగులిసరడం పూర్తయింది.

అప్పటికే మధ్యాహ్నం కావస్తుండడంతో – అంతవరకు వీధిలో ఆడుకొని వచ్చిన సిద్ధప్ప గొడ్ల చావడిలోకి వెళ్లి గొర్తుల నుంచి ఎడ్ల పగ్గాల్ని విప్పి నీళ్లు తాపుకు రావడానికి బయలుదేరబోతుంటే.... "సిన్నా! ఈ పూట ఎండ ఎక్కువగా వుంది లేరా! నేను బొయ్యి నీళ్ళు తాపుకొస్తాలే..!" అంటూ బలవంతంగా అతని చేతుల్లోని పగ్గాల్ని తన చేతుల్లోకి తీసుకొని, గొడ్లను వేగంగా పెద్దచెరువు వైపుకు తోలుకుపోసాగింది రేణుకమ్మ.

వీధిలో కూర్చొని అంతవరకూ ఆమె కోసమే ఎదురుచూస్తున్న బంగారప్ప – గబగబ తమ ఎడ్లను విప్పుకొని ఆమె వెనకే గొడ్లను పెద్దచెరువు వైపు పరుగెత్తించసాగాడు.

# 9

"**అ**మ్మణ్ణీ! అమ్మణ్ణీ! అన్ని నీళ్లియ్యమ్మా!"

– అంటూ అదేరోజు రాత్రి ఏడుగంటలకు అమ్ముడుపోని చాపల్ని, సరుకుల సంచిని మోసుకుంటూ వచ్చి ఇంట్లో అడుగుపెట్టాడు వెంకోజీ.

రేణుకమ్మ గబగబ వెళ్ళి అతని చేతిలోని చాపల్ని, చేతిసంచిని అందుకొని, కొట్టం మధ్యలో వుంచింది. అంతలోపల సుధేష్ణ చెంబుతో మంచినీళ్ళు తెచ్చిచ్చింది.

ఆ నీళ్ళను సగం తాగి, సగం నీళ్ళతో గొడ్లకొట్టం పక్కకువెళ్ళి, కాళ్ళూ చేతులు కడుక్కొని వచ్చి అరుగుపైన కూర్చొన్నాడు. బూసమ్మ కూరగాయల సంచిని నేలపైన కుమ్మరించి, అందులోని కూరల్ని వస్తువుల్ని వేరుచేస్తూ కూర్చొంది.

"అబ్బా... ఏం ధరలే?! నెలక్రితం శేరు అణా అమ్మిన వంకాయలు ఈ సంతకు పదిపైసలాయె! అడ్డగ (రెండణాలు, పన్నెండు పైసలు) వున్న పచ్చిమిరపకాయలు శేరు పావలా అమ్మె! సంతలో సచ్చీ బతికీ రెండు సాపలమ్మితే – వొగ సాప దుడ్డు వీటికే సరిపాయ! ఏమి సంతో, ఏమి సరుకులో...!" నిట్టూర్చాడు వెంకోజీ.

"యిప్పుడు పండగా పబ్బం ఏమీ లేదే! తెంకాయ దెచ్చినావెందుకు? దుడ్డు మిగిలి పోతావుందనా?" పుచ్చుల్ని పరిశీలిస్తూ ఓ బాణం వదిలింది.

"సరేలేయే నీ యిత్తగిల్ల! తొలేటి వానలు బడే టయిం గదా.... ఆరద్దల కార్తె (ఆరుద్ర కార్తె) కూడా పోతావుంది. నేయానికిప్పటికే సేన్లలో గింజలు పడి పోయుండాల! వొగేళ

వున్నట్టుండి గబుక్కున నాలుగు సినుకులు బడితే – సేను దున్నేదానికి వారం చేయొద్దా? అప్పుడు ఉరకాలంటే అయ్యేపనేనా?"

"పెద్ద తెంకాయే... ఎంతిస్తివీ?"

"ఎంత... అయిదణాలు!"

"సరే ! ఏందయ్యో... వంకాయలన్నీ మచ్చలు బడినవి దెచ్చినావు?!" పుచ్చుల్ని పరిశీలిస్తూనే అంది బూసమ్మ.

"వచ్చిండేటివే అయ్యి... యింకేం జేసేది?" అన్నాడతను. ఆ వంకాయల్లో ఎక్కువ మచ్చలున్న ఓ చిన్న వంకాయను పరిశీలించి, పుచ్చు వుండడంతో – "ప్చ్..." అంటూ నోరు చప్పరించి పక్కన పెట్టింది. ఆ తర్వాత అన్నింటినీ ఎత్తుకెళ్ళి వంటింట్లో భద్రపరచుకుంది.

ఆ రెండోరోజే దెబ్బటంగా వాన కురిసింది... అందరూ దుక్కి దున్నడానికి ఆరంభించారు.

రైతుల హృదయాల్లో ఆనందం పొంగింది.... వాళ్ళ కళ్ళల్లో కొత్త కాంతులు విరజిమ్మాయి... అందరూ కొరముట్లను సిద్ధం చేసుకున్నారు.

విత్తనాల సజ్జల్ని ఓ గిద్దెడు చొప్పున మూటగట్టి చూరుల్లో వ్రేలాడదీసి రోజూ నీళ్ళతో ఆ మూటల్ని తడుపుతూ మొలక కట్టారు రైతులు.

అలా మొలక కట్టిన సజ్జల్ని నాలుగు రోజుల తర్వాత బాగా వచ్చాయో, లేవోనని పరిశీలించి, 'బాగానే మొలిచాయిలే...!" అనుకుంటూ విత్తబోయే సజ్జల్ని ఓ గంపలో పోయించాడు సిద్ధోజీ. సజ్జలు, బియ్యం నానబెట్టమని భార్యకు చెప్పి, ఆ రోజు ఉదయం అటకలో నుంచి మడక కిందికి దించాడు. ఆ అటకలోనే 'పనకం తాడు', 'కాడిమాను' 'జలుపు బుర్ర'ను కిందికి దించాడు. మడకను వీధిలో యింటి ముందురబెట్టి, ఒక రాయి తీసుకొని మడక కున్న కర్రును వెనక్కి తట్టి బిగించాడు. ఆ దెబ్బలకి ఎప్పుడో అంటుకొని ఎండిపోయి కర్రుకు అతుక్కుపోయి వున్న మట్టి కర్రు పక్కనుంచి పేసులుగా ఊడి కిందపడింది.

పొనకం తాడు జలుపు బుర్రలో ఎక్కించి, దాన్ని కాడిమానుకుచుట్టి, గుమ్మాని కానించాడు. గంట తర్వాత గాట్లో నుంచి ఎడ్లను విప్పుకొని సిద్ధప్పను, రేణుకమ్మను వెంటబెట్టుకొని పొలంవైపు బయలుదేరాడు. రేణుకమ్మ కొబ్బరికాయ, కర్పూరం, నానబియ్యం, సజ్జలు ఓ గిన్నెలో పోసుకొని, ఓ చెంబులో నీళ్ళు తీసుకుని అవన్నీ ఓ గంపలో పెట్టి, ఆ గంపను నెత్తిన పెట్టుకొని తండ్రి వెంట బయలుదేరింది.

వెంకోజీ మడకను భుజాన వేసుకుని, ఎడ్లను తోలుకొని ముందు వెళుతుంటే... అతని వెనకాల కాడిమాను భుజాన వేసుకుని సిద్ధప్ప, అతని వెంట రేణుకమ్మ పొలంవైపు నడుస్తున్నారు.

కొంతసేపటికి పొలం దగ్గరికి చేరుకున్నారు. ఆ పొలంలో ఈశాన్య మూలన ఎడ్లను ఆపి, మడక దించి, వాటి అ(క్రుల పైన కాడిమాను పెట్టి, వాటి మెడలకు పలుపులు బిగించాడు.

ఆ తర్వాత పానకం తాడును నొగకు తగిలించి, కాడిమానుకి చుట్టి 'తిక్కేసి', దానికింద జలుపు బు(రలో నుంచి ఆ తాడును దూర్చి తీసి, 'ఎలువు జలువు'చూసుకొని మేడి వెనక, మడకను బిగించాడు.

మొనను సూదిలా జివిరిన కోలకట్టెను నేలపైన నిలువునా గుచ్చి, "అమ్మణ్ణీ! ఎద్దుల్ని పూజించు!" అని జేబులో నుంచి బీడీ, అగ్గిపెట్టె తీసి వెలిగించుకుంటూ అన్నాడు వెంకోజీ.

రేణుకమ్మ గంపలో వున్న చెంబును, పసుపు కుంకాలను తీసి ఎడ్ల ముందరి కాళ్ళకు, ముఖానికి, మడకకు, కాడిమానుకు నీళ్ళతో తడిపిన పసుపు పూసి, కుంకుమ బొట్లు పెట్టింది.

అప్పటికి సగం తాగిన బీడీముక్కను ఆర్పేసి, ఆ ముక్కను చెవిలో యిరికించుకొని వచ్చి, ఎడ్లను తూరుపు వైపుకు నిలబెట్టాడు.

రేణుకమ్మ ఒక తట్టలో కర్పూరం, కొబ్బరికాయను పెట్టి తండ్రి కందించింది. అందుకున్న తట్టను కిందపెట్టి, పక్కనే గెనింపై నున్న ఓ రాయి తీసుకొని, ఆ రాయికి పట్టి కొబ్బరికాయను కొట్టి, కొబ్బరినీళ్ళను గొడ్లపైకి చల్లి, పీచుపీకి నేలపైన పెట్టాడు. ఆ తర్వాత కర్పూరం వెలిగించి హారతి తీసాడు. సిద్ధోజి, రేణుకమ్మ హారతిని కళ్ళకద్దుకున్నారు. వెంకోజీ హారతి పళ్ళెం కిందపెట్టి "ఓం తల్లీ! సామి తల్లీ! భగమంతుడా! ఈ సంవత్సరం దుక్కి దున్నే దానికి వారం (ప్రారంభం) జేస్తా వుండా... మొస్తుగా ధాన్యం పండాల... ఒక పుట్టి వెయ్యి పుట్లు గావాల... పిల్లా జల్లా ముసలీ ముతకా అందరూ బాగుండాల... కోళ్ళు, గొడ్డూ గోదా వొగ దొడ్డి వెయ్యి దొడ్లుగా పెరగాల... రైతులంతా శుభోజ్జయంగా వర్ధిల్లాల...!" అని మనసులోనే గొణుక్కొని చెంపలేసుకుని మొక్కుకున్నాడు.

అక్కడే వున్న మరో తట్టలోని నానబియ్యం, సజ్జల్ని కలగలిపి, అందులో కొన్ని బెల్లంముక్కలు వేసి అందించింది రేణుకమ్మ. వెంకోజీ ఆ తట్టలో నుంచి కొన్ని తీసి ఎడ్లకు తినిపించి, ఆ తర్వాత తలా పిడికెడు యిచ్చి తను కొన్ని నోట్లో వేసుకున్నాడు.

నోట్లో పోసుకున్న నానబియ్యపు మి(శమాన్ని నముల్తూ రేణుకమ్మ అన్నీ సర్దుకొని

గంపలో పెట్టి పక్కకు తొలిగింది.. ఎద్ల పగ్గాల్ని మేడికి ముడివేసి, కోలకట్టెతో ఎద్ల ముడ్లను పొడుస్తూ – "చో... చో... హాయ్ః... చో..." అంటూ ఎద్లను అదిలిస్తూ మడకను తిప్పి కొంగ్ర వేసుకు వచ్చి చేను దుక్కి దున్న సాగాడు.

మడక కఱ్ఱు కసకసమని శబ్దం చేస్తూ, భూమిని పెళ్ళగిస్తూ పోతుంటే.... మడక చాలులో నుంచి మట్టి దువ్వదువ్వగా పైకి లేస్తోంది.

అలా రెండు చాళ్ళు తోలిన తర్వాత "అమ్మణ్ణీ రేణూ! నువ్వు పదమ్మా యింటికి.... అబ్బోడు మల్లొస్తాడు గానీ!" అన్నాడు వెంకోజీ.

ఆ మాటతో గంపను నెత్తికెత్తుకొని ఊరుదారి పట్టింది రేణుకమ్మ.

అక్కడ... దారిలోనే మడకా, కాడిమాను భుజానేసుకొని, ఎద్లను తోలుకుంటూ ఎదురుపడ్డాడు బంగారప్ప.

"యేమ్మే రేణూ! నేను పెచ్చెరువులో సెప్పింసంగతి మర్చిపోవద్దు. రేపు మంగళవారం మావిటేళే కుప్పం జాతర! ఆ రోజు సందేళకే నీ సంగతి నాకు తెలియాల..... అట్లో, యిట్లో అంతే.... ఆ మీద నీ యిష్టం!" అంటూ ఎద్లను అదిలించుకుంటూ ముందుకు సాగిపోయాడు బంగారప్ప.

ఎటూ చెప్పలేక అలాగే నిలబడిపోయి, అతన్నే చూస్తూ వుండిపోయింది రేణుకమ్మ.

# 10

"**ఆ**రోజు మంగళవారం!

అదేరోజు కుప్పం రెడ్డమ్మ గంగజాతర! అది ఆ ప్రాంతానికంతా గొప్ప జాతరగా పేరుపొందిన తిరణాల!

'రెడ్డెమ్మ పటాలమ్మ, పోచమ్మ, అనేక రోగాలకు కారణభూతురాలై, ఆగ్రహించిందంటే దూము (ప్లేగు) తగిలేటట్లు చేస్తుందనీ, అంతకుమించి వాయల్పాడు దగ్గర చెర్లోపల్లెలో సంతాన దేవతగా నిలిచిపోయి పూజలందుకుంటున్న గ్రామదేవతనీ ప్రజలు నమ్మి కొలుస్తున్నారు. ప్రజలకు ఎంత భక్తో....?!' తమ యింటి ముందర, వీధిలో కూర్చొని వెంకోజీ యింటి గుమ్మం వైపే చూస్తూ అనుకున్నాడు బంగారప్ప.

ఆ జాతరకు ఆ ఊరి నుంచి చాలా మంది బయలుదేరారు.... ఆరోజు మూడు గంటలకే! ముసలోళ్ళను నడిపించుకుంటూ పోతున్నవాళ్ళు, పిల్లల్ని భుజాల కెత్తుకొని పోతున్న వాళ్ళు, పడచువాళ్ళు, పరువం ఉడిగిన వాళ్లు... అందరూ ఉత్సాహంగా బయలుదేరి వెళుతున్నారు.

'ఏమిదింకా యలబారలా... అందరూ ఉరికురికి బోతావుంటే, ఇదేమో అతీ గతీలా! యిచ్చిన మాట తప్పుతుందా యట్టా? తిరణాలకు వస్తే 'పండు'.... లేకుంటే 'కాయ'... అని గూడా చెప్పినా! ఏమన్నా 'కాయ'జేసి నిల్చిపోవునా... దీని బగిసి (ధైర్యం) మార...!' పరిపరి విధాల ఆలోచించుకుంటున్నాడతను.

పొద్దు పడమటి దిశకు వాలిపోతోంది. జాతరకు పోయేవారి సందడి అప్పటికే తగ్గిపోయింది. యింకాసేపట్లో కర్మసాక్షి కనుమరుగయ్యే సమయం రానేవచ్చింది.

పక్షులన్నీ గూళ్ళకు చేరుకుంటున్నాయి.

మేతకు వెళ్ళిన పశువులన్నీ ఇళ్ళకు చేరుకుంటున్నాయి.

పగలంతా పొలాల్లో పోరకలాడిన రైతులందరూ ఇళ్ళకు చేరుకుంటున్నారు.

అప్పుడు బయలుదేరింది... రేణుకమ్మ!

బాగా అలంకరించుకొని, శాపవశాత్తు పల్లెలో అవతరించిన వనదేవతలా... వీధిలోకి అడుగు పెట్టింది.

"భద్రమమ్మా! నీ సావాసగత్తెలు పోయినారో, లేదో సూడు! వాళ్ళతోనే పో... వొగటే మాత్రం పోవద్దమ్మా... భద్రం!" జాగ్రత్తలు చెప్పింది బూసమ్మ.

"సరేఅమ్మా!" అంటూ మరోసారి కళ్ళారా కన్నతల్లిని చూసింది రేణుకమ్మ.

ఆ తర్వాత రెండడుగులు వేసి, కుప్పం దారిపట్టే సమయానికే బంగారప్ప సంచి చేతబట్టుకొని ఆమె ననుసరించాడు.

ఆ మరునాడు...

జాతరకు వెళ్ళిన ప్రతి ఒక్కరూ తెల్లవారేసరికి ఇల్లు చేరుకున్నారు. కానీ, రేణుకమ్మ మాత్రం తిరిగి రాలేదు.

బూసమ్మ, ఇల్లిల్లు తిరిగి జాతరకు వెళ్ళిన వాళ్ళను వాకబు చేసి, రేణుకమ్మను గురించి విచారిస్తోంది. ఎవ్వరూ సమాధానం చెప్పలేదు.

వెంకోజీ మరోవైపు అన్వేషించసాగాడు.

అయినా..... ఫలితం కనిపించలేదు. ఆమె జాడ చెప్పేవాళ్ళే లేకపోయారు.

ఆమెను వెదికే ప్రయత్నంతోటే మధ్యాహ్నం దాటింది.

ఆ దంపతుల గుండెలు గుండెల్లో లేవు. ఇంట్లో ఆ పూట పిల్లి లేవలేదు. అందరిలోనూ రేణుకమ్మను గురించిన దిగులు!

వీధిలో ఎదురుపడిన ఆచారే చివరికి – చావుకబురు చల్లగాచెప్పినట్లు అసలు విషయం చెప్పాడు... "ఏమన్నో... బల్జోళ్ళ బంగారప్ప యింకా ఇంటికిరాలేదంట! తిరనాల్లో...

ఎవరో వొగ ఆడబిడ్డతో చెట్టపట్టాలేసుకొని తిరగతా వున్నాడంట! 'గొర్లు గూడా యెలదోలేవోళ్ళే లేరేఁ...' అంటా వోళ్ళ ముసిలోడు అంగలారస్తా వుండాడంట!" నర్మగర్భితంగా అన్నాడు.

ఆ మాట విన్న వెంకోజీ... అటునుంచి అటే అనుమానంతో వెదకడానికి కుప్పం వెళ్ళిపోయాడు.

అతను కుప్పం చేరకనే ఆ వార్త మాత్రం ఆ పల్లెలో మారుమ్రోగిపోయింది. ముందే ఆచారి నోట్లో నూగ్గింజ నానదు. యింక చెప్పాల్సిందేముంది? వెంకోజీ కూతురు రేణుకమ్మ, బంగారప్ప లేచిపోయారన్న వార్తతో పల్లె పల్లె అట్టుడికిపోయింది.

గురువు మీదున్న గౌరవంతో తమ సొంత ఖర్చుతో నలుగురు నాలుగు దిక్కులకు వెదకడానికి బయలుదేరి వెళ్ళిపోయారు. ఆ వెదుకులాటతోనే రెండు రోజులు గడిచిపోయింది.

ఎవ్వరూ వెదక్కుండానే... మూడోరోజు వాళ్ళే ఊర్లో దిగారు!

ఉత్తినే దిగలేదు... గుళ్ళో పెండ్లి చేసుకుని మరీ దిగారు.

ఇక ఆ రాత్రి... తిరిగి మద్దిస్తం!

గుడి ముంగిట ఊరు ఊరంతా చేరిపోయారు.... ఊరి పెద్దలూ హాజరైపోయారు!

వెంకోజీ కూడా తన స్థానంలో తాను తలొంచుకుని కూర్చున్నాడు. అవమాన దావానలం అతన్ని నిలువునా దహించివేస్తోంది.

అక్కడ గుసగుసలు ప్రారంభమయ్యాయి...

"ఏమప్పా! ఈయప్ప గంగులయ్య కూతుర్ని, కోటప్పను యెలేసినట్లు ఈళ్ళనూ యెలేస్తాడా, లేదా? కూతురే గదాని 'పోనీలే' అంటాడా?!"

"పరాయోళ్ళకు తీర్పు చెప్పడం సులభమే! యిప్పుడు సొంతబిడ్డె విషయంలో ఏం జేస్తాడో సూడాల!"

"అంతేలే! మంచోడి బుద్ధి మాంసం దెగ్గిర తెలిసిపోయినట్టు – ఎవురికయినా తమ వరకూ వస్తేనే గదా అసలు రంగు బయటపడేది!"

"అదీ సూద్దాం! ఈయప్ప నేయం ఎంతటిదో, పెద్దరికం ఏ పాటిదో...?!"

"నిజమే! గురుపీఠ మెక్కిందానికి – దానికి గౌరవం దెస్తాడో, మచ్చ దెస్తాడో సూడల్ల!" ఎవరికి తోచిన విధంగా వాళ్ళు మాట్లాడుకుంటున్నారు.

వాళ్ళ మాటలు వింటుంటే తల తీసేసినట్టువుతోంది వెంకోజీకి.

విచారణ ప్రారంభించారు పెద్దలు.

బంగారప్ప ఓ పక్క దోషిలా చేతులు కట్టుకొని నిలబడి వున్నాడు.

"ఏమిరా బంగారిగా! గురువు దేవుడితో సమానం గదరా... ముందే ఆయప్ప పసురు బాములాంటోడు... ఏనాడు ఎవురికీ గురుగ్గింజంత కాదు గదా... కనీసం రాగ్గింజంత అపకారం జేసి ఎరగడు. అట్టాంటోడికి అన్యాయం జేస్తివే... నీకేం పోయేకాలంరా?!"

"అంతగా తీపరం (కోరిక) అణవరించుకోలేక (ఆపుకోలేక) పోతే ఆడ యడన్నా మీ కులంలోనే వొగదాన్ని తొడక్కపోగూడదా.... ఈ బిడ్డెను తీసకపోయినావు?!"

బంగారప్ప పెదవి విప్పలేదు!

వెంకోజీ నోరు తెరవలేదు!

అటు అతనూ మౌనమే...!

ఇటు ఇతనూ మౌనమే...!

"అన్నెం పున్నెం తెలీని బిడ్డెను తీసకపోతివి గదరా... ఏమాశ జూపిస్తివిరా ముండాకొడకా?"

అతను మౌనం వీడలేదు.

"లోకం తెలీని బిడ్డెను లేపకపోయేది గాదురా మగతనం... యిప్పుడు జవాబు చెప్పు?!"

అయినా... అతను పెదవి విప్పలేదు.

"యింక వాడేం చెబుతాడు లేబ్బా.... యింక జరిగేది సూడండి!" అన్నాడు ఆచారి.

"అయిందేదో అయింది! కడవరకు ఆ బిడ్డెను పువ్వుల్లో బెట్టుకోని సూసుకోమని సెప్పండి!" ఓ కంఠం వెనకనుంచి వినిపించింది.

"ఆ బిడ్డ కేమన్నా జరిగితే అప్పుడు గదా... వీడి కత ఇసార్నయి పోయేది!" అంది యింకో కంఠం.

"ఇప్పుడెట్లా జేయాల? ఆ బిడ్డె జీవితం ఏం గావాల?"

"కుక్క నాకిందాన్ని ఎవరు ముట్టుకుంటారు? కుక్క ముట్టిందాన్ని కుక్కకే కట్టి పెట్టాల్సిందే!"

"అంతేలే! అట్టే కట్టి పెట్టేసి, యెలేస్తే... అప్పుడు తిక్క కుదర్తాది! యిట్ట యింకొగరు జేసేదానికి భయపడతారు."

"యట్టోబ్బా.... అది గురువు నిర్ణయించాల గదా?!"

ఎవరి అభిప్రాయాలు వాళ్ళు చెప్పారు.

"ఆఁ... చెప్పరా బంగారిగా! యిబ్బుడా బిడ్డనేం జేయాలనుకున్నావు?" గదుమాయించాడు ఆచారి.

కానీ... అతను మౌనం వదల్లేదు.

కోపం వచ్చింది ఆచారికి. "బొక్క తెరవరా బూసడీకే! ఏం... నోరు బోయిందా?" అరిచాడు.

అతను నోరు విప్పాడు.

అందరూ ఆసక్తిగా వినసాగారు.

"ఎందు కట్టరస్తావు ఆచారన్నా! మేమిద్దరం మనసు పడినాం. ఒకరినొకరు కావాలనుకొన్నాం. ఎన్ని కష్టాలొచ్చినా, సుకాలొచ్చినా వొగటిగానే వుండాలనుకుంటున్నాం... అట్లే వుంటాం! అట్టుండేదానికి కులాలెందుకడ్డు గావాల? ఆడదీ, మొగోడు కలిసి జీవించేది ముక్కెశం (ముఖ్యం) గానీ – ఇవన్నీ లెక్కలోకి తీసుకోవాల్సిన పనిలా అనుకున్నాం... అట్లే వుంటాం.... అంతే!".

– తన అభిప్రాయం చెప్పాడు బంగారప్ప.

"అదీ!! యింక నువ్వు నేయం జెప్పయ్యవారా?' 'అంతవరకే తన పని' అన్నట్లు ఆపైన ఊరుకున్నాడు ఆచారి.

'ఉరేసేసి, గొంతుదాకా బిగించేసి, ఊపిరాడకుండా సచ్చేటట్ల జేసి, పాణం పోయేటప్పుడు 'యింక నీ యిష్టం!' అంటా వుంటాడీ ముండాకొడుకు! వీడి కదొగ ఆట....!' అని మనసులోనే తిట్టుకుంటూ –

"అందరికీ వొగటే న్యాయం! యింతకుముందు కోటప్ప నెట్ల పల్లె కెలేసినామో– అట్టనే ఈళ్ళనూ ఎలేస్తా వుండాం... అంతే!" అని తీర్పు చెప్పి, అక్కడినుంచి లేచి గబగబ వెళ్ళిపోయాడు గురువు.

అందరూ అతన్ననుసరించారు.

మద్దిస్తం ముగిసింది.

అయితే.... ఇరవయేళ్ళుగా తమ బిడ్డగా, తమలో ఒకటిగా వున్న రేణుకమ్మ ఆనాటితో తమకే గాకుండా, ఊరి మొత్తానికి పరాయిదైపోయేసరికి ఆ దంపతుల గుండెలు పగిలిపోయాయి.

# 11

**ఆ**రోజు పది గంటల వేళ.....

"అక్కా! గురువుండాడా?" నెత్తిన ఎండిన జమ్ముకట్టను మోసుకుంటూ అక్కడికి వచ్చాడు కదిరయ్య.

"యాడిదబ్బా.... ఈ కాలంలో జమ్ము" ప్రశ్నించింది బూసమ్మ.

"బైరెడ్డి పల్లెలో మాయక్కోళ్లుండారు గదా.... వాళ్ళ చెరువులో పెరిగిందంట! ఒక

మోపు జమ్ము కోసి, ఎండబెట్టి పంపించినారు. అయవోరిచేత అల్లించుకుందామని...!" అంటూ జమ్మును దించి అరుగు పైన పెడుతూ అన్నాడు కదిరయ్య.

"చేనికాడికి పోయనాడు... వస్తానే చెప్తాలే!" అంది బూసమ్మ. ఆ మాటతో అక్కడినుంచి వెళ్ళిపోయాడు కదిరయ్య.

* * *

**రా**శింటి నానుకుని వున్న చింతచెట్టు కింద... సిద్ధప్ప తన వయసు పిల్లల్ని కూడగట్టుకొని, పెద్దల్ని అనుకరిస్తూ నాటకం వేయిస్తున్నాడు.

సిగరెట్టు పేకల్లో వున్న కాకిబంగారుని సేకరించి, కిరీటంలా కత్తిరించిన అట్టలకు అతికించుకుని, వాటిని కిరీటాలకు బదులుగా తలలకు కట్టుకున్నారు. అలాగే చిన్న గదలు తయారు చేసుకుని రంగు కాగితాలు అతికించారు. వెదురు దబ్బలకు సన్నని నులకతాళ్ళను బిగించి విల్లులు తయారు చేసుకుని పొడవుగా వున్న జొన్న పుల్లల్ని బాణాలుగా సంధించి ఆకాశంలోకి వదుల్తున్నారు. ముఖాలకు కొందరు బూడిద పూసుకున్నారు. మరికొందరు మసి పూసుకొని, సున్నపుబొట్లు పెట్టుకున్నారు. మరికొందరు కుంకుమ పూసుకున్నారు. అదే వాళ్ళ పాలిట అర్దాలం! ఓ రాతిపైన ఎంగిలి ఊచి, దానిపైన బొగ్గును నూరి, ఆ ద్రవంతో మీసాలు దిద్దుకున్నారు. అంతా పదిమంది పిల్లలు, అందులో ఇద్దరు బాలికలు కూడా! ఆ యిద్దర్లో ఓ అమ్మాయి ద్రౌపదట...!

వాళ్లు ఎండిన లావుపాటి మునగకాయల్ని, తంబకాయల్ని పగులకొట్టి, వాటి గింజల్ని సేకరించి, మధ్యలో రంధ్రాలు చేసి, తాళ్ళకు గుచ్చి గజ్జెల్లాగా కాళ్ళకు కట్టుకున్నారు. మరికొందరు ఆ గింజలు హారాన్ని నడుముకు, చేతి రెట్టలకు, మణికట్లకు చుట్టుకున్నారు. వాళ్ళు కదిలినపుడల్లా ఆ గింజలు కదిలి గలగల శబ్దం చేస్తున్నాయి.

ఆ ప్రదేశంలోనే... కొంతదూరంలో... వర్షానికి విరిగి పడిపోయిన ఏడడుగుల బొప్పాయి చెట్టుకు – మెటికల్లాగా జిల్లలు కొట్టి, దాన్ని నిలువుగా పెట్టి నేలలో పాతిపెట్టారు. నాటకం ప్రారంభించారు.

ఆ వేళ ఆ చెట్టే... వాళ్లకు పందిరి!

ఆ చెట్టు నీడే... రంగస్థలం!

ఆ ప్రదేశమే... వాళ్ల పాలిట గొప్ప ఆడిటోరియం!

ఒక పిల్లవాడు – కత్తిలా చెక్కుకున్న ఓ కట్టెను చేతబట్టుకొని "పాండావులిదుగో వచ్చిరీ.... పంచ పాండావులిదుగో వచ్చిరీ..." అంటూ పాట పాడుతూ, చిందులు తొక్కుతుంటే – కొందరు పిల్లలు వెనుక పాటపాడుతున్నారు. యిద్దరు పిల్లలు, చదునుగా

వున్న రెండురాళ్ళను తీసుకొని తాళాల్లాగా వాయిస్తుంటే.... యింకో పిల్లవాడు ఓ పాత రేకుడబ్బాను దబదబమని వాయిస్తూ మద్దెల కొడుతున్నాడు.

అలా ఎవరికి వాళ్ళు పాటలు పాడుతున్నారు, ఎగురుతున్నారు. ఒక పిల్లవాడు – ఇంట్లో చిరిగిపోయిన తుండుగుడ్డల్ని, చీర చెరగుల్ని నడుముకు చుట్టుకొని ద్రౌపదిలా వచ్చిన బాలికను ఆటకాయిసన్తా "దుశ్శాసను డిదుగో వచ్చెను... ద్రౌపదికీ వలువలూడ్చేను...." అంటూ ఆ పిల్ల చుట్టుకున్న పాత గుడ్డల్ని పీకి నేలపైన కుప్ప పెట్టాడు.

అక్కడే వస్త్రాపహరణం! అక్కడే యుద్ధం!! అక్కడే సంవాదం!!! అన్నీ ఒకేసారి ప్రదర్శిస్తున్నారు.

చివరన ఒక పిల్లవాడు మధ్యలోనే పరుగెత్తి, నాటిన బొప్పాయి చెట్టెక్కి కిందకు దుమికాడు. ఆ తరువాత ఒకరొకరు ఎక్కి దుమికి, అది కింద పడిపోయేదాకా ఆడారు.

ఆ తర్వాత గదబొమ్మను చేతబట్టుకొని సిద్ధప్ప "రాజరాజు వచ్చెనో! దుర్యోధన మహారాజు సభ కొచ్చెనో...!" అంటూ గట్టిగా పాట పాడుతూ దుమికాడు. అతని వెంట మరికొందరు "వచ్చే కౌరవుల దండు.... వచ్చే...." అంటూ దూకారు.

సిద్ధప్ప ఆ పాటను "రాజే సుయోధనా; రాజే సుయోధన!" అంటూ ఆది కెక్కించినట్టు పాడాడు.

"రాజే...." అతను –

"సుయోధన!" అదే మాదిరి చిందులేస్తూ అన్నారు మిగిలినవాళ్ళు... ధృతగతిలో పాడేస్తున్నారు.

"రాజే..." చిందులు తొక్కుతూ అన్నాడు.

"సుయోధన!" మిగిలినవాళ్లు.

"రాజే...."

"సుయోధన!"

"రాజే...."

"సుయోధన!"

అరగంటలో ఆదిపర్వం మొదలు కురుక్షేత్ర యుద్ధం వరకు ఆడేసి, పాడేసి అలసిపోయారు.

పొలం దగ్గరినుంచి వస్తూ వస్తూ.... దూరం నుంచి ఆ చోద్యం చూస్తూ నిలబడివున్న వెంకోజీని చూసి ఓ పిల్లవాడు "వరే సిద్దూ.... మీ నాయన ఈడనే వుండాడు రేయ్ఁ.... యిట్టే వస్తా వుండాడు..." అని కేకేశాడు.

ఆ సమయంలో ముఖానికి బూడిద పూసుకొనున్న తన అవతారం చూసి తంతాడేమోనని – చేతిలోని గదబొమ్మను అక్కడే పారవేసి ఇంటికి పరిగెత్తాడు.

"వీడికీ నాటకంలో యింక వేషం యివ్వాల్సిందే!" ననుకుని, నవ్వుకుంటూ ఇంటివైపు నడిచాడు వెంకోజీ.

అతను యింటికి వెళ్ళేసరికి –కదిరయ్య వేసిపోయిన జమ్ము సిద్ధంగా వుంది.

"బూసీ... ఎవురే జమ్మేసి పోయినారు?" అడిగాడు.

"కదిరయ్య యేసిపోయినాడయ్య సామి... గూడసాప అల్లాలంట!" లోపల్నుంచే చెప్పింది బూసమ్మ.

ఆ మాటతో జమ్ముకొసల్ని కత్తిరించి, అల్లడానికి సిద్ధంచేసి పెట్టాడు. ఆ తర్వాత పేనిన నూలుదారాల్ని రెండేసి పోగుల్ని ఒకదానితో ఒకటి జతచేసి, వాటిని బెత్తెడు కొకటి చొప్పున నేలపైన పరిచాడు.

మొదట ఓ రెండు జమ్ము పోచల్ని ఒకటి చేసి, ఒకవైపు నేలపైన పరిచిన దారాల్ని వాటికి చుట్టి తిక్కేసి (ముడివేసి) లాగాడు. ఆ తర్వాత అన్ని దారాల్ని అలాగే ముడివేసి తిప్పాడు. అలా ఒక్కొక్కసారి రెండేసి పోచల్ని ఉంచుతూ.... దారాలు తిక్కేసి తిప్పుతూ చాపలాగా అల్లసాగాడు.

బూసమ్మ ఏదో వంట కానిచ్చానని అనిపించుకొని వచ్చి – గోడకానుకొని దిగాలుగా కూర్చుంది. చుట్టింటి గడప పైన కూర్చోని ఆలోచిస్తోంది సుధేష్ణ. సిద్ధప్ప ముఖం కడుక్కొని వచ్చి, కొట్టం అరుగు మీద బోర్లా పడుకున్నాడు.

ఆ వేళ వాళ్ళ బుఱ్ఱలు ఒకే విషయం మీద ఆలోచిస్తున్నాయి... చింత పడుతున్నాయి.

'రేణకమ్మ ఎందుకట్ల చేసింది?!'

అతని చేతివ్రేళ్ళు ఎంత వేగంగా తిరుగుతున్నాయో – అతని మస్తిష్కంలో ఆలోచనలు అంతేవేగంగా చెలరేగుతున్నాయి....

'ఎందుకట్ల జేసింది? ఇన్ని దినాలు ఏ లోటు లేకుండా చూసుకొని, కనిపెంచిన తల్లిదండ్రుల్ని కాదనుకోని ఎవుడెంటనో ఎల్లిపాయనే.... ఇన్ని దినాలు సాకిన మమకార మేమైపాయ? ఆ బెమత ఏమైపాయ? ఏం బిడ్డలో, ఏం పాపలో.... మేమేసే రుక్మిణీ కళ్యాణంలో కిష్ణుడు రుక్మిణీదేవి నెత్తకపోయినట్టు నా బిడ్డె నెత్తకపాయ ఆ అరగాసు నా కొడుకు!

పులిచెర్లో భారత మేసినపుడు – ప్రతి నాటకంలోను ఆ బంగారప్పగోడే కదా కిష్ణుడి వేషం వేసింది! ముండాకొడుక్కి ఆ పాడే విద్దె నేర్పించింది నేనే గదా... కనీసం గురువని

గూడా తలవకపాయె మిడిమేళం నా కొడుకు! అయినా ఈ ముండ కయినా బుద్ధిండక్కర్లా.....?! ఈ గురువుకు దుడ్డు లేకపోవచ్చు. ప్రేముండాది, మంచీ, మర్యాదుండాది, నలుగురు గౌరవించే యిదుండాది... అదంతా ఏం గావాల? వొగసారన్నా యోచ్చన చేసిందా ముండ? దీనెనక యింకా వొగ ఆడబిడ్డుండాది గదా.... అదన్నా గ్యేఁవనించిందా? గ్యేఁవనించలా! అయినా.... ఈ ముండ అంత పనియట్ల జేశ?'

మాటి మాటికీ అదే ప్రశ్న...!

అతని మెదడును తొలిచేస్తున్న ప్రశ్న...!!

రెండు రోజులుగా మనశ్శాంతి దరిచేరనీయకుండా చేస్తున్న ప్రశ్న... ఆ ఒకే ఒక ప్రశ్న –

'అంత పని ఎట్ల జేశ?'

ఆ తండ్రి గుండెను పిండేస్తున్న ఏకైక ప్రశ్న...!!

'అందరికీ తలవంపులు దెస్తివిగదే బసివి ముండా! కంటికి రెప్ప మాదిర్తో కాపాడకొచ్చింది ఎందుకే? ఇన్ని దినాలు పెంచుకున్న బండెడు కండలు.... ఎవుడి కిందనో దోస్తివి గదే.... యభిశారి ముండా! నలుగుర్లో తలెత్తుకోని తిరక్కుండా వుండే పని ఎట్ల జేస్తివి?!

కన్నతల్లి పేగుల్ని కదిలించిన ప్రశ్న....

'ఉండుండి ఈ ముండ అంత పని యట్ట జేశ...??'

– ఆమె మాతృత్వాన్ని ప్రశ్నించిన ప్రశ్న....!

'నీకేం పోయేకాలమే నీ యబ్బడాలా! వయసు బిడ్డెను.... రేపట్నుంచీ నేనెట్ట తలెత్తుకోని తిరుగుదునే ఊర్లో? ఎంత అపకీర్తి దెస్తివే.... నీ యిత్తగిల్ల! అయినా అంతపని యట్ట జేస్తివే?'

– రక్తం పంచుకుని పుట్టిన తోడబుట్టిన దాని హృదయాన్ని తొలిచేస్తున్న ప్రశ్న...!

'అయినా..... ఈ ముండ అంత పని యట్ట జేశ??'

– ఓ కన్నె అంతరంగం నుంచి దూసుకు వచ్చిన ప్రశ్న...

'ఇట్ట చేయరాని పని యట్ట జేస్తివే?'

– కన్నెసోదరి హృదయంలో ప్రతిధ్వనించిన ప్రశ్న....!!

'అయినా.... మమ్మల్నిందర్నీ వదిలేసి పోయేదానికి ఆయమ్మకు యట్ట బుద్ధి పుట్టె... అంత పని యట్ట జేశ???'

– ఒక పసిహృదయంలో సుడులు తిరిగిన ప్రశ్న!

ఒకే ఒక ప్రశ్న...

రెండురోజులుగా వాళ్ళ గుండెల్ని కుదిపేస్తున్న ప్రశ్న!!

వాళ్ల ఆకల్ని దూరం చేసిన ప్రశ్న!

వాళ్ల నిద్రని దూరం చేసిన ప్రశ్న!

వాళ్ళ బతుకుల్ని అవహేళన చేసిన ప్రశ్న!

వాళ్ళ భవిష్యత్తునే ఓ ప్రశ్నగా మిగిల్చిన ఏకైక ప్రశ్న!!

వెంకోజీ వేగంగా అల్లుకుపోతూనే వున్నాడు..... అయిదడుగుల పొడవుతో మట్టసంగా కత్తిరించి పెట్టి వున్న జమ్ముకుప్ప తరుగుతూ వస్తోంది.

ఉన్నట్టుండి... ఆకాశంలో పెనుమార్పు సంభవించింది!

కారుమబ్బులు కమ్ముకొచ్చాయి! ఆకాశం దిగంతాల వరకు నల్లటి దుబ్బటి కప్పుకున్నట్లు ఒకే మేఘం.... ఆకాశం మసకేసినట్లు.... క్రమంగా వర్షం ప్రారంభమైంది.

'చిటపట' మంటూ శబ్దం చేస్తూ చినుకులు నేలకు రాలుతున్నాయి.

"అమ్మణ్ణీ! వానొస్తా వుండాది... వాదె(సందెడు) కట్టెల్దీసి పెట్టు. యింటెనక ఉతికి ఆరేసిన గుడ్డలు నానిపాయనే...!" పెరట్లోకి పరుగెత్తింది బూసమ్మ.

కట్టెల కోసం సుధేష్ణ. తల్లి ననుసరించింది.

సిద్ధప్ప దిగ్గున లేచి కూర్చున్నాడు.

"సామీ పరమాత్మా... పడు సామీ.... సెరువులు మొరవలెత్తుకునేట్టు పడు సామీ! ఈ రెండేండ్ల కరువు తీరిపోయేటట్టుగా పడు! సామీ.... తల్లీ! భగవంతుడా... వానదేముడా... పడుపడు కరువు దీరా పడు!"..... పెరట్లో బట్టల్ని జవురుకొని కొట్టంలోకి వచ్చి – వాటిని మడతలు పెడుతూ వానదేవుడికి మొక్కసాగింది బూసమ్మ.

క్షణాల్లో వేగాన్ని పుంజుకుంది వర్షం!

ఆ వర్షంలో.... వాదెడు కట్టెలు ఏరుకొని వచ్చేటప్పటికీ సుమారుగా తడిసిపోయింది సుదేష్ణ.

గాలి వీచినప్పుడల్లా కొట్టంలోకి జల్లుకొడుతోంది.

"సల్లు (జల్లు) కొడతా వుండాది గానీ, లోపలికి పోరా సిద్దూ!" కొడుకుని కేకేశాడు వెంకోజీ. ఆ మాటతో సిద్దప్ప పైకిలేచి కొట్టంలోని మరో గదిలోకి వెళ్ళిపోయాడు. ఆ వర్షానికి పల్లె పల్లెంతా నిశ్శబ్దంగా మారిపోయింది. వర్షం పడుతున్న శబ్దం తప్ప మరే శబ్దమూ లేదు.

ఉరుములు, మెరుపులతో వర్షం జమాయించేస్తోంది!

ఎక్కడో దూరంగా పిడుగు పడిన శబ్దం...!!

చూస్తుండగానే ఇళ్ళమధ్య, వీధుల్లో వెల్లువలు దొర్లాయి. వాగులు, వంకలు సాగాయి. ఆ వాగులన్నీ ఏకమై పెద్దవంకలా కలిసిపోయి పెద్ద చెరువు వైపుకు దూకుతున్నాయి.

వెంకోజీ గూడచాప అల్లడం పూర్తి చేశాడు. పదడుగుల పొడవు, అయిదడుగుల వెడల్పుతో చూడముచ్చటగా తయారయింది చాప. ఆ చాప నుంచి వస్తున్న కమ్మటి జమ్ము వాసన ఆ కొట్టంలో వ్యాపించి, వర్షపు వాసనను అధిగమించింది.

దారాల కొసల్ని ముడులు వేసి కత్తిరించి, ఒకవైపు నుంచి నిలువుగా వంచి, ఖచ్చితంగా సగానికి మడిచాడు. అలా మడిచిన దానికి అక్కడక్కడా దారాల్ని కట్టి బిగించాడు.

ఆ తర్వాత పొడవుగావున్న ఆ చాపను ఒక చివరినుంచి వంచి తిరిగి ఖచ్చితంగా సగానికి అడ్డంగా మడిచాడు. ఇప్పుడది అయిదడుగుల పొడవుతో, రెండడుగుల వెడల్పుతో ఒక గూడులాగా తయారయింది. ఆ మడతలు విడిపోకుండా మళ్ళీ అక్కడక్కడా దారాల్ని దూర్చి లాగి బిగించాడు. ఆ తర్వాత ఆ చాపను అలాగే నిలబెట్టి వెనుకవైపున దారాలతో జమ్ముపోచల్ని అంటుకొని పోయేటట్లు దగ్గరగా అల్లి చివరన ముడులు వేసేశాడు. ఆ తర్వాత అక్కడక్కడా లేచిపోయి వున్న జమ్ముపోచల్ని కత్తిరించి శుభ్రంగా తయారుచేశాడు. అలా తయారయిన గూడచాపను నెత్తిన కొప్పెర పెట్టుకున్నాడు.

సరిగ్గా అది శిరస్సు నుంచి పిక్కల దాకా మనిషిని ఆక్రమించుకుంది. అలాగే పడుతున్న వర్షంలోకి అడుగుపెట్టాడు. ఆ గూడచాప మీద చినుకులు పడి 'టపటప' మని పెద్ద శబ్దం వినిపిస్తోంటే – ఆనందంగా వీధిలో ఒక్కసారి అటు ఇటు తిరిగి, ఏ మాత్రం తడవడం లేదని గ్రహించి ఇంటికి తిరిగి వచ్చాడు.

తడిసిన గూడచాప నిలువునా నీళ్ళు కారుతుంటే... వెలుపలి వైపున కొట్టం అరుగుకు ఆ గూడచాపను ఆనించి పెట్టాడు.

ఎక్కడా ఒక్క నీటిచుక్క కూడా అతని బట్టల పైనగానీ, శరీరంపైన గానీ పడి తడవలేదు.

అతనికి చాలా సంతోషం వేసింది. అతనిలో ఏదో జయించినంత ఆనందం!

అలా ఆ చాప అల్లడం పూర్తికావడానికి దాదాపు అతనికి ఆరుగంటల కాలం పట్టింది. ఆ వర్షం అలా ఆ రోజంతా పడుతూనే వుంది. ఏదో పనిమీద ఆ గూడచాపవేసుకుని రెండు మూడుసార్లు వీధిలో తిరిగి వచ్చాడు వెంకోజీ.

అలా ఆ సాయంత్రం వేళ వీధిలో గూడచాప కప్పుకొని వస్తున్న వెంకోజీకి – బంగారప్ప, రేణుకమ్మ వర్షంలో ముద్దముద్దగా తడిసిపోయి గొర్రెల్ని దొడ్లోకి తోలుకుంటూ కనిపించారు.

బంగారప్ప ఓ తుండుగుడ్డను నెత్తిన వేసుకున్నాడు. అయినా అదీ తడిసిపోయి వుంది. అతను చలికి వణికిపోతున్నాడు. రేణుకమ్మ తడిసిన పైటనే తలకు చుట్టుకొని వుంది. ఆమెకూ నిలువునా నీళ్ళోడుతున్నాయి. ఆమె శరీరం చలికి, గాలికి కంపించే తామరలా సన్నగా వణుకుతోంది.

ఆ స్థితిలో కూతుర్ని చూసేసరికి – వెంకోజీ గుండె తరుక్కుపోయింది. అంతవరకూ మరచిపోయివున్న బాధ తిరిగి అతని హృదయంలో జొరబడింది.

'ఏం కర్మాలు చేసిందీ బిడ్డె.... ఇంక జీవితాంతం యిదే మాదిరి వాననకా, ఎండనకా మొగుడితో బాటు గొర్రెలు మేపుకుంటూ బతకాల్సిందేనా....?'

'అయినా అంత పని యట్ట చేశ?'

మళ్లీ అదే ప్రశ్న! జవాబు దొరకని ప్రశ్న!!

కసాయివాడి కత్తిలా... తన గుండెను కత్తిరిస్తున్న ప్రశ్న!!

ఒకే ఒక ప్రశ్న... 'అంత పని యట్ల జేశ??'

నిలబడి తన్నే చూస్తున్న తండ్రి ఒక్కక్షణం తలెత్తి చూసి, మౌనంగా తలవంచుకొని ఇంట్లోకి వెళ్లిపోయింది రేణుకమ్మ.

వీధిలో కాలువ కట్టి సాగిపోతున్న నీటిలో అడుగులు వేసుకుంటూ తన ఇంటివైపు నడిచాడు వెంకోజీ.

# 12

**వా**రం తర్వాత....

అప్పటికే చిగురించిన పచ్చికతో నేలతల్లి పచ్చదనాన్ని పులుముకుంటోంది.

ఎక్కడచూసినా ఎఱ్ఱని అనప గింజల్లా, గులాబిరంగుతో చందమామలా మెరిసిపోతూ.... కదుల్తున్నాయి ఆరుద్ర పురుగులు.

పెద్దచెరువు నిండి మొరువ ఎత్తుకుంది.

వర్షం పడి వారం కావస్తున్నా మొరవ నీళ్ళు యింకా సన్నగా పోతూనే వున్నాయి. పొలాలు దున్ని విత్తడాని కనువుగా వున్నాయి. రైతులు పొలాల్లో సజ్జలు, జొన్నలు విత్తుకుంటున్నారు.

ఆరోజు రాత్రే... మూడు మడకల 'గొర్రు' దిండును అటక నుంచి దించాడు వెంకోజీ. కాలి బొటనవ్రేలి పరిమాణంలో దాదాపు గజం పొడవుతో వున్న మూడు వెదురు బుర్రల్ని తీసుకుని గొర్రు మడకల మధ్యనున్న రంధ్రాలకు చెక్కి నిలబెట్టాడు. ఆ మూడింటి

పైభాగాలను, డమురుకం ఆకారంలో వున్న 'జడ్డిగం' రంధ్రాలకు అనుసంధానం చేశాడు. ఆ జడ్డిగంపై అంచుకున్న చిన్న రంధ్రాలకు సన్నని నులక దారాన్ని దూర్చి ముడివేసి గొర్రుదిండు కున్క కొక్కేలకి కట్టి కదలకుండా బిగించాడు.జడ్డిగం గుండా బుర్రల్లోకి, బుర్రల్లో నుంచి మడకల కిందికి ధాన్యం జారుతుందో, లేదో తెలుసుకోవడానికి పిడికెడు సజ్జలు తీసుకుని జడ్డిగంలో పోశాడు. జడ్డిగం మధ్యలో కొనదేలినట్లున్న చిన్నగోపురం లాంటి ఆకారం, ఆ గింజల్ని సమంగా మూడు బుర్రల్లోకి పోవడానికి అనువుగా వుండడంచేత ఆ గింజలు జలజల బుర్రల్లోంచి జారిపోయాయి. మేడి పిడిపట్టుకొని గొర్రును ఎత్తి చూశాడు. మూడు మడకల కింద మూడు నక్షత్రాల్లా మూడు సజ్జకుప్పలు మెరిసిపోతూ కనిపించాయి.

'భేష్! రేపు సజ్జలు సులభంగా యిత్తుకోవచ్చులే...!' అనుకొని, జడ్డిగంలో మట్టి, రాళ్లు పడకుండా శుభ్రమైన ఓ పల్చటి పంచగుడ్డను కప్పి ముడివేసి, కొట్టంలో ఒకపక్క పెట్టాడు. వారంక్రితమే మొలక కట్టి పరిశీలించి ప్రత్యేకంగా ఓ గంపలో పోసిపెట్టుకున్న సజ్జల్ని సాలుగింజలుగా పోసే ఉలవలు, అలసందలు, అనుములు, పెసలు, కందులు, సమంగా కలుపుకొని ఒక దేకిసాలో వుంచుకుంది బూసమ్మ.

ఆ మరునాడు తెల్లవారి పొద్దు పుట్టకముందే.... ఎద్దుల్ని సిద్ధప్పకు అప్పజెప్పి, గింజల్ని తల్లీకూతుళ్ళ నెత్తిన పెట్టి తాను, గొర్రు, కాడిమాను ఎత్తుకొని పొలానికి బయలుదేరాడు.

వెంకోజీ భుజంపైన గొర్రు, మధ్యలో అతని తల, అలంకారం లేని చిన్న రధంలా కనిపిస్తోంది.

అతను ముందు... వాళ్ళు వెనుక!

పొద్దు పుట్టకనే పొలం చేరుకున్నారు.

పొలంలో ఈశాన్యమూలన గొర్రును దించి, ఎద్దుల అర్రుల పైన కాడిమానుంచి పలుపులు బిగించాడు వెంకోజీ. ఆ తర్వాత గొర్రు నొగలన్ని కాడిమాను పైన వేసి, ఎలువు (మడకపై నుండి భూమిలోకి దిగకపోవడం) జలువు (మడక మరీ కిందికుండి భూమిలో మరీ లోతుకు వెళ్లడం) చూసుకుని, జలువు బుర్రను సరిచేసి పొనకం తాడుతో గొర్రును బిగించాడు.

బూసమ్మ ఎద్దులకి, గొర్రుకీ పసుపు కుంకాలు పెట్టింది. ఆ తర్వాత పచ్చి పసుపు గంధాన్ని అందరూ బొట్టుగా పెట్టుకున్నారు.

"అమ్మీ! బూసీ! బిడ్డెకు తెలీదు గానీ – సజ్జగింజల్ని నీవు యిత్తు... సాలు గింజలు అమ్మణ్ణిత్తుతుంది!" అంటూ తలకు తుండుగుడ్డ చుట్టుకొని, పంచగుడ్డను బిగించికట్టి, గొర్రుమేడికి ఎడ్ల పగ్గాలను చుట్టాడు. ఇంటి నుంచి తెచ్చిన మరో బారెడు పొడవు

వెదురు బుర్రకు బారెడు పొడవున్న దారాన్ని మధ్యకు కట్టి, దాని మరో కొసను గొర్రుమేడి కింది భాగానికి కట్టాడు. ఆ వెదురుకు ఒకవైపున ఊటకలం పొల్లులా చెక్కబడివుంది. దాన్ని గొర్రు మధ్యలో వుంచి, మొదటి గెనింవారకు గొర్రును తీసుకుపోయాడు.

"గెనిం వారవచ్చే గొర్రు మడక చాలులో సాలుగింజ లేయండి... చో...చో... పద...పదా!" అంటూ ఎడ్లను అదిలించాడు.

"అమ్మణ్ణీ! నువ్వు బుర్ర దీసుకో....!" అంటూ గొర్రు తోలసాగాడు.

సుధేష్ణ "నాయనా... ఉండు... వడి గట్టుకోవాల!" అంది.

"సరే! బిన్నే (త్వరగా) కట్టుకోండి!" అంటూ ఆగాడు వెంకోజీ.

ఒక పాత పంచగుడ్డతో... చీరపైన పెద్ద వడి కట్టి బిగించింది బూసమ్మ.

సుధేష్ణ అలాగే మరో వడి కట్టుకొంది. ఆ తరువాత బూసమ్మ తన వడిలో శేరుడు సజ్జల్ని పోసుకుంది. సుధేష్ణ తన వడిలో కొన్ని సాలుగింజల్ని పోసుకుంది. మరో వడి కట్టుకొని అందులో జొన్నలు పోసుకుంది.

"యింక పదబ్బా!" అంటూ గొర్రు దగ్గర నిలబడింది బూసమ్మ.

సుధేష్ణ మేడి వెనక కట్టిన వెదురు బుర్రను తీసుకుంది.

వెంకోజీ గొర్రు తోలడం ప్రారంభించాడు. గొర్రుకున్న మూడు మడకలు కసకస శబ్దం చేస్తూ భూమిని చీల్చుకుని ముందుకు సాగుతున్నాయి. అందులో గెనిం వారున్న మడక గెనుమును వరుచుకుంటూ వెళుతోంది.

బూసమ్మ తన రెండు పిడికిళ్ళ నిండా సజ్జల్ని తీసుకుని మార్చిమార్చి, సన్నగా ఒకే రీతిలో జడ్డిగంలో జారవిడుస్తోంటే.... సుధేష్ణ గెనిము పక్కింటిపోతున్న సాలులో వెదురుబుర్ర నుంచి సాలుగింజల్ని జారవిడుస్తోంది. అలా పొలం నాలుగు వైపులా సాలుగింజలతో సజ్జలు విత్తిన తర్వాత ఉత్తరం వైపున ఓ పదడుగుల దూరంలో కొంద్రవేసి చక్కగా గొర్రు తోలాడు వెంకోజీ. అలా గొర్రు తోలిన నాలుగుసార్ల కొకసారి జొన్నలు, సాలుగింజలు కలిపి, వెదురు బుర్రలో నుంచి పోస్తూ వస్తోంది సుధేష్ణ.

చూస్తుండగానే తూర్పు కొండల్ని చీల్చుకొని మండుతున్న అగ్నిబాణంలా ఆకాశంపైకి దూసుకువచ్చాడు సూర్యుడు.... అలాగే బారెడెత్తుకు ప్రాకాడు.

గొర్రును ఆపాడు వెంకోజీ.

"అమ్మణ్ణీ... సాలుగింజలు, జొన్నలు అబ్బోడు చూసుకుంటాడు గానీ - నువ్వు యింటికి బొయ్యి సంగటి జేసుకొని పదిగంటలకంతా ఎత్తకొచ్చెయి!" పురమాయించాడు వెంకోజీ.

ఆ మాటతో తాను కట్టుకున్న వడిని విప్పి పక్కనపెట్టి యింటికి బయలుదేరింది సుధేష్ణ.

"ఒరే అబ్బా! జొన్నలు, సాలుగింజలు సమంగా కలిపి చెడ్డీజేబులో యేసుకొని నేను చెప్పినబ్బుడల్లా – ఇందాకా ఎదురు బుఱ్ఱలో పోస్తా అక్క యిత్తినట్టుగానే, సమంగా సాలుగింజలిత్తు నాయనా!" అన్నాడు వెంకోజీ.

"అట్టే నాయనా" అన్నాడు సిద్ధప్ప.

తిరిగి గొఱ్ఱు కదిలింది.

గింజలు భూమిలో పడుతున్నాయి.

సుధేష్ణ పొలం దాటుకొని పల్లెకు పోయి దారిలో కలుసుకునే సమయానికి – విత్తనాల గంపను నెత్తిన పెట్టుకొని, గొఱ్ఱు నెత్తుకొని వస్తున్న బంగారప్ప వెంట నడుస్తూ వచ్చి ఎదురయింది రేణుకమ్మ.

ఎదురుపడిన అక్కాచెల్లెళ్లు ఒక్కక్షణం ఒకర్నొకరు చూసుకొని – తిరిగి తలలు వంచుకొని ఎవరి దారిన వాళ్ళు వెళ్లిపోయారు.

వెంకోజీ పొలాని కవతలి పొలమే బంగారప్పది!

తన పొలం దాటి వెళుతున్న వాళ్ళను చూసి ఒక్కక్షణం నిశ్చేష్టులై అలాగే నిలబడిపోయి, తిరిగి ఏమీ తెలీనట్లే గింజలు విత్తడంలో నిమగ్నమైపోయారు వెంకోజీ, బూసమ్మలు. కానీ, వారి గుండెల్లో రేగిన బడబాగ్ని వారిని నిలువునా దహించివేస్తోందనీ, గొఱ్ఱు మడకలు – భూమిని చీల్చుకుని ముందుకు పోతున్నట్లు వాళ్ళ బాధ వాళ్ళ గుండెల్ని చీల్చుకుని పోతోంది.

ఆరోజు మధ్యాహ్నం వరకు పొలం విత్తి, గొఱ్ఱు విప్పి, గొడ్లను నీళ్ళు తాపుకుని రావడానికి పెద్దచెరువు వైపు తోలుకుపోయాడు వెంకోజీ.

బూసమ్మ, సిద్ధప్ప అన్నీ ఎత్తుకొని ఇంటిదారి పట్టారు.

'కీయ్యోక్....కీయ్యోక్..." అంటూ చెరువులో గొడ్లకు నీళ్లు తాపుతూ వెంకోజీ చూసిన మరో సంఘటన అతని గుండెను ఊపేసింది.

అక్కడ చెరువునీళ్ళ పక్కన గొఱ్ఱెల్ని మళ్లేసుకుంటూనే మరోవైపు బట్టల్ని ఉతుక్కుంటూ.... ఆ ఎండలో ఆయాసపడిపోతోంది రేణుకమ్మ.

'ఎంత కష్టమొచ్చింది నా బిడ్డెకు?' నొప్పిగా మూలిగింది అతని హృదయం.

ఎడ్లు తమ మోరల్ని వంచి మూతిని నీటిపైన పెట్టి ఆబగా నీళ్లు తాగుతున్నాయి.

రేణుకమ్మ అదేమీ గమనించనట్లే

తన పనిలో తాను నిమగ్నమైపోయి వుంది!

వేరే కులంవాడిని పెళ్ళి చేసుకుందని ఊరి సంప్రదాయానికి కట్టుబడి తనే వాళ్ళను

ఊరికి వెలేస్తున్నట్టు న్యాయం చెప్పాడు. దాని ప్రకారమే తను నడుచుకుంటున్నాడు.

ఫలితంగా... ఊరి వారెవరు ఆ కొత్తదంపతులకు సాయపడలేదు.

వాళ్ళ పని వాళ్లే చేసుకుపోతున్నారు. తమని వెలేసిన ఊరుని వాళ్లూ వెలేసినట్టు ఊరి నడిబొడ్డులో, మనుషుల మధ్య జీవిస్తున్నా ఏదో కీకారణ్యంలో జీవిస్తున్నట్లు, జన సంచారమే లేని దండకారణ్యంలో... ఒంటరిగా బతుకుతున్న ఋషిదంపతుల్లా... వాళ్ళకు వాళ్ళే బతుకుతున్నారు. లోకాన్ని లెక్కచేయకుండా ఆనందంగా బతుకుతున్నారు.

అందుకే వాళ్ళ సాహసాన్ని మెచ్చుకోలేకుండా వుండలేకపోయాడు వెంకోజీ.

'అయినా నా యింట్లో ఈ బిడ్డకేం లోటని? మొగున్ని తెచ్చిపెట్టలేని స్థితిలో వుండానానేను? దేవుడిచ్చిన కాడికి – ఉన్నంతలో అప్పో సప్పో చేసైనా సరే ఏ లోటూ లేకుండా చూస్తినే! అట్టాంటబ్బుడు ఈ బిడ్డె అంత పని యట్ట జేశ? ఎందుకు జేశ?!

మళ్ళీ అదే ప్రశ్న!

జవాబే దొరకని ప్రశ్న!

అతని బుర్రను తినేస్తున్న ప్రశ్న

'అంతపని యట్ల జేశ? యట్ల జేశ? యట్ల జేశ?'

పదే పదే అదే ప్రశ్ననే మనస్సులో వల్లించుకుంటూ... నీళ్లు తాగిన ఎడ్లను తోలుకొని వచ్చేశాడు వెంకోజీ.

గుడ్డలుతకడం ఆపేసి, గుడ్ల నీళ్ళు కుక్కుకుంటూ తండ్రినే చూస్తూ వుండిపోయింది రేణుకమ్మ.

సరిగ్గా అప్పుడే ఓ గొట్టెపిల్ల ఎగిరి నీళ్లలో దూకడంతో – అల్లకల్లోలమైపోయిన వాళ్ళ బుర్రల్లాగే... ఆ చెరువులో నీళ్ళు అల్లకల్లోలమైపోయాయి.

అటువైపు చూసింది రేణుకమ్మ!

# 13

**కా**లచక్రం గిర్రున మరికొన్ని మైళ్ళరాళ్ళను దాటుకొని వెళ్ళిపోయింది.

ఆ కాలగమనంలో మరికొన్ని మార్పులు సంభవించాయి. రేణుకమ్మకు ఇద్దరు పిల్లలు పుట్టుకొచ్చారు. అయినా వాళ్ళ అన్యోన్యత మాత్రం చెడలేదు.

రేణుకమ్మది తన కులం కాకపోయినా తన కోసం, కేవలం నా కోసమే తన వాళ్లనందర్నీ త్యాగంచేసి వచ్చిందన్న అపారమైన ప్రేమ బంగారప్పది!

అదే భావన రేణుకమ్మది!

ఆ భావనే వాళ్ళ ప్రేమను యింకా యినుమడింపజేసి వాళ్ళ మధ్య మరింత అన్యోన్యతను పెంచింది. ఆ అన్యోన్యతను పటిష్టపరుస్తూ పిల్లలూ పుట్టుకొచ్చారు. ఊరు కాదన్నా, తమవాళ్ళు వద్దన్నా... వాళ్ళదో ప్రపంచం! వాళ్ళదో దారి! ఆ దారిలో ఏ వడుదుడుకులు లేకుండా సాగిపోతోంది వాళ్ళ జీవితం! ఆ ప్రయాణంలో వాళ్ళు ఎవరినీ నొప్పించలేదు. మాట్లాడిన వాళ్ళతో ఆప్యాయంగా మాట్లాడారు. మూతి ముడుచుకున్న వాళ్ళతోనూ మామూలుగానే వున్నారు. ఎవ్వరినీ కాదనుకోలేదు. ఆ మంచితనమే తిరిగి మెల్లమెల్లగా ఊరివాళ్ళను దగ్గర చేయసాగింది. వెలి మరిచిపోయి మెల్లమెల్లగా చిన్నచిన్న పనుల్లో వాళ్ళకు సాయపడుతూ వచ్చారు. ఊరి కట్టుబాటుకు పనిమానేసిన ఊరి మంగలి, చాకలి సైతం వాళ్లకు పని చేయడం ప్రారంభించారు.

అన్ని చేసినా ఏ శుభకార్యాల్లోనూ వాళ్ళను అనుమతించలేదు. ఊర్లో జరిగే మంచి సెబ్బరలకు మాత్రం దూరంగానే వుంచారు. ఆ వూరి వాళ్ళంతా మట్టిని నమ్ముకున్న మట్టిబిడ్డలు... చిన్నచిన్న రైతులు... వ్యవసాయ కూలీలు! వాళ్ళకు కులం, గోత్రం, సంప్రదాయం పోగొట్టుకోకూడదన్న పట్టుదలే గానీ... అందరూ మంచివాళ్లే!

సిద్ధప్ప పెరిగి పెద్దవాడయ్యాడు.

అతనూ పెండ్లి చేసుకున్నాడు!

రామకుప్పం దగ్గరుండే శంకరాపురంలో యిచ్చి, సుధేష్ణకు పెళ్ళి చేసాడు వెంకోజీ. ఈ ఖర్చులకంతా మరోఎకరా నేల అమ్మక తప్పలేదతనికి! వడ్డీల బుడ్డయ్య అతిచవగ్గా అతని నేలనుకొనడమేగాక, అందులో సగం తన అప్పుకు జమ చేసుకున్నాడు. ఆ కారణంగా వెంకోజీ కుటుంబంలో ఏ ఎదుగూ బొదుగూ లేకుండాపోయింది.

ఈ పరిస్థితిలో పాకాలలో 'భారతం' వప్పుకున్నాడు. ఈసారి ట్రూపు బాధ్యతంతా సిద్ధప్పే తీసుకున్నాడు. ఈ ఊర్లోనే గాకుండా, చుట్టుపక్కల ఊళ్ళలో నుంచి కూడా మెరికల్లాంటి పాటగాళ్ళను ఎన్నిక చేసి, ఒక మంచి ట్రూపు తయారు చేశాడు సిద్ధోజీ. కొడుకు ప్రయోజకత్వం వెంకోజీకి ఆనందం కలిగించింది.

సిద్ధోజీ తయారుచేసిన ట్రూపులో బలిజోళ్ళున్నారు, గొల్లోళ్ళు, కురువోళ్ళున్నారు. అందుకే కదిరయ్య "ఏమయ్యవారా! బంగారప్ప మంచి పాటగాడు గదా! యిందర్ని బిల్చినపుడు ఆయప్పను పిలిస్తే మాత్రం ఏమైపోయింది?' అన్నాడు.

అతన్ని పిలవడానికి ఆ తండ్రీకొడుకులకు ఏ అభ్యంతరమూ తోచలేదు.

"నీ యిష్టం! నువ్వు పిల్చేటట్టుంటే పిల్చు!" అన్నాడు వెంకోజీ.

పాకాలలో పేరుప్రతిష్ఠలు ఆర్జించిన నారాయణస్వామి ఆ భారతాన్ని నిర్వహిస్తున్నాడు.

అతను చాలా నిష్టగా భారతోత్సవాలను జరిపిస్తాడని చుట్టుపక్కల పేరుంది. పైగా డబ్బుకి, ఖర్చుకి వెనకాడని వ్యక్తి. అతనింట్లో రోజూ అరమూట బియ్యం ఉడకతాయంటారు. యింటికెవ్వరొచ్చినా భోజనం చేసి వెళ్ళాల్సిందేనని, అది ఆ యింటి మర్యాదని చెబుతారు. అలాంటి నారాయణస్వామి ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం 'భారతం' సజావుగా సాగిపోతోంది.

ఆరోజు భారతం కోడెక్కె రోజు!

పాకాల ధర్మరాజుల గుడిలో నుంచి ఒక్క ధర్మరాజు విగ్రహం తప్ప - పాండవుల నలుగురి విగ్రహాలు, ద్రౌపది, కృష్ణుడు, పోతరాజు విగ్రహాలు తెప్పించబడ్డాయి.

ఊరికి తూర్పున, సంతతోపుకు దక్షిణంవైపున దద్దిలంలో ఆ విగ్రహాల్ని పెట్టారు. ప్రతి సంవత్సరం ఆ ప్రదేశంలోనే భారతం జరగడంచేత కాబోలు ఆ ప్రదేశం 'భారతం మిట్ట'గా పిలువబడుతోంది. ఆ ప్రదేశమంతా అక్కడక్కడా గుంజలు పాతి, టెంకాయ కీతుల్తో పందిరి వేయడం చేత చల్లగా వుంది.

ఒక యిద్దరు వ్యక్తులు.... ఆ ఊరి చాకలి, మరో బైరాగి - ఆ ప్రదేశానికి తూర్పున వున్న పెద్దబావిలో స్నానం చేసి వచ్చి, చేతులకు పసుపుకొమ్ము కట్టిన దారాల్ని కంకణంగా కట్టుకొని 'కన్నెసాము'లయ్యారు. 'అంటూ ముట్టూ' తగలకుండా నిష్టగావున్నారు. వాళ్ళు పసుపు బట్టలు కట్టుకొని ఆ విగ్రహాలకు పూజార్లుగా నియమింపబడ్డారు.

ఆ మరునాడు కలశ ప్రతిష్ట, ధ్వజారోహణం! దానికి నాటక సమాజం నాయకుడు వెంకోజీని పిలిచారు. వెంకోజీ సిద్ధోజీని పిలిచి "కాబోయే గురువుగా అన్నీ అనుభవం కావాలి. ఈసారి నువ్వే వెళ్ళు" అంటూ సిద్ధోజీని పంపాడు. హరికథకుడు కృష్ణమదాసు భాగవతార్ కూడా హాజరయ్యారు. వాళ్ళకు విడిది ఏర్పాట్లు నారాయణస్వామిగారి అవుట్‌హౌస్‌లో చేశారు.

ఆరోజు తెల్లవారి మూడుగంటలకే నలుగురు బ్రహ్మచారుల్ని వెంటబెట్టుకుని, ఒక కొత్త మట్టిదుత్తను వాళ్ళ చేతికిచ్చి, పోతరాజు విగ్రహాల్ని మోసుకుంటూ, పంబల, డప్పు వాద్యాల మధ్య పెద్దబావి దగ్గరికి తీసుకుపోయి సచేల స్నానం చేయించి, ఆ నలుగుర్ని బావిగట్టునే ఒకచోట నిలబెట్టారు.

"ఏమండప్పా సాములూ! పలకలు, పంబలలూ వాగతా వుంటాయి. మీలో ఎవురికి దేవుడావహిస్తాడో వోడే బాయిలోకి దిగి, మట్టిదుత్తతో నీళ్ళు దేవాల!" అన్నాడు కార్యకర్త.

వాద్యాలు మిన్నుమిట్టాయి. అప్పుడప్పుడు సాగదీసిన 'ఎస్' ఆకారంలో వున్న కొమ్ముల్ని దిక్కులు పిక్కటిల్లేటట్లు ఊదుతున్నారు. ఆ శబ్దం..... ఉరుములు ఉరిమినట్టు, చెవులు చిల్లులు పడేటట్టు వినిపిస్తోంది.

కొంతసేపటికి ఆ నలుగుర్లో ఒకడు పూనకం వచ్చినవాడిలా ఊగిపోసాగాడు. అతన్ని యిద్దరు పట్టుకొని, చేతికి దుత్తనిచ్చి, బావిలోకి దింపి, ఆ దుత్త నిండా నీళ్ళు ముంచుకొని, దాన్ని అతని నెత్తిన పెట్టి, బ్రాహ్మడు వేదమంత్రాలు చదువుతూ ముందు నడుస్తుంటే.... ఊరేగింపుగా తీసుకువచ్చారు.

అలా తీసుకువచ్చిన దుత్తను విగ్రహాలున్న చోటనే ఓ ప్రక్కగా పెట్టారు. దాని అంచున ఒక పొడవుపాటి అలుగును తలకిందులు చేసి, దాని కంఠానికి తాకించి, మొనను కుండ కంఠం కింద ఆనించి నిలబెట్టారు కన్నెసాములు.

అదంతా చూస్తుంటే సిద్ధోజీకి ఆశ్చర్యం కలిగింది. ఇదివరకు తండ్రితో బాటూ ఎన్నో భారతాలాడారు. కానీ అసలా భారతాలు ఎలా మొదలవుతాయో చూడలేదు. నారాయణస్వామి ఒక పద్ధతీ, పర్దేశం వున్న మనిషి కాబట్టి హరిదాసును, నాటకం ట్రూపు నాయకుడ్ని పిలిపించాడు. కాబట్టే తనకు చూసే అవకాశం కలిగించుకున్నాడు సిద్ధోజీ.

అదంతా చాలా విచిత్రంగా తోచిందతనికి. దాని గురించి తెలుసుకోవాలన్న ఉత్సాహమూ కలిగింది. పక్కనే వున్న కన్నెసామిని పిల్చి, "ఏమి సామీ ఇదంతా... యిచిత్రంగా వుండాదే?!" అని అడిగాడు.

"ఏముండాదన్నా! యిదే కలిశ ప్రతిష్ఠ! ఈ కలిశం పైన అలుగు నిలబడితేనే భారతం జరిపిస్తారు. అది నిలబడకపోతే అది అరిష్టమని ఆ ఏడు భారతం జరిపించరు!" వివరించాడో కన్నెస్వామి.

"మరి, ఈ కలిశ ప్రతిష్ఠ ప్రాముఖ్యత ఏమి?"

"ఏం లేదన్నా... ఈ కలిశం ధర్మరాజులోరి ప్రతిరూపంగా భావించబడతాది. ఆ శెలకు (విగ్రహానికి) బదులుగా దీన్ని పెడతారు."

"యిన్ని శెలలు దెచ్చినారు గదా... అట్టాంటబ్బుడు ధర్మరాజులవారి శెల ఎందుకు తేలేదు...?"

"ఏం లేదప్పా! అయప్ప ధర్మాత్ముడు, సత్తెమంతుడు గదా! ఆయప్ప వున్నచోట అంటుముట్టు తగిల్నా, లేదా యింకేదన్నా సెరుపు జరిగినా మంచిది గాదు. అట్ట జరిగితే రాజ్జెం అల్లకల్లోలమైపోతాది. భస్మమైపోతాది. అందుగ్గాబట్టే ఆ శెలను బయటికి యివ్వరు. అందుకని దానికి బదులుగా ఈ కలిశెం ఏర్పాటు చేస్తారు... అంతే!" వివరంగా చెప్పాడు కన్నెసామి.

వాళ్లు చూస్తుండగానే కొంతసేపు తర్వాత కుండపైన నిలబెట్టిన అలుగును పక్కనపెట్టి, కుండ అంచుకు తమలపాకులు అమర్చి, వాటి మధ్యన పీచు తీయని కొబ్బరికాయను

వుంచారు. ఒక బ్రాహ్మడు వేదమంత్రాలు వల్లించి దానికి పూజాపునస్కారాలు నిర్వహించాడు.

దాని ముందర కొంతదూరంలో యజ్ఞగుండం ఏర్పాటు చేసి, అందులో సమిధలు (వెండప, మోదుగ, మట్టి, రావి, జిల్లేడు, జమ్మి, చంద్ర, ఉత్తరేణి, అత్తి, గరిక, దర్భ, వెదురుపుల్లలు) వేసి, అనుష్టుఫ్ శ్లోకాలు చదివాడు... గరిటెతో నెయ్యి పోశాడు.

"ఇక్కడ ఈ యజ్ఞమెందుకు?" తిరిగి అడిగాడు సిద్ధోజీ.

"భారతం ఒక యజ్ఞం జరిపించడం లాంటిది. అందుకే ఈ ఉత్సవాలను 'భారత యజ్ఞా'లని కూడా పిలుస్తారు కదా! అందుకే యిదొక పవిత్ర కార్యం! దాన్ని భక్తితో, నిష్టగా చేయాలనే ఈ ఏర్పాటు! అంతేగాకుండా ఆ మహాతల్లి ఆదిశక్తి, శక్తి స్వరూపిణి ద్రౌపదీదేవి పుట్టిండేది యజ్ఞగుండంలో నుంచే అంటారు. భారతమంటే ఆమె కథే కదా! అందుగ్గాబట్టే కొన్ని ప్రాంతాల్లో ఈ ఉత్సవాలను ద్రౌపతమ్మోత్సవాలని గూడా అంటారు. అందువల్లనే ఈ భారతం అయిపోయిందాకా ఈ యజ్ఞగుండంలో అగండ్లం (నిరంతరం వెలిగే జ్యోతి లేదా నిప్పులు) యలగతా వుండాల్సిందే!" వివరంగా చెప్పాడు కన్నెసామి.

ఈ తంతంతా అయిదుమంది కన్నెసాములు నిర్వహణలో పూర్తయింది. ఆ కలిశాన్ని తర్వాత పాలకంబాలు, అరటికంబాలు, మారేడు ఆకులతో చేసిన గుడిలో మధ్యన బియ్యం పోసి, అందులో ప్రతిష్ఠ చేసి, తెల్లగుడ్డ కప్పేశారు. ఆ తర్వాత ఒక పొడువాటి వెదురుకొయ్యకు చివరన ఒకవైపున అడ్డంగా మూరెడు పొడవున్న మూడు వెదురుదబ్బలు అమర్చారు. దానికి ఒక ఎఱ్ఱటి గుడ్డను చుట్టారు. ఆ తర్వాత బ్రాహ్మడి వేదమంత్రాల మధ్య – కాసులు, నవధాన్యాలు వేసిన ఒక గుంతలో నిలువుగా నిలబెట్టి, పాతి, పసుపు కుంకాలతో అర్చించారు. అదే "కొడిస్తంభం' అనబడే ధ్వజారోహణం!

అట్లా 'కొడెక్కిన' భారతం తొలి రెండురోజులు విగ్రహాల్ని ఊరూర ఊరేగించి తెచ్చి మళ్ళీ యథాస్థానాల్లో పెట్టేశారు.

అదంతా చూసిన సిద్ధోజీ 'భారతం కొడెక్కడం' అంటే యిదే గదా!' అనుకున్నాడు.

ఆ విగ్రహాలన్నింటినీ బాగా పరిశీలించాడు సిద్ధోజీ. ప్రతి విగ్రహానికి నాలుగు చేతులు..... ప్రతి చేతిలోను ఓ బాణమో, ఓ కమలమో, ఓ కత్తో వుండి, తప్పనిసరిగా ఒక చేయి ఆశీర్వదిస్తున్నట్లుంటోంది. కృష్ణుడి విగ్రహానికి ఒక చేతిలో పిల్లనగ్రోవి, మిగిలిన చేతుల్లో శంఖచక్రాలు, గదా వున్నాయి. అర్జునుడి చేతిలో విల్లు, భీముడి చేతిలో గదా వున్నాయి. ద్రౌపది విగ్రహానికి పొడువాటి సవరం విగ్గు వుంది. అన్నింటిలోకీ పోతరాజు విగ్రహం ప్రత్యేకంగా కనిపిస్తోంది. ఎడమకాలి అరికాలి పైన కూర్చొని, కుడికాలిని మోకాటి వరకు మడిచి వున్నట్లుంది.

ఆ విగ్రహాన్ని చూసేకొద్దీ చాలా విచిత్రంగా తోచింది సిద్ధోజీకి. తాము భారతోత్సవాల్లో నాటకం వేసేటప్పుడు – మొదటనే పోతరాజు విగ్రహాన్ని తెచ్చి రంగస్థలంపైన ఓ పక్కనపెడతారు. దాన్ని చూసినప్పుడల్లా సిద్ధోజీకి దాని గురించి తెలుసుకోవాలన్న జిజ్ఞాస కలిగేది. దానికి రెండు చేతులున్నాయి. కుడిచేతిలో పైకెత్తిన కత్తి, ఎడమచేతిలో ఓ మనిషి తల... పెద్ద పెద్ద మీసాలు, కనుగుడ్లు, తలకు పాగా... చాలా రౌద్రాకారంలో కనిపిస్తోంది పోతరాజు విగ్రహం.

ఆ పోతరాజుకీ, పాండవులకీ ఏమి సంబంధమో, అసలు అతని చేతిలో మనిషి తల ఎందుకుందో అతని కర్థం కాలేదు. దాన్నిగురించి తెలుసుకోవాలన్న ఆశ చాలారోజులుగా అలాగే మిగిలిపోయివుంది..

ఆరోజు మధ్యాహ్నం.... భోజనం చేసి కూర్చున్న తర్వాత కృష్ణదాసుని అడిగాడు సిద్ధోజీ –

"ఏం దాసూ... ఈ పోతరాజు కథేందో – పాండవులకూ, అతనికీ ఏమి సంబంధమో కొంచెం చెప్పండి..."

"అయ్యో... సిద్దోజీరావూ! నిజానికి భారతంలో పోతరాజు కథే లేదు. పాండవులపై నుండే ప్రేమకొద్దీ జానపదులు – అంటే ... పల్లెవాళ్ళు కల్పించుకున్న పాత్ర పోతరాజు..." చెప్పసాగాడు దాసు.

"ఎందుకు కల్పించుకున్నట్లు?" మధ్యలో అడ్డుతగిలాడు సిద్ధోజీ.

తిరిగి చెప్పసాగాడు దాసు...

"చెప్తా! అదిగూడా సెప్తా! పూర్వం దండకారణ్యంలో ఒక రాజ్యం వుండేదంట... అక్కడ ఒక పెద్ద 'విబూది కోట'ను కట్టుకొని 'గురులింగ మహారాజు' అనే గొప్ప శివభక్తుడు రాజ్యం చేస్తావున్నంట. ఆయప్ప యెంత భక్తుడంటే... ఆయన నేరుగా రథంలో రోజూ ఉదయాన కైలాసానికి వెళ్ళి స్వయంగా శివపార్వతుల్ని పూజించి వచ్చేవాడంట. అతని ఏకైక కుమారుడు నాలుగే నాలుగడుగులు పెరిగిన గుజ్జారిగాడు పోతల్‌రాజు. మనిషి పొట్టోడయినా పుట్టెడు తెలువులున్నోడు. నాయన దినొమ్మూ ఎందుకు కైలాసానికి బోతావుండాడో చూడాలని ఒకరోజు తండ్రికి తెలీకుండా రథానికి ఎనకవుండే పెట్టెలో కూర్చొని కైలాసానికి వెళ్ళిపోయినాడంట. గురులింగ మహారాజు అదేమీ గమనించకనే నేరుగా శివపార్వతులుండే చోటికి వెళ్ళిపోయినాడంట. అక్కడుండే ప్రమదగణం, మన గురులింగ మహారాజు కొడుకే గదా, పోనీలే' అని – 'ఓరబ్బీ... కైలాసంలో నువ్వు యాడన్నా దిరుగు, పరవలా! కానీ, ఉత్తర దిక్కుకు మాత్రం పోవద్ద'న్నారంట. అయితే

మన పొట్టోడు వినకుండా ఏముంటుందో చూద్దామని ఉత్తర దిక్కునే వెళ్ళాడంట. పోనూపోనూ అక్కడ కొంతదూరంలో శివుడి ఆయుధాగారం కనిపించిందంట. అక్కడికి బొయ్యి అక్కడ కావలివుండే ప్రమదగణాన్ని వివరాలడిగాడంట! 'గురులింగ మహారాజు కొడుకు గదా!' అన్న అభిమానంతో అక్కడున్న ఆయుధాల నన్నింటినీ చూపించి, వాటి గొప్పతనాన్ని వివరించినారంట వాళ్ళు. అందులో దక్షయజ్ఞంలో వీరభద్రుడు వాడిన వీరజాటీ, వీరఖడ్గం వున్నాయి. ఇంకా త్రిశూలం,పాశుపతాస్త్రం వంటి అనేకం వున్నాయంట. ఈ గుజ్జారోడి చూపు అక్కడ వుండే ఒక నిమ్మపండు మీద, జాటీ, ఖడ్గం మీద బడిందంట. వాటి గురించి వివరాలడిగినాడంట. అప్పుడు అక్కడే వుండే ఒక ప్రమదుడు ఆ నిమ్మకాయ సిరిసంపదల్నిస్తుందనీ, ఆ వీరజాటీ, వీరఖడ్గం ఎవరిచేత వుంటే వాళ్ళకు అపజయమే కలగదనీ చెప్పినాడంట! ఆ మాటలతో ఆయన ఆ నిమ్మకాయ చేతబట్టి, ఆ వీరఖడ్గం, వీరజాటిని గబుక్కున దూరి ఎత్తుకోని, ఆడుండేవాళ్ళను వాటితోనే జయించి చక్కగా విబూదికోటకు పోయినాడంట! ఆ విషయం శివపార్వతులకు తెలిసినా – తమ భక్తుని కొడుకు తమ బిడ్డతో సమానమని భావించి ఏమీ అనలేదంట.

అది సరిగ్గా పాండవులు అరణ్యవాసం చేస్తున్న సమయం! ఒకరోజు భీముడు అడవంతా తిరిగి కట్టెలు కొట్టి మోపు కట్టుకోని ఆ మోపును మోసుకొస్తా ఆ విబూదికోట కాడ అలుపు తీర్చుకొనే కోసరమని మోపు దించి ఆ కోటకు ఆనించినాడంట. దాంతో ఆ విబూదికోట పడిపోయిందంట. అప్పుడు పోతరాజు వీరఖడ్గం, వీరజాటీ చేతబట్టి భీమున్ని కొట్టి తన్ని తగలేస్తే భరించలేక భీముడు పరుగెత్తినాడంట. అయినా వదలకుండా పోతరాజు తరుముకోని పోతానే వుంటే... అప్పుడు క్రిష్ణుడు – ఓ అవ్వ మాదిరి మారిపోయి, అర్జునున్ని పదహారేండ్ల ఆడదానిగా మార్చేసి ఆ దారిలో నిలబడినాడంట. భీమున్ని తరుముకుంటా ఆడికొచ్చిన పోతరాజు, ఆ అమ్మాయిని చూస్తానే ఆమెను నాకిచ్చి పెండ్లి చేయమన్నాడంట. అప్పుడు మాయాక్రిష్ణుడు... 'నీ తండ్రి తలను నరికితెస్తే యిస్తానన్నాడంట. దాంతో గుజ్జారి వెధవ భీమున్ని మరిచిపొయ్యి ఆ ఖడ్గంతో గురులింగ మహారాజు తల నరికి చేత్తో పట్టుకొనొస్తాడంట... గురులింగ మహారాజు నెవరయినా చంపితే,. ఆయప్ప తల నేలబడగానే చంపినోడు తల బగిలి చచ్చేట్టుగా శివుడి వరమంట! అందుకని పోతరాజు ఆ తలను ఎప్పుడూ చేతిలోనే పెట్టుకోనుంటాడని చెప్తారు!" ఆగాడు దాసు.

సిద్ధోజీ మధ్యలో అడ్డుతగిలి, "ఓహోఁ... పోతరాజు చేతిలో మనిషి తల వుండేది అందుకన్నమాట! ఇదంతా ఆ క్రిష్ణుడి ఆట. శానా బాగుంది దాసూ... యింకా చెప్పండీ!" తిరిగి ఉత్సాహంగా అడిగాడు.

మళ్ళీ చెప్పసాగాడు దాసు –

"అట్ల పోతరాజు ఎప్పుడయితే అన్నంత పని చేసుకొచ్చినాడో.... ఇంకా అప్పుడు క్రిష్ణుడికి కూడా భయం పట్టుకునిందంట! ' యింకెట్రా దేవుడా?' ని యోచ్చన్లు జేస్తే పాండురాజు మాద్రీదేవితో కలిసినపుడు ఆయప్ప రేతస్సు మాద్రీదేవి గర్భంలో నుంచి పతనమై కిందబడిందంట! అప్పుడు దాన్ని వ్యాసులవారు ఓ శంఖలో పోసి సంరక్షిస్తే... అందులోనుంచి ఒక ఆడబిడ్డ పుట్టిందంట! ఆమే పాండవుల చెల్లెలు 'శంఖాదేవి' ఆయమ్మ అర్జునుడి పోలికలతో వుంటే.... ఆమెను రప్పించి పోతరాజుకిచ్చి పెండ్లిజేసి, ఆ పోతరాజును పాండవులకు బావమరిదిని చేస్తాడంట క్రిష్ణుడు. పెండ్లయిం తర్వాత నిజం తెలుసుకున్న పోతరాజు క్రిష్ణుడు చేసిన మోసం తెలుసుకోని, 'ఏం క్రిష్ణయ్యా! యిట్ల జేస్తివే?' అంటూ నిలదీసినాడంట. అందుకాయప్ప – 'పాండవులకు నువ్వు కార్యదర్శిగా వుండి, వాళ్లకందే పూజల్లో మొదటి పూజ నువ్వే అందుకో!' అని వరమిచ్చినాడంట. కాబట్టే భారతోత్సవాల్లో యేది జేసినా ముందు పోతరాజు విగ్రహమే తెస్తారు."

– కథ ముగించాడు దాసు

తన అనుమానం తీరినందుకు ఆనందంగా గాలి పీల్చుకున్నాడు సిద్ధోజీ.

వాళ్ళ సంభాషణ అలాగే మిగిలిన పాత్రలవైపు సాగింది. చాలా రసవత్తరంగా సాగింది. ఆ సంభాషణలో తనకు తెలిసిన విషయాలన్నీ ఎదుటివాడికి చెప్పాలన్న ఉత్సాహం దాసులోను, యింకా తెలుసుకోవాలన్న జిజ్ఞాస సిద్ధోజీలోను కలిగింది.

"సరే దాసుగారూ! ద్రౌపదికి అయిదు మంది భర్తలుండారు గదా! అది లోకానికి విరుద్ధంగా ఉండలేదా? దాన్ని గురించి కూడా కొంచెం సెప్పు దాసూ!" అడిగాడు సిద్ధోజీ.

"సిద్ధోజీరావూ! యిట్టాంటివన్నీ తెలుసుకొనే గదా మీ నాయన గురువయ్యిండేది! నువ్వూ రేపు మీ నాయనంతటోడివి కావాల్సినోడివి. అంతమాత్రం తెలుసుకోకపోతే యట్లా?" అన్నాడు దాసు.

"నాకెవరు సెప్తారు దాసూ...?!" అన్నాడు సిద్ధోజీ.

"సరే! నేను చెప్తాలే యినుకో.... అసలు ద్రౌపదీదేవి అంటే సాక్షాత్తూ ఆ ఆదిపరాశక్తే! ఆయమ్మ భూభారాన్ని తగ్గించేదానికే ద్రౌపదిగా పుట్టింది. యట్లా అంటే... కైలాసంలో శివపార్వతులు ఏకాంతంగా వున్నపుడు ఒకసారి అన్యమనస్కంగా వున్న పార్వతి 'నాథా! నాథా! నాథా! నాథా! నాథా!' అంటూ అయిదుసార్లు కలవరించిందంట. అది విని శివుడు 'నువ్వు భూలోకంలో పుట్టు.... నువ్వు అయిదుసార్లు 'నాథా' అన్నావు కాబట్టి పంచపాండవులనే పేరుతో నేనే అయిదు మందిగా పుట్టి నిన్ను అలరిస్తాను' అన్నాడంట.

ఆ ప్రకారమే ఆ శక్తి యజ్ఞగుండంలో పుట్టి పాండవుల్ని పెండ్లిచేసుకునింది....యిదీ కథ!

ఇంకో కథ యేమిటంటే మన పురాణాల ప్రకారం... మొదటి జన్మలో ద్రౌపది పేరు ఇంద్రసేన. ఆమె భర్త మోద్గల్యుడు అనే ఋషి. అతను కుష్టు రోగి. తన తపశ్శక్తినంతా ధారపోసి సంసారానికి దూరమై ఆ వ్యాధి తనను చంపేయకుండా చేసుకుంటూ వుంటే... వొగడిన ఆయమ్మ నా కోరిక తీర్చాల్సిందేనని పట్టుబడితే, భార్య మాట కాదనలేక తన తపశ్శక్తి నల్లా అయిదు మందిగా మారి అయిదురోజులు ఆమెతో కలిసినాడంట. దాంతో తపశ్శక్తి నశించిపోయినాడా ఋషి. నా క్షణికమైన కోరికవల్లా మొగుడు చనిపోయేనే అనుకొని ఆమే చనిపోయి, మరుజన్మలో కాశీరాజు కూతురుగా పుట్టి శివుని భర్తగా కోరి తపస్సు చేసి, అతను ప్రత్యక్షమైతే 'మగడు మగడు' అని అయిదుసార్లనిందంట. శివుడు తథాస్తు అన్నాడంట. ఆమే ద్రుపదునికి యజ్ఞంలో కూతురుగా పుట్టి యాజ్ఞసేని అయింది. ద్రుపదుని కూతురు కాబట్టి ద్రౌపది అయింది. పాంచాల దేశపు రాజకుమారికాబట్టి పాంచాలి అన్నారు. ఆమె పేరు కృష్ణ.

అట్లగాకుండా యింకోవిధంగా ఆలోచిస్తే.... పూర్వం ఎప్పుడో మనిషి పుట్టినపుడు ఆదిమానవుని కాలంలో 'స్త్రీస్వామ్య వ్యవస్థ' అని వుండేది. యిప్పుడు ఈ కాలంలో ఇట్ల యింట్లోనూ, అట్ల బయట సమాజంలోనూ పురుషుడిదే గదా పైచెయ్యి?! దీన్నే 'పితృస్వామ్య వ్యవస్థ' అంటారు. అట్లాగే... అప్పుడు కుటుంబానికీ, సమాజానికీ ఆడదే పెద్దగా వుండేది. అదే మాతృస్వామ్య వ్యవస్థ! అంటే... ఇప్పుడు మగవాడు ఏ విధంగా యిద్దర్ని,ముగ్గుర్ని పెండ్లి చేసుకుంటా వుండాడో... అదే మాదిరిగా ఆడది ఆ కాలంలో నలుగురు, అయిదుగురి మగాళ్ళను పెండ్లి చేసుకుంటూ వున్నిందంట. రానురాను అట్లా స్త్రీస్వామ్యం పోయి, పురుష స్వామ్యం వచ్చేసిందంట. ఆ విధంగా ఆ కాలంలో వుండే ఆచారానికి గుర్తుగా మిగిలిపోయి వుండేది అది! దీనిగురించి యిప్పుడిప్పుడు చాలా పుస్తకాలొచ్చినాయిలే! ఇదంతా వాటిలో రాసిండారు!" క్షుణ్ణంగా వివరించాడు కృష్ణదాసు.

అప్పటికి సరిగ్గా మధ్యాహ్నం మూడు గంటలయింది.

"సరే దాసుగారూ...... నేను యింటికి బొయ్యి నటుల్నందర్నీ ఎగేసుకోని రావాల. భారతం కొడెక్కి రెండురోజులైపాయ.... రేపట్నుంచీ నాటకాలు ప్రారంభించాల గదా!" అన్నాడు సిద్ధోజి.

"ఆఁ ... అవును. మీరు నాటకాలాడే సమయానికి నేను పగలు కథ అక్కడికి తీసకరావాల గదా!" అన్నాడు దాసు.

"అందుకే ఈ పూటే యింటికి పోవాల!"

"యట్టా వచ్చినావు సిద్ధోజీ – ఈరోజు మధ్యాహ్నం 'భీష్మ ప్రతిజ్ఞ'తో కథ ప్రారంభిస్తా... కొంచెం వినేసి పో!"

"మీరే అట్టన్నాకా యింకెట్ట పోయేది?" వప్పేసుకున్నాడు సిద్ధోజీ.

అప్పటికే పోతరాజు విగ్రహంతో, పంబల వాద్యాలతో దాసును తీసుకోవడానికి వచ్చేశారు కార్యకర్తలు.

దాసు స్నానం చేసి, నామం వేసుకొని, పూజ ముగించి కాషాయాంబరాన్ని బిళ్ళగోచీ చుట్టి కట్టి, ఆ తర్వాత మరో ధోవతిని కప్పుకొని, చిడతలు చేతబట్టుకొని బయలుదేరాడు. అతని వెంట హార్మోనిస్టు, తబలా, వయలినిస్టులతో సిద్ధోజీ బయలుదేరాడు.

అందరూ అయిదు నిమిషాల్లో 'భారతం మిట్ట'చేరుకున్నారు.

అక్కడ విగ్రహాలున్న దద్దిలం (తలుపులు లేని మిద్దె) ముందర, పందిరి కింద – రెండు బెంచీల మధ్య ఒక చాప వేసి, మైకుపెట్టి, బెంచీల పైన ఒకవైపు నాలుగయిదు తబలాలు, మరోవైపు వాయులీనం, హార్మోనియంను ఉంచారు. వాళ్ళు నేరుగా విగ్రహాల దగ్గరకు వెళ్ళి మొక్కుకొని, వాళ్ళవాళ్ళ స్థానాల్లో వాళ్లు కూర్చున్నారు. అక్కడే ఓ మూల పోతరాజు విగ్రహాన్ని కూడా వుంచారు.

సిద్ధోజీ అక్కడే యింకో ప్రక్కన కూర్చున్నాడు.

జనంలో కృష్ణదాసుకు మంచి పేరుంది. ముఖ్యంగా ప్రేమ సన్నివేశాలు! యుద్ధఘట్టం అతను చెప్పినట్లు మరొకరు చెప్పలేరని పేరు! విరాట పర్వం చెప్పాడంటే... ఆరోజు కుంభవృష్టి తప్పదని ప్రజల విశ్వాసం! అతని కళానైపుణ్యానికి మెచ్చి 'కంకుభట్టు' అన్న బిరుదు కూడా యిచ్చారు. భారతంలో లేని విధంగా ప్రతి సన్నివేశాన్ని మరింత ఎక్కువచేసి చెబుతాడని కూడా కొందరు అతన్ని విమర్శిస్తారు. అలా విమర్శించే వారిలో ఎవడు పెట్టాడోగాని – అతనికి 'ఉడాందాసు' అని పేరు పెట్టాడు. ఆ మారుపేరే రానురాను అతనికి స్థిరమైపోయి, అతని అసలు పేరు మరుగున పడిపోయింది. ఆ మారుపేరే అతనికి మరింత గౌరవంగా మారిపోయింది. ఉడాందాసు కథంటే అందరికీ మహా యిష్టం! ఆ యిష్టంతోనే చుట్టుపక్కల గ్రామాల నుంచి ప్రజలు సద్దన్నాలు కట్టుకొని మరీ వచ్చారు.

మొదట మైకు ముందుకు వచ్చి, వంగి అక్కడి నేలను తన కుడిచేతితో తాకి, "జననీ జన్మభూమిశ్చ... స్వర్గాదపి గరీయసీ!" అంటూ నోట్లో గొణుక్కున్నాడు కృష్ణదాసు – ఉరఫ్ ఉడాందాసు. ఆ తర్వాత కప్పుకొనివున్న ఎట్టని పట్టుశాలువ లాంటి ధోవతిని తీసి నడుముకు బిగించాడు. ఆ తర్వాత నేలపైన కూర్చొని, "వాతాపి గణపతిం భజే.... హం!

వాతాపి గణపతిం భజే..." అంటూ గణపతి స్తుతి ఆలపించాడు. అది అయిం తర్వాత విద్య నేర్పిన గురువును ప్రార్థించాడు. "మాతృదేవో భవా! పితృదేవో భవా! గురుదేవో భవా! అతిథి దేవో భవా!" అంటూ పాడాడు. అలా అన్ని స్తుతులు పది నిముషాల్లో ముగించి పైకి లేచి సభనంతా ఒక్కసారి పరికించి "శ్రీమద్ రమారమణ గోవిందో హారి.... వెంకట్రమణ గోవిందో హారి... నమో పార్వతీ పరమేశ్వరం...హరహర మహాదేవ!" అన్నాడు.

అతనితో బాటు అందరూ 'గోవింద' నామస్మరణ చేశారు.

ఈలోపల ఓ వ్యక్తి పూలమాల తెచ్చి అతని మెడలో వేశాడు.

ఆ తర్వాత దాసు తనను తాను పరిచయం చేసుకున్నాడు. భారతం గొప్పతనాన్ని వివరించాడు. అందులో 'ఆదిపర్వంలోని 'భీష్మ ప్రతిజ్ఞ' ఈనాటి కథా కాలక్షేపం' అంటూ ముందుకు నడిచి, తబలా, హార్మోనియంలను కళ్ళకద్దుకుని – "మరొక్కసారి భక్తాదులందరూ గట్టిగా గోవింద నామస్మరణ చేయండి!" అంటూ "గోవింద!" అన్నాడు... అందరూ గట్టిగా "గోవిందా!" అన్నారు.

జగన్నాటక సూత్రధారి అయిన కృష్ణుని ప్రార్థించాడు...."జగన్నాటక సూత్రధారీ హరీ... హేఁ... జగన్నాటక సూత్రధారీ... హరీ... కృష్ణా ... ఆఁ.... ఆఁ... కృష్ణా... ఆఁ... ఆఁ..."

– ఉత్సాహంగా రసవత్తరంగా ఆలపించి, కృష్ణుడి మహాత్మ్యాన్ని గూర్చి చెప్పసాగాడు.

"మహాజనులారా! ఓ పుణ్య మనస్కులారా... భక్తాగ్రేసరులారా.... ఆ పరమాత్మ ఆడే వింత నాటకంలో మనమంతా పావులం... బొమ్మలం! ఆ జగన్నాటకంలో ఎన్నో పాత్రలు వస్తుంటాయి. పోతుంటాయి. మనమూ అంతే...! మన పని అయిపోగానే ఈ లోకం నుంచి నిష్క్రమిస్తుంటాం. ఈ జగన్నాటకానికంతటికీ ఏకైక సూత్రధారి – పరమాత్మ ఆ శ్రీకృష్ణ భగవానుడే! ఆయన ఈ జగన్నాటకాన్ని ఎందుకు ఆడుతుంటాడయ్యా అంటే... గీతలో ఆ పరమాత్మే స్వయంగా సెలవిచ్చాడు –

"యధాయధాహి ధర్మస్య గ్లానిర్భవతి భారత<br>
అభ్యుత్థాన మధర్మస్య తధాత్మానం సృజామ్యహం<br>
పరిత్రాణాయ సాధూనాం వినాశాయచ దుష్కృతాం<br>
ధర్మ సంస్థాప నార్థాయ సంభవామి యుగేయుగే..!"

లోకంలో ధర్మం ఎప్పుడయితే నశిస్తుందో, అధర్మం పెచ్చు పెరిగిపోయి శిష్టులకు నిలువ నీడ లేకుండా అయిపోతుందో – అప్పుడు దుష్టుల్ని శిక్షించి, శిష్టుల్ని రక్షించడానికి యుగ యుగంలోను నేను పుడుతుంటాను..' అని చెప్పుకున్నాడు. అందుకోసం ఆ

గోపాలకృష్ణుడు, రాధారమణుడు, కాంచన కృష్ణుడు ఆడిన ఒక రసవత్తరమైన జగన్నాటకమే మహాభారతం....!"

– అంటూ భారత కథను ప్రారంభించి మత్స్యగంధీ పరాశరుల వృత్తాంతం, వారి సమాగమం, ఆమె సత్యవతి అయిన తీరు, అక్కడే వ్యాస భగవానుల జననం, ఆపైన శంతనుడి కథ ఎత్తుకున్నాడు.

ప్రజలు తన్మయత్వంతో వింటున్నారు. అక్కడ మనుషులున్నట్లే లేదు. బొమ్మలు కొలువు తీరినట్టుంది. అంతే ఏకాగ్రతగా కథ వింటున్నారు. ప్రజల్ని తన వాక్చాతుర్యంతో, గానకౌశలంతో మంత్రముగ్ధుల్ని చేయడం ఉడాందాసు గొప్పతనం.

అతని కథా నైపుణ్యానికి మనస్సులోనే అభినందనలు తెలుపుకుని, శలవు తీసుకుని యింటికి బయలుదేరాడు సిద్ధోజీ.

# 14

**భా**రతం కొడెక్కిన మూడోరోజు నుంచే, సిద్ధోజీ ఆధ్వర్యంలో భారత నాటకాలు సజావుగా సాగిపోతున్నాయి.

ఆరోజు 'అర్జున తపస్సు' నాటకం!

పాసుపతాస్త్రం కోసం అర్జునుడు దీక్షపూని, ఇంద్రకీలాద్రి పైకి వెళ్ళడానికి అన్నదమ్ముల అనుమతి కోరుతాడు. అదంతా రాత్రి నాటకంలో ప్రదర్శించినా – పగటి ఉత్సవంగా దాన్ని రక్తి కట్టించాల్సి వుంది. అందుకోసం భారతం జరిగేచోట మధ్యలో ఓ పొడువాటి అశోకవృక్షాన్ని నరుక్కొచ్చి, దానికి మూరకొకటి చొప్పున మెటికలు అమర్చి, మూరెడు వెడల్పు, బారెడు పొడవు వున్న దళసరి చెక్కకు మధ్యన రంధ్రం చేసి దాన్ని మాను చివరికొసకు అమర్చారు. ఆ తర్వాత దానికి అర్ధచంద్రాకారంలో వెదురు దబ్బలు చుట్టి కాషాయరంగు బట్టను చుట్టి, మామిడితోరణం కట్టి, మాను నిలబెట్టి, నిలువునా పాతారు. అదే... తపసు మాను.

ఆరోజు ఉదయం పదిగంటలకే భారతం మిట్టలో ఇసక వేస్తే రాలనంత జనం చేరిపోయారు.

బిడ్డలు లేని స్త్రీలు తడిబట్టలతో వచ్చి, తపస్సు మాను చుట్టూ వరపడ్డారు. వేలాది జనంతో అక్కడొక తిరణాల సాగినట్టుగా వుంది.

ద్రౌపదీ కృష్ణులతో పాటు పాండవుల వేషాలు వేసుకుని నటులు అక్కడికి వచ్చేశారు. పంబల వాద్యంతో బాటు వచ్చి పోతరాజు అక్కడ అప్పటికే కొలువైపోయి వున్నాడు. దాంతోబాటుగా కృష్ణ, పాండవుల విగ్రహాలు కొలువైపోయాయి.

మొదట కృష్ణ విగ్రహానికి పూజలు జరిపి, కొబ్బరికాయలు కొట్టారు. ఆ కార్యం నిర్విఘ్నంగా సాగాలని మొక్కుకున్నారు. ఇతరులెవ్వరూ 'చెరుపు' చెయ్యకుండా 'కట్టుమంత్రం' చదివి, నిమ్మకాయ కోసి, దాని ముక్కలు నాలుగువైపులకు విసిరాడు వెంకోజీ. మాను ఎక్కబోయే అర్జునుడి వేషధారి కదిరయ్యకు ధైర్యం చెప్పాడు. దరువు ప్రారంభించాడు.

"ఇంద్రకీలాద్రెంత దూరమో! చూసి యెరుగము యెట్టి కాంతారమో!

యింద్ర కుమారుని యెటువొంటి బంపుదు

చంద్రశేఖరుడందు జనదెంచునో, రాడో

ఇంద్రకీలాద్రెంత దూరమో!"

ఆనందభైరవి రాగం ఆటతాళంలో ఇంపుగా సాగిపోతోంది దరువు. తాళం వేసే వాళ్ళు తాళం వేస్తున్నారు. తబల, హార్మోనియం మ్రోగించేవాళ్లు మ్రోగిస్తూనే వున్నారు.

వాళ్ళ దరువులతో ఆ ప్రాంతమంతా గుమ్మెత్తిపోతోంది.

అలా చాలా దరువులు సాగాయి.

అర్జునుడి పాత్రధారి కదిరయ్య – మొదట కృష్ణ విగ్రహానికి మొక్కి, అశోక వృక్షానికి మూడు ప్రదక్షిణలు చేసి, మైకు చేతబట్టుకొని శంకరా భరణం రాగం, ఆదితాళంలో "వెడలెను వడిగ, వుండి పుడమరచ్చుని, యెడ తెగ కనుమతి – నిడుకొని యడవికి!" అని దరువు పాడాడు.

మోహించి వచ్చిన రాక్షస యువతి 'బేరుండి'ని తిరస్కరించడం, ఆ తర్వాత ఆమె మగడు 'బేరుండు'డితో యుద్ధం, బేరుండుడి ఓటమి అంతా దరువుల రూపంలో పాడారు. ఆ తర్వాత మొదటి మెటిక ఎక్కి కదిరయ్య, సురటి రాగం, ఏకతాళంలో "అర్జునుడరుదెంచె కాల్నడకలతో, అర్జునుడరుదెంచెను. అర్జునుడరుదెంచె, అమరులు పొగడగ ధూర్జటి గూర్చి యత్యుగ్ర తపము జేయ అర్జునుడరుదెంచెనూ..."

అలా మెట్టు మెట్టుకూ ఓ దరువు, ఓ పద్యం పాడుకుంటూ తపస్సు మాను ఎక్కుతున్నాడతను.

కింద వేలాదిమంది జనం...!

కొబ్బరికాయ, అరటిపండ్లు, నిమ్మపండ్లు, కొన్ని మిఠాయిలు, విబూది పండ్లు వున్న జోలెడు చేతబట్టుకొని ధైర్యం చెబుతూ వెంకోజీ చెట్టెక్కుతున్నాడు. అతని వెనక బంగారప్ప, అతని వెంట కృష్ణపాత్రధారి, కదిరయ్యకు తోడుగా చెట్టెక్కుతున్నారు. వాళ్లు ప్రతి మెటిక పైన కూర్చొని రెండుకాళ్లతో చెట్టును పెనవేసుకుని కదిరయ్య పాడుతున్న దరువుల్ని వెనుక పాటగా పాడుతూ వెళుతున్నారు. వాళ్లు ఎక్కేకొద్దీ ఎత్తు తరుగుతోంది... లోతు పెరుగుతోంది.

బంగారప్పను చూసినప్పుడంతా వెంకోజీకి కూతురు రేణుకమ్మ గుర్తుకొస్తోంది. కూతురు గుర్తొచ్చినప్పుడంతా అతని హృదయం కుంచించుకుపోతోంది. ఆ తర్వాత పరిసరాల్ని మరిచిపోతున్నాడు. వాళ్ళకు ఊర్లోని ఇళ్ళ పైభాగాలు, దూరంలో వున్న పొలాలు, చెట్లు చేమలు, కొండలు అన్నీ కనిపించసాగాయి.

వాళ్లు ఎక్కుతూనే వున్నారు.

కదిరయ్య దరువు లాలపిస్తూనే వున్నాడు... జనం చూస్తూనే వున్నారు.

మాని చివర అలంకరించిన భాగం గాలికి ఊగుతోంది.

దూరంగా ఒక కాకి "కావు... కావు" మంటూ అరుచుకుంటూ వెళ్లింది.

నటులు మధ్యలోనే ఆగిపోయారు.

కదిరయ్య గుండెను చిక్కబట్టుకొని పైకి వెళుతూనే వున్నాడు.

మధ్యలో వెంకోజీ అందించిన జోలెను భుజానికి తగిలించుకున్నాడు. అలా చివరిమెట్టు కూడా ఎక్కేశాడు. మాను చివర వున్న చెక్క పైకెక్కి జాగ్రత్తగా కూర్చున్నాడు.

చూసేవాళ్ళకు అది మానెక్కుతున్నట్టు లేదు. ఓ పొడువాటి కట్టె చివర ఆకాశంలో గాలికి తేలిపోతూ ఫీట్లు చేస్తున్న సర్కస్ కళాకారుడిలాగా అనిపిస్తున్నాడతను.

తన రెండుకాళ్లతో చెక్కను పెనవేసుకుని కూర్చుని, ఒక చేత్తో మధ్యలో వున్న మాను చివరిభాగాన్ని పట్టుకొని మరోచేత్తో జోలెవిప్పి, జాగ్రత్తగా కొబ్బరికాయ తీసి, చెక్కు అంచుకేసి కొట్టి రెండొప్పులు చేశాడు.

"భద్రంరా... కదిరీ! భద్రం నాయనా... ఏం ఫరవాలేదు... నిదానంగా గానీ! ఏమాత్రం తొందరపడొద్దు..." కింది మెటికల పైనుంచి హెచ్చరిస్తున్నాడు వెంకోజీ.

కొట్టిన కొబ్బరిచిప్పలలో నుంచి కొబ్బరిని వెలుపలికి తీసి, చిన్నచిన్న ముక్కలుగా విరిచి జోలెలో వున్న వాటితో కలిపి, నిమ్మపండ్లు, విబూది వుండలు, మిఠాయిలు పిడికిలితో తీసి నాలుగు వైపులకు, జనంపైన పడేటట్టు చల్లాడు.

వాటికోసం ప్రజలు ఎగబడ్డారు.

'అవి దొరికిన వాళ్ళ కోరికలు నెరవేరతాయంటారు. ఇంతమందిలో ఎవరెవరికి అవి దొరుకుతాయో, ఎందరికి దొరకతాయో?!" అనుకోసాగాడు వెంకోజీ.

అతను కూర్చున్న చెక్కపీఠం గాలికి ఊగిపోతూ కిటకిట శబ్దం చేస్తోంది.

కిందనున్న వాళ్ళకు ఎంతో ఎత్తున అతను...

అతని కింద వెంకోజీ, మరిద్దరు...

అందరూ చూస్తూనే వున్నారు.

"ఉత్తీత్త! ఉత్తీత!" అంటూ ఓ టిట్టిభం... అరుచుకుంటూ, ఆ చెక్కపైభాగాన్ని ఒరుచుకుంటూ పోయింది.

కదిరయ్య గుండె జల్లుమంది!

అయినా ధైర్యం తెచ్చుకున్నాడు.

అతనలా ఎన్నోసార్లు తపస్సు మానెక్కాడు.

ఆ మాని కింద బిడ్డలు కావాలని పరవడిన వాళ్ళకోసం కొన్ని నిమ్మకాయలు, విబూది వుండలు జోలెలో అలాగే మిగిల్చి శివస్తుతి ప్రారంభించాడు. ఆ స్తుతి పూర్తికాగానే మాను దిగేయాల్సి వుంది.

బంగారప్ప కిందికి దిగుతున్నాడు. అతనికంటే పైనున్న వెంకోజీ, అతని వెంట కిందికి దిగసాగాడు.

బంగారప్పను చూసేసరికి వెంకోజీకి కూతురు, వర్షంలో గొట్టెల్ని దొడ్లోకి తోలడం, పొలంలో గింజలు విత్తడం, చెరువు గట్టున బట్టలుతకడం వంటి అనేక దృశ్యాలు కళ్ళముందు కదిలాయి. బాదతో అతని హృదయం నొప్పిగా మూలిగింది... శరీరం తూలింది... కళ్ళు తిరిగాయి!

ముందే వయసైపోయిన ప్రాణం...

ఓర్చుకోలేకపోయింది!!

అందరూ చూస్తూనే వున్నారు.

కొన్నివేల మంది...

అంతా కళ్ళు మూసి తెరిచే లోపల... జరిగిపోయింది!

కాలుజారి కింద పడిపోయాడు.

ఆ ప్రాంతం అల్లకల్లోలమైపోయింది.

అంతవరకూ పిల్లలు కావాలని, మాను మొదట్లో వరవడి వున్న స్త్రీలు భయంతో వణికిపోయి దూరంగా పరుగెత్తారు.

పోతరాజు చూస్తానే వున్నాడు!

అన్ని విగ్రహాలూ చూస్తానే వున్నాయి...

కొన్నివేల కళ్ళు చూస్తానే వున్నాయి.

కదిరయ్య... చేస్తున్న శివస్తుతిని ఆపేసి, భయంభయంగా మాను దిగేశాడు.

కింద పడిన వెంకోజీ కదలడం లేదు. మెదలడం లేదు. అతను అపస్మారక స్థితిలో వున్నాడు. అతన్ని చూసి సిద్ధోజీ చాలా దుఃఖపడ్డాడు.

జరిగిన దుర్ఘటనకు నారాయణస్వామి చాలా చింతపడ్డాడు. నటుల కోరిక ప్రకారం... అతన్ని అతని యింటికి చేర్పించాడు.

మరణశయ్య మీదున్న తండ్రిని చూసి భోరున విలపించాడు సిద్ధప్ప. ఏడుస్తున్న కొడుకును చూసి "ఏడవద్దురా.... ఇదంతా ఒక నాటకం! జగన్నాటకం!! ఈ నాటకంలో ఎవరి పాత్రను వాళ్ళు ముగించుకొని పోతావుంటారు. నా పాత్ర కూడా అయిపోయింది. నువ్వేం దిగులు పడొద్దు. నీకు రెండుమాటలు సెప్తావుండా.... యినుకో! ఇది మన ముత్తాతల కాలం నించీ ఒకరికొకరు సెప్పుకుంటా వచ్చిందేది. మన వంశాచారం ప్రకారం ప్రతి ఉగాదికి ఊర్లో 'ఆట' యేపించు. ప్రతి బ్రహ్మోత్సవానికీ తిరుపతికొండకు యాత్ర సాగించు. నాటకాలాడడంలో మన కెదురయిన కష్టాలు, కన్నీళ్ళు అన్నీ గురువుల చరిత్రలో రాసి పెట్టు!!" అంటూ చెప్పి తుదిశ్వాస వదిలేశాడు వెంకోజీ ఉరఫ్ వెంకోబరావు.

అలా అతని చివరి అంకానికి తెరపడింది.

# 15

**సి**ద్ధప్ప కళ్ళలో నీళ్ళు తిరుగుతున్నాయి...!

పెళపెళార్భటులు వినిపించినట్లు కీచక పాత్రధారి రంగస్థలం పైన పెడబొబ్బలు పెడుతున్నాడు. సైరంధ్రిని కీచకుడు మోహించిన ఘట్టం అమోఘంగా రక్తి కడుతోంది.

"భామరో..... నేనేమి జేతునే – మదన విరహ బాధకింక యెటు సైతునే...!"

సావేరి రాగం, చాపుతాళంలో దరువు దంచేస్తున్నాడు.

నీళ్ళోడుతున్న సిద్ధప్ప కళ్ళకు ఆ దృశ్యం అస్పష్టంగా కనిపిస్తోంది. తన చిన్నతనపు రోజులు గుర్తుకు వచ్చి, ఉద్వేగానికి గురయ్యాడు సిద్ధప్ప.

ఆ తర్వాత అతనికి తన యవ్వనపు రోజులు గుర్తుకు రాసాగాయి.

* * *

**ఒ**కరోజు...

రాయచోటిలో వున్న సురభివాళ్ల నుంచి పిలుపు వచ్చింది,.

వచ్చిన జాబు చూసుకుని పెదవి విరిచాడు వెంకోజీ

ఏమయ్యా! పోతావా?" ప్రశ్నించింది బూసమ్మ.

"యిప్పుడేడ అంతదూరం పోయేది? నాకా... వయసు అయిపూడ్లా? అంతదూరం బొయ్యి నాటకం యేసే ఓపిక నాకు లేదు" అన్నాడు వెంకోజీ

"నువ్వు పోకపోతే పాయగానే – అబ్బోడు ఊరికేనే వుండాడు గదా... పంపేయ్య గూడదా?" సూచించింది.

"నిజమే! పది పదయిదు దినాలు వరసగా ఆడాల్సి వుంటుంది. అబ్బోడే మంటాడో...?!"

"ఏమంటాడు? సంతోషంగా బోతాడు గానీ!"

వాళ్ళ సంబాషణ విని చుట్టింట్లో నుంచి వెలుపలికి వచ్చాడు సిద్దప్ప.

"ఏమిరాబ్బా! సురభోళ్ళు జాబు రాసిండారు రమ్మని! నాకు ఓపికల్లేవు. నువ్వు బోతావా? డబ్బులు కూడా బాగా యిస్తార్లే...!" అన్నాడు కొడుకును చూసి వెంకోజీ

"నీ యిష్టం నాయనా... పొమ్మంటే పోతా! ఇంతకూ యేమి నాటకమంట?" ప్రశ్నించాడు సిద్ధప్ప.

"విషాద సారంగధర!"

ఆ మాట వినగానేకాస్త వెనక తొక్కులు తొక్కాడు సిద్దప్ప.

అతను ఎన్నో భారతనాటకాల్లో కృష్ణుడి వేషం వేశాడు, భీమ, దుర్యోధనుల పాత్రలు వేశాడు... అందర్నీ మెప్పించాడు. ఆటపాటల్లో తండ్రిని మించిన కొడుకనిపించుకున్నాడు. అన్ని చేసినా... 'విషాద సారంగధర' ఎప్పుడూ వేయలేదు. అదే చెప్పాడు.

"ఆ నాటకం మనమెప్పుడూ వెయ్యలా! అందులోనూ కొత్తోళ్ళ మద్దెన పాడాలంటే... కష్టం గదప్పా!"

"అదేం లేదురా... మన పక్క మాదిరిగాదు! ఆ పక్క ఆటోళ్ళంటే శానా మర్యాదిస్తారు. అందునా శానా మంచోళ్లు! కళను నమ్ముకోని బతికేవోళ్ళు గదా.... నీకేం భయం లేదు. నేనింతకు ముందు యేసిన నాటక కంపిని వాళ్ళేలే! ముందు ఉత్తరం రాస్తాను... నీకేం భయం లేదు..".

"మన పాట వాళ్ళకు నచ్చకపోతే యట్టా?"

"అదేంలేదురా.. వోళ్లేమీ మనకంటే బాగా పాడేవోళ్లు గాదు. తెలిసినట్లు పాడు... చాలు! అందునా నీకు కంట్లం (కంఠం) బాగుండాదిలే... పైగా తాళజ్ఞానం తెలిసినోడివి! యింకేం భయం? కాకపోతే మనకూ, వాళ్ళకూ కొంచెం తేడా! మనం వచనం తగ్గించేసి, దరువులు ఎక్కువ పాడతాం.. కానీ, వోళ్ళు దరువులు తగ్గించేసి పద్యాలు, వచనం ఎక్కువ పాడతారు. అంతకుమించి వొగప్పుడు వోళ్ళంతా మనకు అయినోళ్ళే! వాళ్ళ పూర్వీకులు, మన పూర్వీకులు వొగ చోటనుంచే వచ్చిన వాళ్ళంట!"

"సరే! నీ యిష్టం!"

ఆరోజే వివరంగా వాళ్లకు ఉత్తరం రాశాడు వెంకోజీ.

ఆ ఉత్తరానికి బదులు ఉత్తరంలో సిద్ధప్పకు పిలుపొచ్చింది.

కొంచెం డబ్బులు, బట్టలు అవీ సర్దుకొని తల్లిదండ్రుల దగ్గర సెలవు తీసుకొని, కుప్పం వచ్చి బస్సెక్కి చిత్తూర్లో దిగాడు. అక్కడ రాయచోటి వయా పీలేరు బస్సెక్కి ఆరోజు సాయంత్రం వేళకి గమ్యం చేరుకున్నాడు.

అక్కడ అతనికి అన్ని మర్యాదలు జరిగాయి. బాగానే చూసుకున్నారు.

వాళ్ళది 'కాంట్రాక్ట్ నాటక సమాజం!' రోజుకింత అని కాంట్రాక్ట్ తీసుకొని, ఊరూర టికెట్లు పెట్టి నాటకాలు ప్రదర్శించే వ్యక్తి – కంపెనీ మేనేజర్ నాగేశ్వరరావు, అతనూ గోవిందరావు బంధువే! గోవిందరావు కోస్తాకు వెళ్లి ఏలూరుకు సమీపంలో వున్న 'పోలసాని పల్లె'లో స్థిరపడిపోయాడు. ఆ తర్వాత రాయచోటిలో మరో నాటక కంపెనీ స్థాపించి నడుపుకొస్తున్నాడు నాగేశ్వరరావు. గోవిందరావు 70వ జన్మదిన ఉత్సవానికి ఏలూరెల్లొచ్చాడు వెంకోజీ. ఆ తర్వాత 1953లో గోవిందరావు మరణానంతరం నాగేశ్వరరావు నాటక కళను జీవన వృత్తిగా స్వీకరించి నడుపుకొస్తున్నాడు. నాటక ప్రదర్శనలో ఎన్నో ప్రయోగాలు చేస్తూ వస్తున్నాడతను. స్టేజీ మీదనే భారీ సెట్టింగులు వేయిస్తాడు. ఆడపాత్రల్ని ఆడవాళ్ల చేతనే వేయిస్తున్నాడు. ముఖ్యంగా అతని కూతురు పూర్ణిమే ఏ నాటకంలోనైనా కథానాయిక పాత్ర వేస్తోంది.

సిద్ధప్పను పిలిపించింది... సారంగధర నాటకం కోసం!

అతన్ని చూడగానే సారంగధరుడి పాత్రకు అతికినట్టు సరిపోతాడనుకున్నాడు నాగేశ్వరరావు.

రెండురోజుల్లోనే తనకిచ్చిన దరువులు నేర్చేసుకున్నాడు సిద్ధప్ప. దానికి తగినట్లు మంచి భాషలో వచనం కూడా రాసుకున్నాడు. ఆ టీమ్‌లోనూ అందరికంటే అద్భుతంగా పాడసాగాడు.

ఆ నాటకం ఒక్కో ఊర్లో కనీసం మూడురోజులు చొప్పున అనేకచోట్ల ప్రదర్శించాలని నాగేశ్వరరావు ఆలోచన!

మొట్టమొదట రాయచోటిలో నాటకం ప్రారంభమైంది.

రాజరాజ నరేంద్రుడు – కొడుకు కోసం అనేక మంది రాచకన్యల చిత్రపటాలు తెప్పించుకుని చూడడం, అందులో చిత్రాంగి పటం చూసి మోహించి, సారంగధరుని పటం ఆమెకుపంపి, మోసంతో తానే పెండ్లి చేసుకోవడం.... జరిగే కథసాగింది.

సారంగధరుడు మిత్రుడితో కలిసి పావురాన్ని ఎగురవేస్తూ రంగస్థలం పైకి వచ్చాడు.

ఆ వేషంలో సిద్ధప్ప అసలు రాకుమారుడు లాగే వున్నాడు. అతని అందాన్ని చూసి ప్రేక్షకులు ముగ్ధులయ్యారు. వాళ్లతో బాటు పూర్ణమ్మ కూడా ముగ్ధురాలైపోయింది.

సారంగరాగం రూపక తాళంలో రమ్యంగా దరువు పాడసాగాడు సిద్ధప్ప.

"రాజసుతుడు సభకు వచ్చెను... పురజనులు చూడ ॥రాజ॥

రాజసంబు ప్రజ్వరిల్ల - ఆ జగంబు ప్రజకెల్ల

తేటముగను వెల్లుచుండు - రాజసుతుడు సభకు వచ్చెను!"

మనిషి ఎంత అందంగా వున్నాడో - అతని కంఠమూ అంత మధురంగా వుండడంతో ప్రేక్షకులు గుడ్లప్పగించి చూస్తూ, చెవులప్పగించి వింటూ తన్మయత్వం చెందుతున్నారు.

"పావురమును వెగురవేయుడీ బాలులారా! ॥ పావు॥

పావురమును ఎగురవేసి బిలిచితే మళ్ళీ వచ్చు ॥పావు॥

ఓడు గెల్పు రెండు చూడవలెను గాన యిప్పుడు మీరు" ॥పావు॥

–అంటూ పావురాన్ని ఎగురవేశాడు.

ఆ పావురం కాస్తా ఎగిరిపోయి, స్టేజీని ఒక చుట్టుచుట్టి వచ్చి, మైకును తాకి, హార్మోనిస్టు నెత్తిన కూర్చొని, అతని బట్టతల పైన రెట్ట వేసింది. ప్రజలు గొల్లున నవ్వారు.

అతను "తుఁ... నీయమ్మ!" అంటూ దాన్ని ఎడమచేత్తో పట్టుకొని గట్టిగా విసరివేశాడు. దాంతో అది నేరుగా వెళ్ళి, ముందువరుసలో కూర్చొనివున్న ఒక స్త్రీ పైన పడ్డది.

ఆ దెబ్బకు "ఓలమ్మో... చచ్చితినిపో తల్లే...!" అంటూ కేకేసింది ఆయువతి.

అక్కడ ప్రేక్షకుల్లో కాస్తా కోలాహలం చెలరేగింది. దాంతో యింకా బెదిరిపోయిన ఆ పావురం రంగస్థలాన్ని రెండు చుట్లు చుట్టి, ఎగిరి ఆకాశంలోని మబ్బుల్లో కలిసిపోవడంతో కోలాహలం కాస్త తగ్గింది.

ఆ పావురాన్ని అన్వేషిస్తూ సారంగధరుడు నిష్క్రమించగానే...

"ఎంత చక్కనివాడే కొమ్మా... యింతీ ఎన్నడు వలచునమ్మా! ॥ఎంత॥

కంతుని సాటి మోమమ్మా.... నా చెంత చేరడే కొమ్మా!" ॥ఎంత॥

తూరత రాగం, ఆట తాళంలో దరువు నందుకుంటూ చెలికత్తెతో బాటు వచ్చింది... చిత్రాంగి దేవి.

చిత్రాంగి అందాన్ని చూసి గుటక వేయని మగవాడే ప్రేక్షకుల్లో లేకపోయాడు. రంగస్థలం పైన ఒక మెరుపు తీగ సాక్షాత్కరించినట్టుంది పూర్ణమ్మ. దానికితోడు తన మధురమైన కంఠస్వరంతో ముక్కుమీద వేలేసుకునేట్లు చేసింది ఆమె.

ఆ వేషంలో పూర్ణమ్మను చూసి సిద్ధప్పకు మతిపోయినట్లనిపించింది. ఆ తర్వాత రూపక తాళంలో దరువెత్తుకొని –

"విడువలేను నిన్ను తగవైన గానిమ్ము – కడవేడ్క పొందాక!"

– అంటూ మీదబడి ఒక్కసారి తన భుజంతో అతని వక్షస్థలాన్ని తాకి, కౌగలించుకుంది.

ఒక్కక్షణం బిత్తరపోయి, తత్తరపడ్డాడు సిద్ధప్ప!

ప్రేక్షకులు "వ్వాఁ..." అంటూ చప్పట్లు కొడుతూ, ఈలలు వేసి పెద్ద కోలాహలం చేశారు.

అంతలోపల తేరుకున్న సిద్ధప్ప ఆమెను దూరంగా తోసేసి, "విడువుమమ్మా తల్లీ... విడువమ్మా! కొడుకుపై దుడుకుతనములు  చేయ సేయవలదు..."దరువు పాడుతూ సర్దుకున్నాడు.

"ఏందీయమ్మ.... కౌగలించుకున్నట్లు తగిలీ తగలకుండా వుండని ట్రైనింగిస్తే – ఇప్పుడు స్టేజీమీద నేమో ఇట్ట జేస్తా వుంది? సిద్ధప్ప మోహన రూపాన్ని జూసి మోహించేసిందా... యట్టా? బుద్దిలేక రమ్మన్నాను సిద్ధప్పను....తుఁ....తుఁ....." మనసులోనే తిట్టుకోసాగాడు నాగేశ్వరరావు.

ఆ సంఘటనతో సారంగధరునిలో ఏమోగాని, ఆ పాత్రధారి అయిన సిద్ధప్పలో మాత్రం ఆమె పట్ల మరులు పెరిగింది. ఆ మరులే 'ప్రేమ'గా మారిపోయింది.

పూర్ణమ్మ అదే స్థితిలో వుంది!

యింకేముంది....? ఆ నాటకం వేసిన ప్రతిచోటా, ప్రతిసారీ.... చిత్రాంగ సారంగధరుల సమాగమ ఘట్టాలన్నీ  రక్తి కట్టి ప్రేక్షకుల్ని గిలిగింతలుపెట్టాయి. వాళ్ళ సహజ నటనకు ప్రజలు నీరాజనాలర్పించారు.... కాసుల వర్షం కురిపించారు.

ఆ నాటకం అనేకచోటక్ల ఒక నెల పాటు ప్రదర్శింపబడింది.

కడప, ప్రొద్దుటూరు, నంద్యాల, కర్నూలు, కందుకూరు, నెల్లూరు, కావలి, చిత్తూరు, పుత్తూరు, మదనపల్లె, పీలేరు వంటిపలుచోట్ల ఆ నాటకం ప్రదర్శించారు.

ప్రదర్శించిన ప్రతీచోటా చిత్రాంగీ సారంగధరులకు అభినందన చందనాలర్పించారు. దాంతో పూర్ణమ్మ, సిద్ధప్పలకు మంచి పేరు ప్రతిష్టలొచ్చాయి.

ఆ నాటక ప్రదర్శనలు పూర్తయింతర్వాత జేబునిండా డబ్బులు నింపుకొని ఇల్లు చేరాడు సిద్ధప్ప.

కానీ, నాటకంలో చిత్రాంగి కౌగిలింతలు, హావభావాలు, పూర్ణమ్మ స్నేహం.... అతన్ని

నిద్రాహారాలకు దూరం చేశాయి. పరధ్యానం పెరిగిపోయింది. ఎవ్వరితోనూ మాట్లాడక మౌనం వహించాడు.

విషయం తెలియక వెంకోజీ కంగారు పడ్డాడు. చివరికి ఎలాగో ఓలాగు అసలు విషయం రాబట్టిన వెంకోజీ – రాయచోటికి ప్రయాణం కట్టాడు...

నాగేశ్వరరావును వప్పించి పూర్ణమ్మకూ, సిద్ధప్పకూ పెండ్లి చేసేశాడు.

# 16

**త**ండ్రి మరణించిన రెండేండ్లకు తల్లి బూసమ్మ మరణించింది.

సిద్ధోజీకి తండ్రి మిగిల్చిన ఆస్తి ముక్కాలెకరా చేను, గురువుల తోపు... వెయ్యి రూపాయల అప్పు! ఆ అప్పు కూడా అధిక వడ్డీలు లాగే వడ్డీల బుడ్డయ్య దగ్గరే! వడ్డీల బుడ్డయ్య వడ్డీకి చక్రవడ్డీ లాగినా – వయసులోనే వైధవ్యాన్ని పొంది తనను ఆశ్రయించిన ఆడబిడ్డ ఆస్తిపాస్తుల్ని రాయించుకున్నా – ఏనాడూ ఎవరితోనూ తగాదా పడలేదు. వడ్డీల పేరుతో ఋణగ్రస్తుల ఆస్తుల్ని చాకచక్యంగా తన వశం చేసుకున్నా – ఎవ్వరితోనూ పేచీపడలేదు. తను చేసింది అన్యాయమని తెలిసి, తన్ను నరకడానికి వచ్చిన వ్యక్తిని సైతం మాటలతోనే వప్పించి, మెప్పించి, తను చేసిందే న్యాయమని అతని దగ్గరే చెప్పించి, దండం పెట్టించి పంపగల నేర్పరి!

అతని తర్వాత అదే వ్యాపారాన్ని చేతబట్టిన అతని కొడుకు గుర్రప్ప అలా కాదు –

తండ్రికి పూర్తిగా విరుద్ధం... కక్షకు కాలు దువ్వే రకం...!

ప్రతి చిన్న విషయానికీ  ఇతరులతో పోట్లాడుతుంటాడు.

ఆ గ్రామంలో తనకు మించిన ధనవంతుడు లేడన్న అహం అతనిది! పైగా.... అతని దగ్గర అప్పు తీసుకున్న వ్యక్తినైతే మరీ రాచిరంపాన పెట్టాలనుకుంటాడు. ఎవరయినా తన ఎదుట ఇతరుల్ని మెచ్చుకున్నా, తనకంటే అధికుడిగా చెప్పినా వప్పుకోడు. అలాంటి వ్యక్తులతో అనవసరంగా వైరం పెట్టుకుంటాడు.... అతనిదో మనస్తత్వం!

గురువు వెంకోజీని అందరూ భక్తిగా చూడడం, పొగడడం అతని కిష్టం వుండేది కాదు. పైగా తన వయస్కుడే అయిన అతని కొడుకు సిద్ధోజీ కూడా చాలా బాగా పాడతాడంటే అస్సలొప్పుకునేవాడే కాదు.

ఒకసారి... మొగిలి వెంకటగిరిలో శివరాత్రి నాటికి మంచి నాటకం వేయించాలని ఈ ఊరినుంచి యిద్దరు వ్యక్తులు వచ్చి వెంకోజీకి అడ్వాన్సు యిచ్చి కాంట్రాక్ట్ మాట్లాడుకుని వెళ్లిపోయారు.  శివరాత్రికి పదిహేను రోజులముందు నుంచి 'వద్దిక' ప్రారంభించారు.

ఆ నాటకం పేరు 'చుక్కలూరి రామనాటకం!' అందులో రాముడిగా గుబ్బప్ప, సీతగా సిద్ధప్ప, వాల్మీకిగా వెంకోజీ ప్రధాన పాత్రలు వేస్తున్నారు. సిద్ధప్పది అన్ని పాత్రలకు సరిపోయే కంఠం! అయినా శోకాన్ని చాలా బాగా రక్తి కట్టించే నేర్పు అతనికి పుట్టుకతోనే అబ్బిన వరం! అందుకే సీతగా అతను అద్భుతంగా పాటలు పాడుతున్నాడు.

ఆరోజు రాత్రి.... భజన గుడి ముందర 'వద్దిక!' ఆ ముందురోజున రాముడు గర్భవతి అయిన సీతను అడవుల కంపమని లక్ష్మణున్ని ఆజ్ఞ చేస్తాడు. ఆ ఆజ్ఞను నెరవేర్చి లక్ష్మణుడు యింటికి రావడం దగ్గర 'వద్దిక' ఆగింది. ఇక అక్కడినుంచి ఆరోజు వద్దిక సాగాల్సివుంది.

లక్ష్మణుడి కోసం ఎదురుచూస్తున్న రాముడు "అనుజుడేల రాడో... యేమి యందు దైవమా వనములోన నెటులనున్న వాడో తెలియదు!"

జంఝూటి రూపకంలో జోరుగా పాడుతున్నాడు గుబ్బప్ప. ఎంత ప్రయత్నించినా చప్పగానే వుంటోంది. అక్కడక్కడా తాళం తప్పుతోంది.

"ముదిత కారణమున నాదు ముద్దు... నా.... ము..."

అక్కడ తాళం తప్పింది.

"వరే ముతాలే... తాళం పోతావుందిరా గుడ్డినాకొడకా!" మద్దల కొట్టడం ఆపి అన్నాడు తబలిస్టు.

గురువుకూ కోపం వచ్చింది.

"ఏమ్మడిసివిరా నువ్వు? తాళం... రూపక తాళం పాడతా పాడతా అటతాళంలోకి వస్తావు... తుఁ.... ఈసారి మళ్ళా పాడు.... అదే నుడుగు...."

హార్మోనిస్టు హార్మోనియం వాయిస్తూ ఇట్ల... ఇట్ల... పాడు!" అన్నాడు. అతను పాడసాగాడు.

"ముదిత కారణమున నాదు ముద్దు తమ్ముడూ వదలి యడవిలోన... యెంత బా.... యెంత బా..."

దరువు ముందుకు సాగలేదు.

"తుఁ... యిట్టయితే నీవు ఆటేసినట్టే! నే పాడతా చూడు..." అంటూ గురువు పాట పాడి వినిపించాడు.

అయినా అతను తప్పే పాడాడు.

"తుఁ.... నీకెందుకురా... నాటకాలు...పో?! యిద్దో కడసారి... తాళం తప్పకుండా పాడు! లేకుంటే...ఆ వేషం వేరే వాళ్ళ కిచ్చేస్తా.... అఁ... సిద్దుగోడు పాడి వినిపిస్తాడు... నేర్చుకో! నాయనా... వాడికి అట్టజెప్పరా!" పురమాయించాడు గురువు.

దరువు అందుకొని పూర్తిచేశాడు సిద్ధోజీ.

"అద్భుతంగా పాడాడు..చెవుల పండుగగా పాడాడు"

"అబ్బా! సిద్దుగోడు గొంతెత్తితే చాలబ్బా! సుక్కలు తెగిపడాల్సిందే! ఏమీ కంట్లం.. ఏమి ఎత్తుగడ... ఏమి రాగం...!!" మెచ్చుకోలుగా అన్నారు సహనటులు.

కోపం ముంచుకొచ్చింది గుజ్జప్పకు.

"వడ్డీల వ్యాపారం జేసుకోకుండా... వీడికెందుకు నాటకాలు?"

– ఓ నటుడు గుసగుసమన్నాడు.

ఆ మాట అతని చెవిన పడనే పడింది.... చాలా అవమానంగా అనిపించింది... తల తీసేసినట్లనిపించింది.

"వాన్ని జూసి నేర్చుకో...!" అన్నాడు గురువు.

భగ్గుమంది గుజ్జప్ప హృదయం!

"ఏంది గురువా? వోడు నీ కొడుకని మెచ్చుకుంటా వుండావా?" ఆవేశంగా అన్నాడు.

ఖంగుతిన్నాడు గురువు.

అన్నేళ్ళ గురుజీవితంలో అతనికెదురుకాని అనుభవం అది!

"అబ్బేం.... అదేమీ గాదు. కళ దగ్గర నా కందరూ వొగిటే! నువ్వూ బాగా పాడు...సంతోషిస్తా!" అనునయించాడు.

ఆ సమయంలో అంతకంటే ఏమనాలో.. అతని కర్థం కాలేదు.

ఆ తర్వాత గుజ్జప్ప ఏదో పాడాడు... గురువు 'సరే'నన్నాడు.

వెంకోజీ "ఈ కాంతామణి ఎవ్వరొకో... ఆ కాననమున ఈవేళ!"

– అంటూ ఆదితాళంలో దరువెత్తుకొని అందర్నీ మెప్పించాడు.

సీతా వాల్మీకి సంవాదాలు పాడుతుంటే – అబ్బా కొడుకుల కంఠస్వరాలతో అక్కడి జనాలకి ఏ గంధర్వ లోకానికో పోయినట్లనిపించింది.

అదిచూసి సహించలేకపోయాడు గుజ్జప్ప.

ఆ వద్దికలోనే కాదు – మొగిలిలో నాటకం వేసిన రాత్రీ అతని కోపం రెట్టింపయ్యే సంఘటనలు ఎన్నో జరిగాయి.

ఇంట్లో భోషాణం తెరిచి వెంకోజీ – వేషాలు, మేకప్ సామగ్రి తీసుకొని, ఆటవాళ్ళ నందర్నీ వెంటబెట్టుకొని మధ్యాహ్నం మూడు గంటలకంతా మొగిలిలో దిగాడు.

దిగగానే వాళ్ళకు కార్యకర్తలు మంచి వసతి సౌకర్యం కల్పించారు. అందులో గురువు వెంకోజీని, అతని కొడుకుని ప్రత్యేకంగా  చూశారు. కానీ, అలాచూడమని వెంకోజీ వాళ్లను కోరలేదు.

వాళ్ళకోసం ప్రత్యేకంగా ఓ గది కూడా ఏర్పాటు చేశారు. కానీ వెంకోజీ ఒప్పుకోలేదు. అందరికీ ఒకేచోట విడిది ఏర్పాటు చేయమన్నాడు. అయినా వాళ్ళు వెంకోజీ, సిద్ధప్పల అడుగులకు మడుగులొత్తే విధంగా ప్రవర్తించారు.

అదంతా గమనిస్తున్న గుఱ్ఱప్పకు వళ్లంతా తేళ్ళు, జర్రులు ప్రాకినట్లనిపించసాగింది.

"తిండికి టికానీ లేక మా దగ్గర అప్పు తీసుకొని బదికే ఈ దరిద్రపు నా కొడుకుల కింత మర్యాదా? ఎంతో భూమి పుట్ర, దుడ్డు దస్కం సంపాదించి ఈ ఊరికంతా షావుకారయిన వడ్డీల బుడ్డయ్య ఒక్కగానొక్క కొడుకుని నన్నెవరూ గ్యేఁవనించలేదే... అప్పుటికంత పనికి రానోన్నానేను?" నానా రకాలుగా తలపోశాడు.

ఆలోచించేకొద్దీ అతని బాధ రెట్టింపు కాసాగింది. రానురాను ఆ బాధ భరించలేనిదిగా మారిపోయింది.

ఆ టెన్షన్ తట్టుకోలేక ఆ సాయంత్రం వేళ అలా ఊర్లోకి వెళ్ళాడు.

మొగిలి – మద్రాసు, బెంగుళూరు ప్రధాన రహదారిలో – చిత్తూరు, పలమనేరుకు మధ్యన... పలమనేరుకు పది కిలోమీటర్ల దూరంలో వుంది. అందువల్ల వాహనాల రద్దీ ఎక్కువగానే వుంది. నిముష నిముషానికి వాహనాలు వస్తూపోతూ వున్నాయి. అలా వచ్చిపోయే వాహనాలను చూసుకుంటూ ముందు వెళుతుంటే... ఒకచోట... ఓ సారా దుకాణం కనిపించింది.

దాన్ని చూడగానే అతనికి మరో ఆలోచన తట్టింది.

'శానామంది ఆటోళ్ళు మందేసుకుని అద్భుతంగా పాడతారు. గొంతింటీ ఘాటుగా సారాయి దిగిపోతే...... కంట్లం భలే మధురంగా స్పష్టంగా వస్తుందంట! నేను రెండు ధరాములు యేసుకుంటే... అప్పుడు, ఆ సిద్దుగోన్ని తలదన్నేట్లు పాడొచ్చు!' అనుకున్నాడు.

అప్పుడప్పుడూ మందు కొట్టడం అతనికి అలవాటే! ఆ ఆలోచన రావడమే ఆలస్యం– నేరుగా దుకాణంలో అడుగుపెట్టాడు.

అక్కడ... చెక్క బెంచీ మీద కూర్చొని, ఏదో అనుపానం తెచ్చుకొని నముల్తూ, యిద్దరు వ్యక్తులు సారా తాగుతున్నారు. మెల్లగా వెళ్ళి ఆ బెంచీపైనే ఓ చివర కూర్చొని నోరు చప్పరించాడు. అది గమనించిన ఆ షాపువాడు ఓ గ్లాసునిండా నాటుసారా తెచ్చి అతనికిచ్చాడు.

దాన్ని తీసుకుని కొద్దికొద్దిగా నోట్లో పోసుకుని గ్లాసు ఖాళీ చేశాడతను.

"యింకో ధరామివ్వమంటావా... సాల్నా?" అడిగాడు కొట్టువాడు.

"ఆఁ..." అన్నాడు – తల కెక్కుతున్న మత్తు ననుభవిస్తూ గుఱ్ఱప్ప.

మెల్లగా.... ఆ సారా అతని శరీరంలోని నరనరంలోకి వెచ్చగా దిగుతోంది. శరీరమంతా గాలిలో తేలిపోతున్నట్లు అనిపించసాగింది.

రెండోసారి గ్లాసు అందించాడు కొట్టువాడు. దాన్నీ ఖాళీచేసి, డబ్బులు చెల్లించి వచ్చేశాడు. అతను వచ్చేటప్పటికీ భోజనాలకి పిలుపొచ్చింది.

గొంతులు పూడుకుపోకుండా ఉండడానికని – కేవలం రసం, మజ్జిగన్నం మాత్రమే ఏర్పాటు చేయించాడు వెంకోజీ. ఎక్కడ నాటకం వేసినా అతను అనుసరించే పద్ధతే అది!

భోజనాల బంతిలోనే గుఱ్ఱప్ప మందుకొట్టేసి వచ్చాడని కొందరు పసిగట్టేశారు. ఆపైన మెల్లగా గురువుగారి చెవిలో ఊదేశారు.

అలాంటి వాటిని గురువు సహించడు. డ్రామా రోజు తాగడం, తోటి నటుల్ని తూలనాడడం, ప్రేక్షకుల పట్ల దురుసుగాను, అసభ్యంగాను ప్రవర్తించడం వంటివి గురువు అసలు క్షమించడు. నాటకం రోజున కనీసం బీడీ తాగినా, మాంసాహారం సేవించినా అస్సలు వప్పుకోడు. అలాంటిది – సారా తాగితే వప్పుకుంటాడా? ససేమిరా వప్పుకోడు.

అయితే అతని మనస్తత్వం తెలిసినవాడు కావడం చేత – 'వెంటనే దండిస్తే యట్లనో, ఏమో? ముందే మనిషి కొంచెం పెడసరం! యెడ్డెమంటే... తెడ్డెమంటాడు. ఏదన్నా రాద్ధాంతం చేయొచ్చు. ఆపైన ట్రూపుకే చెడ్డపేరు రావచ్చు. పైగా... పరాయి గడ్డన పరువు పోతుంది. నిషా దిగినాక చూస్తా...!' అనుకున్నాడు.

ఏమీ ఎరగనట్టే వుండిపోయాడు.

అతి ప్రాచీనమైన ఆ ఆలయం రోడ్డుకు దక్షిణం వైపున రోడ్డు పక్కనే వుంది. ఆ ఆలయానికి దక్షిణాన... ఓ సుందరమైన చిన్న కొలను, ఆ కొలను గట్టున పడమటి వైపునున్న ఓ చిన్న నందీశ్వరుడి విగ్రహం నోట్లో నుంచి నిరంతరంగా కారుతూ కోనేట్లోకి పడుతూ కనిపించే జలధార... ఆలయానికి దిగువన వరిమళ్ళు, చెరకు తోటలు...!

ఆ ఆలయం ముందరే... పెద్ద పందిరి వేసి, టెంకాయ కీతుల్తో కప్పేసి, కరెంటు దీపాలతో అలకరించారు.

అదే.... రంగస్థలం!

ఆ పందిరినే రెండు భాగాలు చేసి, ముందు భాగంలో ఎత్తుగా బెంచీలు పరచి రంగస్థలం ఏర్పాటు చేశాడు. దానిచుట్టూ ఓ చిన్న టార్పాల్ చుట్టి, గ్రీన్ రూమ్ ఏర్పాటు చేశారు.

అప్పటికే జనం 'ఓం...' అని చేరిపోతున్నారు.

దేవుడికి మొలకలు ఎత్తుకొచ్చేవాళ్ళు... గుడిచుట్టూ పానకం బండ్లు తిప్పేవాళ్లు....

అంతా సందడి సందడిగా వుంది. అదేమీ పట్టించుకోకుండా భోజనాలవగానే మేకప్పుల్లోకి దిగిపోయారు ఆటగాళ్ళు.

ఎవరి మేకప్పుల్లో వాళ్ళు మునిగివున్నారు.

గుడికి కుడివైపునున్న కోనేట్లోకి వెళ్ళి గుజ్జప్పను ముఖం కడుక్కు రమ్మన్నాడు గురువు. కదిరయ్యని పిలిచి గుజ్జప్ప ముఖానికి 'అర్దాలం' పూసి మేకప్ వేయమన్నాడు.

ఎనిమిది గంటలకంతా భక్తుల కోలాహలం తగ్గింది. కానీ, వాళ్ళు ప్రదర్శించబోయే నాటకం కోసం వేలాది జనం చేరిపోయారు. ఎంతదూరం చూసినా జనాలే... ఒకటే జనాలు!

నాటకం ప్రారంభమైంది!

మేళం కట్టడం పూర్తయిన తర్వాత... చోపు దారి (పాత్ర ప్రవేశానికి ముందు ఆది హెచ్చరికలు పలికే నటుడు) ప్రవేశం. ఆ తర్వాత అట్టహాసంగా భద్రున్ని వెంటబెట్టుకొని రంగస్థలం పైకి ప్రవేశించి, "రాజకచ్చేరికి వెడలె... రామచంద్ర విభుడు వేగ!" అంటూ రేగుప్తి రాగంలో, రూపక తాళంతో దరువెత్తుకున్నాడు గుజ్జప్ప.

రెండు నుడుగులు అలా పాడాడో, లేదో... ఆ తర్వాత ఎంత ప్రయత్నించినా దరువు సజావుగా పాడలేకపోతున్నాడు. తాళం తప్పుతోంది... రాను రాను సారామత్తు అతని అణువణువును ఆక్రమించుకోసాగింది. మనిషి తూలిపడబోయి, తిరిగి సంబాళించు కున్నాడు. పిచ్చిపిచ్చిగా నోటికొచ్చినట్లు దరువును ఆలపించసాగాడు.

అది గమనించిన వెంకోజీ – భద్రుడి వేషధారిని తెర లోపలికి పిలుచుకుపోయి, ప్రజలకు అనుమానం రానివిధంగా పదం పాడుతూనే అతన్ని లోపలికి తీసుకువచ్చేయమని చెప్పాడు. అంతలోపల హనుమంతుని వేషం వేయబోతున్న కదిరయ్యనే రాముడి వేషం వేసుకుని సిద్ధంగా వుండమన్నాడు.

అందరూ అన్ని పాత్రలు పాడగలిగి వుండడం 'కంగుంది' కళాకారులకు వెన్నతో పెట్టిన విద్య! అందుకే గురువు మాటనే ఆజ్ఞగా భావించిన కదిరయ్య క్షణంలో ముఖానికి బులుగు రంగు అర్దాలం పూసుకొని కళ్ళకు, కనుబొమ్మలకు కాటుక దిద్దుకొని, నెత్తిన కిరీటం పెట్టుకుని, విల్లు, బాణం చేతబట్టుకొని సిద్ధంగా వున్నాడు.

అనుకున్న ప్రకారం.... నాటక ప్రదర్శనకు ఆదిలోనే ఆటంకం కలగకుండా గుజ్జప్పను లోపలికి తీసుకువచ్చేశాడు భద్రుడి వేషధారి!

ఏమాత్రం గ్యాప్ లేకుండా... గుజ్జప్పను లోపల్నే వుంచేసి, కదిరయ్యను తీసుకుని రంగస్థలంపైకి వచ్చి, ప్రదర్శనను కొనసాగించారు.

తెర వెనుక గ్రీన్‌రూమ్‌లో గుఱ్ఱప్పను పడుకోబెట్టారు.

అతను అలాగే ఓ గంటసేపు పడుకొని నిద్రపోయి, కళ్ళు తెరచేసరికి –

సీత వేషం వేసుకొని సిద్ధప్ప భైరవరాగం రూపక తాళంలో "నీ మర్మమున కేమందును... ఏమయ్యా సౌమిత్రీ!" అంటూ పదం ఆలపిస్తుంటే... ప్రేక్షకులు కళ్ళు తుడుచుకుంటున్నారు. ముక్కులు చీదుకుంటున్నారు. నాటకంలోని సీత బాధల్ని తమ బాధలుగా భావించుకుని, సీత కష్టాలు తమ కష్టాలుగా అనుకుని ఏడుస్తూ... తమ పైట చెరగులతో కళ్ళు తుడుచుకుంటున్నారు.

సంగీత జ్ఞానం లేనివాళ్ళు సైతం అతని పాటను వేనోళ్ళ మెచ్చుకుంటున్నారు. అతని గాత్రమాధుర్యానికి దరువు దరువుకు చప్పట్లు కొడుతూ నీరాజనాలు అర్పిస్తున్నారు.

ఆ దృశ్యం చూసేటప్పటికి – యింకా కుమిలిపోయాడు గుఱ్ఱప్ప.

కాననంలో, నిండు చూలాలయిన సీతను వంటరిగా వదిలేసి లక్ష్మణుడు అయోధ్యకు వెళ్ళిపోగానే – ఆ గంగానదీ తీరంపైన కటకటపడి సీత శోకించడం, ఆ తర్వాత వాల్మీకి వచ్చి ఆదుకోవడం కథ!

వయసుకు తగినట్లే వెంకోజీ వాల్మీకి వేషం వేసుకుని, 'ఈ కాంతామణి యెవ్వరొకో... ఈ కాననమున యీ వేళా, యేకాంతయో, శోకమునా, యే కారణమున యున్నదొకో?!" అంటూ రంగస్థలం పైన ఆదితాళంలో పదం పాడుతూ, వచనం చెబుతుంటే – జనం "గురువు గురువేరా... ఏమి గాత్రసుద్ధి, ఏమి డొక్కసుద్ధి, ఏమి కంట్లం!' నిజంగా ఆయప్ప గురువే...!" అని మెచ్చుకోలు మాటలంటున్నారు.

కొందరైతే వెనకనుంచి మేకప్ రూమ్‌లోకి తొంగిచూసి – సిద్ధోజీని, వెంకోజీని అభినందిస్తూ.... తమ అభినందనలను వ్యక్తం చేస్తున్నారు. మరికొందరు రూపాయి నోట్లను వాళ్ళ మెడల్లో వేస్తున్నారు. పిన్నీసులతో నోట్లను వాళ్ల బట్టలకు కుట్టి వెళుతున్నారు.

అలా తండ్రీకొడుకుల్ని జనం అభిమానంతో ఆకాశానికి ఎత్తేస్తుంటే.... గుండె భగ్గున మండిపోసాగింది గుఱ్ఱప్పకి! దరువు పాడేసి లోపలికి వచ్చిన వెంకోజీతో పేచీ పెట్టుకున్నాడు. అతనికింకా మత్తు పూర్తిగా తగ్గలేదు.

"యేందయ్యా గురువా నువ్వు? నా కథను నన్ను ఎందుకు పాడనీలేదు? ఆ కదిరయ్య చేత ఎందుకు పాడించినావు? వోడు నాకంటే పెద్ద పుడింగనా? నేను పనికి రానోన్ననా? అట్టుంటే ఈ నాటకంలో నన్నెందుకు చేర్చుకోవాల?! ముందే వద్దని ఉండచ్చు గదా! చెప్పు... యాసం యెయ్యనీకుండా నన్ను బగిశీనం (అవమానం) జేస్తివే...?! అంటూ ఎగిరెగిరి పడ్డాడు.

సారా మత్తులో అతని మాటలు ముద్దముద్దగా వస్తున్నాయి... వెంకోజీకి కోపం వచ్చింది–

"నువ్వు తాగేసి స్టేజీ ఎక్కితే యట్టరా? నువ్వు నోరు తెరవలేక స్టేజీమీదనే పడిపోతే యెంత బగిశాట్లు? స్టేజీ మిందికి తాగేసి వచ్చినారని ఎవురికన్నా తెలిస్తే.. అనాక (తర్వాత) మనకు బరముండునా? ఉప్పురాయి బుట్టునా? నీవల్ల ట్రూపు – నలుగురిలో నీళ్ళకన్నా పల్చనైపోదా? ఈ అగుమానం నీగ్గాదు... నాకు! నీలాంటోన్ని తీసుకొచ్చినందుకు నన్ను నేను మెట్టుతో కొట్టుకోవాల! ఇదిబ్బుడు ఎవురన్నా యిన్నా మన ముఖాన మజ్జిగ నీళ్ళు జల్లుతారు... చెంబుడు పేడనీళ్ళు జల్లుతారు.... అవ్వఁ! కొంచెంగనా ఏమారింటే.... మన ముఖాలకు మసి పూసిందురు జనాలు... తుఁ... యింకా 'నన్ను జూడు సినాయనా' అంటా బొక్క తెరస్తా వుండావే... పోఁ...!"

గడ్డి పెట్టాడు!

అయినా గుజ్జప్ప వినలేదు. నోటికి వచ్చినట్లు తిట్టసాగాడు. మత్తులో ఏమ్మాట్లాడుతున్నాడో అతనికే తెలీడం లేదు.

కొందరు నటులు – ఆ విషయం జనానికి తెలీకుండా ఉండడానికని అతని వేషం తీసేసి లుంగీ చుట్టి, అతన్ని గుడి వెనక్కి దూరంగా తీసుకెళ్ళారు. ఓ యిద్దరు అతను తిరిగి రాకుండా అక్కడే కావలి వున్నారు.

ఎలాగో ఓలాగు ఆ రాత్రి నిర్విఘ్నంగా నాటక ప్రదర్శన ముగించాడు వెంకోజీ. కానీ, ఆ తర్వాత ఏ నాటకంలోనూ గుజ్జప్పను తీసుకోలేదు. ఆ కారణంగా గుజ్జప్ప అనవసరంగా వాళ్లపైన శత్రుత్వం పెంచుకున్నాడు.

"గురువు శానాసెడ్డోడు! పాట మర్మం, ఆడే గుట్టుమట్టులు, మెలకువులు అన్నీ ఆయన కొడుక్కి మాత్రమే నేర్పించినాడు. మర్రిచెట్టు మాదిరి – యితరుల్ని ఎదగనీయకుండా జేసినాడు. మర్రిసెట్టు నీడన ఏదన్నా కనీసం అట్ట ఎల మొలుస్తుందా యాడన్నా?" అంటూ రకరకాలుగా ప్రచారం చేయసాగాడు.

గురువు చనిపోయాక కూడా అతని ప్రవర్తనలో మాత్రం ఏ మార్పూ రాలేదు. అవకాశం వచ్చిన ప్రతిచోటా సిద్ధప్ప మీద జగడానికి వెళ్ళసాగాడు.

ఒకరోజు... ఉదయాన... ఒక కూలి మడకను పిలిపించి తన ముక్కాలెకరా చేను దున్నిస్తున్నాడు సిద్ధోజీ. కొంతసేపు అతనికి సూచనిలిచ్చి, తొమ్మిది గంటలకంతా యింటికి వచ్చేశాడు.

గుజ్జప్ప నింపాదిగా మడకల్ని ఎగేసుకుని దానిపక్కనే వున్న వెంకన్న చేను

దున్నించసాగాడు. అప్పుడెప్పుడో తీసుకున్న అప్పుకు వెంకోజీ చేత బలవంతంగా రాయించుకొని, అతని తండ్రి వడ్డీల బుడ్డయ్య తన వశం చేసుకున్న చేనది!

ఇక అప్పట్నుంచీ దానికి 'వెంకన్న చేను' అని ముద్దుపేరు పెట్టుకొని అనుభవిస్తున్నారు వాళ్లు.

గతంలో అది చేనులో చేనే కాబట్టి రెండింటికీ మధ్యన సన్నని గెనిం మాత్రమే వుంది. ఆ గినిమును ఎగ దున్నించాడు గుఱ్ఱప్ప. గుర్తు రాళ్ళు లేచిపోయాయి. వాటిని ఊడదీసి ఒక మూరకవతల సిద్ధప్ప చేనిలో నాటించాడు. అలా నాటించడమే గాకుండా అక్కడివరకు గెనిం దున్నేసి, తన చేనిలో కలిపేసుకున్నాడు.

సిద్ధప్ప చేనిలో మడక దున్నుతున్న వ్యక్తి అది గమనించి ఆక్షేపణ చేశాడు.

"కూలి మడక్కొచ్చిన్నా కొడుకువి.... నువ్వేందిరా నాకు సెప్పేది? నీ పని నువ్వు చూసుకుపోరా... మద్దెలో నీ బోడి పెత్తనమేంది పోరా...!" అంటూ గుఱ్ఱప్ప అశ్లీలంగా తిట్టేసరికి –

"నాకెందుకొచ్చింది లేబ్బా.... యాడన్నా కొట్టుకోని సావండి.... నాదేం బోతావుండాది?" అనుకుంటూ తన పనిలో తాను మునిగిపోయాడు కూలిమడకాయన.

ఆ సాయంత్రం.... పొలం దగ్గరకు వెళ్ళి ఆ విషయం గమనించిన సిద్ధప్ప – చేను గెనిం చూసి..... ఉగ్రుడైపోయాడు.

"ఏందిరా గురప్పా... గెనిం యిట్ల ఎగదున్నించినావు;?" ప్రశ్నించాడు.

"నేనేం దున్నించలా! మడక కారు (కర్రు) తప్పొయ్యి, గెనిమి రాయికి తగిలి లేసిపోతే, మళ్లా అదే తావన తిరగనాట్నా.... అంతే!" తాపీగా చెప్పాడు గుఱ్ఱప్ప.

"మూరడెగ దున్నేసినారు గదరా.....? మళ్ళా తప్పొయ్యి తగిలిందంటా వుండావు?"

"యోవ్‌ఁ... జరిగింది సెప్పినా! నమ్మితే నమ్ము... నమ్మకపోతే పో....! నీకంత అనుమానంగా వుంటే... సర్వే వాళ్ళను పిల్చుకోని కొలిపించుకో!"

"అడిగితే అట్ల ఎగరేసి మాట్లాడతావేందిరా?"

"అంతేరా.... నేను మాట్లాడేది అంత! నీవల్లా అయింది చేసుకో పో...!"

ఇంక వీడితో మాట్లాడి లాభం లేదనుకొని సిద్ధప్ప – ఊర్లోకి వెళ్ళి ఆచారినీ, మరో వ్యక్తినీ పిల్చుకొచ్చి, గురువుల తోపు వైపున్న పాత సర్వేరాయిని చూపించి, దున్నేసిన గెనిం చూపించాడు. సర్వేరాయికీ, గుఱ్ఱప్ప తిరగనాటిన రాళ్లకి మూరెడు తేడా వుంది.

అది గమనించిన ఆ పెద్ద మనుషులు గుఱ్ఱప్పది అన్యాయంగానే భావించారు.

ఆ పెద్దమనుషులు ఊర్లోకి వెళ్ళి, గుడి ముందర కూర్చొని గుఱ్ఱప్పను పిలిపించి

అడిగితే – వాళ్లనీ ఎగరేసి మాట్లాడాడు. దాంతో వాళ్లకీ కోపం వచ్చింది.

"ఆ రాళ్ళు పెరకేసి, నువ్వు మామూలుగా నాటుకో.... సిద్ధప్పా!" అన్నారు పెద్దమనుషులు.

ఆ పెద్దమనుషుల్లోనే యిద్దర్ని తోడుగా తీసుకెళ్ళి, పూర్వం ఎలా వున్నాయో అలా నాటుకొని, అక్కడికి గెనిం వేసుకుని దున్నుకున్నాడు సిద్ధప్ప.

ఆ మరునాటి ఉదయాన – అక్కసు పట్టలేక వీధిలో నిలబడి పూర్ణమ్మ "అరగాసునా బట్ట! యింట్లో వున్నోళ్ళను ఈదిలో కీడ్చెనె... వాన్నెత్తక పొయ్యి యిజలాపురం కటవన పూడ్చా! వాని పిండమెత్తక పొయ్యి కేజీఎఫ్ గనుల్లో తొక్కా! వాని నొసట్న నల్ల నాగుబాము పటక్కన పెరకా! అన్నేకారి నా బట్ట! అంతపని జేసెనే...." అశ్లీలంగా తిట్టసాగింది.

వీధిలో నీళ్ళు తెచ్చుకుంటూ ఆ మాటలు విన్న గుణ్ణప్ప భార్య కొప్పమ్మ ఆమెను అంతకన్నా భయంకరంగా తిట్టింది.

యిద్దరికీ మాటామాటా పెరిగింది...

"పోయే... నాటకాల దానా!" అని వొకరంటే–

"పోయే... యభిశారీ!" అని మరొకరనుకున్నారు.

కొప్పమ్మకు సహాయంగా గుణ్ణప్ప మేనత్త బుడ్డమ్మ కూడా తోడుగా నిలిచింది.

"ఏమే... మొగుడు సచ్చిన ముసిల్దానా... నువ్వా తగుదునమ్మా అంటా ఆడిపించు కుంటా వచ్చినావు గదే కొట్లాటకు?!" అంది పూర్ణమ్మ.

"ఏమే వస్తే... మిటికిలేడి (మిటుకులాడి) ముండా...?! మాటకు మాట అంది బుడ్డమ్మ.

"అవునేఁ... నేను మిటికులేడినే! నువ్వేందే.... కాటికి సిద్ధంగా వుండే ముసిలిముండా... అన్నీ ఊగులాడించుకుంటూ వచ్చినావు?" అంది పూర్ణమ్మ.

"ఎవురు ఊగులాడించుకుంటూ వచ్చిండేదీ ఈ జగతికి తెల్సునే నీ యబ్బడాలా!" అంది బుడ్డమ్మ తిట్టుమంగళం పెడుతూ.

"పోయే... నీతిపాతీ లేని ముసిలిముండా!" పూర్ణమ్మ దూషణ.

"మేంగాదే నీతీపాతీ లేనోళ్ళం.... మీరేనే! నాటకా లాడేదానికి యాడన్నా ఒక నీతిజాతీ వుంటుందా..... వొగడే మొగుడు యాడన్నా వుంటాడా?!" విరుచుకుపడింది కొప్పమ్మ.

దాంతో భరించలేని కోపం వచ్చేసింది పూర్ణమ్మకు. అమాంతం కొప్పమ్మ మీదబడి, ఆమె కొప్పు పట్టుకొని ఈడ్చి నేలకుదేసింది.

చేయి చేయి కలిశాయి!

కొప్పు కొప్పు ఊడాయి!!

గాజులు చిట్లాయి...

ఒకర్నొకరు తిట్టుకుంటున్నారు.

గుద్దుకుంటున్నారు! తన్నుకుంటున్నారు!!

అక్కడ... ఒక హిడింబి, తాటకి, శూర్పణఖలు ఏకకాలంలో ప్రత్యక్షమైపోయి పోట్లాడుకుంటున్నట్టుగా వుంది. మానవ స్త్రీల ఆకారం దాల్చిన కొండలు ఢీ కొన్నట్లుగా వుంది.

మేఘాలు ఘర్జిస్తున్నట్లు వాళ్ళ అరుపులు..!

యింకా ఆలస్యం చేస్తే ఏం కొంపలు మునుగుతాయోనని అక్కడున్న ఆడవాళ్ళు వాళ్ళను విడదీసి, యిండ్లకు పంపించేశారు.

ఆ సాయంత్రం... పశువులు, పక్షులు పగలంతా మేతకు వెళ్ళి తమతమ నెలవులకు తిరిగి చేరుకుంటున్నట్లే... తమ పగటి పనులు ముగించుకుని ఊర్లో జనాలు ఇళ్ళకు చేరుకుంటున్నారు.

గుఱ్ఱప్ప గురువు చేను గెనిం దగ్గర చేసిన అన్యాయం, ఊర్లో ఆడవాళ్ళ గలాటా తెలుసుకున్న జనాలు అందరూ గుఱ్ఱప్పను తిట్టిపోశారు. వెంకోజీ అభిమానులంతా ఖాళీ అయిన గురుస్థానంలో సిద్ధప్పనే భావించుకోవాలనే తీర్మానానికి కూడావచ్చారు.

ఆ మరునాటి సాయంత్రమే కదిరయ్య అందర్నీ.... యింటికో మనిషి చొప్పున భజన గుడిలో హాజరు పరిచాడు.

ఆ సభకు గుఱ్ఱప్ప కూడా హాజరయ్యాడు.

అందరూ వచ్చారనుకున్న తర్వాత కదిరయ్య పైకిలేచి, “అందర్నీ ఈడ కూడేసింది (చేర్చింది) ఏమీ లేదబ్బా! మనకు యిన్ని దినాలు వెంకోజీరావే గురువుగా వుండె! అంతకుముందు వాళ్ళ నాయన, ఆయనకంటే ముందు వాళ్ళ తాత ముత్తాతలే... ఊరికి గురువులుగా వుండ్రి! యిప్పుడు మన గురువు కాలమై పోయింతర్వాత మనమింకా మన గురువు ‘ఫలానా’ అని అనుకోలా! ఉగాది గూడా దెగ్గిర్లోనే వుండాది. దానిగురించి మాట్లాడే దానికే ఇక్కడ మద్దిస్తం చేర్పించినాం...!”

–హాజరు పరిచిన కారణాన్ని వివరించాడు.

“దానికి బొయ్యి మద్దిస్తం చేర్పించాల్సినంత అగత్తె మేముండాదబ్బా! తరతరాల్నించీ వోళ్ళే గదా గురువులు...యిప్పుడూ అంతే!” అన్నాడు నరసిమ్ములు.

“అంతేలే! యిప్పుడు సిద్ధప్పనే గురువనుకుంటే సరిపాయ...!” వత్తాసుగా అన్నాడు కొత్తోళ్ళ లచ్చుమయ్య,

"అవును.... అంతే!"

అందరూ ఏకగ్రీవంగా అంగీకరించారు.

గుట్టప్ప గుండె లోలోపలే మండిపోసాగింది.

"దీని కెవురికయినా అచ్చాపన (ఆక్షేపణ) వుంటే సెప్పండబ్బా యిప్పుడే...!" మరొక్కసారి అందరి అంగీకారాన్ని కోరాడు కదిరయ్య,..

గుట్టప్ప మెల్లగా అందుకున్నాడు... "తరతరాల్నించీ వెంకోజీ వోళ్ళే గురువులుగా వుంటా వచ్చినారు. నిజమే... ఎవరూ కాదన్లే! ఏం.. యల్లకాలంవూ వోళ్ళే వుండాల్నా? గురుపీఠ మేమన్నా వాళ్ళ జమీందారీనా? ఈసారి కొత్తోళ్ళను బెట్టొచ్చు గదా!"

"ఓహోఁ... నీ ఆంతర్యం ఇదా?!' మనసులోనే అనుకొని, యింకా మనసులో ఏం దాచుకున్నాడో చూద్దామని – "ఆఁ... కొత్తోల్లెవురో అదిగూడా నువ్వే సెప్పు గుట్టప్పా?" అన్నాడు కదిరయ్య.

"అదేంది కదరప్పన్నా! మాకంటే నువ్వు పెద్దోడివి, బాగా పాడగలిగినోడివి! ప్రతిసారీ యాడ భారతాలాడినా తవుసు మానెక్కేవోడివి! పైగా భజనలు, కోలాటలు బాగా నేర్చినోడివి! నువ్వే గురువుగా వుండచ్చు గదా!" ఆశ కల్పించాడు గుట్టప్ప.

కానీ, అలాంటి అత్యాశ లేవీ లేనోడు కదిరయ్య.

"అయ్యయ్యో... నాకొద్దు సామీ! చెప్పినట్టు వొగడినే వోడుంటాడు – యింకొగడు విననోడూ వుంటాడు, ఒకడు ఎంగిరంటే, యింగొకడు కొంగిరి అంటాడు. అందర్నీ అనుసరించుకొని పోయే వోపికా, తెలివీ నాకు లేవబ్బా! అందునా ఎన్నో తరాల్నించి ఆ వెంకోజీ వోళ్ళ వంగిశం వోళ్లే గురువు లవతావస్తా వుండ్లా? ఆ సంప్రదాయాన్ని చెడగొట్టిన పాపం నాకెందుకు?" నిక్కచ్చిగా చెప్పాడు కదిరయ్య,

"అట్టయితే ఈ వూర్లో ముక్కాలోశం (ముక్కాలు భాగం) వోళ్ల వంగిశమోళ్ళేగదా! వోళ్లల్లో ఎవుర్నన్నా వొగర్ని పెట్టొచ్చు గదా!" మొండిగా వాదించాడు గుట్టప్ప.

"ఇప్పుడు సిద్దుగోడు గురువుగా వుంటే నీకేం నష్టమబ్బా.. సెప్పు?" సూటిగా ప్రశ్నించాడు నరసిమ్ములు.

"నష్టమని గాదు... యల్లకాలంవూ వోళ్లే ఎందుకని....." నీళ్ళు నమిలాడు గుట్టప్ప.

"నువ్వెందుకంటా వుండావో మాకు తెలుసులేరా గురవిగా! ఈ ఊర్లో గురువోళ్ళతో కొట్టాటకు పోయినోళ్ళెవరూ లేరు. నువ్వు మాటమాటకు వాళ్ళను గిచ్చి రంపుకు రాదీస్తా వుండావు గదరా బూసడీకే! అసలు ఏంది నీ ఉద్దేశ్యం.... అయవోరోళ్ళ కెవురూ లేరనా?" కోపంతో అన్నాడు లచ్చుమయ్య,

"ఈసారిగనా అనేవాసింగా (అనవసరంగా) వోళ్ళ జోలికి బొయ్‌నావా.... మరేదుండదు జాగర్త!" అన్నాడింకో వ్యక్తి.

"బుద్ధీ గ్యానమూ లేదంట్రా నీకు గురప్పా! యిన్నిదినాలు యట్ల బోయేది అట్లే పోనీ! వుండే సంప్రదాయాన్ని నీ వొక్కడి కోసరం ఎందుగ్గాదనుకోవాల?" మరోవ్యక్తి అన్నాడు.

"సిద్ధప్ప కంటే బాగా పాడేవోళ్ళెవుర్రా ఈ ఊర్లో? అది వోళ్ళ నెత్తుర్లోనే వుండాది. ఆయప్పను గురువుగా పెడతామంటేనే కండ్లలో నిప్పులు పోసుకుండా వుండావే... మిడిమేళం నాయలా? అడిగే వోళ్ళెవెరూ లేరనా? భగ్గుమన్నాడు భద్రావతాయన.

"అసలు వోన్నెందుకురా పంచాయితీకి పిల్చింది? గురువు ఏనాడో వాన్ని కడ తోసేసినాడు... నాటకాలకు, భజనలకు వోరగా పెట్నాడు! ఊరంతా ఒక దారైతే ఉలిపి కట్టె దొకదారని - వోడి బోడి సలహా ఎవుడి గ్గావాల?" తలగుడ్డ విదిలించి భుజనా వేసుకుంటూ అన్నాడింకో వ్యక్తి.

"అంతే.... కడ తోసేయండి నాయాల్ని!" మరోవ్యక్తి పైకిలేచి నిలబడ్డాడు. అతనికి సపోర్టుగా మరో యిద్దరు "అంతే...!" అంటూ పైకి లేచారు.

ఖంగు తిన్నాడు గుఱ్ఱప్ప!! ఎలాగయినా సరే.... సిద్ధప్పను గురుపీఠం ఎక్కకుండా చూడాలని ఒక పావు కదిలించి చూశాడు. కానీ, వాతావరణం అందుకు అనుకూలంగా లేకపోవడంతో అవమానంగా తలొంచుకున్నాడు.

"ఈ కొంతేగాలం నాయాలు మన మద్దెనెందుకు - తులసి వనంలో బంగిసెట్టు మాదిరి?! ఈ యిరుడ్డపు (విరుద్ధపు) నాకొడుకుని పొమ్మనండి ఈడినుంచీ!" ఆవేశంగా అరిచాడు నరసిమ్ములు.

ఆ మాటతో యింకా అవమానంగా తోచింగి గుఱ్ఱప్పకు. ఆ పైన అక్కడ వుండలేకపోయాడు.

"నా మనసులో మాట సెప్పినా! అంతమాత్రానికే ఏమయ్యా అట్టా లేచివస్తారు? ఈ బోడి మద్దిస్తంలో వుంటే ఏం, ఉండకపోతేనేం పో?" కోపంగా అక్కడినుంచి లేచొచ్చేశాడు గుఱ్ఱప్ప.

అందర్నీ ఒక్కక్షణం పరకాయించి చూసి, ప్రారంభించాడు కదిరయ్య.

"పోతే పీడ నాయాలై లేపో.... మళ్లా సెప్తావుండా యినుకోండి! ఈ ఊరికి ఇంకనుంచి గురువు సిద్ధప్పే! ఇకనుంచీ ఆయప్పవొట్టి సిద్ధప్ప గాదు - గురువు సిద్ధప్ప... అణ్ణావు సిద్ధోజీరావు! మన కొత్తగురువు సిద్ధోజీరావుకీ... జై!!"

అందరూ "జై....!"

అతను "అణ్ణావు సిద్ధోజీరావుకీ.."

అందరూ "జై...!"

"సిద్ధోజీరావుకీ..."

"జై....!"

"సిద్ధోజీకి..."

"జై....!" జయజయ ధ్వానాలతో గుడి మారుమ్రోగింది.

వాళ్ళ అభిమానానికి సిద్ధప్ప కళ్ళు చెమ్మగిల్లాయి.

"ఏమప్పా సిద్ధోజీ... యిక నుంచీ నువ్వే ఈ ఊరికి గురువు! మీ పూర్వీకుల మాదిరిగానే ఈ ఊర్ని వొగటిగా నడుపుకోని రా! ఆటలు, భజనలు, అన్నీ పిలకాయలందరికీ నేర్పి, 'గురువు' అనే పేరు నిలబెట్టుకో... ఏమంటావు?" అతని అభిప్రాయాన్ని అడిగాడు కదిరయ్య.

"మీరంతా యింత అభిమానంగా అంత పెద్ద బాధ్యత నా నెత్తిన ఎత్తి పెట్టింతర్వాత నేను కాదంటానా కదిరప్పన్నా? మీ అందరి సహకారంతో అట్లే జేస్తా... నా బాధ్యతను నేను నెరవేరస్తా!" ఎంతో కృతజ్ఞతాభావంతో వినయంగా చెప్పాడు సిద్ధప్ప – ఉరఫ్ సిద్ధోజీ.

"మా సహకారం ఎప్పుడూ వుంటుంది. నువ్వారికే అట్టుండు సాలు... అంతా మేం జూసుకుంటాం గానీ... నీ మాటెవురన్నా కాదంటే గదా? ఏమప్పా?" అన్నాడు నరసిమ్ములు అందర్నీ ఉద్దేశించి.

"ఆఁ... అంతే....అంతే!! యికనుంచీ నువ్వే మా గురువు!" ఏక కంఠంతో అన్నారు.

వాళ్ల అభిమానానికి అతని కళ్ళు మరోసారి చెమర్చాయి.

"సరే కొత్తయ్యవారా? రేపొచ్చే ఉగాదినాటికి ఏం నాటక మేయాలో అదిగూడా సెప్పెయ్యి! ఎందుకంటే అదిగూడా దగ్గరికొచ్చేసింది గదా!" అన్నాడు కదిరయ్య.

"మీరే సెప్పండన్నా... ఏదేస్తే బాగుంటుందో?!" వినయంగా అడిగాడు సిద్ధోజీ.

"మేం సెప్పేది గాదబ్బా... యిప్పుడు గురువు నువ్వు... నువ్వే సెప్పాల!" అన్నాడు భద్రావతాయన.

"అవును... నువ్వే సెప్పాల!" అన్నారందరూ.

"సరేబ్బా... సెప్తా సెప్తా! మనం భారత నాటకాలు, లవకుశ అన్నీ యేసేసినాము. ప్రహ్లాద నాటకం మాత్రం ఈ వేరకు యెయ్యలా! ఈ తూరి అదేద్దాం... బాగుంటుంది. ఏమంటారన్నా?" అందర్నీ అడిగాడు సిద్ధోజీ.

"ఆఁ.... సరేలే... అదే ఏద్దాం!" అందరూ అంగీకరించారు.

"యింకేమబ్బా... పోదామా?" అందరూ పైకి లేచారు

ఆ విధంగా ఆనాటి మద్దిస్తం ముగిసింది!

కానీ... రాబోయే ఉగాదికి ఎలాగయినా సరే – ఆ నాటకాన్ని రసాభాసం చేసి, 'సిద్ధోజీ చేతకాని వెధవ!' అని నిరూపించాలని, అందుకోసం పథకాలను అన్వేషిస్తూ ఆ రాత్రంతా జాగరణం చేశాడు గుళ్లప్ప.

# 17

**ఆ**రోజు ఉదయం...

తొమ్మిది గంటల సమయం...!

అప్పటికే సూర్యుడు తన ప్రతాపాన్ని చూపుతున్నాడు.

ఏదో పనిమీద కుప్పం బయలుదేరాడు సిద్ధోజీ.

మెల్లగా ఊరు దాటి ఒక ఫర్లాంగు దూరంలో నడిచి వెళుతున్నాడు.

ఆ దారి పక్కన కానగచెట్లు అక్కడక్కడా గుబురు గుబురుగా కనిపిస్తున్నాయి.

అక్కడ... ఓ గొర్రెల మంద తోలబడి వుంది.

ఆ మంద ఆ ఊరిదే...!

ఓ ఎకరం నేలలో – ఎరుపు, తెలుపు, నలుపురంగు రాళ్ళను కుప్పపోసి చదును చేసినట్టు చేలంతా పరుచుకొని వున్నాయి గొర్రెలు.

అది బీళ్ళ కాలం గనుక గొర్రెల కాపర్లు రోజుకొక్కరు చొప్పున వంతులవారీగా తమ పొలాల్లో మంద తోలుకుంటున్నారు.

ఆరోజు బంగారప్ప వంతు!

ఆ రాత్రంతా మంద మల్లేసిన బంగారప్ప – యింకా గొర్రెల్ని మల్లేస్తూనే "ఎక్కడి వాడవురా కోతీ...." అని రామాయణం నాటకంలోని రావణుడి దరువును ఆలపించుకుంటున్నాడు.

గొర్రెలు చాలావరకు పడుకొని వున్నాయి. మరికొన్ని నిలబడి వున్నాయి. కొన్ని దగ్గుతూ, కొన్ని తుమ్ముతూ, కొన్ని "బేఁ....." అని అరుస్తూ శబ్దంచేస్తున్నాయి.

కొన్నివేల గొర్రెలు! తేనెటీగల తుట్టెలా, గుంపుగా చేరివున్నాయి.

కొన్ని తలలు వంచుకొని, నేలను వాసన చూస్తూ మెల్లమెల్లగా మేయడానికి మందని వదలిపోతుంటే... "ఉస్సుక్ఁ..." మంటూ ఓ మట్టిపెళ్ళను వాటిపైకి విసిరి – అవి మళ్ళీ మందలోకి కలిసేటట్లు మల్లేస్తున్నాడు బంగారప్ప.

మందలకి ఒకవైపు కొమ్ములు దిరిగిన కొన్ని పొట్టేళ్లు అదేపనిగా పోటీపడి ఒకదానితో ఒకటి ఢీకొంటున్నాయి.

ఢీకొని అంతటితో ఆగక, మెల్లగా వెనక్కి వెళ్ళి ఒకచోట ఆగి, రెట్టించిన కోపంతో తలలు వంచి, పరుగున ముందుకు దూకి మళ్లీ మళ్లీ ఢీ కొంటున్నాయి.

"ఏం గుద్దుకుంటా వుండాయబ్బా సామే యివి?! ఢీకున్నప్పుడు గనక వాటి మద్దెన ఏదయినా బడిందో – నుగ్గు నుగ్గు గదా!" అనుకుంటూ నడుస్తున్న సిద్ధోజీకి ఎవరో పిలిచినట్లయితే వెనక్కి తిరిగి చూశాడు.

వెనక... ఓ ఏడెనిమిదేళ్ళ పిల్లవాడు నవ్వుతూ "మామా....!" అంటున్నాడు.

అతనెవరయిందీ గుర్తుకు రాక క్షణంసేపు ఆలోచించింతర్వాత గుర్తుకు తెచ్చుకున్నాడు.

"ఓఁ... నువ్వా ... ఏమి?" అన్నాడు కాస్త గంభీరంగా.

"మామా!" అన్నాడు మళ్ళీ అతను నవ్వుతూ.

ఆ నవ్వులో వెన్నెలంత చల్లదనం! పచ్చటి పైరులాంటి నిండుదనం!!

అంతకుమించి ఆ ఒక్కమాట తప్ప యింకేమనాలో తెలిసినట్టు లేదు.

అతను "మామా! మామ!" అంటూనే వున్నాడు.

ఆ పిలుపుతో సిద్ధోజీ శరీరం ఒక్కసారి పులకించింది. ఆ పిలుపులోకల్లా కపటం లేని ఏదో స్వచ్ఛమైన ప్రేమ! ఏదో అనుబంధం!

దగ్గరకు పిలిచి, వంగి అతని భుజాలపైన చేతులు పెట్టుకొని "నీ పేరేమి?" అన్నాడు అతని ముఖం లోకి చూస్తూ.

"నా పేరు... నాపేరు.... వెంకోబరావు!" ముద్దుముద్దుగా అన్నాడతను.

ఆ పేరు విని ఒక్కక్షణం మౌనం వహించి, "నాయన పేరు కొడుక్కి పెట్టుకునిందన్నమాట!' అనుకొని "బడికి పోతున్నావా? గొఱ్ఱెలు మేపుతున్నావా?" అన్నాడు.

"బడికే పోతుండా!" నవ్వుతూ చెప్పాడు.

అతను నవ్వుతుంటే... బుగ్గలు సొట్టలు పడుతున్నాయి.. ఎంతో ముద్దుగా అనిపిస్తోంది.

"ఎన్నో క్లాసు?" తిరిగి అడిగాడు సిద్ధప్ప.

"మూడో క్లాసు..."

"నేను మామనని నీకెట్ల తెలుసు?"

"మాయమ్మ సెప్పిందిలే....."

"మీ యమ్మ చెప్పిందా....?" అనిచుట్టూ ఒక్కసారి చూసి "ఏదీ..?" అన్నాడు.

"ఇక్కడే వుండాన్లే...." అంటూ నవ్వుతూ వెనకనే వున్న చెట్ల నుంచి వెలుపలికి వచ్చింది రేణుకమ్మ.

"ఇక్కడే వుండావా? నేను కుప్పం బోతావుంటే...?!" దొరికిపోయిన దొంగలా తత్తరపడిపోతూ అన్నాడు సిద్ధప్ప.

ఆమె చేతిలో రెండు చెంబులున్నాయి. ఒక చెంబులో చద్దినీళ్ళున్నాయి.... మరో చెంబులో మంచినీళ్లున్నాయి.

"ఏమిరా... నాకు నచ్చినోన్ని చేసుకున్నా.... వెలేసినారు. వెలేసినోళ్లే యిప్పుడు దాని గురించి మరిచిపోయినారు. అట్టాంటిది – నీకేంరా మాట్లాడేదానికి?" సూటిగా ప్రశ్నించింది రేణుకమ్మ.

ఏం సమాధానం చెప్పాలో తెలీక నీళ్ళు నమిలాడు సిద్ధప్ప.

"పోనీలేరా! మీరు సుఖంగా వుండారు..... సాలు! నాకు పుట్టింటాశ లేకపోయినా పరవాలేదు..." చెమ్మగిల్తుతున్న నయనాలతో తమ్ముడి ముఖంలోకి చూస్తూ అంది.

బాల వెంకోబరావు తల్లి వెనకనుంచి చూస్తూ వున్నాడు. ఆ స్థితిలో ఆమెను చూసేసరికి చలించిపోయాడు సిద్ధప్ప.

"అది కాదక్కా.. అదీ..."అంటూ ఏదో చెప్పబోయాడు.

కానీ, ఆమె మధ్యలోనే అందుకుంది – "నాకందురూ వుండీ లేనిదాన్నయినాను. నే జేసిం తప్పేమిరా? నువ్వు భారతా లాడతా వుండావు గదా? ఈ మద్దెన గురువు కూడా అయినావు. భీమున్ని హిడింబి పెండ్లాడింది.... వాళ్ళిద్దరిదీ ఏ కులం? కృష్ణుడు అడవిలో వుండే జాంబవతిని పెండ్లాడే... ఆమెదే కులం? మత్స్యగంధి పరాశరునితో వ్యాసున్ని గని, ఆమింద శంతనున్ని పెండ్లాడె... ఆ శంతనుడు గంగను పెండ్లాడె! అంతెందుకు... కుంతీదేవి పాండవుల్ని యట్ల గనే...? వాళ్ళందరివీ ఒగిటే కులాలా.... సెప్పు? వాళ్ళంతా కులాలకు ఎలేయబడినారా...? మనం పూజించే ఆ దేవతలదే తప్పు కానప్పుడు – నేను జేసిన పని యట్ల తప్పవతాది? నేనేమీ ఒగన్ని మొనసు పడి సంసారం జేసి, యింగొగన్ని మనువాడలా! నేను మొనసు పడిందీ,,, మనువాడిందీ వొగన్నే..!"

– ఆవేశంగా అంది రేణుకమ్మ. ఎన్నో ఏళ్ళ తర్వాత అతనితో మాట్లాడే అవకాశం వచ్చినందుకు మాట్లాడాల్సినదంతా మాట్లాడింది.

అతనికి ఆమె మాటల్లో తప్పేమీ కనిపించలేదు. అలాగే ఆమె చేసిన సాహసమూ తప్పనిపించలేదు. అందుకే ఆమెకేం చెప్పాలో అర్థంగాక, "అక్కా! కాలం మారింది. రాబోయే కాలంలో కులాలు పూర్తిగా పోతాయి. ఆ నమ్మకం నాకుంది. సరే.... జరిగిందేదో జరిగిపోయింది. నువ్వు మన యింటికి ఎప్పుడయినా రావచ్చు. నాకున్న ఆకో, అంబిలో కూడా తినేసి పోవచ్చు... వస్తా!" అని మాత్రమే అనేసి, అల్లుడ్ని పిలిచి, తల నిమిరి.... అక్కడనుంచి ముందుకు వెళ్ళిపోయాడు.

అన్ని రోజుల తర్వాత అక్క మనసు విప్పి మాట్లాడినందుకు సిద్ధప్పకు ఎంతో ఆనందం వేసింది. ఎన్నో రోజులుగా తన గుండెలో ముల్లులా గుచ్చుకుంటున్న బాధను – ఆ సంఘటన చేయిపట్టి తీసేసినట్టపించి, సంతోషంతో తమ్ముడి వైపే చూస్తుండిపోయింది రేణుకమ్మ.

"ఏయ్ఁ! తమ్ముని జూసి తనువు మరిచిపోయినట్టుండావు... ఆకలయితా వుండాది గానీ – చెంబిట్టియ్యి!" అంటూ వచ్చి,ఆమె తెచ్చిన మంచినీళ్ళ చెంబును తీసుకొని నోరు కడుక్కొని, మరో చెంబులోని సద్దినీళ్ళను తాగసాగాడు బంగారప్ప.

"మధ్యాహ్నం.... పెచ్చెరువు కళ్ళా అన్నమెత్తకరా...!" సద్దినీళ్ళు తాగడం పూర్తిచేసి, చెంబును తిరిగిచ్చేస్తూ అన్నాడు బంగారప్ప.

"ఆఁ... సరే!" అంటూ కొడుకుని వెంటబెట్టుకొని ఊరివైపు నడిచింది రేణుకమ్మ.

# 18

**చూ**స్తుండగానే ఉగాది రానే వచ్చేసింది!

ముక్కలు పోయిన గోడలకు, అరుగులకు ఎఱ్ఱమట్టి తెచ్చి మొక్కులేసి తమ ఇళ్ళకు శుభ్రంగా సున్నాలు కొట్టుకున్నారు. అరుగులకు, గడపలకు ఎఱ్ఱమన్ను పూసుకున్నారు.

ప్రతి యింటి ముందరా మామిడి  తోరణాలు వ్రేలాడుతున్నాయి.

ప్రతి ఇల్లు ముస్తాబయిన పెళ్ళికూతురిలా అనిపిస్తోంది!

అప్పటికే వద్దికలో అందరూ వాళ్ళవాళ్ళ కథను వాళ్లు నేర్చేసుకున్నారు.... బాగా తర్ఫీదు అయ్యారు. ఆ తర్ఫీదులో సిద్ధోజీ – ఎవరికి ఏ అనుమానం వచ్చినా తీర్చి, ఏ తప్పు చేసినా సరిదిద్ది, తండ్రికి తగిన కొడుకనిపించుకున్నాడు.

ఆరోజు మూడు గంటలకంతా భజనగుడి ముందర పందిరి సిద్ధమైపోయింది. గుంజలు నాటేవాళ్ళు నాటుతున్నారు. టెంకాయ కీతులు కప్పేవాళ్ళు  కప్పుతున్నారు. కర్టన్లు లాగే వాళ్ళు లాగుతున్నారు. గుడిలో నుంచి కరెంటు తీసేవాళ్ళు తీస్తున్నారు. నలుగురూ నాలుగు పనులు చేస్తున్నారు. మైకు సెట్టు కూడా పిలిపించారు. అప్పటికే... లౌడ్‌స్పీకర్లో సినిమా పాటలు  వినిపిస్తున్నాయి.

రెండు రోజుల ముందే చుట్టుపక్కల గ్రామాల్లో దండోరా కూడావేయించారు. చుట్టుపక్కల పల్లెల నుంచి తండోపతండాలుగా జనం వచ్చేస్తున్నారు. ఆరోజు ఎనిమిదికంతా ఆ వీధి జనంతో నిండిపోయింది.

గుఱ్ఱప్ప బంధువులు కొందరు విజలాపురం నుంచి వచ్చి అతనింట్లో దిగారు. ఆ

ఊర్లో కొత్తగా నాటకం నేర్చుకుంటున్న వాళ్ళున్నారు. వాళ్ళకు నాటకం నేర్పించే గురువు కూడా వచ్చాడు. ఆ గురువుకు గుళ్లప్ప నిండా అయినవాడు. అతనిలాగే మిడిమిడి జ్ఞానం కలిగిన అతను – కళాకారులే లేని ఆ ఊర్లో గొప్ప విద్వాంసుడు! చెట్లులేని ప్రదేశంలో మహావృక్షంలా భావింపబడే ఆముదపు చెట్టు! విద్వాంసుడే లేనిచోట అతిగౌరవాన్ని పొందే అల్పుడు! ఎవరు ఏ పాట పాడినా, ఎంత బాగా పాడినా ఏదో ఒక వంక పెట్టేవాడు. ఎలాగయినా సరే.... ఎదుటివాడిని అబాసుపాలు చేయాలనుకునే తత్త్వం గల మనిషి! అగ్గికి ఆజ్యం తోడయినట్టు గుళ్లప్పకు తోడయినాడు.

వచ్చినప్పటినుంచి ఏవేవో కబుర్లు మాట్లాడుకుంటూనే వున్నారు వాళ్లు.

వాళ్ళు మాట్లాడుకుంటున్న తాలవారం పక్కనున్న కొట్టంలో నులకమంచం పైన పడుకొని కుళ్ళు దగ్గు దగ్గుకుంటోంది బుడ్డమ్మ.

వాళ్ళ సంభాషణ చూడబోయే నాటకం పైకి మళ్ళింది...

“ఏమప్పా గురప్పా! మీ ఊరోళ్ళు యెట్టేస్తారు ఆట?” అన్నాడా వ్యక్తి.

“ఆఁ... వీళ్ల మొహం! వొగడకీ డొక్కుసుద్ది లేదు. అసలు అందరికంటే ముందు ఆ గురువు సిద్ధప్పకే ఏ దరువు ఏ రాగంలో పాడితే రక్తి కడుతుందో కూడా తెలీదు. యింకా వీళ్ళ పిండాకూడు... ఏం మెప్పిస్తారు జనాన్ని?” ఏద్దేవా చేస్తూ అన్నాడు గుళ్లప్ప.

ఇంతలో.... అనారోగ్యంతో మంచంపైన పడివున్న బుడ్డమ్మకు దగ్గు ముంచుకొచ్చింది. ‘ఖళ్ళుఖళ్ళు’న దగ్గింది. ఆ శబ్దం కర్ణకఠోరంగా వినిపించి వాళ్ళ సంభాషణ కంతరాయం కలిగింది.

గుళ్లప్పకు కోపం ముంచుకొచ్చింది.

“తుఁ.... నీయమ్మా ముసలిముండా! ఎందుకట్ట దగ్గతావు.... పాణం పోయేట్టుగా? భరించలేకుండా వున్నాం... గొమ్మునుండు! లేకుంటే మూతిమింద కొడతా సూడు!” కసురుకున్నాడు.

“వచ్చే దగ్గును యట్టాపుకుండేదిరా ముండాకొడకా! నేను సంపాయిచ్చిందంతా మీయదాన్నే యేసుకోని కడదినాల్లో నన్ను హీనంగా చూస్తారా? నా వుసురు తగిలి పురుగులు పడి చస్తార్రా....” అంటూ అరవాలనుకుంది బుడ్డమ్మ. కానీ, ఆమె నోరు పెగల్లేదు. ఊపిరాడకుండా వస్తున్న దగ్గును బలవంతంగా ఆపుకొని, మెల్లగా ‘కుఫ్....కుఫ్’ అంటూ దగ్గుతోంది.

“సరే గురప్పా! మీవోళ్ళంతా మంచి పాటగాళ్ళని పేరు గదబ్బా... నువ్వేంది అట్టాంటివీ?”

"దూరపు కొండలు నునుపని - బయటోళ్ళకు అట్లే అనిపిస్తాది! మేము రోజూ చూసేవాళ్లం- మాకు తెలుసు గదా... ఈళ్ళ పురసత్తా (మగతనం) ఎంతో?"

"ఏమప్పా..... అట్టంటివి?"

"అంతే అన్నా.... ఉండేదంతే! వడ్లగింజలో బీపగింజ... ఆఁ...! అది సరేన్నా.... నేను వొగమాట సెబతా... యినుకో!" రహస్యంగా అన్నాడు గుజ్జప్ప.

"చెప్పు...." అంటూ చెవి వొగ్గాడు ఆ గురువు.

"నువ్వు కొత్తగా పిల్లోళ్ళకు 'ఆట' నేర్పిస్తా వుండావు. వొగ ట్రూపు తయారుజేస్తా వుండావు. నేను సెప్పేది జాగర్తగా యిను.... ఎట్లన్నాగానీ - ఈ నాటకం చెడిపోయేట్టిగా సూడు!" విషయం గక్కాడు గుజ్జప్ప.

"అట్ట జేస్తే మనకేంది లాభం?!" ఆశపడ్డాడు గురువు.

"ఏందన్నా.... అట్టంటివి? ఇది రసాభాసమైపోతే వీళ్ళ ముఖాన మసి బూసినట్టే! వెంకోజీతోనే ఈళ్ళ ఆటపాటలు అయిపోయినాయి అనుకుంటారు జనం. ఆ తర్వాత వీళ్లమింద జనానికి గౌరవం పోతుంది. ఆపైన మీరేసే నాటకం యట్టున్నా పేరొచ్చేస్తుంది. ఆ తర్వాత సుట్టుపక్కల భారతం కాంట్రాక్టులన్నీ నీవే!"

ఆలోచనల్లో పడ్డాడు ఆ గురువు.

ఆలోచించేకొద్దీ అతని మాటలు నిజమనిపించసాగాయతనికి.

"అయితే యిప్పుడేం జెయ్యమంటావ్?" ప్రశ్నించాడు.

"యట్టో వొగట్ట.... ఆరు నూరుగానీ - నూరు ఆరుగానీ - అగ్రారం పాడుగానీ.... నాటకం మధ్యలో నిల్చిపోవాల... అంతే!" కసిగా అన్నాడు గుజ్జప్ప.

ఆ మాటతో తన శిష్యులందర్నీ పిలిపించి చెప్పాడు...

"వొరే...... బాగా యినుకోండి! మనం ఆడబోయే ఆటకు మంచి పేరు రావాలంటే ఈ నాటకాన్ని గబ్బులేపాల! లేకంటే రేపుమనకు బరం (గౌరవం) దక్కదు. మీరేం చేస్తారో నాకు తెలీదు-అంతా గబ్బయిపోయి,నాటకం మధ్యలోనే ఆగిపోవాల...అంతే..... పోండి..!"

వాళ్ళు - ఆ గురువు మాటే ఆజ్ఞగా భావించి వెళ్ళిపోయి వీధిలో ఒకచోట గుంపుగా కూర్చున్నారు. వాళ్ళు మొత్తం పదిమంది!

జనం 'ఓఁ...' అని మాట్లాడుకుంటున్నారు.

నాటకం ప్రారంభమైంది!

"పరాబ్రహ్మ...పరాబ్రహ్మ...పరమేశ్వర!"

తెరవెనుకనే..... మేళం కట్టాడు గురువు. వెనుక పాటలందుకున్నారు నటులు. ప్రజల కోలాహలం క్రమంగా తగ్గిపోయింది.

ఆ మేళం కట్టడంలో గణపతి స్తుతి, ఇష్టదేవతా స్తుతి అయిన పిదప.... గురువులకు జేజేలు పలికారు.

ఆదిరుగువు మొదలు – వెంకోజీ వరకు నామస్మరణ చేశారు. ఆ తర్వాత సిద్దోజీకి జేకొట్టిన పిదప పాత్ర ప్రవేశం జరిగింది.

"కట్టిక వాడొచ్చెను.... హిరణ్యకశిపు సన్నిధికి! ॥కట్టి॥

కట్టిక వాడొచ్చెను – ఘనతరముగాను!"

రూపకంలో దరువుపాడుతూ అట్టహాసంగా ప్రవేశించాడు కట్టికవాడనే చోపుదారు.

అందరూ నాటక సందర్శనంలో మునిగిపోయి వున్నారు. కానీ, విజలాపురం ట్రూపువాళ్ళు మెల్లగా సంభాషించడం మొదలుపెట్టారు.

"అబ్బో! చోపుదారేందిరా... 'కట్టిక వాడొచ్చెనూ' అంటూ పాడతా వుండాడు?"

"చోపుదారి వెడలి వచ్చెను – సభకు చోపుదారి వెడలివచ్చెను' అనిగదా.... మనం పాడుతాం?"

"వొరే! ప్రతి నాటకంలోను చోపుదారులుంటారు. కట్టికోడు, చోపుదారు, దారకుడు... వీళ్ళంతా వొగిటే! వొగో నాటకంలో వొగో పేరుతో పిలుస్తారు... అంతే! ముందు వోళ్ళెట్ట పాడతారో గ్యేఁవనించండి. కానీ, నేను చెప్పిన యిసయం మాత్రం మరచిపోవద్దు... ఆఁ..!!" హెచ్చరించాడు ఆ గురువు.

కట్టికవాడి తర్వాత హిరణ్యకశివుడి ప్రవేశం, ఆ తర్వాత మంత్రులు, ఆ పైన అప్సరసల ప్రవేశం, వారి తర్వాత ప్రహ్లాదుడు.... వరుసగా రంగప్రవేశం చేసి, తమతమ గాత్రనైపుణ్యాలను నిరూపించుకున్నారు.

నాటకం రసవత్తరంగా సాగిపోతోంది.

పున్నాగ వరాళి, ఆటతాళంలో ప్రహ్లాదుడు పాట పాడుతున్నాడు.

"దాసాను దాసుని దండింప దలచిరి..

వాసుదేవా నన్ను – భాసురముగ నీవే

పాలింప వలెనయ్యా... వాసుదేవా!"

"వాడి మొహమాలా పాడతా వుండాడు..... సూడాంద్రా పిల్లగోడు! అది ఆటతాళంలో గాదు – 'టింగ్ టింగ్ టక్.... టింగ్ టింగ్ టక్' అంటా పాడాల్సింది! 'టింగ్ టింగ్ టక్ (వేగంగా) టింగ్, టింగ్, టక్ (మెల్లగా) టింగ్ టింగ్ టక్ – టింగ్ టింగ్ టక్' అంటూ త్రిపుట తాళంలో పాడాల! త్రిపుట తాళం పడితేనే ఆ పాట రక్తి గడతాది! అదిగూడా తెలీకుండా వాళ్ళ గురువు పిల్లోనికి దరువు నేర్పించేసినాడు.... తుఁ... సిగ్గుచేటు!" ఎగతాళిగా అన్నాడు విజలాపురం గురువు.

"అదే నేనూ అనుకుంటా వుండా...." అన్నాడు ఒకతను.

"తుఁ.... ఏం పాడతా వుండార్రా.... ముండ కొడుకులు! వొకడి కన్నా తాళజ్ఞానం వుందా?" అన్నాడు యింకోవ్యక్తి.

నాటకం సాగిపోతోంది సజావుగా! వీళ్ళ సంభాషణా సాగిపోతోంది యధేచ్ఛగా!!

"వొక్కడన్నా సక్కరమంగా పాడతా వుండాడేమో సూడు!"

"మావాళ్ళ కంతా పెడసరమూ, ఫోజులు ఎక్కువబ్బా! ఈ గ్రామంలో వాళ్ళు పాడిందే పాట – ఆడిందే ఆట... అట్టయిపోయుండాది కాలం!" గుఱ్ఱప్ప వాళ్ళకు వంతపాడాడు.

"మీరు భలే పోటుగాళ్ళు గానీ.... కొంచెం మూసుకోనుండండయ్యా.... కథ విననీ....." ప్రక్కనే వున్న మరో ప్రేక్షకుడన్నాడు.

"ఏందయ్యా..... మూసుకోనుండమంటావు? మేమేమన్నా తెరుసుకోనుండామా – మూసుకునే దానికి! నువ్వే.... మూసుకోనుండయ్యా..... మాతో నీకేం పని.... నీ పాటికి నువు సూడు!"

అతనుపయోగించిన బూతుమాటకు వెంటనే రెచ్చిపోయాడా ప్రేక్షకుడు –

"ఏందిరా ముండ నాకొడకా! అట్ల మాట్లాడతావ్? అదేదో నువ్వే మూసుకోనుండు! లేకంటే... బూడుసు లిరిగిపోవును... ఆఁ..!" కోపంగా పైకి లేచాడతను.

"వొరేఁ... దర్బేసి నా కొడకా... మమ్మల్నే బూడుసుల్తొ కొడతానంటావ్... ఏం? ఇంక గాన బొక్క తెరిసినావా – మెడలో మెట్ల హారమేస్తా.... ఏమనుకున్నావో?!" రొమ్ము విరుచుకుంటూ ముందుకొచ్చాడు.

"ఎయ్యిరా మెట్లహారం సూతాము – నా కొడకా... నీ బగిసెంతో? మా ఊరికొచ్చి మమ్మల్నే తిడతావా...?!" లుంగీ ఎగచెక్కి భుజం చరుచుకుంటూ ఒకడుగు ముందుకేశాడతను.

అతన్ని సమర్థిస్తూ మరో యిద్దరు పైకిలేచారు.

"వాళ్లేమి జేసుకుంటారు గానీ... వాళ్లమ్మా బుసపత్తిరి! ఎనిక్కి జగ్గొద్దండి!" ఇంకా రెచ్చగొట్టాడు గుఱ్ఱప్ప.

విజలాపురం వాళ్ళు ఏకమయ్యారు.

"రండ్రా కొడుకల్లారా.... రండ్రా..... సూసుకుందారి! మీ బగిసెంతో తేల్చేస్తాము!" రంపుకు రాగదీశారు.

అదిచూసి యామిగాని పల్లె యువకులంతా ఏకమైపోయి దొమ్మీకి దిగారు.

క్షణంలో అక్కడ వాతావరణం మారిపోయింది!

ప్రశాంతంగా, గంభీరంగా వున్న బావిలో ఉన్నట్టుండి పెద్ద బండరాయి వేస్తే అల్లకల్లోలమైపోయే బావినీళ్ళలా.... అక్కడ వాతావరణం అల్లకల్లోలమైపోయింది - కకావికలమైపోయింది.

"వాళ్లేదో కుశాలకంటే... మీరేంది వోళ్ళ మిందికి కొట్టాటకు దిగతావుండారు? తమాస కనిందానికి తరమకొస్తా వుండారే... మనూరి పరువుబోదూ?" తమ ఊరివాళ్ళదే తప్పున్నట్టుగా అన్నాడు గుజ్జప్ప.

దాంతో యింకా రెచ్చిపోయి, "తమాసే అమాసయ్యేది! అయినా నీ బోడి సలహా ఎవరిగ్గావాల పో.... కుశాలంట కుశాల... కుశాల గిశాలైపోను... పో... ఇక్కన్నించీ!" గుజ్జప్ప మీద పడ్డారు.

ఒకరి మీద ఒకరు కలయబడ్డారు.

ఆ దొమ్మిలో 'అమ్మా, అక్కా, అబ్బా' అన్న మాటలు మిన్నుముట్టాయి.

'కొట్టు... తన్ను... కొడుకుల్ని...' అన్న పదజాలం పెల్లుబుకుతోంది.

యామిగాని పల్లె యువకుల ధాటికి విజలాపురం వాళ్ళు తాళలేకపోయారు. చావు దెబ్బలు తిన్నారు. మిడిమిడి జ్ఞానంతో విర్రవీగిన వాళ్ళ గురువు ముక్కు పచ్చడయింది.

వాళ్ళను పురిపెట్టి కొట్లాడే విధంగా చేసిన గుజ్జప్పకూ ఆ దొమ్మీలో కొన్ని ధర్మగుద్దులు పడనే పడ్డాయి.

అక్కడ ఒకటే గలాట!

రగడ...!!

ఆ రగడకు నాటకం ఆగిపోయింది!

సిద్ధోజీ, మరికొందరు పరుగున వచ్చి వాళ్ళను వీడదీశారు.

రగడ ఆగింది!!

ఇరువర్గాల వారినీ దండించారు.

అవమానభారంతో అక్కడనుంచి వెళ్లిపోయారు విజలాపురం వాళ్ళు!

వాళ్ళతో బాటు గుజ్జప్ప - యింకా అక్కడ వుండలేక, తన యింటికి వెళ్ళిపోయి పడుకున్నాడు.

తిరిగి నాటకం ప్రారంభమైంది!

రసాభాసమై ఆగిపోతుందనుకున్న నాటకం తిరిగి ప్రారంభమైనందుకు చింతిస్తూ..... పరిపరివిధాలా... పరివేదన ననుభవించసాగాడు గుజ్జప్ప.

మేడ పైనుంచి ప్రహ్లాదుడ్ని మేదిని పైకి నెట్టమని తండ్రి ఆజ్ఞ చేసినపుడు ప్రహ్లాదుడు "స్వామి... నన్ను కరుణ జూడరా! సద్గుణ సాంద్రా! స్వామి... నన్ను కరుణ జూడరా!" అంటూ రమ్యంగా దరువు పాడుతున్నాడు.

పునాగ రాగం, ఆదితాళంలో సాగిపోతున్న ఆ దరువు గుఱ్ఱప్పకు కర్ణకఠోరంగా వినిపించసాగింది.

# 19

**కా**లం ఋతువులనే షట్చక్రాల మీద స్వారీ చేస్తూ, మందకొడిగా మరో మజిలీ చేసింది.

సిద్ధోజీకి రెండో సంతానం కలిగింది!

రెండోసారీ మగబిడ్డే!

పెద్దవాడు నాగోజీకి ఏడేండ్లు... చిన్నవాడికి సంవత్సరం నిండింది!

ఆ ఏడూ వర్షాలు సరిగా పడలేదు... పొలాలు దుక్కులు కాలేదు.

కరువు మొదలయింది!

రైతులు అప్పులు చేసుకుని ధాన్యం కొంటున్నారు.

పెద్దచెరువు బీటలు వారిపోయి, ఆ నెర్రెల్లో తొండలు, బల్లులు గుడ్లు పెట్టసాగాయి. చీలిన నెర్రెలు – కరువు రక్కసి పుడమితల్లి ముఖాన నిర్దాక్షిణ్యంగా పెట్టివెళ్ళిన గాట్లలా అనిపిస్తున్నాయి.

సిద్ధోజీ కుటుంబం ఆర్థికంగా యింకా చితికిపోయింది.

నాటకాల మీదనే ఆధారపడి జీవించే కాలం పోయింది!

నాటకాలాడించాలన్నా,ప్రజలకు తిండి సమస్య లేకుండా వుండాలి గదా?!

కడుపు నిండిన వాళ్ళకు కళాపోషణ గానీ, కడుపు కాలేచోట కళలెలా జీవిస్తాయి?

అందరిదీ ఒకటే సమస్య! తిండి సమస్య!!

ఆ...క...లి.. సమస్య!!

వర్షాగమనం కోసం రైతులు ఎన్నెన్నో దేవర్లు, సాంగేలు, చిట్కాలు ప్రయోగించారు.

ఊహూఁ.. వాన రాలేదు!

పెద్దచెరువులో పందిరివేసి, ఉడాందాసుని పిలిపించి 'విరాట పర్వం' కూడా చెప్పించారు.

అయినా... వాన రాలేదు!

'హరికథలకి, బుఱ్ఱకథలకి వాన పడే కాలం ఎప్పుడో చెల్లిపోయింది'... అన్నారు జనం.

ఊర్లో యువకులంతా చేరి, ఒక గోదురుకప్పను తీసుకొచ్చారు. దాన్ని ఒక రోకలి బండకు కట్టి, యింటింటి వద్ద చెంబుడు నీళ్ళు పోయించి, పసుపు కుంకుమలు పెట్టించారు. అదయినా తర్వాత చెరువులో ఆ కప్పను వదలి, "లబ...లబ...." మని నోరు కొట్టుకొని వానదేవుడ్ని బూతులు తిట్టి, "దిగిరారా... దివినించి – దిక్కువాలిన్నా కొడకా! పవలమై రారా.... నీ పట్టూడి పోనానీ! మొయిలై ముంచక రారా... ముండమోపి దేవుడా!" అని అరచి అరచి నోర్లు కొట్టుకుంటూ తిరిగి చూడకుండా వచ్చేశారు.

అయినా... వర్షపు చినుకు నేల రాలలేదు!!

ఊర్లోకి రెండు కుక్కల్ని పట్టుకొచ్చి, వాటికి నడివీధిలో పెండ్లి చేశారు.

ఇంటింటి దగ్గర, ఒక ముత్తయిదువ నెత్తిమీద కడవ బెట్టి, నీళ్లుపోయించి, పసుపు కుంకాలతో అర్చించి, వానదేవుడ్ని వేడుకున్నారు. పెళ్ళికాని పన్నెండు, పద్మూడేళ్ళ కన్నెపిల్లల్ని అర్ధరాత్రి వెన్నెట్లో పెద్దచెరువు మధ్యలోకి తీసుకెళ్లి బట్టలు లేకుండా వారిచేత మడక దున్నించారు.

అయినా.... చినుకు రాలలేదు – వాళ్ళ ఆర్తి తీరలేదు!

ఆకాశంలో అరచేయంత కారుమబ్బే కరువైంది!!

అన్ని గ్రామాలవాళ్ళు చేరి, ఇంటికింత అని 'పంపకం' వేసుకుని ఊరికొక్క వేట చొప్పున నరికి, ఊరి పొలిమేరలో వండించి, సంగటి ముద్దలు చేసి, అందరికీ వడ్డించి, వలస దేవర చేసుకున్నారు.

అయినా.... ప్రయోజనం లేకపోయింది!

చినుకు రాలే సూచనలే కనిపించలేదు.!!

ఆ కరువు రెండో ఏడూ అలాగే కొనసాగింది.

రైతులు తట్టుకోలేక తమ పశువుల్ని కటికోళ్ళ కమ్ముకోసాగారు. పశువుల్ని కొనుక్కున్న కటికోళ్ళు – వాటిని లారీల కెక్కించి, వాటి కాళ్ల కొంకులు నరికేసి కోతకు బెంగుళూరుకు తోలుకుపోసాగారు. కొందరైతే లారీలోకి పశువును ఎక్కించీ ఎక్కించగానే ఓ పెద్ద బడరోకలితో నిర్దాక్షిణ్యంగా వాటి కాళ్ళను కొట్టికొట్టి విరిచేస్తుంటే అవి హృదయవిదారకంగా అరుస్తున్నాయి.

సిద్ధోజీ యింట్లో ధాన్యం ఎప్పుడో అయిపోయింది!

కూలీ చేసి సంపాదిద్దామన్నా – ఎక్కడా పనుల్లేవు. పశువులకు మేత లేదు. వట్టి

నీళ్లతో బతుకు బక్కచిక్కిపోయి, తమ ప్రాణాలను కొనకళ్ళతో నిలుపుకుని బిక్కుబిక్కున చూస్తున్న ఎద్దుల్ని చూస్తుంటే సిద్దోజీ గుండె తరుక్కుపోతోంది.

బిడ్డలు పస్తు పడుకునే దౌర్భాగ్యం వచ్చేసింది. ఏం చేయాలో అతనికి పాలుపోలేదు. ఇక గత్యంతరం లేక – వాటిని బెంగుళూరు నుంచి వచ్చిన సాయిబులకు అయినకాడికి అమ్మేశాడు.

అతను చూస్తుండగానే ఆ ఎడ్ల కాళ్ళు విరిచేసి లారీలో, ఓ మూల, పాత సామాను మూటల్ని దొర్లించినట్లు పొర్లించారు. ఆ దృశ్యం చూసిన సిద్ధోజీ గుండెల విసిపోయాయి.... విలవిల లాడిపోయాయి....

'దుక్కిదున్నే గొడ్లకు కళ్ళ ముందరే.... కాళ్లిరిచేస్తే చూసే దవుర్భాగ్యం రైతులకు బట్టెగదా...!" అనుకుని, ఓ వారం వరకు మానసికంగా కోలుకోలేకపోయాడు సిద్ధోజీ.

అలా పశువుల్ని అమ్మిన డబ్బుతో ఓ నెల గడిచింది! మళ్లీ చిల్లిగవ్వ లేకుండా పరిస్థితి యింకా దిగజారిపోయింది. పిల్లలకి పట్టెడన్నం పెట్టడానికే కటకటపడే పరిస్థితి ఏర్పడిపోయింది.

అలాంటి పరిస్థితిలో గుబ్బప్ప తన అప్పు తీర్చమని గొంతుమీద కూర్చున్నాడు.

పశువుల్ని కోతకు తోలుకుపోయిన కటికోళ్ళకు, అతనికి తేడా లేదనిపించింది సిద్దోజీకి.

'అంతే! కొందరు మనుషులు – మనుషుల్ని వేదించడానికే పుడతారు. యింకొందరేమో బాదలు అనుభవించడానికే పుడతారు ఈ పాపిష్టిలోకంలో!' అనుకున్నాడు.

అతని మాటలు, బాధలు హరించలేక – వున్న ముక్కాలెకరా నేల అతనికే ధారపోసి, అప్పు తీర్చేశాడు. మిగిలిన డబ్బుతో మరికొన్ని నెలలు నెట్టుకొచ్చాడు.

కానీ, మళ్లీ పరిస్థితి మామూలే!

చేతిలో చిల్లిగవ్వ మాయం!!

ఎప్పుడో విజలాపురం జమీందార్ల నుంచి తమ పూర్వీకులు ఈనాముగా పొందిన 'గురువుల తోపు' మాత్రమే మిగిలింది సిద్ధోజీకి.

'ఎలాగో ఓలాగు దాన్నికూడా దక్కకుండా చేసి, గురువుల గుర్తురాళ్ళను పగులగొట్టించి, అందులోని మామిడిచెట్లను నిలువునా నరికించి, నేలనంతా కుళ్ళపొడిపించి, తన చేనిలో చేనుగా కలుపుకోకపోతే నా పేరు వడ్డీల బుడ్డయ్య కొడుకు గుబ్బప్పే కాదు!' తనకు తానే శపథం చేసుకున్నాడు గుబ్బప్ప. అవకాశం కోసం అన్వేషిస్తూ కూర్చున్నాడు.

ప్రభుత్వం గంజి కేంద్రాలు తెరిచింది.

కరువు. వొగటే కరువు. ప్రభుత్వ కరువు మాపుతాం అంటూ వుందేగానీ ఏ సహాయమూ

చేయడం లేదు. సిద్ధోజీకి ఏం చేయాలో తోచలేదు. రోజుకొక పూట తిండికే కష్టంగానే వుంది.

చాలామంది ప్రజలు కరువు ధాటికి తట్టుకోలేక – మూటాముల్లె సర్దుకొని వేరే ప్రాంతాలకు వలస వెళ్లిపోయారు.

‘ఇంకెట్లరా భగవంతుడా.... జీవనం గడసేది?!” అనుకుంటుండగానే.... బ్రహ్మోత్సవాలొచ్చేశాయి.

‘ఏం చేయాలి? ఎన్ని బాధలన్నా వుండనీ గాక – భజన యాత్ర సాగించాల్సిందే! అన్నింటికీ ఆ భగవంతుడే వుండాడు!’ అనుకొని, ఒకనాటి రాత్రి ఊర్లో వున్నవాళ్ళను భజన గుడిలో చేర్పించాడు. విషయం చెప్పాడు.

“ఈ కరువు కాలానికి పెండ్లాంబిడ్లను పస్తులు పెట్టేసి యట్టొచ్చేది సామీ?” అన్నారు కొందరు.

“ఎన్ని బాధలైనా వుండనీ... సంప్రదాయం పోగొట్టుకోకూడదు. ఈ కరువు ఈరోజుంటుందీ, రేపు పోతుంది... సంప్రదాయాలు పోతాయా? అంతా ఆ దేవుడే చూసుకుంటాడు!” అన్నారు. కొందరు.

ఎలాగయితేనేం? ఆ మరునాడే యాత్ర బయలుదేరాలని నిశ్చయించాడు సిద్ధోజీ. ఎంత ప్రయత్నించినా ఆ యాత్రకు పదిమందికి మించి సిద్ధపడలేదు. ఉన్నవాళ్ళనే వెంట తీసుకుని బయలుదేరారు.

అందరూ ఎఱ్ఱ దుస్తులు ధరించారు. ఎఱ్ఱ ధోవతులు తలకు, మొలకు చుట్టుకున్నారు. మెడలో రుద్రాక్షమాలలు వేసుకున్నారు.

మద్దెల, చిటితాళాలు, చిన్న హార్మోనియం పెట్టె ఎత్తుకొని, చిడతలు, ఎఱ్ఱజండాలు చేతబట్టుకొని గోవిందలు పెడుతూ యాత్ర మొదలుపెట్టారు.

సిద్ధోజీ పదేళ్ళ నాగోజీని వెంట బెట్టుకొని బయలుదేరాడు.

యామిగానిపల్లె గురువు తిరుమల యాత్ర సాగిస్తున్నాడని తెలుసుకున్న చుట్టుపక్కల పల్లె జనాలు ఆ ఊరి నుంచి కుప్పం వెళ్ళే దారిపొడుగునా నిలబడి చూడసాగారు.

పాండురంగ భజన కీర్తనలు – చెక్కభజన పాటలు, కోలాట పాటలు పాడుకుంటూ, నర్తిస్తూ వెళుతున్న ఆ బృందానికి జనం ముడుపులు చెల్లించసాగారు. కొందరు బట్టలిచ్చారు, ధాన్యమిచ్చారు. మరికొందరు డబ్బులిచ్చారు. ఎవరికి తోచింది – తృణమో, ఫణమో ఏదో వొకటి యిస్తున్నారు. ఈ దేశంలో తిండికి కరువైనా, బట్టకు గతిలేకపోయినా.... భక్తికి కొదవ లేదనిపించుకున్నారు. అన్నీ సేకరించుకొని కుప్పం చేరేటప్పటికి దాదాపు

అరమూట బియ్యం, ఒక తట్టెడు చింతపండు, మిరపకాయలు, మరికొన్ని పప్పుదినుసులు పోగయ్యాయి.

వాటిని చూసిన సిద్ధోజీకి చాలా ఆశ్చర్యం వేసింది.

'ఒకవైపున చాలా మంది జనం గంజి కేంద్రాలలో గంజి తాగి బతుకుతుంటే... మరోవైపు భక్తిలో మునిగిన జనం ధనం, ధాన్యం, దానం చేయడం... ఎంత వైరుధ్యముందీ జీవితంలో?! ప్రజల్లో వుండే ఈ భక్తిని ఆసరా చేసుకొనేకదా... కొందరు దొంగబాబాలు, స్వాములు కోట్లు గడిస్తున్నారు!' అనుకొని, వచ్చిన వాటిని అందరికీ సమంగా పంచి, ఇళ్ళకు చేర్పించాడు సిద్ధోజీ.

అలా ఆ ధాన్యంతో ఆ బృందం యింటికి తిరిగొచ్చేవరకు ఏ చీకూచింతా లేకుండా గడిచిపోయే అవకాశం లభించింది.

'దేవున్ని నమ్ముకున్నందుకు తమ కుటుంబాల కింత గంజి పోశాడు దేవుడు!' అనుకుని ఆనందంగా యాత్ర సాగించారు వాళ్ళు.

సిద్ధోజీ హాయిగా గాలి పీల్చుకున్నాడు.

"అప్పుడే సుఖం, అప్పుడే కష్టం... అప్పుడే ఆనందం, ఆ మరుక్షణాన్నే ఆవేదనం... అప్పుడే వెలుగు, అప్పుడే చీకటి... ఏమిటీ విచిత్రం? ఇదేనేమో జీవితమంటే...!" పరిపరి విధాలా ఆలోచిస్తూ అందరితోబాటు కుప్పంలో తిరుపతి బస్సెక్కాడు సిద్ధోజీ

ఆ తర్వాత చంద్రగిరిలో దిగి మంగాపురం దారిన కాలినడకతో కొండెక్కి భజనలు ప్రదర్శించి దేవుడ్ని చూసుకొని వారం తర్వాత బోడిగుండ్లతో ఊర్లో దిగారు ఆ బృందం వాళ్ళు.

ఆ శ్రీనివాసుడు సిద్ధోజీ మొర ఆలకించినట్టు – పుంగనూరు నుంచి ఇద్దరు వ్యక్తులు వచ్చి పదహైదు రోజులపాటు తాము జరపబోయే భారతోత్సవంలో నాటకాలు వేయాలని కొంత డబ్బు అడ్వాన్సు ముట్టజెప్పి వెళ్ళిపోయారు. దాంతో సిద్ధోజీకి కాస్త ధైర్యం వచ్చింది.

ఊర్లో జనాలు సగంమంది కరువుకు వలసవెళ్ళిన కారణంగా – తన భార్యతో సహా రేణుకమ్మను, యింకో స్త్రీని కూడా ట్రూపులో చేర్చుకొని ట్రైనింగిచ్చి తీసుకెళ్ళాడు.

ఆ ట్రూపులో చాలామంది కరువుకు తిండి జరిగిపోతుందని – తమ పిల్లల్ని కూడా తెచ్చుకున్నారు.

సిద్ధోజీ చిన్న కొడుక్కి అనారోగ్యం చేసింది. పిల్లవాడికి సరైన వైద్యం చేయించే పరిస్థితి కూడా లేకపోయింది. తీసుకున్న అడ్వాన్సు అందరికీ సమానంగా పంచి యిచ్చాడు.

పుంగనూరు పరిసరాలలో కరువు ఛాయలే కనిపించడం లేదు.... అక్కడక్కడా వరి మళ్ళు, చెరకుతోటలు సాగుబడిలో వున్నాయి.

ఊరు శివార్లలో మదనపల్లెకు పోయే రోడ్డు పక్కనున్న చింతతోపులో 'భారతం మిట్ట' ఏర్పాటు చేశారు.

ఆ భారతానికయ్యే ఖర్చులో ముక్కాలు భాగం పుంగనూరు జమీందార్లే భరిస్తున్నారు.

కార్యక్రమాల గురించి జమీందారు ఎప్పటికప్పుడు తెలుసుకుంటూనే వున్నారు.

భారతం కొడెక్కింది... విగ్రహాలు ఊరూరు తిరిగాయి. కలిశ ప్రతిష్ఠ, ధ్వజారోహణం జరిగాయి. నెల్లూరు నుంచి హరిదాసుని పిలిపించారు.

పగటి కథా ప్రారంభమైంది.

కొండెక్కిన మూడోరోజుకే సిద్ధోజీ ట్రూపు దిగిపోయింది.

ఆ ట్రూపులో కదిరయ్య, బంగారప్ప, నరసిమ్ములు, కోదండం, కొత్తోళ్ళ లచ్చుమయ్య, భద్రావతాయన... యింకా చాలామంది వున్నారు.

పెద్దకొడుకు నాగోజీని, చిన్నకొడుకుని తమతోబాటు తీసుకువచ్చాడు సిద్ధోజీ.

మొదటి రోజు 'కృష్ణలీలలు' వేశారు.

అందులో కంసుడిగా సిద్ధోజీ, అక్రూరుడుగా కదిరయ్య, దేవకీ వసుదేవులుగా రేణుకమ్మా, బంగారప్పలు వేశారు. యశోదగా పూర్ణమ్మ వేసింది. చిన్నికృష్ణుడిగా నాగోజీ వేశాడు.

నాటకం రసరమ్యంగా ప్రదర్శింపబడింది.

ఆ నాటకానికి జమీందారు కూడా విచ్చేశారు.

పాండవ జననం – ధర్మరాజు జూదం – ద్రౌపదీ వస్త్రాపహరణం – పాండవ వనవాసం – వారణావతం (హిడింబాసుర వధ) – బకాసుర వధ – యక్ష ప్రశ్నలు (పాండవులు విషనీళ్ళు త్రాగడం) – విరాటపర్వం (కీచకవధ) – ఉత్తర గోగ్రహణం – కృష్ణరాయభారం ... వంటి నాటకాలు వరుసగా సాగిపోతున్నాయి. డబ్బులు లేకుండా వేసే కొసరు నాటకాలుగా మధ్యలో 'మైరావరణ చరిత్ర' వేశారు. చివరినాడు 'సత్య హరిశ్చంద్ర' వేయాలని నిశ్చయించుకున్నారు.

పగటి కథను బట్టి – ఒకరోజు 'ద్రౌపదీ కళ్యాణోత్సవం' జరిగింది. పగలు ఆ ఉత్సవానికి తండోపతండాలుగా ప్రజలు వచ్చారు.

నాటక ప్రదర్శననుసరించి – ఒకరోజు పగలు 'అర్జున తపస్సు' జరిగింది. ఈసారి 'తపస్సు మాను'నరసిమ్ము లెక్కాడు.

సిద్ధోజీ చిన్నకొడుకు ఆరోగ్యం రోజుకోజుకీ క్షీణించసాగింది. ఎన్ని మందులు వాడినా తగ్గడం లేదు.

ఓ వైపున నాటక ప్రదర్శనలు!

మరోవైపున పిల్లవాడి అనారోగ్యం!

ఏం చేయాలో సిద్ధోజీకి పాలుపోలేదు. అప్పటికీ – అక్కడున్న ప్రభుత్వ ధర్మాసుపత్రిలో భారతం కార్యకర్తలు చూపిస్తూనే వున్నారు.

కానీ, ఆ ఆసుపత్రిలో మందుల్లేవు. మందులుంటే డాక్టరుండడు. అక్కడున్న నర్సుఏవో యిస్తుంది. పిల్లవాడు మింగుతూనే వున్నాడు. అయినా.... గుణం కనిపించడం లేదు.

ఆరోజు బలిబండి తిరిగేరోజు.!

ఆ ముందురోజే చుట్టుపక్కల పల్లెల్లో 'బలిబండి' తిరుగుతుందని దండోరా వేయించారు.

ఆరోజు ఉదయాన బలిబండి సిద్ధమైపోయింది. ఒక ఎడ్లబండిలో కొత్తగా వెదురుదబ్బలతో అల్లిన ఒక 'దొల్ల'ను వేసి, దాని అడుగుభాగాన రెండు సిరిచాపలు పరిచారు.

చక్రాలకు సున్నం పూసి, ఎఱ్ఱమన్ను పట్టెలు పెట్టి, రంగు కాగితాలతోను, టెంకాయ ఆకులు, నేరేడు మండలతోను అలంకరించారు. ఎడ్లకొమ్ములకు రంగులు పూసి,కుప్పెలు తొడిగి, వాటినీ అలంకరించారు.

నరసిమ్ములు భీముని వేషం వేశాడు. అతనితోబాటు తబలా, తాళాలు తీసుకుని ఓ నలుగురు పాండవుల పాత్రధారులు వేషాలు లేకుండా బయలుదేరారు.

ముందర డప్పులు, పంబల వాద్యాలతో బాటు, పోతరాజు విగ్రహం, కొందరు కార్యకర్తల పర్యవేక్షణలో పెద్ద ఊరేగింపుతో ముందుగా జమీందారుగారింటికి బయలుదేరింది బలిబండి.

సిద్ధోజీ బిడ్డను తీసుకుని ఆసుపత్రికి బయలుదేరాడు

జమిందారుగారి 'నగరు'చేరి, 'వెడలె పవన సుతుడు.... వేగ బకాసురుడి సన్నిధికీ!" అంటూ భీముడు దరువందుకున్నాడు. వెంట వచ్చిన కళాకారులు వెనుక పాట పాడారు.

అలా పదినిమిషాలు సాగిన తర్వాత నగరులో నుంచి ఓ పెద్ద పాత్రలో పిండివంటలు, అన్నము అందించారు పనివాళ్ళు.

వాటి నందుకొన్న భీముడు కొద్దిగా రుచిచూసి, మొత్తం దొల్లలో పోయించాడు. ఆ తర్వాత అలా ఇల్లిల్లు తిరిగి పిండివంటలు, అన్నం సేకరించారు. అలాగే... ఆరోజు సాయంత్రం నాలుగు గంటల వరకు చుట్టుపక్కల పల్లెల్లో 'బలిబండి' ఇల్లిల్లు తిరిగింది. పల్లెల్లో బండికి హారతులిచ్చి, కొబ్బరికాయలు కొట్టి, నీరాజనాలర్పించారు జనాలు. ఆవేళ ప్రతి పల్లె ఒక 'ఏకచక్ర' పురంగాను, బండిలో కూర్చున్న ఆ వేషధారే నిజమైన భీముడిగాను అనిపించింది.

ప్రజలు అందించిన పిండివంటలతోను, అన్నంతోను డొల్ల నిండింది. ఆ అన్నాన్ని 'భారతం మిట్ట'లో ఒకవైపున ఈతచాపలు పరచి దానిపైన కుమ్మరించారు. ఆ అన్నం, తెల్లటి మంచుగుట్టలా కనిపిస్తోంది. ఆ అన్నాన్ని అక్కడ చేరిన వాళ్ళకు ప్రసాదంగా అందించారు.

కోటీశ్వరులయిన జమీందార్లు మొదలుకొని, కూటికి గతిలేని అతిపేద రైతు కూలీ సైతం వేసిన అన్నం అది! అందులో కులాల భేదాలు, మతాల తేడాలు ఏవీ లేకపోయాయి. ఆ అన్నాన్ని పేదసాలకు వడ్డించి అన్నదానం నిర్వహించారు. అలా ఆ తంతు ముగిసింది.

అదంతా పరిశీలిస్తున్న సిద్ధోజీకి 'దేశంలో ఒకపక్క కరువుకు తిండిలేక జనాలు చస్తా వుండారు. ఈడమాత్రం భక్తి పేరుతో అన్నం కుప్పల్ని దానం చేస్తున్నారు.... ఏమిటీ విచిత్రం? ఎందుకిలా వుంది పరిస్థితి....??"

–పరిపరి విధాల ఆలోచిస్తూ వేషాల పాకలోనే బిడ్డకు మందిస్తూ కూర్చున్నాడు

మరో రెండురోజులు గతించాయి.

భారతోత్సవం వైభవంగా గడిచిపోతోంది.

ఒకవైపు పగటికథ!

మరోవైపునాటకాల రూపంలో రాత్రి కథ!!

భారతం మిట్టలో ఎక్కడ చూసినా జనాలే.... ఎక్కడ చూసినా సందడే! పిల్లలు, పెద్దలు, ముసలీ ముతకా.... అన్ని వయసుల వాళ్లు కనిపిస్తున్నారు.

భారతం మిట్ట చుట్టూ రకరకాల అంగళ్లు వెలసి వున్నాయి. టీకొట్లు, మిఠాయి అంగళ్ళు, బోండాల సెంటర్లు, ఇవిగాక జూదంలాసాగే చింతగింజ లాటలు సాగుతున్నాయి.

వాటిని చూసిన సిద్ధోజీ..... 'ఇక్కడ వినోదాల ఆటలు – అక్కడ బతుకు పోరాటాలు!' అనుకున్నాడు.

విరాట పర్వమైన మరునాడు సాయంత్రం అయిదు గంటలకంతా ఊర్లోవుండే పశువుల నన్నింటినీ భారతం మిట్టకు తోలారు. బృహన్నలగా బంగారప్ప వేశాడు. ఉత్తరుడిగా కోదండం వేశాడు.

బాగా అలంకరించిన ఒక ఎడ్లబండిలో బృహన్నల వేషం కట్టిన బంగారప్ప బండి నొగలపైన కూర్చొని ఎడ్ల పగ్గాలు చేతబట్టాడు. ఉత్తరుడి వేషంలో వున్న కోదండం విల్లు బాణాలు చేతబట్టుకొని ఎక్కి బండిలో నిలబడ్డాడు.

కొన్ని వేల మంది జనం... ఆ ఘట్టాన్ని తిలకించడానికి వచ్చారు.

భారతం మిట్టలో సగం వరకు పశువులు... మిగిలిన సగభాగంలో ప్రేక్షకులు!

కొందరైతే పక్కనున్న ఇండ్లపైన, చెట్లపైన ఎక్కి కూర్చున్నారు.

అంతా గందరగోళంగా వుంది!

ఆవేళ వాళ్ళు 'ఉత్తర గోగ్రహణ' ఘట్టాన్ని అభినయించసాగారు. జమ్మిచెట్టులో నుంచి ఆయుధాలను ఉత్తరుడి చేత దింపించి, యుద్ధానికి సన్నద్ధుడైన విరాటుని గోవుల్ని కబళించుకుని వెళుతున్న కౌరవ సైన్యాలతో బృహన్నల రూపంలో వున్న అర్జునుడు యుద్ధానికి తలపడి గోవుల్ని మళ్లించుకు వచ్చే ఘట్టం...!

మొదట కౌరవ సైనికుల్ని చూసి ఉత్తరుడు భయభ్రాంతుడవడం, అతనికి అర్జునుడు ధైర్యం చెప్పి ముందుకు పోవడం అభినయించసాగారు.

బిడ్డ ఆరోగ్యం బాగా లేకపోయినా – ఆ కార్యక్రమాన్ని సిద్ధోజీనే పర్యవేక్షిస్తున్నాడు.

"రథము తోలెను అర్జునుండు, ఉత్తరుని కపుడు! ॥రథం॥"

–ఆట తాళంలో దరువందుకున్నాడు బంగారప్ప.

ఉత్తరుడు బెదిరిపోయే ఘట్టాన్ని – కోదండం బండి దిగి పారిపోతూ అద్భుతంగా నటించి అందర్నీ కడుపుబ్బ నవ్విస్తూ పాడి మెప్పించాడు.

చివరన బంగారప్ప పాండవుల అజ్ఞాతవాస వృత్తాంతాన్ని దరువుల రూపంలో పాడి వినిపించిన తర్వాత – బండిని గోవుల చుట్టూ పరుగెత్తించి, గోవుల్ని అదిలించి, బెదిరించి, మూడుసార్లు భారతం మిట్టంతా తిప్పించి, తరిమేశారు.

ఆ సమయంలో కొన్ని పశువులు ప్రేక్షకుల్లో జొరబడి ఒకరిద్దరికి గాయాలు కూడా అయ్యాయి.

గోవుల్ని బెదిరించినపుడు లేచిన గోధూళి పెద్ద మేఘంలా పైకి లేచి, ప్రేక్షకుల్ని కప్పేసింది.

ఆ కార్యక్రమం ముగించి వెళ్లేసరికి బిడ్డ ఆరోగ్యం ఇంకా క్షీణించిపోయింది.

గవర్నమెంటు ఆసుపత్రి మందులు వేస్తూనే వున్నాడు. అయినా అనారోగ్యం పెరుగుతూనే వుంది. పిల్లవాడు డొక్కలు ఎగరేస్తూ ఆయాసపడిపోతున్నాడు. పూర్ణమ్మ బెంబేలు పడిపోసాగింది.

పరాయి దేశం... పైగా కరువు! ఆ కారణంగా సరయిన వైద్యం యిప్పించలేక పోతున్నాడు.

పరిస్థితిని గమనించిన కదిరయ్య, నరసిమ్ములు –

"గురువా! బిడ్డెను తీసుకుని తిరుపతి రొయ్యాసుపత్రి కన్నా పోండి! లేదా వేలూరు సి.యం.సి. కన్నా పోండి.... ఇక్కడ పరిస్థితి మేం చూసుకుంటాం!" అని భరోసా యిచ్చారు.

భారత నాటకాలను తను కాంట్రాక్ట్ తీసుకుని, ఆ బాధ్యతను వాళ్లపైన నెట్టిపోవడానికి అతనికి మనస్కరించలేదు. పైగా.... బయటి ఊరికి తీసుకెళ్లి మంచి వైద్యం చేయించడానికి తగిన మొత్తం తన దగ్గర లేకపోయింది. ఎలాగో ఓలాగు అలాగే నెట్టుకురావడానికే నిశ్చయించుకున్నాడు.

"వాడి తలరాత, మా అదృష్టం యట్ట రాసింటే అట్ట సాగతాది!" అన్న మొండిధైర్యంతో ఉండసాగాడు సిద్ధోజీ.

ఆ మరునాడు ద్రౌపది అగ్నిగుండ ప్రవేశం...!

దాన్ని ఆరోజు తెల్లవారి అయిదు గంటలకే జరపాలని నిశ్చయించారు.

అందుకోసం భారతం మిట్టలో ఓ వైపున పెద్దపెద్ద చింత మొద్దులు, కట్టెలు వేసి, కాల్చి నిప్పు చేశారు. చంద్రనిప్పులు ఎఱ్ఱగా పేదవాడి గుండెల్లా నిగనిగ మండిపోతున్నాయి. సెగలు గక్కుతున్నాయి.

ఆరోజు ఉదయం నాలుగు గంటలకే నాటకం ఆపేశారు.

నటులు కూడా పక్కనే వున్న చెరువుకు వెళ్ళి చన్నీటితో స్నానాలు చేసి వచ్చారు.

పూర్ణమ్మ, సిద్ధోజీ కూడా సచేల స్నానాలు ఆచరించి, బిడ్డనెత్తుకొని, తడిబట్టలతోనే అక్కడికి చేరుకున్నారు.

గుప్తరోగాలతో బాధపడేవాళ్ళు, దయ్యాలూ, భూతాలు ఆవహించిన మానసిక రోగులు, ఆ గుండం తొక్కితే బాగైపోతుందన్న నమ్మకంతో అక్కడికి చేరుకున్నారు. సంతానం లేని వాళ్ళు సంతానార్థులై గుండం తొక్కడానికి సిద్ధపడిపోయి వచ్చేశారు. ఇంకా అనేక కోరికలు కోరేవాళ్ళు, పెళ్ళికాని వాళ్లు, పెళ్ళయినవాళ్లు ఒకరేమిటి - చాలా మంది నిప్పులు తొక్కడానికి సిద్ధంగా వున్నారు.

వాళ్లకోసమే ఎదురు చూస్తున్నట్లు - గుండంలో నిప్పులు... రవరవగా మండుతూ కనిపిస్తున్నాయి.

బారెడు వెడల్పుతో, పదడుగుల పొడవుతోవున్న ఆ గుండంలోని నిప్పుల్ని ఓ వ్యక్తి కట్టెతో చదును చేశాడు

ఉత్సవం ప్రారంభమైంది.!

పోతరాజు విగ్రహాన్ని, ద్రౌపది విగ్రహాన్ని పంబల వాద్యంతో అక్కడికి తెచ్చిపెట్టారు.

ఇద్దరు కన్నెస్వాములు వాటికి కొబ్బరికాయలు కొట్టి, ద్రౌపది విగ్రహాన్ని చెరోవైపు పట్టుకొని ఎత్తి, గుండాన్ని సమీపించారు.

అందరి హృదయాల్లోను భక్తిభావం నిండివుంది.

మరో కన్నెస్వామి తడిపసుపును చేతులకు పూసుకొని, ఆ చేతుల్తో గుండంలో నుంచి దోసెడు చంద్రనిప్పుల్ని తీసుకొని, వాటిని పసుపులో తడిపిన ఓ బట్టలో కట్టి, ఆ గుడ్డను ద్రౌపది విగ్రహానికి 'వడిబాలు'గా కట్టాడు.

పంబల, పలకలు అదేపనిగా మ్రోగుతున్నాయి.

దెయ్యాలావహించిన వాళ్లు ఆ డప్పుల కనుగుణంగా గంతులు వేస్తూ, కేకలు వేస్తూ వీరంగం చేస్తున్నారు.

"నీ యబ్బడాలా..... ఎవరే..నువ్వు? అన్నెం పున్నెం తెలీని ఆడబిడ్డను పట్టుకోని అల్లాడిస్తా వుండావు...పో! వదలి పో...!!" – అంటూ అశ్లీలంగా తిడుతూ ఆ కన్నెస్వామి దెయ్యం ఆవహించిన స్త్రీని యింకా వేగంగా వీరజాటీతో కొట్టసాగాడు.

ఆ దెబ్బలకు తాళలేని ఆ యువతి – "ఇంకరాను స్వామీ... నన్ను కొట్టొద్దు! నిప్పుల్లో దూకతా సామీ.... ఈ శరీరాన్ని వదిలిపోతా! ఈ బిడ్డె జోలికింక రాను సామీ... కొట్టద్దు!" అంటూ మొత్తుకుంటోంది.

"సరే... ఊc... దూకు నిప్పుల్లో!" హుంకరించాడు కన్నెస్వామి.

బెదిరిపోయిన ఆయువతి "దూకతా...దూకతా..." అంటూ గుండంలో దూకి నిప్పుల్ని తొక్కుకుంటూ ఇవతలికి వచ్చేసింది.

బిడ్డెను భుజాన వేసుకుని వచ్చి, "అమ్మా తల్లీ! ద్రౌపదమ్మా! సామి తల్లీ! నా బిడ్డను కాపాడు తల్లీ! రోగం దూరం జేసి ఆరోగ్యం ప్రసాదించు తల్లీ! నీకు దాసానుదాసున్ని..... కాపాడకరా తల్లీ! సామి తల్లీ! అంటూ నిప్పుల్లో అడుగుపెట్టి "గోయిందా! గోయిందా!" అనుకుంటూ అటువైపు నుంచి ఇటువైపు కొచ్చేశాడు సిద్ధోజీ. అలా మూడుసార్లు గుండం తొక్కి 'ఇంక ఆ ద్రౌపదమ్మే నా బిడ్డను కాపాడకొస్తాదిలే!' అనుకుంటూ వచ్చేశాడతను.

ఆ తర్వాత రెండో రోజు....

'కృష్ణ రాయబారం' నాటకం వేసేరోజు...!

ఆరోజు ఉదయమే ఉలూచీ అర్జునుల పుత్రుడయిన నాగార్జునుడి (ఇలావంతుడు, బలిరాముడని జానపద వ్యవహారం)ని పాండవులు తమ ఆయుధాలకు బలివ్వడానికి సిద్ధపడే ఘట్టం కోసం – భారతం మిట్టలో... ఆగ్నేయం వైపున రంగస్థలానికి కొంతదూరంలో తొమ్మిదడుగుల ఎత్తులో ఒక వెదురు గుంజను పాతి, దానికి వరిగడ్డి చుట్టి – ఆ గడ్డిపైన బంకమన్ను మెత్తించి భయంకరమైన ఆకారాన్ని నిర్మించారు. పెద్దపెద్ద మిడిగ్రుడ్లు, ఎఱ్ఱని ముఖానికి పెద్దవైన నల్లటి మీసాలు, పెద్ద కిరీటం, రంగు రంగులతో దిద్దారు. అది పూర్తయ్యేసరికి సాయంత్రం అయింది. దాన్నీ సిద్ధోజీనే పర్యవేక్షించాడు.

ఆరోజు రాత్రి... ఉద్యోగపర్వంలో 'కృష్ణ రాయభారం' కథ పాడసాగారు. అరణ్య, అజ్ఞాతవాసాలు ముగించుకు వచ్చిన పాండవులు దాయభాగం కోసం తమ ద్రుపద పురోహితుని రాయబారిగా హస్తినకు పంపడం... దానికి ప్రతిగా కౌరవులు – పాండవులకు దాయభాగార్హత లేదని తెలియజేయడానికి సంజయుని ఇంద్రప్రస్థానికి పంపడం... చివరగా కౌరవ, పాండవ యుద్ధ నివారణకు కౌరవుల చెంతకు కృష్ణుడు రాయబారం వెళ్ళడం, అదీ విఫలమై యుద్ధం అనివార్య మవడం....అన్నీ నాటకంలో చోటుచేసుకోసాగాయి. ఆ తరుణంలో తమ ఆయుధాలకి ఎదురు రోమాలతో పుట్టి, వెయ్యేనుగుల బలం కలిగిన బ్రహ్మచారైన మహావీరుడ్ని గనక బలియిస్తే తప్పక జయం లభిస్తుందని – జ్యోతిశ్శాస్త్రవేత్త, మహాజ్ఞాని అయిన సహదేవుడు అటు కౌరవులకు, ఇటు పాండవులకు ఒకేరీతిగా చెప్పడం దరువుల రూపంలో సాగింది.

అందరికంటే ముందు తన బలిదానాన్ని కోరివచ్చిన తన తండ్రులయిన పాండవుల్ని చూసి ఇలావంతుడు సంతోషించి – తన తల్లికి ప్రియమైన వ్యక్తి, తన తండ్రి అయిన అర్జునుడికి పాదాభివందనం చేసి వచ్చి, విషయం గ్రహించి,రాబోయే యుద్ధంలో తమతో బాటు పాల్గొని, 'కౌరవుల్ని చీల్చి చెండాడి, తన ప్రతాపాన్ని నిరూపించుకునే అవకాశం లేకుండా చేస్తున్నారే....' అని చింతించి, కనీసం పాండవుల పరాక్రమాల్ని చూసి తరించే భాగ్యమైనా కలిగించండని కృష్ణుడ్ని వేడుకోవడం, అందుకు కృష్ణుడు – ఆదినుంచీ యుద్ధ సమాప్తి వరకు అతను యుద్ధాన్ని సందర్శించే వరమివ్వడం – పాడింతర్వాత ఇలావంతున్ని ఆయుధాలకు బలివ్వడానికి తీసుకువచ్చే ఘట్టం సిద్ధం చేసుకున్నారు.

ఆ తంతు చాలా విచిత్రంగా సాగింది.

పాండవుల వేషధారులు, ఇలావంతుల్ని తోడ్కొని రంగస్థలం పైనుంచి... నిష్క్రమించి వెంటనే కన్నెస్వామిగా దీక్ష తీసుకుని వున్న బైరాగిని 'బలిరాముడు'గా సిద్ధం చేశారు.

అతని ముఖానికి మసిపూసి సున్నంబొట్లు పెట్టారు. అతని బట్టల్ని ఊడదీసి, మొలకు వేపాకు మండలు చుట్టారు. ఓ పొడువాటి తడిబట్టతో అతని నెత్తికి చుట్టచుట్టి... ఒక చిన్న పచ్చికుండను పెట్టారు. ఆ కుండలో వెలుగుతున్న నూనెదీపం వుంచారు. ఆ తర్వాత ఒక వేటను కొట్టి – దాని కాలేయాన్ని, గుండెకాయను తీసి ఒక కమ్మికి గుచ్చి నిప్పులపైన కాల్చి, ముక్కలు చేసి – అందులో కొన్ని ముక్కల్ని తీసి ఓ కన్నెస్వామి... "కిలిలో కిలిలో..." అంటూ కిలారిస్తూ నాలుగు వైపులకి పడేటట్లు ఆకాశంలోకి విసిరాడు. ఆ తర్వాత ఆ వేట నాలుకను మొదలంటా కోసి, అతని నోటికి కరిపించారు. అది జానెడు పొడవుతో వేలాడుతూ భయంకరంగా కనిపిస్తోంది. దాని పొట్టకోసి, పేగులు తీసి అతని మెడకు వేశారు.

ఆ తర్వాత ఊరేగింపు ప్రారంభమైంది!

డప్పులు, కొమ్ములు, పంబల వాద్యాల శబ్దం మిన్నుముట్టింది. వాద్యాల మధ్య ఓ వ్యక్తి పోతరాజు విగ్రహాన్ని నెత్తిన పెట్టుకొని వెళుతుంటే... ఆ వెనుక నగ్నభైరాగిని భారతం మిట్ట వెలుపలి నుంచి ఊరేగింపుగా తీసుకుపోసాగారు

"బలిరాముడి ఊరేగింపు వస్తావుండాది! ఎక్కడోళ్లు అక్కడే కూసోండి... ఎవ్వరూ సూడొద్దు! అట్ట సూసినోళ్ళకు సెరుపు జరగతాది.... ఎవురూ ఎదురురావద్దు! అట్లా వచ్చినోళ్లు నెత్తురు కక్కుకొని సస్తారు!" అంటూ హెచ్చరించసాగారు.

ఓ పదిమంది కార్యకర్తలు భైరాగిని వలయాకారంగా చుట్టి, దగ్గరకు ఎవరినీ రాకుండా జాగ్రత్త పడసాగారు. అలా నగ్నంగా ఆ భారతం మిట్టను భైరాగి చేత మూడుచుట్లు తిప్పించారు. ఆ తర్వాత అతన్ని అలాగే విగ్రహం దగ్గరకుతీసుకువచ్చి, దీపపు కుండను అక్కడ పగలగొట్టించి, అతని చేతికొక కొడవలిచ్చి, బలిరాముడి విగ్రహం ఎడమ చెంపను నరికించారు. ఆ విగ్రహ దృష్టి దోషం ప్రజల పైన పడకుండా – దాని తలను దక్షిణం వైపుకు తిప్పేసి, భైరాగిని అక్కడినుంచి తీసుకువెళ్లిపోయారు.

సరిగ్గా అప్పటికి ఉదయం ఐదు గంటలు దాటింది.

తిరిగి నాటక ప్రదర్శన ప్రారంభమైంది!

"వెడలె కౌరవుల దండు వెడలె... పాండవులపైకి

వెడలె కౌరవుల దండు... వెడలె... వెడలె..."

మధ్యమావతి, ఆదితాళంలో ఆవేశంగా గంతులేశారు కౌరవ వేషగాళ్లు. అందులో ఒకతను ఒక నుడుగు సగం పాడి ఆపితే – మిగిలినవాళ్ళు మిగతా సగాన్ని పాడసాగారు.

రంగస్థలం పైన చిందులు తొక్కుతున్నారు... కేకలు వేస్తున్నారు... అరుస్తున్నారు... ఈలలు వేస్తున్నారు... గట్టుకు కదలివచ్చే కడలి తరంగాన్ని తలపింప జేస్తున్నారు. తమ పటాటోపమంతా ప్రదర్శిస్తున్నారు.

పాటపాడే వ్యక్తి.... 'కౌరవుల దండు' అంటూ చేతులు ముందుకు చాపి,పైకీ కిందికి వేగంగా ఊపుతూ 'అడుగు' వేస్తూ ఆపగానే – మిగిలినవాళ్ళూ అతన్ననుసరిస్తూ.... అంతే వేగంగా "వెడలే...." అంటూ దరువును ఆదికెక్కిస్తున్నారు.

"కౌరవుల దండు..." అతను –

"వెడలె!" మిగిలిన వాళ్ళు.

"కౌరవుల దండు..."

"వెడలె!"

"కౌరవుల దండు..."

"వెడలె!"

వాళ్ళ అడుగులకి దెబ్బకి రంగస్థలమంతా గుమ్మెత్తిపోయి, దుమ్ము పైకి లేచింది.

వాళ్ల అరుపులకి వులిక్కిపడి లేచాడు సిద్ధోజీ చిన్నకొడుకు.

"అమ్మా.." అంటూ నీరసంగా ఏడవసాగాడు.

"బజ్జోరా... నాయనా.... బజ్జోరా!"

వీపు తడుతూ తిరిగి నిద్రపుచ్చింది పూర్ణమ్మ.

కౌరవుల దండు లాగానే.... పాండవుల దండు ఆవేశంగా రంగస్థలం పైకి దూకింది.

ఒకవైపు కౌరవుల దండు....

మరోవైపు పాండవుల దండు...

యిద్దరికీ యుద్ధం జరిగింది!

సరిగ్గా అప్పటికి.... ఆదిశేషునిపడగపైన మెరిసే మణిలా – తూర్పుకొండలపైన ప్రకాశిస్తూ ఉదయించసాగాడు సూర్యుడు.

ఆ రోజుకి నాటక ప్రదర్శన ఆగింది!

అదే సమయంలో సిద్దోజీ చిన్న కొడుకు ఆయాసంతో ఊపిరాడక కళ్లు తేలేసేశాడు.

పూర్ణమ్మ లబోదిబోమంది!

ఖంగారుపడిపోయిన సిద్ధోజీ గబగబ వేషాన్ని తీసేసి, అంత కొబ్బరి నూనె తీసుకుని ముఖానికి పూసుకొని అర్దాలం తుడిచేసుకున్నాడు. ఆ తర్వాత ముఖం కడుక్కుని, పరుగున ఆసుపత్రికి పరుగెత్తాడు. ఆసుపత్రిలో అప్పటికీ లైట్లు వెలుగుతూనే వున్నాయి.

ఉదయం ఏడుగంటలగ్గానీ ఆసుపత్రి తెరవరనీ, తెరిచినా డాక్టరు ఏ తొమ్మిదికోగానీ రాడనీ.... వాచ్‌మన్ ద్వారా తెలుసుకుని హతాసుడైపోయాడు సిద్ధోజీ.

పిల్లవాడి ఎగశోష ఎక్కువైంది. న్యూమోనియా వల్ల ఊపిరాడక కళ్లు తిప్పుతున్నాడు.

సిద్ధోజీ గుండెల్లో గుండెల్లేవు.

"బిడ్డ ఎగశోష పడతా వుండాడు.... మార్గం సెప్పయ్యా.... డాక్టరెక్కడుంటాడు?" ప్రాధేయ పూర్వకంగా అడిగాడు.

"అయ్యో....అవును గదయ్యా! డాక్టరుది ఈ ఊరు గాదు. ఆయన్ది చౌడేపల్లి! దినొమ్ము ఇస్కూటర్లో వచ్చిపోతాడు. పది గంటల గ్గానీ రాడే! సరే.... యింకో పంజెయ్యి!" అన్నాడు వాచ్‌మన్.

"చెప్పయ్యా...!" ఆతృతగా అడిగాడు సిద్ధోజీ.

"ఇద్దో... ఇట్ట ఈ సందులోనించి పోతే... క్వార్టర్స్‌లో మూడో యిల్లే అరుణమ్మనే నరసమ్మిల్లు! భలే మంచిదిలే... ఆడికి పో! సెప్పగూడదు గానీ – ఆ డాకటేరు కంటే ఆ నరసమ్మే మేలుపో...!" సందులోకి చేయి చూపిస్తూ అన్నాడు.

అతని సూచన ప్రకారం – నరసమ్మింటికి వెళ్ళి "అమ్మా తల్లీ! నరసమ్మా! యట్టయినా నా బిడ్డను కాపాడమ్మా.... నీకు పున్నె ముంటుందమ్మా!" అంటూ ఏడ్చినంత పనిచేశాడు సిద్ధోజీ.

ఆమె బిడ్డెను టేబుల్‌పైన పడుకోబెట్టి పరీక్ష చేసి, తన దగ్గరున్న యింజక్షన్ గుచ్చి, రెండు మాత్రలు చేతిలో పెట్టి "ఇవి మింగించి, పది గంటలపైన డాక్టర్ వస్తాడు...ఆసుపత్రికి తీసుకురా!" అని అయిదు రూపాయలు తీసుకుంది.

"నా బిడ్డకేం పరవాలేదామ్మా?" దీనంగా అడిగాడు సిద్ధోజీ.

"భయమేమీ లేదుగానీ, మంచి ఆహార మిచ్చి, మంచి వైద్యం చేయిస్తే సరిపోతుంది!" ధైర్యం చెప్పింది నర్సు.

పిల్లవాడ్ని తీసుకుని తిరిగి వచ్చేశాడు సిద్ధోజీ.

పది నిమిషాల్లో పిల్లవాడు కాస్త మామూలు స్థితికి వచ్చాడు, కానీ, అప్పుడప్పుడు "అమ్మా! అమ్మా!" అని ముక్కసాగాడు.

నటులందరికీ ఆ పిల్లవాడిపైన జాలి, సానుభూతి కలిగాయి. అందరూ ఆ పిల్లవాడి ఆరోగ్యం కోసం దేవుడ్ని ప్రార్థించారు.

ఆరోజు ఉదయం పళ్ళు తోముకొని, స్నానాలు చేసి, టిఫిన్ ముగించుకొని అందరూ తెరవెనుకనున్న పాకలోనే నిద్దరపోయారు. కానీ పూర్ణమ్మ, సిద్ధోజీ మాత్రం నిద్దరపోలేదు. పిల్లవాడ్ని కనిపెట్టుకొని తూగుతూ కూర్చున్నారు. అలా కొంత సేపు గడిపి, ఒకరి తర్వాత ఒకరువంతులు వేసుకుని నిద్రపోసాగారు.

మంచివైద్యం చేయించాలంటే – చేతిలో అంత డబ్బులేదు. తెచ్చుకున్న డబ్బులు మందులకు, ఖర్చులకే అయిపోయాయి. మరికొంత డబ్బుల్ని తీసుకుని వైద్యం చేయిద్దామనుకుని – అడ్వాన్సు యిచ్చిన వ్యక్తిని కలిసి మరికొంత డబ్బు అడిగాడు. మిగిలిన డబ్బులు కాంట్రాక్టు ప్రకారం నాటకం చివరిరోజున యిస్తానన్నాడతను. వాళ్ళకూ సమయానికి రావాల్సిన డబ్బులు రాలేదు.

నాటకాలు ముగియాలంటే యింకా మూడురోజులు ఆడాలి. పద్మవ్యూహం, దుర్యోధన వధ, అవిగాక ఈనాముగా రెండో నాటకం ఆడాల్సి వుంది.

'సరే! అంతా దేవుడి యత్నం!' అనుకుని, భారతమంతా దేవునిపైన వేసి, ప్రభుత్వ ఆసుపత్రిలో డాక్టరు దగ్గరే వైద్యం చేయిస్తున్నాడు.

పిల్లవాడికి ఆరోజంతా కాస్త నయంగానే తోచింది.

ఆ మరునాడు....ట్రాక్టర్‌తో భారతం మిట్టలో ఈశాన్యం వైపున ఎఱ్ఱమట్టి తోలించారు. మరో బండి బంకమట్టీ తోలించారు.

ఆ మట్టిని మూడడుగుల ఎత్తు, ఇరవై అడుగుల పొడవుతో సన్నకట్టలా ఎగదోసి, ఆమట్టిని నీళ్ళతో తడిపినారు. పంబల వాయించే బవనీల వాడు... ఆ మట్టిపైన కూర్చొని ఓ డేక్సాలో నీళ్ళు పోయించుకుంటూ, ఆ నీళ్ళతో చేతులు పదును చేసుకుంటూ, మనిషి ఆకారాన్ని తీర్చాడు. అందులో కుడిచేతిలో గదను చిత్రించడంలో మునిగిపోయాడు.

ఆరోజు మధ్యాహ్నం..... ఆటోళ్లంతా భోజనాలు చేశారు. వాళ్లు రేయంతా నాటకం వేసి పగలంతా ఆ జోబిడిలోనే నిద్రపోతున్నారు. కొందరు నిద్రపట్టక పిచ్చాపాటీ మాట్లాడుకుంటున్నారు.

ఆ జోబిడి కప్పుకున్న వెదురు దబ్బలకు పురుషులు ధరించేరకరకాల విగ్గులు, స్త్రీలు ధరించే సవరం విగ్గులు వ్రేలాడుతున్నాయి. ఒక మూల ఓ మూడు గదలు, కొన్ని విల్లులు, బాణాలు, కత్తులు, కొన్ని దుడ్డుకర్రలు ఉంచబడివున్నాయి. మరికొన్ని బాణాలు, విల్లులు కప్పుకు వేలాడదీయబడి వున్నాయి. అవన్నీ రంగురంగుల్తో వుండి కళ్లకు ఇంద్రధనుస్సుల్లా కనిపిస్తున్నాయి.

ఇక్కడ – పంబలవాడు తను తీర్చుతున్న బొమ్మకు ఎడమచేతిలో ఓ కత్తిఆకారాన్ని చిత్రించాడు. ఆ తర్వాత పొడుగాటి కాళ్లను చిత్రించాడు. ఆ పిదప బంకమట్టిని నీళ్లతో తడిపి. ముఖాన్ని చిత్రించాడు. ఆ బంకమట్టితో ముఖంలో ఎత్తయిన ముక్కును, పెద్దపెద్ద మీసాలను, కనుగుడ్లను తీర్చాడు. ఆ పిదప కిరీటాన్ని చిత్రించాడు. మిగిలిన బంకమట్టితో..... బొమ్మ పైభాగాన్ని కప్పి, సాపు చేశాడు.

కాళ్లు చాపుకొని వెల్లకిలా పడుకున్నట్లుగా చిత్రింపబడిన దుర్యోధనుడి ఆకృతి అది!

అక్కడ 'దుర్యోధన వధ' ఘట్టాన్ని ప్రదర్శించాల్సి వుంది.

అక్కడ – జోబిడిలో .. నిద్రపోతున్న వాళ్ళలో కొందరు గుర్రు పెడుతుంటే, మరికొందరు బుస్స వదుల్తున్నారు.

పూర్ణమ్మ పిల్లల్ని పక్కన వేసుకుని నిద్రపోతోంది. ఆమె కానుకొని సిద్ధోజీ 'కొత్తూరు రామలింగార్య కవి రచించిన శ్రీ మహాభారత నాటకం' పది పర్వాల బైండు బుక్కు తెరిచి దరువులు చదువుకుంటున్నారు.

కదిరయ్య, నరసిమ్ములు మాత్రమే మేల్కొనివున్నారు.

"ఏమప్పా గురవా.... ఎట్టుంది పిల్లోడికి?" ప్రశ్నించాడు కదిరయ్య,

"నర్సమ్మ సూదేసింది.... డాకట్రు ఏదో ఎర్రమందు నీళ్లిచ్చినాడు. పిల్లోడు కొంచెం నిద్రపోతా వుండాడు... ఫరవాలాన్నా!" అన్నాడు సిద్ధోజీ.

"దుర్యోధనుడి బొమ్మ తీర్చుతా వుండాడు పంబలోడు! దాన్ని చూస్తావుంటే నాకు కొన్ని అనుమానాలు అయ్యవారా?" అన్నాడు నరసిమ్ములు.

పుస్తకం చదవడం ఆపేసి, పక్కన పెట్టి – "ఏమో చెప్పు!' అన్నాడు సిద్ధోజీ.

"అసలు ఈ దుర్యోధనుడి బొమ్మ ఎందుకు తీర్చాల?"

"ఏమి లేదబ్బా! యుద్ధంలో అందరూ సచ్చిపోయింతర్వాత దుర్యోధనుడు బొయ్యి 'జల్ది' (జలధి)లో దాక్కుంటాడు గదా.. ఆ మడుగులో ఆయప్ప తపసు చేసుకుంటూ వున్నిట్టు జనాలకు తెలవాలని ఆ బొమ్మ తీరస్తారు. దాన్ని యింకో విధంగా కూడా చొప్పొచ్చు. దుర్యోధనుడు శ్యానా చెడ్డోడు. పాపిష్టోడు గదా.... అట్ల పాపాలుచేసే సెడ్డోళ్లంతా ఎప్పుడో వొగప్పుడు... దుర్యోదనుడి మాదిరి నికృష్టపు సావు సావక తప్పదని లోకానికి తెలియాలని గూడా అట్ట బొమ్మ తీర్చి నాటకం వేసి, ఆయప్ప తొడలు విరగ్గొట్టినట్టు ఆడాలని – పూర్వమెబ్బుడో పెద్దోళ్లు నిర్ణయించినట్టు కూడా అనుకోవచ్చు."

కదిరయ్య కూడా ఆసక్తిగా వినసాగాడు. "మొన్న బలిరాముడి బలి జరిగేరోజు గూడా ఇలావంతుడి బొమ్మ తీర్చి, చెంప నరికేసినారుగదా!నాకు ఆడ ఒక అనుమానం...." తానూ వ్యక్తం చేశాడు కదిరయ్య.

"ఏమనుమానం...?"

"ఏంలేదు... భారతంలో సహదేవుడు ఒక గొప్ప జ్యోతిశ్యాస్త్ర మాదిరితో గూడా అనిపిస్తాడే... బలరాముడిని బలిచ్చినోళ్ళకే విజయం లభిస్తుందని అన్నాడు. పైగా సహదేవ జ్యోతిశ్యాస్త్రాలు, వైద్యశాస్త్రాలు ఎన్నో వుండాయి. ఆయప్ప అంతజ్ఞానం ఎపుడు సంపాయించ? యెట్ల సంపాయించ?"

"ఉడాందాసే ఇట్టాంటి అనుమానాలు తీరస్తావుండె! పాండురాజుకు, ధృతరాష్ట్రుడికి, విదురుడికి... ఒక్కొక్కరికి ఒక్కొక్క శక్తి వుండింది. ధృతరాష్ట్రుడు ఎదుటివాళ్ళను ఇనుపశరీరాలుగా మార్చగలిగే శక్తినీ, ఉక్కునైనా సరే పిండిపిండి చేయగల శక్తినీ పొందినోడు. అందుకే ఆయప్ప చిన్నప్పుడు దుర్యోధనున్ని అన్నీ యిప్పేసి బిత్తల్తో తన దగ్గరకు రమ్మంటాడంట. ఆయప్పఅట్లే బిత్తల్తో బోతావుంటే... అది తెలుసుకున్న వాళ్లమ్మ గాంధారీదేవి 'వరివరే – ఇంత ఎడపిల్లోడివైనావు. బిత్తల్తో బోతావుండావు గదరా!" అంటూ మొలనించీ తొడవరకు వొగ పుట్టగోసి పెట్టి పంపించిందంట. ధృతరాష్ట్రుడు తన రెండు చేతుల్తో కొడుకు శరీరాన్ని పైనించీ కిందివరకు తడుంకుంటూ వస్తావుంటే పైభాగమంతా

ఉక్కుమాదిరిగా మారిపోతా వస్తావున్నంట. తొడల కాడి కొచ్చేసరికి 'ఇదేందిరా బిత్తల్తో రమ్మంటే గోసి పెట్టకొచ్చేసినావు....పో... నీ ఆయుప్రాణమంతా నీతొడల్లోనే పో... అన్నాడంట.

అంతేగాకుండా... కురుచ్ఛేత్ర యుద్ధంలో ఆ తొడల్ని విరగ్గొట్టి కొడుకుని సంపిన భీమున్ని నుగ్గునుగ్గు చేయాలని – వంటరిగా భీమున్ని 'నా దగ్గరికి రా!' అని పిలవ నంపతాడంట. ఏం జరుగుతుందో దూరదుష్టితో ముందే తెలుసుకున్న కిష్టపరమాత్మ – భీముడి మాదిరే వుండే వొగ ఉక్కు విగ్రహాన్ని ధృతరాష్టుడి ముందరుంచతాడంట. ఆయప్ప దాన్ని కసితో తన చేతుల్తో నుగ్గునుగ్గు జేసేసినాడంట. అదీ ఆయప్ప శక్తీ....!"

"ఆ తర్వాత...?" అన్నాడు కదిరయ్య.

సిద్ధోజీ తిరిగి చెప్పసాగాడు.

"విదురుడేమో న్యాయానికీ, ధర్మానికి ప్రతిరూపమంట. నిజానికి యమధర్మరాజే విదురుడుగా పుట్నాడంట. ఇంకపోతే... పాండురాజు గొప్పతనమేమంటే... ఆయప్ప కళేబరం (శవం) తిన్నోళ్ళకు సావే వుండదంట! ఏం గావాలంటే అది జరిగి, మూడు లోకాలకు రాజులై పోయేంత శక్తి వస్తుందంట! అంతేగాకుండా, వాళ్ళకు భూత భవిషత్తు వర్తమానాలన్నీ తెలిసిపోతాయంట! అందుకే... ఆయప్ప– మాద్రీదేవితో కలిసి మరణం పొందేటప్పుడు కొడుకుల్ని బిల్చి 'ఓరబ్బా! నా కళేబరం పూడ్చొద్దు, కాల్చొద్దు. మీరే సమంగా పంచుకొని తినేయండ్రా!' అన్నాడంట. ఆ తండ్రి మాటకు జవదాటకుండా పాండవులు – నాయన సచ్చింతర్వాత కళేబరాన్ని తినేదానికి పనిపట్నారంట.

ఆ యిసయం దూరదుష్టి వల్లముందే తెలుసుకున్న ఆ కిష్టపరమాత్మ 'వరివరే.... కొంప మునిగేటట్టుగా వుండాదే! ఈళ్లు గనా ఆ శవాన్ని తినేస్తే – అనాక వాళ్ళను జయించే దానికి ఎవరితరమవుతాది? ఆ తర్వాత ఈళ్ళను సంపేదానికి యింకెన్ని అవతారా లెత్తాల్నో ఏమో?! ముందు ఆ పని ఆపించాల!' అనుకోని, అక్కడ ప్రత్యక్షమై పోయినాడంట. 'తుఁ.... ముండాకొడుకుల్లారా! పీనిగి నెవురన్నా తింటారండ్రా... తుఁ...తుఁ....'అని దండించి, ముందు శవాన్ని కాల్చేయండి!' అంటూ అగ్గెనె (ఆజ్ఞ) యిస్తాడంట. ఆ మాటతో పాండవులు ఆ పని మానుకోని, కిష్టుడితో బాటుగా అడివిలోకి కట్టెల కోసరం బోతారంట.

అప్పుడేమో సహదేవుడు తండ్రి శవానికి కావిలుంటాడంట. వాళ్లు అట్ల బోతానే శవం దెగ్గిరుండే సహదేవుడు – 'ఈ కిష్టుడెంతా మాయదారి గోడు! తండ్రి శవాన్ని తినకుండా జేసినాడు. మనయ్య ఊరికేనే తినమనుంటాడా?' అనుకోని, బొడ్డులో వుండే కత్తి దీసి,పీనిగ కుడికాల్లో చిటికెన వేలు కోసేసి, నోట్లో యేసుకోని సైలెంటుగా నొగసారి పటక్కన నమిల్నాడంట.

అంతే...! ఆ దెబ్బతో ఏడేడు పద్నాలుకు లోకాలు ఆయప్ప కళ్ళ ముందర నిల్చినాయంట! యింగోసారి నమిలేటప్పటికి ముక్కోటి దేవతలు కనిపించి, ఏఏ దేవతలు ఏఏ దిక్కుల్లో ఏఏ లోకాల్లో ఏమేమి జేస్తావుండేదీ తెలిసిపోయిందంట! అంతేగాకుండా ఈ భూబారాన్ని తగ్గించేదానికి ఆ మహాయిష్ణువే కిష్టుడిగా పుట్నట్టు కూడా కనిపించేసి, సిన్నగా నవ్వుకున్నాడంట! ఇంకా ఏమేమి జరిగిండేదీ, జరగతా వుండేదీ,ఏం జరగబోయేదీ అంతా ఆయప్పకు గోచరమైపోయిందంట.

యింకా మూడోసారి నమిల్నాడో – ఆ తర్వాత ఆయప్పను పట్టేదానికి హరిహర బెమ్మాదుల గ్గూడా సాధ్యపడక పోవునంట! ఈ యిసయం యట్టో గ్యేంవనించేసిన కిష్ణపరమాత్మ టక్కున ఆడ ప్రత్యక్షమై – దాన్ని ఉమ్మింజేసినాడంట!

అప్పటికే శ్యానా పిల్లోడైన సహదేవుడు – 'నువ్వెవురో, ఎందుగ్గానీ పుట్నావో, ఏం చేయబోతావో గూడా నాకు తెలుసులే బావా!' అన్నాడంట.

దానికి కిష్టయ్యకు కోపం వచ్చేసి 'ఈ యిసయం గనక ఎక్కడన్నా పొక్కినావా.... నీ తల వెయ్యిముక్కలై సస్తావం'టా శాపమిచ్చినాడంట!

అందుకు బదులుగా వొగ వరం కోరినాడంట సహదేవుడు. అదేమంటే.... 'పాండవుల్లో ఆయుస్సు తీరకనే మద్దెన ఎవురు సచ్చినా నీ ఎద పైనేసి కాల్చతా... ఆ వరమియ్యి!' అన్నాడంట.'సరే...' నన్నాడంట కిష్టుడు. ఎదపైనేసి కాల్చడమంటే... ఆయప్పా సచ్చినట్టే గదా! అందుగ్గాబట్టే కిష్టుడు పాండవులకే కష్టమొచ్చినా కాపాడకొస్తా..... 'పాండవ పక్షపాతి' అనిపించుకున్నాడు. ఇంక అబ్బుట్నుంచీ సహదేవుడికి తెలీని శాస్త్రం లేదంట. అట్ల సహదేవుడు జ్యోతిశాస్త్రవేత్తయినా డంటప్పా!" వివరంగా చెప్పాడు సిద్ధోజీ.

"రేతిరికి మళ్లా ఆటెయ్యాల గదా! పడుకుందామబ్బా.... నిద్దరొస్తా వుండాది!" అంటూ కదిరయ్య అక్కడే తుండుగుడ్డ పరుచుకొని, పడుకొని నిద్ర కుపక్రమించాడు. ఇక చేసేది లేక సిద్ధోజీ, నరసిమ్ములు కూడా నిద్రకుపక్రమించారు.

అక్కడికి కొంతదూరంలో వున్న చెరువు నీటిని స్పృశించి, చల్లబడి వచ్చి, జోబిడిలో జొరబడి వాళ్ళను జోకొట్టి వెళ్లిపోయింది.... ఓ పిల్ల తెమ్మెర.

ఆరోజు రాత్రి 'యుద్ధ పంచకం' నాటకం పూర్తయింది. ఆ నాటకం మధ్యలో అనేక సార్లు రేపు 'సత్యహరిశ్చంద్ర' ధర్మం నాటకం ఉంటుందని ప్రకటించారు.

హరికథ దాసు కూడా.... ఆరోజు పగలే కథ ముగించేసి వెళ్ళిపోయాడు. ఆ హరికథ లోను రెండు మూడుసార్లు రేపు 'సత్యహరిశ్చంద్ర' నాటకం వుంటుందని ప్రకటించారు.

ఆ మరునాడు – పదిగంటలకే 'దుర్యోధన వధ' ఘట్టాన్ని తిలకించడానికి తండోప తండాలుగా జనం వచ్చేశారు.

అప్పటికే అన్ని విగ్రహాల్ని అక్కడికి తెచ్చి పెట్టేశారు.

పంబల వాడు ఓ చిన్న మట్టి దుత్తలో ఎఱ్ఱటి రంగు ద్రవాన్ని నింపి, మూతపెట్టి దుర్యోధనుడి బొమ్మకు ఎడమ తొడలో పెట్టి, అది గుర్తుపట్టడానికి అక్కడొక రోజాపుష్పాన్ని వుంచాడు.

పాండవుల వేషాలు వేసుకొని కొందరు నటులు అక్కడికి వచ్చారు. అందులో భీముడి పాత్రను నరసిమ్ములు వేశాడు. సిద్ధోజీ దుర్యోధనుడి వేషం వేసుకొని, ఒక కత్తి చేతబట్టుకొని వచ్చి, ఆ బొమ్మ పైనెక్కి కత్తిని పొట్టభాగంలో గుచ్చి నిలబెట్టి, కూర్చొని ధానంలో మునిగిపోయాడు.

అలా కొన్ని క్షణాలు గడిచాక జలధి నుంచి బైటకి రమ్మని ధర్మరాజు – "ఏల దాగినావురా సుయోధనా... ఏల దాగినావురా!" అంటూ నాటరాగం, ఆటతాళంలో దరువు పాడసాగాడు.

ఆ తర్వాత ధర్మరాజాదులు – ధుర్యోధనున్ని మడుగు నుండి పైకి రప్పించి, భీముడితో తలపడేటట్లు చేసే ఘట్టాన్ని పాడారు.

ఆ తర్వాత గదకు బదులుగా ఓ బండరోకల్ని భుజాన పెట్టుకొని నరసిమ్ములు ముందుకు వచ్చాడు. దుర్యోధనుడు పైకి లేచి, అతన్ని ఉరిమురిమి చూసి, తొడగొట్టి "రా....రా...!" అంటుంటాడు.

అది చూసి భీముడు "గొట్టెదను చూడరా! యీ గదచే నిన్ను కొట్టెదను చూడరా..."

హాహీర్షి రాగం, ఆదితాళంలో సంవాద దర్వు పాడుతూ ఆ బొమ్మ చుట్టూ గంతులేస్తూ తిరగసాగాడు భీముడు.

"మోదెదను చూడరా.... యీ గదచే నిన్ను మోదెదను చూడరా!" అంటూ దుర్యోధనుడు ఆ బొమ్మపైనే వీరంగం చేస్తూ పాడాడు.

అలా కొన్ని సంవాదాలు, పద్యాలు పాడిన తర్వాత భీముడు "కిలిలిలో..." అంటూ కేకేసి, రోకలి బండను పైకెత్తి గుర్తుగా పెట్టిన రోజాపువ్వు పైన గట్టిగా మోదాడు.

"ఆ దెబ్బకు – అక్కడ గుప్తంగా దాచివుంచిన మట్టి దుత్తలోని రంగుద్రవం రక్తాన్ని తలపింప చేస్తూ పైకెగసింది.

దుర్యోధనుడు "హాఁ..." అంటూ ఒక గావుకేక పెట్టి, నాలుక బైటకు చాపి, నేలకు వరిగిపోతుంటే.... ఓ యిద్దరు నటులు వచ్చి అతన్ని నేలపడనీయకుండా అలాగే రంగస్థలం వెనుకనున్న తమ జోబిడిలోకి మోసుకొని వెళ్ళిపోయారు.

ఆ ఘట్టాన్ని సిద్ధోజీ, నరసిమ్ములు అద్భుతంగా నటించారు.

అక్కడినుంచి ఆ నటులు అటువెళ్లారో, లేదో – జనాలు ఆ దుర్యోధనుడి బొమ్మ పైకెగబడి దానికున్న బంకమట్టిని పిడికిళ్ళ నిండా పెరుక్కొని పోసాగారు. ఆ మట్టిపెళ్ళలు యింట్లో వుంటే అశుభాలు జరగవనీ, పైగా ధనధాన్యాలు అభివృద్ధి చెందుతాయనీ నమ్మి – మట్టిని తీసుకుపోసాగారు.

అంతటితో.... భారత నాటకాలు ముగిశాయి!

చివరవీనాముగా వేసే ధర్మం నాటకంగా.... ఆరోజు సాయంత్రం పది గంటలకు 'సత్యహరిశ్చంద్ర' నాటకం ప్రారంభమైంది.

ఆ ముందు రోజు కొంచెం మెరుగనిపించిన బాలుడి అనారోగ్యం ఆరోజుకు తిరగబెట్టింది. సాయంత్రానికి పిల్లవాడి మూలుగులు ఎక్కువయ్యాయి.

అప్పటికే పిల్లవాడు చిక్కిశల్యమైపోయివున్నాడు. అయినా సిద్ధోజీకి, పూర్ణమ్మకు వేషం కట్టక తప్పలేదు. హరిశ్చంద్రుడిగా సిద్ధోజీ, చంద్రమతిగా పూర్ణమ్మ, లోహితాస్యుడిగా నాగోజీ వేశారు. నక్షత్రకుడిగా బంగారప్ప వేస్తే, విశ్వామిత్రుడిగా కదిరయ్య వేశాడు.

ఆ నాటకానికీ జమీందారుగారు హాజరయ్యారు.

మేళం కట్టిన తర్వాత నాటకం ప్రారంభమైంది..!

"చోపుదారి వచ్చె సభకు....సొంపు మీరగా.... చూపుల కింపుగా! జనులు చూడ – వీధివీధుల నిలిచి ..... చోపుదారి వచ్చె సభకు....సొంపు మీరగా....!"

నాటరాగం, ఆదితాళంలో దరువు పాడుతూ రంగప్రవేశం చేశాడు చోపుదారు.

"చోపుదారి వచ్చె సభకు... చోపుదారీ..." అతను

"వచ్చె సభకు!" వెనక పాటగాళ్ళు.

"చోపుదారి...." అతను...

"వచ్చె సభకు!" అందరూ....

దరువును ఆది కెక్కించి, రంగస్థలాన్ని గుమ్మనిపించి, చిందులు తొక్కి కొన్ని మాటలు చెప్పి, హరిశ్చంద్రుడి రాకను తెలియజేసి, ఆది హెచ్చరికలు జేసి నిష్క్రమించాడు.

ఆ వెంట తెర లోపలనే పాత్ర ప్రవేశాన్ని సూచించే సంధిపద్యం చదివి, శ్రీరాగం – రూపక తాళంలో.....

"సభ జేరెనా.... హరిశ్చంద్ర భూవిభుడు... సభ జేరెనా...." అంటూ గంభీరంగా దరువు పాడుకుంటూ రంగప్రవేశం చేశాడు హరిశ్చంద్రుడు.

ఆ తర్వాత రాజు కొలువుదీరి, వెంట వచ్చిన మంత్రులతో....

"మంత్రి శేఖరా దెల్పుమా –

మన రాజ్యామెల్ల సుఖమే...!

మంత్రి శేఖరా దెల్పుమా..!!" అంటూ పాడుతూనే అడిగాడు.

"రాజ చంద్రమా వినుమా.....–

మన రాజ్యమెల్ల సుఖమే...!" అంటూ మంత్రి సమాధానం చెప్పాడు.

సంవాద రూపంలో సాగే ఆ దరువు బ్రహ్మాండంగా రక్తి కడుతోంది.

ప్రజలు ఉత్సాహంగా చూస్తున్నారు.

మధ్యలో "మంత్రివర్యా! అంగ, వంగ, కళింగాది ఛప్పన్నారు దేశముల వారు తప్పక కప్పంబు చెల్లించుచున్నారా?" అని అడిగాడు రాజు

"రాజ వంశోత్తమా! అంగ, వంగ, కళింగాది ఛప్పన్నారు దేశముల వారు తప్పక కప్పంబు చెల్లించుచున్నారు. నెలకు మూడు వానలు కురియుచు ప్రజలు చోరభయము లేక, జ్వరాది పీడలు లేక సుఖించుచున్నారు. దేవరా!" మంత్రి సమాధానం చెప్పాడు.

నీతి, ధర్మం, ఇచ్చిన మాట నిలబెట్టుకోవడం లాంటి ఉత్తమ గుణాలను – ఎన్ని కష్టాలెదురైనా వదలక స్థిరంగా నిలబడిన చంద్రమతీ హరిశ్చంద్రుల కరుణ రసభరిత కథను... ఎంతో ఏకాగ్రతతో సందర్శిస్తున్నారు ప్రేక్షకులు.

నాటకం రంజుగా సాగిపోతోంది!

కానీ,పిల్లవాడికి మాత్రం అనారోగ్యం హెచ్చింది.

డొక్క లెగరేస్తూ, ఎగశ్వాసలుపడుతున్నాడు.

బిడ్డ ముదరకపోయి, ముడుక్కొని పడుకున్నాడు.

అతను బిడ్డలాగా అనిపించడం లేదు... ఏదో ఎముకల గూడు పిల్లవాడి ఆకారంలో చర్మం కప్పుకొని పడుకున్నట్టుగా వుంది.

సిద్ధోజీ రంగస్థలం పైనున్నప్పుడు పూర్ణమ్మ, ఆమె రంగస్థలం పైనున్నప్పుడు సిద్ధోజీ, ఆ యిద్దరూ రంగస్థలం పైనున్నప్పుడడు రేణుకమ్మ, నాగోజీలు పిల్లవాడ్ని చూసు కుంటున్నారు.

లోపలొకటే ఉక్క!

వేషధారులకి చెమటలు పట్టి – అర్ధాలం పూసుకున్న ముఖాల మీద బొట్లుబొట్లుగా కారుతున్నాయి.

గాలి స్థంభించి పోయినట్టు – చిన్న గాలితెమ్మెర కూడా వీచడం లేదు.

ముందే ఎండాకాలం  కావడంతో – ప్రజలు వేడికి ఆపసోపాలు పడుతున్నారు.

చెమటకు ఆర్ధాలం చెదరిపోతున్నా నటులు నాటకం ప్రదర్శిస్తూనే ఉన్నారు.

నాటకం రమణీయంగా రక్తి కడుతోంది.

సుమారు అర్థరాత్రి దాటింది!

నీరసంగా మూలగడం ప్రారంభించాడు పిల్లవాడు.

అతని ఘోష్ట చూస్తున్న నటులు – ఆ భారతోత్సవ నాటక ప్రదర్శనలో వచ్చిన డబ్బులో సగం గురువుకు విరాళంగా యిచ్చి ప్రదర్శిస్తున్న నాటకం పూర్తికాగానే అటునుంచి అటే రుయాసుపత్రికి పంపించి, వైద్యం చేయించి పిల్లవాడ్ని బ్రతికించాలనుకున్నారు.

వాళ్ళ అభిమానానికి గురువు మనసు కృతజ్ఞతతో నిండిపోయింది.

అందరి హృదయాల్లోనూ ఆ పిల్లవాడి పరిస్థితికి బాధ చోటు చేసుకొని వుంది.

నాటకం సాగిపోతూనే వుంది.

పిల్లవాడి పరిస్థితి చూస్తున్న పూర్ణమ్మ కళ్ళు ధారాపాతంగా వర్షిస్తున్నాయి.

సిద్ధోజీదీ అదే పరిస్థితి!

రంగస్థలం పైన –కష్టాల్లో పాడే దరువులకు, సన్నివేశాలకు, వాళ్లకు వేరే కన్నీళ్లు అవసరం లేకపోయాయి. బిడ్డ పరిస్థితే వాళ్ళచేత కళ్ళనీళ్లు తెప్పిస్తున్నది.

ఆ విషయం తెలీని ప్రేక్షకులు "అబ్బ! పాత్రల్లో జీవిస్తా వుండార్రా నాయనా!" అంటూ మెచ్చుకుంటున్నారు.

కడుపులో అగ్నిగుండం రగుల్తున్నా, గుండెలు పగులుతున్నా – ప్రేక్షకుల ఆనందం కోసం.... దుఃఖాన్ని దిగమింగి నటిస్తున్నారు వాళ్లు.

"శహభాష్.....!" అంటున్నారు జనాలు.

వీళ్ళది ఆనందం!

వాళ్ళది శోకం!!

ఒకరి ఆవేదన...మరొకరి ఆనందం!!

ఇదొక మానవ నైజం!!

హరిశ్చంద్రుడ్ని – నక్షత్రకుడు పెడుతున్న బాధలు, చంద్రమతీ హరిశ్చంద్రులు పడుతున్న కష్టాలు, రంగస్థలం పైన చూస్తున్న ప్రేక్షకుల గుండెలు బరువెక్కుతున్నాయి.

అర్ధరాత్రి సమయం దాటింది.

అంతవరకూ వేడెక్కిన వాతావరణాన్ని చల్లబరుస్తూ రవరవమంటూ గాలి మెల్లగా వీచసాగింది. ఆ గాలికి ప్రజల శరీరాలు – చెమటలు పట్టడం తగ్గి, కాస్త హాయిని అనుభవించ సాగాయి.

మధ్యమధ్యలో....."టైంపాస్ బఠానీ.... టైంపాస్ బఠానీ.... బఠానీ!" అంటూ

బఠానీలున్న చిన్న బుట్టను అరచేతుల్లో పెట్టుకొని ప్రేక్షకుల్లో బఠానీ అమ్ముతున్నాడొక పిల్లవాడు.

ఒక ట్రేలో మురుకులు, వడలు, బోండాలు పెట్టుకొని, "వడా... బోండా... ముర్రుక్కేయ్!" అంటూ తిరుగుతున్నాడు మరో కుర్రాడు. యింకోవైపున నలభై ఏళ్ల లల్లూసాయిబు ఒక చేత్తో ఓపనీర్‌ను పట్టుకొని, మరోచేత్తో సోడాసీసాలు పట్టుకొని.... "నన్నార్....నన్నార్! సోడా కలర్.... సోడా కలర్.... కలర్ సోడా....!' అంటూ తిరుగుతున్నాడు. అడిగిన ప్రేక్షకులకు ఓపనీర్‌తో సీసా మూతల్ని తీస్తూ దాంట్లో గ్యాస్ వున్నట్లు అనుకోవాలని నోటితోనే "తుస్‌తుస్సః..." అని శబ్దం చేస్తూ యిస్తున్నాడు.... అతని కదొక టెక్నిక్!

పదిహేను రోజులుగా వారలా అమ్ముతూనే వున్నారు.

అక్కడక్కడా ప్రేక్షకులు తినుబండారాల్ని నములుతూ... సోడా కలర్లు తాగుతూ.... కొందరు బీడీలు, సిగరెట్లు తాగి పొగ వదులుతూ... మరికొందరు పొగాకు, దుగ్గపొడి నములుతూ... ఎంగిల్ని తమ ప్రక్కల్నే ఉమ్మేసుకుంటూ... నాటకాన్ని చూస్తున్నారు. కొందరు ప్రేక్షకులు నిద్రపోతున్నారు.

నాటకం మాత్రం గంభీరంగా సాగిపోతూనే వుంది!

పిల్లవాడి ఆరోగ్యం ఇంకా దిగజారిపోయింది!!

రంగస్థలం పైన సాగుతున్న కథతో బాటుగా కాలమూ గడిచిపోతూనే వుంది!!!

హరిశ్చంద్రుడు విశ్వామిత్రుడి కిచ్చిన మాట కోసం రాజ్యం పోగొట్టుకొని, భార్యాబిడ్డలతో అడవుల పాలై, తిండికి కటకట పడి కాశీనగరం చేరడం, అక్కడా నక్షత్రకుడు పైక మడగగా – విధిలేని స్థితిలో భార్యాబిడ్డల్ని ఒక బ్రాహ్మడికి అమ్మివేసి, తాను ఛండాలుడయిన కాటికాపరి 'వీరబాహు'డికి అమ్ముడుపోవడం – 'వీరదాసు' పేరుతో హరిశ్చంద్రుడు కాటికి కావలి వుండడం –ఇంతలో... లోహితాస్యుడు ఆకుల కోసం అడవికి వెళితే సర్పం కరవడం... వరకు కథ సాగింది.

సరిగ్గా అప్పుడే...

తెరవెనుక.... పిల్లవాడికి ఎగశ్వాస లెక్కువయ్యాయి.

తెర ముందు లోహితాస్యుడి వేషంలో వున్న నాగోజీ – "హాః.... పాపి దైవమా... ఈ ఘోరాటవిలో సర్పంబు గరిచెనే!" అంటూ అద్భుతంగా భైరవి రాగం, రూపక తాళంలో దరువును ఆలపిస్తూ ప్రేక్షకుల కంటతడి తెప్పిస్తున్నాడు.

విషప్రభావం.... క్షణక్షణానికీ ఆయువు తోడేస్తున్న బాధను అనితర సాధ్యంగా

రంగస్థలం పైన అభినయిస్తూ.... 'తండ్రికి తగిన తనయు' డనిపించుకుంటున్నాడు నాగోజీ.

తెర వెనుక....

పిల్లవాడు–మృత్యువుతో పోరాడుతూ ఘడియఘడియకూ దాని చేతుల్లో ఓడిపోసాగాడు!

కళ్ళు తేలేశాడు!!

తెర ముందర.....

అదే అవస్థను నాగోజీ నటిస్తున్నాడు!

తెర వెనుక....

అదే నిజమవుతున్న పరిస్థితి!!

ఇక్కడ... నటన..

అక్కడ... నిజం...!!

సిద్ధోజీ తన రెండు చేతులతో బిడ్డను స్పృశిస్తున్నాడు.

రంగస్థలం పైన నాగోజీ దరువు పాడడం పూర్తిచేసి, లోహితాస్యుడు విగత జీవుడైనట్టు నటించి, తెరకానుకొని వున్న బెంచీపైన పడుకున్నాడు. తెర లోపల నున్నవాళ్లు తెరను కింద నుంచి లేపి, చాకచక్యంగా అతన్ని తెర లోపలికి లాగేశారు.

ప్రేక్షకులు అతని నటనకు, పాటకు ముక్కుమీద వేలేసుకున్నారు.... కరతాళ ధ్వనులు చేశారు..... ఆ కరతాళ ధ్వనులకు నటుల ఆనందం అతిశయించింది.

ఆ ధ్వనులు అందరికీ వీనుల విందుగా వినిపిస్తున్నాయి.

కానీ.... అక్కడ....

ఆ ధ్వనులే గాక, యిక ఏ ధ్వనులూ శాశ్వతంగా వినిపించుకోలేని స్థితిలోకి వెళ్లిపోయిన ఏకైక ప్రాణి.... నాగోజీ తమ్ముడు... సిద్ధోజీ చిన్న కొడుకు... అన్నపూర్ణమ్మ ముద్దుల పట్టి... ఆ చిన్న బాలుడు.

ఇంతలో....

చంద్రమతి రంగ ప్రవేశం చేయాల్సి వుంది

ఆ బిడ్డె నలాగే జవురుకొని, గుండెలు బాదుకుంటూ.... ధన్యాసి రాగం, ఆదితాళంలో

"ఏమని వగతురా.... ఏదిరా నాగతి; ఈ మహి నిన్ను నన్నెడబాసెనె విధి!

ఏమని వగతురా.... ఏదిరా నా గతి కుమారా.... అయ్యో కుమారా...."

– అంటూ నిజంగానే ఏడుస్తూ పాడుతుంటే....

అది కేవలం నటనగానే భావించిన ప్రేక్షకులు సైతం కరిగిపోసాగారు.

అంతటి శోకతప్త గీతాన్ని వాళ్ళు ఎన్నడూ వినలేదు!

అంతటి ఆర్ద్రమైన నటనను వాళ్లు ఎన్నడూ చూడలేదు!!

జీవితాంతం ఆ శోకగీతం వాళ్ళ గుండెల్లో చిరస్థాయిగా నిలబడిపోయే విధంగా ఒక వింత అనుభూతిని వాళ్ల గుండె గోడలపైన చెక్కుతోంది. ఆ శోకరస ప్రభావం వాళ్ళ అణువణువులోకి శాశ్వతంగా ఇంకిపోతోంది.

కానీ, ఆమె నిజంగానే ఏడుస్తోందన్న స్పృహ మాత్రం ఎవ్వరికీ కలగడం లేదు.

కేవలం ఆమె నటనలో జీవిస్తున్నట్లుగానే భావించుకుంటున్నారు.

ఆమె కిది..... యదార్థం!

వీళ్లకది.... రసయోగం!!

ఇక్కడ... సత్యం! అక్కడ.. భ్రమ!!

అదొక వ్యథార్థ యథార్థ విచిత్ర సంఘటన....

పూర్ణమ్మ, సిద్ధోజీలు ఎన్నడూ మరిచిపోలేని సంఘటన!

బిడ్డె నలాగే బెంచీపైన పడుకోబెట్టింది పూర్ణమ్మ.

అలాగే స్మశానవాటిక లోకి లోహితాస్యుడ్ని తీసుకుపోయి కాల్చే సన్నివేశం వచ్చింది.

బిడ్డను ఖననం చేయడానికి అనుమతి కోరుతుంది చంద్రమతి.

"నా యాజ్ఞ లేనిదే ఈ యర్ధరాత్రి కాలంబున కొడుకు కళేబరంబు దెచ్చి కాల్చజూచెదవు. ఆడదాని వైనందున బ్రతికితివి. పురుషుండైన ఈ కత్తిచే తల దెగనరుకుదు! ఈ కట్టియలు చేర్చినంత భూమికి 'మాడ' యివ్వవలయును. నీవా మేర దప్పక మాడ యిచ్చి కళేబరంబు గాల్పుము. లేదేని శీఘ్రుంబుగా నెత్తుకొని పొమ్ము - మత్తకాశినీ...!'

సిద్ధోజీ వస్తున్న దుఃఖాన్ని ఆపుకొని, గంభీరంగా నిలబడి వీరదాసు డైలాగు చెప్పాడు.

కథలో హరిశ్చంద్రుడు - తాళిబొట్టు నమ్మి సొమ్ము తెచ్చి, సుంకంబు చెల్లించి, కళేబరాన్ని కాల్చమనడం..... దాంతో చంద్రమతి హరిశ్చంద్రుడ్ని గుర్తించడం.... నిజం తెలిసిన తర్వాత బాలుడి పైనబడి హరిశ్చంద్రుడు దుఃఖించే సన్నివేశం సాగుతోంది.

"ఏదిరా నా గతి - తనయా.... తనయా!

తనయా... నా గతి!!

ముదుముతో నాదగు ముచ్చట దీర్చక

విదితముగా నా విధి యిట్లాయెరా!

ఏదిరా నా గతి - తనయా.... తనయా... తనయా....!"

- నాదనామ క్రియ రాగం, ఆదితాళంలో దరువు పాడుతూనే దుఃఖిస్తున్నాడు. ఆ దరువునే పూర్ణమ్మ పాడుతూ.... నిజంగానే అందరి ముందు, రంగస్థలం పైన వాళ్ళు దుఃఖిస్తున్నారు.

వారి దుఃఖానికి ప్రజలు నీరాజనా లర్పించారు.

వారి శోక వచనాలకు, నటనకు, పాటలకు బ్రహ్మరథం పట్టారు!

కరతాళ ధ్వనులు చేశారు....

ఈలలు వేశారు!

కేకలు వేశారు!

ఒకవైపు... అభినందన!

మరోవైపు.... గుండెలు చీల్చే దుఃఖం!!

ఏ కళాకారుడికీ ఎదురుకాని వింత పరిస్థితి!!!

ఆ సన్నివేశం చూసి జమీందారు చలించిపోయారు.

'నిజమా, నాటకమా....?' అన్న సంశయంలో పడ్డారు–

మొదట్నుంచీ సిద్ధోజీ వేషాల్ని, నటనను చూస్తూనే వున్నారు. దుర్యోధనుడిగా, భీముడిగా, కీచకుడిగా, వాల్మీకిగా, ధర్మరాజుగా, హరిశ్చంద్రుడిగా, ఏది చేసినా 'అతని కతనే సాటి' అనిపించుకున్నాడు.

అతని పాటకి, నటనాభినయానికి విస్తుపోయారు జమీందారుగారు. అతన్నెలాగయినా సరే – ప్రపంచం దృష్టికి తీసుకుపోవాలన్న ధృఢనిశ్చయాని కొచ్చారు. వారు స్వాతంత్ర్యోద్యమ కాలంలో 'స్వతంత్ర పార్టీ'లో పనిచేశారు. ఇప్పటికీ చాలా మంది రాజకీయ నాయకులతో, మంత్రులతో వారికి మంచి సంబంధాలే వున్నాయి.

అందుకే నేరుగా స్టేజీ మీదికి వెళ్ళారు.

వారు వెళుతుంటే విద్యుద్దీపాల వెలుగులో వారి భుజాన వున్న ఖరీదయిన కండువా బంగారు జరీ తళతళ మెరుస్తోంది.

అందరూ విస్తుపోయి చూస్తున్నారు!

బిడ్డ పైనబడి ఏడుస్తున్న వాళ్ళని భుజాలుపట్టి పైకి లేపి, జేబులో నుంచి చేతికి దొరికినన్ని కరెన్సీ నోట్లను వారి చేతుల్లో కుక్కి, మైకు ముందుకు తీసుకువచ్చాడు –

'ఈ నాటక ప్రదర్శనలో.... మధ్యలో... పానకంలో పుడకలా వచ్చినందుకు ప్రేక్షకులు క్షమించాలి! ఇంతటి గొప్ప కళాకారుల్ని నేనింత వరకూ చూడలేదు. ముఖ్యంగా సిద్ధోజీ లాంటి ఆటగాడు, పాటగాడు మన జిల్లాలో వుండడం మన అదృష్టం! ఇంతటి కళాకారుడికి మనం ఏం చేయగలం? నేను తప్పకుండా.... వీళ్ళను ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్ళి ఏదో విధంగా గుర్తింపు వచ్చే విధంగా చేస్తాను. వీలయితే ఏదయినా అవార్డు వచ్చేట్టుగా కూడా ప్రయత్నిస్తానని సభాముఖంగా తెలుపుకుంటున్నాను. అంతేగాకుండా వీలయినంత త్వరలో, ఈతని నటనను ఏదో ఒక రూపంలో రవీంద్ర భారతిలోను, ఆపైన ఢిల్లీలోను ప్రదర్శించే ఏర్పాట్లు చేయించి, వారి ఋణం తీర్చుకుంటానని ప్రమాణం చేసి మరీ చెబుతున్నాను".

– అంటూ మరొక్కసారి వాళ్ళ భుజాలను తట్టి, తను వేసుకున్న పట్టుధోవతి మడతలు విప్పి ఇద్దరికీ కప్పి–

"ఇప్పటికిప్పుడు..... ఇంతకంటే ఏమీ ఇచ్చుకోలేను... క్షమించాలి!"

– అంటూ అభినందించి వచ్చేశాడు.

ప్రజల హర్షధ్వానాలతో, చప్పట్లతో ఆ ప్రదేశమంతా మారు మ్రోగిపోయింది.

ఆ శబ్దం సద్దుమణిగేసరికి పది నిమిషాలు పట్టింది...

పూర్ణమ్మ, సిద్ధోజీ కళ్ళు ఇంకా ధారాపాతమయ్యాయి!

అయితే అక్కడ నిజంగానే ఆ బాలుడు చనిపోయాడనీ, వాళ్ళు చేసింది నటన కాదనీ, నిజమేనని.... చివరికి జమీందారు కూడా గుర్తించలేకపోయారు.

పిల్లవాడు అచేతనంగా అక్కడే పడివున్నాడు.

నాటకం తిరిగి ప్రారంభమై... చివరివరకు అలాగే సాగిపోయింది.

నాటకం ముగిసేటప్పటికి తెల్లవారింది!

ఆ భారతం మిట్ట – ఆ విధంగా ప్రసాదించిన మధురానుభూతిని పదిలంగా తమ గుండెల నిండా నింపుకుని ప్రేక్షకులు అక్కడి నుంచి వెళ్ళిపోసాగారు.

ఆ ప్రదేశానికి కొంతదూరంలో వున్న చెరువుగట్టున నటులందరూ చేరి, ఆ పిల్లవాడికి దహన సంస్కారాలు చేసి, గుండెల నిండా శోకాన్ని నింపుకొని, బరువెక్కిన గుండెలతో తమ తమ నెలవులకు వెళ్ళిపోవడానికి అన్నీ సర్దుకోసాగారు.

ఏమీ తెలినట్లే –

రోజులాగే... అరుణిమను అద్దుతూ తూర్పు కొండల మీద ఉదయించసాగాడు సూర్యుడు!

# 20

**ఉ**య్యాలల్ని మోసుకుని తిరిగి జైంట్‌వీలుగా, మాసాల తొట్లను మోసుకుంటూ... కాలం మరికొన్ని భ్రమణాలు చేసింది.

వేగంగా రోజులు తిరిగిపోతున్నాయి.

గాయాలను అదే చేసి – తిరిగి వాటిని అదే మాన్పుతూ, కష్టాల గరళాన్ని బలవంతంగా మింగిస్తూ.... తిరిగి సుఖాల సురను అదే తాపిస్తూ, మనిషిని మత్తులోకి నెట్టేస్తోన్న కాలం....

గుజ్జప్ప గాయాన్ని మాన్పలేకపోయింది!

సిద్ధోజీ పైన అతనికి కసి, పగ, ద్వేషం!!

అందువల్లనే సిద్ధోజీ ట్రూపుకి పోటీగా ఊర్లో మరో ట్రూపును తయారుచేసి, సిద్ధోజీ గురుపీఠాన్ని ఎలాగయినా కూలదోయాలనుకున్నాడు.

మెల్లగా ఏవేవో ఆశలు చూపించి, మభ్యపెట్టి, కులతత్వాన్ని రెచ్చగొట్టి, ఎలాగో ఓలాగు కొందర్ని కూడగట్టగలిగాడు. వారి జతకు – కొత్తిండ్ల నుంచీ, విజలాపురం నుంచీ మేటిగా పాడగలిగిన వాళ్లను కొందర్ని చేర్చాడు. కొత్తిండ్లలోనే 'వద్దిక' ఏర్పాటుచేసి సినీపాటలు, డాన్సులు చొప్పించి నాటకం నేర్పించి, కాంట్రాక్టు పద్ధతిలో నాటకాలు ప్రదర్శించడం మొదలు పెట్టాడు.

దానికితోడు – చుట్టుపక్కల పల్లెల్లో మరికొన్ని నాటక కంపెనీలు స్థాపించబడ్డాయి.

కొత్తిండ్లలో 'ఆరేళ్ళ మునుస్వామి, రామచంద్రయ్య', విజలాపురంలో 'ముని వెంకటప్ప', శాంతిపురంలో 'నారాయణ, పనారస కన్నారావు' వంటి వాళ్ళు నాటక సమాజాలు స్థాపించి, ప్రదర్శనలు ప్రారంభించారు. ఒక కంపెనీకి, మరో కంపెనీ పోటీగా నిలబడ్డాయి.

అప్పటికే సినిమాల ప్రభావంతో నాటకాలకు ఆదరణపోయి చాలా కాలమైంది. పూర్వంలాగా నాటకాల ప్రదర్శనే వృత్తిగా సాగడం లేదు. భారతోత్సవాలు జరగడమూ తగ్గాయి. ఒకవేళ అరకొరగా జరిగినా – ఆ అవకాశాల్ని ఇతరులు తన్నుకుపోతున్నారు.

ఆ కారణం వల్లా... సిద్ధోజీ ట్రూపుకి అవకాశాలు రావడం లేదు.

బతుకు తెరువుగా వున్న నాటకాలు అలా నిరాదరణకు గురికావడంతో – పల్లె కళాకారులలో నిరుత్సాహం చోటుచేసుకుని, ఆ కళకు క్రమంగా దూరం కాసాగారు.

అయినా.... సిద్ధోజీ అప్పుడప్పుడు అందర్నీ సమావేశపరుస్తూ... ఆ కళను నిలబెట్టడానికి ప్రయత్నం చేస్తూనే వున్నాడు. అందుకోసం అతనికి చేతి నించీ ఖర్చయ్యేది.... అయినా భరించేవాడు.

అలాంటి పరిస్థితుల్లోనే... అతనికి ఓ ఆడబిడ్డ పుట్టింది!

ఆ అమ్మాయి పెరిగి పెద్దది కాసాగింది.

పిల్లలు పెద్దవాళ్ళయ్యే కొద్ది ఖర్చులు పెరిగాయి...

ఆ కారణంగా అతని ఆర్థిక పరిస్థితి పూర్తిగా దెబ్బతినిపోయింది.

తెలిసిన వాళ్ళ దగ్గరంతా అప్పులు చేయడం ప్రారంభించాడు సిద్ధోజీ. కొంతకాలానికి అప్పు పుట్టడం కూడా గగనమైపోయింది.

అలాంటి గడ్డు పరిస్థితుల్ని ఎదుర్కోవడానికి నాటకాలను వదిలిపెట్టి ఇంటిల్లిపాదీ చుట్టుపక్కల రైతులకు కూలికి పోసాగారు.

ఆ యేడు వర్షాలు ఒక మోస్తరుగా పడ్డాయి.

పెద్ద చెరువులోకి కూడా సగానికి పైగా నీళ్లు వచ్చిచేరాయి!

ఆ చెరువు చుట్టుప్రక్కల వ్యవసాయ భావుల కింద మడిసేద్యం సాగుబడిలో వుంది. అక్కడక్కడా కొన్ని చెరకు తోటలు కూడా వేయబడివున్నాయి. ఆ చెరకు తోటలు చుట్టకానికి వచ్చి వున్నాయి.

రైతులు తోటలు చుట్టుకోవడంలో నిమగ్నమై వున్నారు.

ఒకరోజు సిద్ధోజీ – ఒక రైతుకుతోట చుట్టకానికి వెళ్ళాడు.

ఉదయం నుంచి ఆ పనిలో మునిగిపోయి వుండి, ఆ సాయంత్రం పని ముగించుకొని ఇంటికి బయలుదేరాడు.

అదే సమయంలో...

రేణుకమ్మ – తన మనవడితో వచ్చి, గొఱ్ఱెల్ని నీటిప్రక్కగా చెరువకట్ట కిందుగా తోలి మల్లేస్తోంది. ఒక చెట్టుకింద కూర్చోని బంగారప్ప 'నుచ్చులు' (పిల్లలు పాలు తాగకుండా – పేడలో అద్ది, జీవాల రొమ్ములకు చుట్టే బెత్తెడు పొడవున్న గుడ్డ పీలిక) నలుపుకుంటున్నాడు.

ఒకప్పుడు వున్న గొర్రెల మంద – ఆరోజుకి ఆ ఊర్లో లేకపోయినా, గొఱ్ఱెల్ని పోగొట్టుకోకుండా, తానే స్వయంగా గొఱ్ఱెల్ని మేపుకుంటున్నాడు బంగారప్ప.

అతని ఆర్థిక పరిస్థితి కాస్త మెరుగ్గానే వుంది.

కట్టమీద నడిచివస్తున్న సిద్ధోజీని దూరంనుంచే చూశారు వాళ్లు!

"యట్టున్న కంటుంబిరం ఎట్టయిపాయ?! మా నాయన యట్ట బతికె?... ఏ కష్టమొచ్చినా ఆయనే అనుభవించి మమ్మల్ను సాకె! తిన్నా, తినకపోయినా ఊర్లో గొప్పగానే వుండే! అట్టాంటిది – ఇప్పుడు మా తమ్ముడు కూలికి పోయే పరిస్థితి దాపరించె! అన్నేకారికాలం.... అట్టయి పూడిశ! నాటకాలే వృత్తిగా బతికిన వంశం... నాటకాలాడ్డం తప్ప ఏమీ ఎరగని మడుసులు.... వాటికి ఆదరణ పోయేటప్పటికి పరిస్థితి మారిపోయ! బండ్లు ఓడలాయ – ఓడలు బండ్లాయ! ఈ మారిన కాలంలో మావోళ్ళ బతుకులు కనీసం ఆ బండిచెక్రాలు కూడా కాలేకపాయ! పూలమ్మిం చోటే కట్టెలమ్మే పరిస్థితి దాపరించ....!"

–పరిపరి విధాల రేణుకమ్మ మనసు పరివేదనచెందింది.

"ఏందో... ఈ జీవితం! మా సిద్దుగోడు యట్టుండే... యాసం గడితే సిల్మాలో ఎన్టీవోడున్నిట్టే గదా.... గొంతిప్పితే ఘంటసాలనే దిగదుడుపన్నిట్టుగా వుండె! పద్యం పాడినాడంటే సుక్కలు తెగిపడాల్సిందే! అట్టాంటోడు సూడు... యట్టయిపాయ? జుట్టేమో చూస్తా వుండంగానే తెల్లబడిపాయ. ఆరావు (అందం) తరిగిపాయ... మడిసి

బక్కసిక్కిపాయ... రూపే మారిపాయ... లొక్కి దవళ్ళు వచ్చేశ.... గుంటకండ్లు, ముసిలితనం బిన్నే వచ్చేశ!"

– బావమరిది బాధలు తలచుకొని బాధపడ్డాడు బంగారప్ప. అప్పటికీ తాను సహాయం చేయడానికి ఒకటి రెండుసార్లు ప్రయత్నిస్తే.... ససేమిరా వప్పుకోలేదు.

'ఆ యప్పంతే.... భలే ఆత్మాభిమానం! వొగసారి వొగ నిర్ణయం దీసుకున్నాడా – యింక హరిహర బెమ్మాదులు వచ్చినా దాన్ని మార్చుకోడు!' అతను దగ్గరకొచ్చినా ఆలోచించడం మానలేదు బంగారప్ప.

"ఏమ్మామా! నుచ్చులు నలుపుకుంటా కూసోనుండావు?" సమీపించగానే పలుకరించాడు సిద్ధోజీ.

"ఇప్పుడు నుచ్చు లేసేస్తే గదా – రేపటికిన్ని పాలసుక్కలు దొరకతాయి?! లేకంటే.... పిల్లలు తాగెయ్యవూ?" నుచ్చుల కంటిన ఎండిపేడను వేళ్ళతో నలిపి దుమ్ముచేసి, నడిమివేలితో కొడుతూ వాటిని శుభ్రం చేయడంలో మునిగిపోయాడతను.

కట్టకింద వున్న రేణుకమ్మ "ఏమబ్బా... యిట్టొస్తా వుండావు? యాడ బొయింటివి?" అంది.

"తోట సుట్టకానికి బొయింటక్కా! పొద్దుకల్లా అయిపాయ... యింటికి బోతా వుండా!" అని, పిల్లవాడ్ని చూసి –

"ఏమంటా వుండాడక్కా నీ మనవడు?" అన్నాడు మురిపెంగా పిల్లవాడి వైపు చూస్తూ..

"యెర్రి నా కొడుకు... వోడేమంటాడు?" అంది రేణుకమ్మ.

సిద్ధోజీ బంగారప్ప పక్కన కూర్చుంటూ –

"మామా... వొగ బీడీ వుంటే యియ్యి!" అని బీడీ, అగ్గిపెట్టె తీసుకుని, బీడీ వెలిగించుకొని, అగ్గిపెట్టె తిరిగిచ్చేసి, పొగ పీల్చుకుంటూ వుండిపోయాడు.

అంతలో.... బంగారప్పలేచి, దులిపిన నుచ్చుల పీలికలకు పచ్చిపేడ పూసి, గొఱ్ఱెల్లో, జొరబడి పిల్లలున్న ఒక్కొక్క గొఱ్ఱెనీ పట్టుకొని వంగి, ఎడంచేతితో దాని నడుమును అదిమిపట్టుకొని, వెనుక కాళ్ళు లేపి, వాటి రొమ్ముల్ని సాగదీసి, నుచ్చు ఒక చివరను వాటి మొనలకు చుట్టి, వేళ్ళతో అదిమి వదిలివేయసాగాడు.

వాటి పిల్లలు పాలు తాగడానికి తల్లి రొమ్ముల్ని సమీపించి పేడవాసనకు ఆ ప్రయత్నాన్ని విరమించుకుంటున్నాయి.

'చూస్తా వుండంగానే వీళ్ళు గూడా ముసిలోళ్ళయిపోయిరి! ఈ లోకంలో ఏది శాశ్వితం? మనిషే శాశ్వితంలా! ఈ ఆస్థిపాస్తులూ, ఈ వయసూ శాశ్వితమా? మనం సంపాదించుకున్న మంచితనం శాశ్వితంగానీ ...!'

– ఆ దృశ్యాని చూస్తూ అనుకొని, పైకి లేచాడు సిద్ధోజీ.

'అంత వయసయినా అక్కా, బావ ఎంతో అన్యోన్యంగా వుండారు!' అనుకున్నాడు.

ఆరోజుల్లో వేరే కులంవాడ్ని ప్రేమించి పెళ్ళి చేసుకుందని తన తండ్రే ఊరి న్యాయానికి కట్టుబడి వాళ్ళని ఊరికి వెలేయడం.... వాళ్ళు మంచితనంతో తిరిగి అందరితో కలిసిపోవడం... అన్నీ ఆ వేళ అతనికి గుర్తుకురాసాగాయి.

'ఊరి కెలేసినా వీళ్ళు బతకలేదా? వీళ్ళకు పిల్లలు పుట్టలేదా.... పెండ్లిండ్లు గాలేదా?అంతమాత్రానికి కులాలు, కోపతాపాలు, ఎలెయ్యడాలు.... అన్నీ ఎందుకు?' ఆలోచిస్తూ... చివరి దమ్ము లాగి, ముక్కను పారవేసి, వారి దగ్గర సెలవు తీసుకుని తిరిగి పల్లెదారి పట్టాడు సిద్ధోజీ.

అతను యింట్లో అడుగు పెట్టగానే "నాయనా! నీకు రవీంద్రభారతిలో నటించాల్సిందిగా వుత్తరం వచ్చిండాది!" అంటూ అంతవరకూ గూట్లో పెట్టి వున్న ఉత్తరాన్ని అందించాడు నాగోజీ.

దాన్ని తీసుకుని ఆత్రంగా చూడసాగాడు సిద్ధోజీ.

"మ.రా.రా.శ్రీ. అణ్ణావు సిద్ధోజీరావు గారికి,

పుంగనూరు జమిందారు గారయిన శ్రీశ్రీ చిన్నబసవ చిక్కరాయులు రాయించిన పత్రం.

*అయ్యా!*

*రాబోయే నెల పదవ తేదీన జానపద కళారూపాల ప్రదర్శనల పోటీని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారు రవీంద్రభారతిలో జరుప తలపెట్టినారు. మేము సాంస్కృతిక శాఖామాత్యులతో మాట్లాడి మీకు అవకాశం కలిగించాము. కాలవ్యవధి గంటన్నరకు మించరాదు. కావున మీరు అయిదుమంది కళాకారులకు మించకుండా మీ నాటకంలో ఏదో ఒక ఘట్టాన్ని నటించడానికి సిద్ధం కండి. తగిన వివరాలతో మీరు పదిరోజుల లోపల వారికి మీ అంగీకారాన్ని తెలపండి. ఆ తర్వాత మీకు ఆహ్వానం రాగలదు. మీకు వాగ్దానం చేసి చాలా ఏళ్ళే అయినది. క్షమించగలరు. ఇన్నిరోజులకు మా ప్రయత్నము సఫలమైనందుకు సంతసిస్తున్నాము.*

*ఇట్లు*
*శ్రీశ్రీ చిన్న వీరబసవ*
*చిక్కరాయల వారి*
*తరపున వారి గుమాస్తా*
*సంతకం/–"*

ఆ ఉత్తరం చదువుకొని ఆనందం పట్టలేకపోయాడు సిద్ధోజీ.

ఆ మరునాడు ఉదయానే స్నానంచేసి, ఉతికిన బట్టలు వేసుకుని, కుప్పం వచ్చి పుంగనూరు బస్సెక్కి – మధ్యాహ్న సమయానికి పుంగనూరు చేరుకున్నాడు.

బస్సు దిగి నేరుగా..... భారతోత్సవాలు జరిపించే ఓ కార్యకర్త యింటికి చేరుకున్నాడు. ఆ తర్వాత అతని ద్వారానే జమిందారుగారు ఊర్లో ఉన్నారో, లేదో తెలుసుకున్నాడు.

జమిందారు బెంగుళూరు నుంచి ఆరోజు సాయంత్రమే వస్తున్నట్లు ఫోన్ చేశాడని వాళ్ల గుమాస్తా చెప్పాడు. దాంతో అక్కడే ఆగిపోయి, ఆ రాత్రి గడిపాడు.

అనుకున్న ప్రకారం జమిందారుగారు ఆరోజు సాయంత్రం ఊర్లో దిగారు.

ఆ మరునాటి ఉదయాన పదిగంటలకు అన్నీ ముగించుకొని, బంగళాకు బయలుదేరాడు సిద్ధోజీ.

అప్పటికే బాగా ముస్తాబై ఎక్కడికో వెళ్ళడానికి సిద్ధమవుతున్నారు జమిందారుగారు.

వారు వెంటనే సిద్ధోజీని గుర్తుపట్టలేకపోయారు.

ఆ తరువాత ఉత్తరం చూపించి, తన్ను తాను పరిచయం చేసుకున్నాక – 'చిట్ హవుస్'లో కూర్చోబెట్టుకొని, అన్ని విషయాలూ మాట్లాడారు.

'సత్య హరిశ్చంద్ర' నాటకంలో తన్ను కదిలించిన ఆనాటి కాటి సీనే వేయమన్నాడు.

కొడుకు గుర్తుకువచ్చి, కళ్ళనీళ్లు పెట్టుకున్నాడు సిద్ధోజీ.

ఆ సంఘటన విన్న జమిందారుగారు చాలా బాధపడ్డారు. 'ఇలా కూడా జరిగిందా?' అని కూడా ఆశ్చర్యపడ్డారు. అలాంటి క్లిష్టసమయంలోనూ నాటకం ఆగకుండా నటించినందుకు ఎంతగానో అభినందించారు... ఎంతో సానుభూతిని చూపించారు.

గుమాస్తాను పిలిపించి, హైదరాబాదు వెళ్ళేటప్పుడు ఖర్చులకంటూ కొంత డబ్బు కూడా యిప్పించారు. జమిందారుగారి మంచితనానికి కృతజ్ఞతలు తెలిపి, శెలవు తీసుకొని తిరిగి వచ్చేశాడు సిద్ధోజీ.

ఆ మరునాడే తాము ఏ ఘట్టాన్ని ప్రదర్శించబోతున్నదీ, ఎందరు కళాకారులు వస్తున్నదీ అన్నీ వివరంగా రాసి, జమిందారుగారి ఉత్తరంలో వున్న అడ్రస్‌కి పంపించాడు.

ఆ ఉత్తరం చేరిన వారంరోజులకి రవీంద్రభారతిలో ప్రదర్శించడానికి అతనికి ఆహ్వానం వచ్చింది. తనతోబాటు మరో అయిదుగురు నటులకి, ఇద్దరు ఇతర కళాకారులకి రానుపోను ఖర్చు, ఉండడానికి వసతి, భోజనాలు కల్పిస్తామని కూడా ఆ ఉత్తరంలో వుంది.

చాలా సంతోషించాడు సిద్ధోజీ. జమిందారుగారికి మనసులోనే కృతజ్ఞతలు తెలుపుకున్నాడు.

తన ట్రూపులో మెరికల్లాంటి వాళ్లని నలుగురు కళాకారుల్ని ఎంపిక చేసుకుని, తన భార్యాపిల్లల్తో బాటు ఆ కార్యక్రమానికి హాజరయ్యాడు సిద్ధోజీ.

అక్కడ సిద్ధోజీ ట్రూపుకి బహుమతి కూడా లభించింది. అప్పటి ముఖ్యమంత్రి స్వయంగా అవార్డు అందించారు.

పేపర్లు సిద్ధోజీని ఆకాశానికెత్తేశాయి...! రేడియోలు, టీ.వీలు ఆవిషయాన్ని ఘోషించాయి!

అదే సంవత్సరం ఢిల్లీలో జరిగిన రిపబ్లిక్ దినోత్సవ వేడుకల్లో కూడా తమ కళను ప్రదర్శించాల్సిందిగా సిద్ధోజీకి పిలుపొచ్చింది. సిద్ధోజీ అక్కడా అదే 'కాటి సీను' ప్రదర్శించి పలువురి ప్రశంసల నందుకొని వచ్చాడు.

దాంతో...యామిగానిపల్లెలో అతని పట్ల ప్రజలకు మరింత గౌరవాభిమానాలు పెరిగాయి.

అదంతా చూసి యింక ఓర్చుకోలేకపోయాడు గుజ్జప్ప.... ఎప్పటికప్పుడు అతన్ని దెబ్బకొట్టడానికి ఆలోచనలు చేస్తూనే వున్నాడు.

అందులో భాగంగా, ఆ కుటుంబం గొప్పగా భావించుకునే గురువుల తోపును – ఏదో విధంగా తన వశం చేసుకుని, అందులోని మామిడిచెట్లను కొట్టేసి, గురువుల స్మృతిరాళ్ళను కూలదోసి, నేలనంతా చదునుచేసి తన చేనిలో కలుపుకుని, కసిగా దున్ని దున్ని పెకలించి ఉలవలు చల్లాలనుకున్నాడు. అలా అని తనకు తానే ప్రతిజ్ఞ చేసుకున్నాడు..... తన గుండెను తానే గాయం చేసుకున్నాడు. ఆ గాయాలనే గేయాలుగా చేసుకుని పదే పదే పాడుకుంటూ, పగనే జరిపించుకుంటూ జీవించసాగాడు.

అతనిలో అంతవరకూ దాగివున్న అసూయ విశ్వరూపం దాల్చింది...

అతనిలోని మాయమృగం నిద్రలేచి జూలు దులుపుకుంది!

అతను సమయం కోసం వేచి చూడసాగాడు!!

అది ఉగాదికి కొద్దిరోజుల ముందు...

రాబోయే ఉగాదికి కూడా యథాప్రకారం నాటకం వేసి గురువుల్ని స్మరించుకోవాలని సిద్ధోజీ ప్రయత్నం!

ఎలాగయినా సరే..... ఆరోజు నాటకం వేయనీకుండా చేయాలని గుజ్జప్ప ఆలోచన!

ఒకరోజు సాయంత్రం భోజనాలు చేసి, ఇంటి ముందర మంచం వేసుకుని సన్నగా వీస్తున్న దక్షిణానిలం యొక్క హాయి ననుభవిస్తూ కూర్చోనున్నాడతను. అతని భార్య, పిల్లలు లోపల పడకలు సమకూర్చుకుని నిద్ర కుపక్రమిస్తున్నారు.

అది బండల మిద్దె!

దానికి వెనక పడమటి వైపున ఒక చుట్టిల్లు! దానికి ఉత్తరం వైపున ఒక కొట్టం!

ఆ కొట్టంలో కొన్ని పశువులు దంట్లు నములుకుంటున్నాయి.

ఆ గొడ్లచావడి లోనే ఒకవైపున ఒక కుక్కిమంచం.... దానిపైన మూల్గుతూ ముక్కుతూ ఆయాసపడిపోతూ ముసలి బుడ్డమ్మ.... ఎముకల గూడులా వున్న ఆమె శరీరం నుంచీ "ఖల్–ఖల్" మని దగ్గు....!

ఆమె పడుకున్న చోటు నుంచి చెడువాసన వస్తోంది. ఆమె ఎప్పుడో నలభై ఏళ్ళ క్రితం – వివాహమైన మూడో ఏడే భర్త చనిపోయి, విధవగా మారింది. భర్త మరణానంతరం ఏ దిక్కూమొక్కూ లేక పుట్టింటికి చేరింది. ఆమెకున్న ఆస్తిపాస్తుల పైన ఆశపడిన వడ్డీల బుడ్డయ్య అక్కను ఆదరించాడు. కొన్నాళ్ళకు ఆమె ఆస్తిని కూడా తనపేర రాయించేసుకున్నాడు కూడా.

ప్రస్తుతం ముసలితనంతో, అనారోగ్యంతో రోజుల్ని లెక్కపెట్టుకుంటోంది. ఆరు మాసాలుగా ఆమె మంచం దిగకుండానే జీవిస్తోంది. ఈ మధ్యన ప్రకృతి కార్యాలు సైతం మంచంపైనే!

'ఈ ముసలి ముండ... ఎప్పుడు చస్తుందా?" అని ఆ యింటిల్లిపాదీ ఎదురు చూస్తున్నారు.

'ఈ ముండకు ఏండ్ల తరబడి ఉలపాగా (వృధాగా) తిండిపెట్టింది గాక – యిప్పుడు ఉచ్చాపియ్యా ఎత్తాలంటే ఎవరివల్లా అవతాది? అట్ట సచ్చిందీ గాదు, బతికిందీ గాదు.. ఏడిపించక తింటావుంది! ఈ శనెప్పుడు ఇరగడయితాదో ఏమో?! అట్ల సఫాయిగా (మామూలుగా) సస్తే ఏ బాధలా! ఇంక ఈ ముండ 'కావు కావు' మంటా కాకి మాదిరి ఎన్నేండ్లు బతకాల..... ఎందుకు బతకాల... ఎవరి కోసం బతకాల? పిల్లలా, పాపలా... ఇట్ట అగోరించీ, అగోరించీ బతికి ఎవుర్ని ఉద్ధరించాలా? ఇంకన్నా సఫాయిగా సావకూడదా ముండ!' మనసులోనే అసహ్యించు కోసాగాడు గుజ్జప్ప.

'ఈ ముండ బతికెవుర్ని ఉద్ధరించాల? అన్న మాటను అప్రయత్నంగానే మనసులో మళ్ళీ మళ్ళీ మననం చేసుకోసాగాడు.

అలా చేసుకోగా, చేసుకోగా.... అతనికొక మహత్తరమైన ఆలోచన కలిగింది. ఆ ఆలోచన తనకు వచ్చినందుకు ఎగిరి గంతేసినంత పని చేశాడు. ఇన్నేళ్ళుగా వృధా అనుకొన్న ఆ ముసలిప్రాణి కూడా ఒక మహత్తరమైన కార్యం సాధించడానికి ఉపయోగ పడబోతున్నందుకు ఆశ్చర్యపోయాడు.

‘కుక్క తలకాయంతటిది ఎప్పుడో వొగప్పుడు పనికొస్తా’దన్నమాట ఊరికే పుట్టుండదు. లేకుంటే ఈ ముసిలి వగ్గుఎందుకున్నా తరమైతాది (ఉపయోగపడుతుంది.) అనుకున్నామా? యిప్పుడు సూడో... ఎంత బాగా ఉపయోగపడబోతాందో?!’ పరిపరి విధాల అనుకోసాగాడు.

తనే తుమ్మి, తనే ‘శతాయుష్షు!’ అని దీవించుకున్నట్టు – తన నెత్తిన తనే అక్షింతలు చల్లుకొని, తనను తానే ఆశీర్వదించుకున్నట్లు – ఆ ఆలోచన వచ్చినందుకు తనను తానే మెచ్చుకున్నాడు.

ఆ ఆలోచనను అమలు చేయడానికే పూనుకున్నాడు.

భజన గుడిలో ఉగాదికి వేయబోయే నాటకం కోసరం జరిగే వద్దిక దరువులు వినిపిస్తుంటే....

‘వద్దిక గిద్దిక జేస్తా కొడుకులకి! నా సత్తా ఏందో సూపిస్తా...!’ అనుకుంటూ నిద్రలోకి జారుకుని, చాలారోజుల తర్వాత హాయిగా నిద్రపోయాడు.

# 21

**ఉ**గాది రోజు రానేవచ్చింది!

కొత్త బట్టలతో, కొత్త ఉత్సాహంతో ప్రజలు పండుగ జరుపుకుంటున్నారు.

ఆరోజు ఉదయాన పదిగంటల సమయంలో సిద్ధోజీ కొందరు నటుల్ని తీసుకుని గురువుల తోపుకి వెళ్ళి, గురువులను స్మరించుకొని వచ్చాడు.

ఆరోజు మధ్యాహ్నం...

వేయబోయే నాటకం కోసం, భజన గుడి ముందర – పందిరి నిర్మాణం జరుగుతోంది.

కొందరు గుంజలు నాటుతుంటే, మరికొందరు టెంకాయ కీతులు చీల్చుతున్నారు. కొందరు నాటిన గుంజలకు పైన అడ్డకొయ్యలు కట్టి, వాటిపైన చీల్చిన టెంకాయ మట్టల్ని వేస్తున్నారు. మరిద్దరు గుడిలో నుంచి కరెంటు సప్లయి తీసుకొని లైట్లు అరేంజ్ చేస్తున్నారు.

అప్పటికే మైక్‌సెట్లు దిగిపోయి, లౌడ్‌స్పీకర్లో సినిమా పాటలు వినిపిస్తున్నాయి.

సాయంత్రమైంది!

నటులు ఎవరి వేషాలు వాళ్ళు సిద్ధం చేసుకోసాగారు....

పొద్దు గూకడానికి సిద్ధంగా వుంది!

సిద్ధోజీ తన యింటిలోని భోషాణం తెరిచి, అందులోని వేషాల్ని, అర్ధాలం పెట్టెను, కాళ్ళగజ్జెల గుత్తుల్ని బయటికి తీసి వుంచుకున్నాడు.

అప్పటికే ఆ 'ఏడు గుఱ్ఱాల సామి' తన నెలవు చేరుకోడానికి తొందరపడిపోతూ... పడమటి కొండల్ని ఎరుపుదనంతో మలామా చేస్తున్నాడు.

సరిగ్గా అదే సమయంలో.....

ఒక నటుడు పరుగెత్తుకుంటూ సిద్ధోజీ దగ్గరకు వచ్చి. –

"గురువా! ఊర్లో సావు బడెనే?!" అన్నాడు.

"చావా! ఎవరి సావు? ఏంది? వివరంగా చెప్పు?" కంగారుగా ప్రశ్నించాడు సిద్ధోజీ

"గుఱ్ఱప్ప మేనత్తుఉండ్లా..... ముండమోపి ముసిల్ది.... బుడ్డమ్మ – అది సచ్చిపోయింది!"

చావు కబురు చల్లగా చెప్పాడు.

"ఊర్లో సావయితే ఆట యెట్టేస్తా మయ్యవారా?" అన్నాడు పక్కనేవున్న మరో ఆటాయన.

అప్పటికే ఘొల్లున ఏడుస్తున్న ఆడవాళ్ళ కంఠారావాలు, ఆ ప్రాంతంలో జొరబడి, శోకంతో ఆ వార్తను చెప్పకనే చెబుతున్నాయి.

"వొరేఁ..... రికార్డు ఆపించరా!" అన్నాడు సిద్ధోజీ.

వెంటనే ఆ నటుడు వెళ్ళి రికార్డు ఆపించేశాడు.

ఆగిన రికార్డుతో ఆగిపోయినందుకు గుఱ్ఱప్ప లోలోపలే భలే సంతోషించాడు. కానీ, ఆ ముసిల్ది దగ్గిదగ్గి ఆయాసంతో నోరు తెరిచి, మగతగా కళ్ళుమూసుకొని వున్న సమయంలో – ఆమె నోట్లో పిడికెడు వడ్ల గింజలు కూరి ఊపిరాడకుండా చేసి, అతనే చచ్చిపోయేటట్లుగా చేశాడన్న నిజం ఆఊర్లోవాళ్ళకే కాదు – చివరికి ఆ యింట్లో వాళ్ళకి సైతం తెలియనే లేదు.

ఆగిపోయిన నాటకాన్ని తిరిగి ఎప్పుడెయ్యాలో సిద్ధోజీ నిర్ణయించుకునే లోపలే... ఆమె పెద్దకర్మ సందర్భంగా పదకొండో రోజు తన ట్రూపుతో ఆమె ఆత్మశాంతికి 'సతీ సావిత్రి' నాటకాన్ని వేయించి, తన ఋణం తీర్చుకున్నాడు గుఱ్ఱప్ప.

అలా... ఆ ఊర్లో మొట్టమొదటిసారిగా ఉగాది నాటకం ఆగిపోయింది!

అదే సమయంలో.... సిద్ధోజీ ట్రూపుతో గాకుండా గుఱ్ఱప్ప ట్రూపుతో ఆ ఊర్లో నాటక ప్రదర్శనా జరిగిపోయింది.

## 22

**నా**టకం చూస్తున్న సిద్దోజీ గతంలోకి అనేక సంఘటనలు – నాటకంలోని సన్నివేశాల్లా గబగబ ఒకదాని తర్వాత ఒక్కొక్కటిగా నడిచి వెళ్ళిపోయాయి.

ఎండ వేడిమికి చల్లగా, కరిగిపోయే మంచుతెరలా గతం కళ్లముందు నుంచి కరిగిపోయింది.

అప్పటికి.....

వేస్తున్న "విరాటపర్వం' నాటకంలో ద్రౌపది సైరంధ్రి వేసంలో, వలలుడిగా వున్న భీముడి దగ్గర కీచకుడి దురాగతం చెప్పుకొని ఏడ్చే ఘట్టం నడుస్తోంది.

"కటకట యిదేమి కర్మ!

కారణంబే మెరుగదయిన ఘటనకు

నేమందునయ్యో ప్రాణేశ...!"

– అన్న దరువు నీలాంబరి రాగం, ఆటతాళంలో రసవత్తరంగా సాగిపోతోంది.

అప్పుడప్పుడు... ఉగాది నాటికి నాటకం వెయ్యలేకపోయినా ఈ సంవత్సరం వెయ్యగలుగుతున్నందుకు లోలోపలే సంతోషించ సాగాడతను.

మొత్తానికి చివరివరకు విజయవంతంగా నాటక ప్రదర్శన జరిగి ముగిసింది.

భారత నాటకాలు వేయడానికి వెళ్ళి, ఉగాది పోయిన మూడోరోజు ఊర్లో దిగిన సీనియర్ కళాకారులంతా ఉగాదినాటి నాటకం విజయవంతమైనందుకు తాము లేని లోటు తీర్చినందుకు ఆ కళాకారుల్ని మెచ్చుకుని సంతోషించారు.

## 23

**ఈ** అనంత విశ్వంలో స్వేచ్ఛగా తిరిగే కాలమనే తిమింగిలం నెమ్మదిగా మరికొన్ని సంవత్సరాలను దిగమింగింది.

ఆ కాలగమనంలో సిద్ధోజి కుటుంబ పరిస్థితి యింకా దిగజారిపోయింది.

సిద్ధోజీ కూతురు శశిరేఖకు పాతికేళ్ళు నిండాయి.

అయినా పెళ్ళి చేసుకుంటామని ఎవ్వరూ ముందుకు రాలేదు!

అప్పటికీ – ఎందరో తెలిసినవాళ్ళకు సంబంధాలు చూడమని చెబుతూనే వున్నాడు.

ఎప్పుడో ఆర్నెల్లకో, సంవత్సరానికో గానీ నాటకాలువేసే అవకాశం రావడం లేదు. భారతోత్సవాలు జరిపించడమూ తగ్గిపోయింది. వచ్చిన ఒకటీ అరా అవకాశాలను నాగోజీ

సద్వినియోగం చేసుకుంటూనే వున్నాడు. అయినా వాటివల్ల వచ్చే ఆదాయం ఏ మూలకీ చాలడం లేదు. తిండికి జరగడం.... కష్టం అయిపోయింది.

కొడుక్కి చేదోడువాదోడుగా వుంటుందని తానూ కూలికి పోతూనే వున్నాడు. ఆ కూలీలయినా ఎక్కువగా లేకపోతున్నాయి. రానురాను బతుకు భారమైపోసాగింది.

ఇలాంటి పరిస్థితిలో....

టిక్కెట్టు పెట్టి ప్రదర్శనలిచ్చే అద్భుతమైన ఒక ఆధునిక నాటక కంపెనీ కుప్పంలో దిగింది.

“అబ్బఁ... భలే వుంది!” అంటూ యువతీ యువకులు విరగబడి చూడసాగారు.

నాటకంలో వేషం కట్టి సిద్ధోజీకి చాలా సంవత్సరాలయింది. ‘కనీసం... ఈ నాటకమన్నా చూసి ఆనందిద్దాం!’ అన్న ఆలోచన తట్టిందతనికి. ఎలా వేస్తారో చూడాలన్న ఉత్సాహమూ కలిగింది.

అందరూ వెళుతుంటే... తానూ వెళ్ళాడు.

బెంగుళూరు రోడ్డుప్రక్క నున్న ఒక బీడునేలలో టెంటు! దానికి చుట్టూ మనిషెత్తున తెరలు... ముందువైపున ఎత్తయిన తడికెల గేటు.... ఆ గేటుకు ఒక వైపున టికెట్టు కౌంటర్.... ఆ కౌంటర్ పక్కనే కొట్టొచ్చినట్టు పెద్దపెద్ద అక్షరాలతో –

‘ఈరోజు నాటకం..... అల్లీ అర్జున! రేపు.... కనకతార!’ అన్న బోర్డు.

టెంటు పైభాగాన కట్టబడివున్న లౌడ్‌స్పీకర్‌లో అదేపనిగా వినిపిస్తున్న సినిమా పాటలు!

‘అల్లీ అర్జున తన ట్రూపు ఎప్పుడూ వెయ్యలేదు. చూద్దాం... వీళ్ళు ఎలా వేస్తారో...?!” అనుకుంటూ నేల టిక్కెట్టు తీసుకుని లోపలికి వెళ్ళాడు.

వేరువేరుగా నేల, బెంచీ, కుర్చీ టిక్కెట్లు.... వెళ్ళి నేలపైన కూర్చున్నాడు.

నాటకం ప్రారంభమైంది!

టెంటు లోపల లైట్లు ఆరిపోయాయి!

ఒక్క స్టేజిమీదనే లైట్లు వెలుగుతున్నాయి!

మేళం కట్టకనే, ఇష్టదేవతా స్తుతి, వినాయక స్తుతి, గురు ప్రశంస... ఇవి ఏవీ లేకనే పాత్ర ప్రవేశం జరిగిపోయింది.

రంగురంగుల లైట్ల మధ్యన సన్నివేశాలు దొర్లిపోతున్నాయి.

అతనికేమీ నచ్చడం లేదు.

అన్నీ డైలాగులే! ఒకటో, అరో అక్కడక్కడా పద్యాలు! ‘వాటినైనా సరిగా పాడుతున్నారా?’ అంటే అదీ లేదు. ఇష్టం వచ్చినట్లు పాడుతున్నారు.

సిద్ధోజీ చెవుల కవి కర్ణకఠోరంగా వినిపిస్తున్నాయి.

దరువులు అసలే లేవు... అన్నీ సినిమా పాటలు! సినిమాలో మాదిరిగానే డబుల్ మీనింగ్ డైలాగులే! సినిమాలో మాదిరిగానే డ్రస్సులు, డాన్సులు!

వాటిని చూసేసరికి – సిద్ధోజీకి దిమ్మతిరిగిపోయింది.

'డ్రామా అంటే ఏమో అనుకున్నాను గానీ... ఇంత చండాలమా? నాటకాలకు ఎంత దవుర్భాగ్యం పట్టిందిరా దేవుడా?!' అనుకున్నాడు.

అప్పటికి 'అల్లీ అర్జునుల' ప్రేమఘట్టం సాగుతోంది. 'అల్లీ'గా స్త్రీనే వేషం వేసింది.

ఆమె వేషం అర్ధనగ్నంగా, జిగేల్ మనిపించే తళుకు బెళుకుల వేషం! మాటిమాటికీ అర్జునున్ని గట్టిగా వాటేసుకుని, కౌగలించుకోవాలనే ఆమె....

'ఇంతకంటే ఛాన్సు రాదేమో....' నన్నట్లు – మాటిమాటికి ఆమెను స్పృశించడానికి, కౌగిలించుకోవడానికి చూస్తున్నట్టు అతను.

ఒకర్నొకరు రెచ్చగొట్టుకునే మాటలు, సెక్స్ భంగిమల్ని తలపింపజేసే ఫోజులు!

అక్కడ.... అందరి ఎదుట అసభ్య సన్నివేశాలు...

కొన్ని వందల కళ్ల ముందరే పబ్లిక్ శృంగారం!

వాళ్ళు కౌగిలించుకున్న ప్రతిసారీ ప్రేక్షకులలో సంచలనం!!

అక్కడ – ఈలలు ... కేకలు... చప్పట్లు!

అంతకుమించి వినరాని మాటలు!!

"అబ్బాం.... గురువా! అదుము గెట్టిగా... చెయ్యిని, కాళ్ళను పిసుకు.... ఆం... కానీం..."

"భలే ఛాన్సులేరా కొడకా! వదిలి పెట్టొద్దు!"

"ఓరిం..... వీడి పాసుగాల! స్టేజీ మిందనే పని పట్టేసేట్టు" వుండాడ్రా కొడుకు!"

"ఊం... కానీం.... కొరుకు పండును... అదుము!"

"ఏం తల్లీ... అల్లీ! ఎందుకింకా ఆలస్యం! కానీయ్ అల్లీ! అల్లకపో..... అతక్కపో అర్జునున్ని!"

అక్కడ ఒకటే బూతులు... బరితెగించిన మాటలు!

ఆ మాటలు వినలేకపోతున్నాడు సిద్ధోజీ....

ఆ దృశ్యాలు చూడలేకపోతున్నాడు...

ప్రేక్షకుల ఈలలు, కేకలు విని, ఇంకా ఉత్సాహంతో రెచ్చిపోసాగారు అల్లీ అర్జునులు!

ఇంతలో..... ఇద్దరూ పాటెత్తుకున్నారు...

ఆ పాటతో సగంమంది ఆడవాళ్ళు లేచిపోయారు.

ఆ పాట ఓ పాత సినిమాలోనిది! 'దాన్నయినా సక్రమంగా పాడుతున్నారా....' అంటే– అదీ లేదు. సంగీతాన్ని సజావుగా హత్య చేస్తున్నారు.

అది నాటకంగా అనిపించడం లేదు.... వెకిలి చేష్టలు... వెర్రిమొర్రి చిందులు! డాన్సులు చేసి, డైలాగులు చెప్పి సొమ్ము చేసుకోవడం తప్ప మరొకటి అనిపించడం లేదు.

అది 'నాటకం' పేరుతో యువకుల బలహీనతల్ని రెచ్చగొట్టి, డబ్బు చేసుకోవడం కోసం చేస్తున్న 'దగా' అనిపించింది.

ఈనాటి సినిమాలకీ, దానికీ ఏమీ తేడా లేదనిపించింది.

సిద్ధోజీకి చిర్రెత్తుకొస్తోంది!

'లేచిపోదామా...' అనుకుంటుండంగానే మధ్యలో ఒక రికార్డు డాన్సు!

అర్జునుడు బెంచీపైన నిద్రపోతున్నాడు. అతన్ని నిద్రలేపడానికి అల్లి అర్ధనగ్నంగా వళ్ళును, అవయవాలను అదే పనిగా తెగ ఊపేస్తూ....

"లే... లే... లే... లేలేలే... నా రాజా! లేవనంటావా? నన్ను లేపమంటావా? నిద్దుర లేవనంటావా... నన్ను లేపమంటావా?" అంటూ రంగుల లైట్ల మధ్య తెగ ఆవేశపడిపోతూ కుర్రకారుని రెచ్చగొట్టేస్తుంటే.... టెంటంతా ఈలలు, చప్పట్లు, ఎడనెడ "లేపేదానికి నడుముకి బట్టేదీ?" అంటూ రకరకాల బూతుమాటలతో మార్మోగిపోతోంది.

ఇక ఏ మాత్రం భరించలేకపోయాడు సిద్ధోజీ.

"తుః.... నీయమ్మ!" అంటూ పైకిలేచి, తుండుగుడ్డను విదిలించి భుజాన వేసుకుని, తిట్టుకుంటూ గేటు దగ్గరున్న వ్యక్తిని పిలిచి, గేటు తెరిపించుకుని వెలుపలి కొచ్చేశాడు.

ఆ గేటు దగ్గరే ప్రత్యక్షమయ్యాడు గుఱ్ఱప్ప!

ఆశ్చర్యపోయాడు సిద్ధోజీ....!

అతనూ తనలాగే నాటకం చూడడానికి వచ్చి వుంటాడనుకున్నాడు.

తాను మాట్లాడకపోయినా అతనే పలకరించాడు.

"ఏమి సిద్ధోజీ! పోతా వుండావా? బాగా లేదా? మనమేసే ఈది నాటకాలకు, ఈ డ్రామాలకు ఎంత తేడానో చూడు! డ్రామా అంటే యిట్టుండాల! సిల్మా జూసినట్టుండాల...! అప్పుడే జనాలు కనక వర్షం కురిపిస్తారు. మనమూ వేస్తాం... మన తాతలు, ముత్తాలు ఎట్టేసినారో అట్ట...!"

అతని మాటల్లో వ్యంగ్యం ధ్వనించింది.

అతను తనను ఎద్దేవా చేస్తున్నట్లు గ్రహించాడు సిద్ధోజీ.

"అవునూఁ... నువ్వెందుకు ఉండావిక్కడ?" అని ప్రశ్నించాడు.

"ఎందుకంటావేందీ? అసలు ఈ డ్రామా కాంట్రాక్టు దీసుకొని, ఈడ ఆడిస్తావుండేది నేనే...!" నవ్వుతూ అన్నాడు గుజ్జప్ప.

ఆ నవ్వు సిద్ధోజీ గుండెకు సూదిలా గుచ్చుకుంది. ఆ టెంటు ముందరున్న 'అల్లీ అర్జున' బోర్డుపైన "తుపుఁ..." అంటూ ఒక్క ఉమ్ము ఉమ్మి, తన ఊరి బాట పట్టాడు.

అలా ఉమ్మినందుకు గుజ్జప్పకు వళ్ళుమండినా – డ్రామా చూడలేక వెళ్ళిపోతున్న అతన్ని చూసి, కసిగా నవ్వుకున్నాడు.

అతను ముందుకు సాగిపోతుంటే....

ఆ టెంటు నుంచి వినిపిస్తున్న గోల క్రమంగా దూరం కాసాగింది.

# 24

**రో**జూ అయిదు గంటలకే లేచే సిద్ధోజీ – ఆ మరునాడు ఆలస్యంగా నిద్రలేచాడు.

అప్పటికే.... నాగోజీ కొడుకు రఁవణ స్కూలుకి బయలుదేరి వెళుతున్నాడు.

కళ్లు పులుముకుంటూ వీధిలో కొచ్చాడు సిద్ధోజీ.

"ఏవిరా రఁవణా... ఇస్కూలుకు బోతుండావా?" అడిగాడు.

"ఆఁ... వస్తా తాతా!"

పుస్తకాల సంచిని భుజానికి లాక్కుంటూ....కారుతున్న చీమిడిని చొక్కాతోనే తుడుచుకుంటూ ముందుకు వెళ్ళిపోయాడు రఁవణ.

ఊరి ముందరికెళ్ళి.... ఓ ఉత్తరేణి చెట్టును పైకిలాగి, పుల్లలు విరిచి, దాని వేరు మొదలు భాగం మెత్తగా నమిలి, పళ్లు తోముకుంటూ పెద్దచెరువు వైపు బయలుదేరాడతను.

అక్కడ కాలకృత్యాలు తీర్చుకుని, ముఖం కడుక్కొని వచ్చేటప్పటికి గంటయింది!

అతను యింటికి వచ్చేసరికి – ఎవరో ఓ ఏభై ఏళ్ళ కొత్త మనిషి అరుగుపైన కూర్చొని పూర్ణమ్మతో తెగ మాట్లాడేస్తున్నాడు.

"మీకేం భయం లేదమ్మా... వోళ్ళూ మన కులస్తులే! మీ మామ వెంకోబరావుకు, మీ ఆయనకు తెలిసినోళ్ళే!"

"ఏమోన్నా... మా యింటాయన్నడగాలా!" కూరకు చేటలో చింతచిగురు పోసుకుని, ఏరిపించుకుంటూ కొట్టంలో కూర్చొని చెబుతోంది పూర్ణమ్మ.

అప్పుడే.... యింట్లో కడుగుపెట్టిన సిద్ధోజీ – అతన్నెగాదిగా చూసి, "ఎవురప్పా నువ్వు?" అంటూప్రశ్నించాడు.

"మాది రాసీడులే!" అన్నాడా వ్యక్తి.

"రాయచోటా! పొద్దన్నే ఏం పనిమీదొస్తివి?"

"నువ్వు?" అనుమానంగా చూశాడతను.

"ఆయనే.... మా యింటాయన!" చెప్పింది పూర్ణమ్మ.

"ఆఁ... మీ కోసమే వస్తినబ్బా!

"మా కోసరమా...? ఏమన్నా నాటకం వేయాల్నా?"

"అదేం లేదు సామీ.... మీ బిడ్డెకు పెత్తనమొచ్చినా!" కళ్ళెగరేస్తూ అన్నాడతను.

"పెత్తనమా?" అనుమానంగా చూశాడు సిద్ధోజీ.

"అదే... మీ ఆడబిడ్డెకు మంచి సంబంధ మొగటి దీసకొచ్చినా!" నవ్వుతూ అన్నాడు.

అతని వాలకం చూసి, 'వీడెవడో పెండ్లిండ్ల పేరయ్యగా వుండాడు....సంబంధాలు పేరుతో నాష్టాలు గీష్టాలు ఉల్ఫాగా మింగేసి పోయే బాపతుగా వుండాడు!' అనుకున్నాడు.

'అయినా బిడ్డకు పెళ్ళి సంబంధమంటే... ఏ పుట్టలో ఏ పాముండాదో సూద్దాం!' అనుకొని –

"ఎవరు? ఏమీ? వాళ్ళ మంచీ, సెబ్బర, సాలు సంప్రదాయం....." వివరాలడిగాడు సిద్ధోజీ.

"నీకూ తెలుసంటలే వాళ్ళు! నాగేశ్వర్రావ్ బంధువులు! రాసీడు కివతల గుడిబండుంది గదా.... కలకడ దెగ్గిర... ఆడుండారు!"

"కలకడ కాడ గుడిబండ దెగ్గిర్నా? పిల్లోడు బాగుంటాడా?" ఉత్సాహంగా అడిగాడు సిద్ధోజీ.

"పిల్లోడికేమో అపీలేలే (తిరుగులేదు) రేపు మీరొచ్చి చూచ్చేగూడా నిజమే అనుకోవాల! పిల్లోడు సుక్కల్లో సెందురుడే...!" చేతుల్ని గాల్లోకి తిప్పి మరీ చెప్పాడతను.

"ఏం జేస్తాడు?"

"యేం జేచ్చాడంటే... ఏమీ జెయ్యడు! వోపినంత యగసాయ ముండాది. అంతా యింతా గాదు – నెత్తినేసుకునే టంతుంది. పదెకరాల భూమిగల అసామిలే.... వొగే కొడుకు! కుడిసేకీ, తాగేకీ ఏమీ లోటులే! అంతేగాకుండా... గుడిబండ్లోనే కడప రోడ్లో వొగ సిల్లరంగిడి గూడా వుండాది. అది భలే జరగతాదిలే... ఆ ఊర్లో కోమిటోళ్ళ క్కాడా అట్ట జరగదు. పిల్లోడు భలే న్యాకయినోడు (తెలివి గలవాడు) దుడ్డు వారుకుంటా వుండాడనుకో!"

– గుక్క తిరుక్కోకుండా చెప్పాడు.

"అదిసరే.... మరి, అంత వరుంబడి వుండేవోళ్ళు మన బిడ్డె నెట్ల సేసుకుంటారో..?!" తన అనుమానం వ్యక్తం చేసింది పూర్ణమ్మ.

"నీ బిడ్డకేమీ లోటుండదమ్మా! ఆడబిడ్డ పోరు గూడా లేదు. ఓమ్మో – ఓ అన్నో! నా మాటిను.... నీ బిడ్డె సుఖపడతాది! యట్లో నీ బిడ్డె పవుడీ (ఆనవాలు) తెలుసుకోని వాళ్ళే నన్ను బంపినారు.... ఆఁ...!"

"పిల్లోడేమన్నా సదూకున్నాడా?".

"ఆఁ... ఈకాలంలో సదూకున్నోళ్ళంతా ఏం పొడిసేచ్చాండారో సూచ్చానే వుండాం గదా! లచ్చలు పోసి సదూకున్నోళ్లు గూడా ఉజ్యోగాల్లేక – ఊర్లు దిరగతా వుండారు... గెడ్డాలు బెంచుకోని!".

"అది సరే... కనీసం అంతో యింతోనన్నా సదుకోనుంటే బాగుండు గదా?"

"సదుకోకేమిలే... తుట్రాగా (పూర్తిగా) సదువు లేనోడేమి కాదులే! ఏడు వరకు సదూకున్నాడు. జాబులు రాసేకి, పత్తరాలు ఉత్తరాలు సదివేకీ వచ్చులే!"

"సరే... మేమేమీ కట్నాలూ, అవీ ఇచ్చుకోలేము. పాపను సూసేపనిలా – సేతులు కడుక్కోని ముట్టుకోవాలనుకో...! మా బిడ్డని సెప్పుకోకూడదు గానీ – బిడ్డె బంగారమే... ఆఁ...!" మధ్యలో అందుకుంది పూర్ణమ్మ,.

"శశమ్మా! పెద్దాయన కన్ని నీళ్లు పట్టకరామ్మా!" అంటూ కేకేశాడు సిద్దోజీ.

శశిరేఖ సిగ్గుపడుతూ గ్లాసుతో నీళ్ళు తెచ్చింది.

వచ్చిన వ్యక్తి శశిరేఖను ఎగాదిగా చూసి – "పాప కేమయ్యా... ఆణిముత్తెం! ఆ ముఖంలో సూడో.... లచ్చిమి కళ ఉండ్లా?!" అన్నాడు.

గడగడ నీళ్ళు తాగి, గ్లాసు తిరిగిచ్చేశాడు.

గ్లాసు తీసుకొని శశిరేఖ లోపలికి వెళ్ళిపోయింది.

కోడలు నీలమ్మ లోపల వంటపనిలో మునిగిపోయి వుంది.

"వోళ్ళకు కట్నం, గిట్నం అవసరం లేదు. మంచి కుటింబరమై యుండి, సాలూ సంప్రదాయం బాగుంటే సాలు! వోళ్ళకేమీ లచ్చలవసరంలా...! నువ్వు సరేనంటే నాతో బాటురా.... వోళ్ళ యిల్లూ వాకిలీ సూడు.... పిల్లోన్ని సూడు!"

"ఆఁ... యిప్పుడెందుకులే! వొగ మంచిదినం సూసుకొని మేమే వస్తాం గానీ – ముందు వోళ్ళను వచ్చి పాపను చూసుకోమను.... తర్వాత మేమొస్తాము.."

మంచి సంబంధం తెచ్చినందుకు ఆ ముసలోన్ని అతిమర్యాదలతో ముంచెత్తేశారు.

మధ్యాహ్నం అక్కడే భోంచేసుకుని, తిరిగి వెళ్ళిపోయాడతను.

అతను వెళ్లిన పదిరోజులకి పెళ్లికొడుకు, అతని తల్లిదండ్రులు అమ్మాయిని చూడ్డానికి వచ్చారు. ఉన్నంతలో అన్నీ బాగానే ఏర్పాటు చేశాడు సిద్ధోజీ.

వాళ్ళకు అమ్మాయి నచ్చింది.

ఆ తర్వాత ఓ మంచిరోజు చూసుకొని – సిద్ధోజీ, పూర్ణమ్మ... కొడుకుని తీసుకొని వెళ్ళి వాళ్ల ఇల్లూ వాకిలీ చూసివచ్చారు.

ఇరువర్గాల వారు ఒకర్నొకరు నచ్చుకున్నాక – పెళ్ళి సిద్ధోజీనే చేసేటట్లుగా పెద్దలు నిశ్చయించారు.

అప్పటికే ఇంట్లో చిల్లిగవ్వ లేక అప్పు చేశాడు. ఆపైన ఎంత ప్రయత్నించిన అప్పు దొరకలేదు. ఇక యిప్పుడు తప్పిస్తే శశిరేఖకు పెళ్ళి కానేకాదేమోనన్న భయం! ఇప్పుడు విరమించుకుంటే.... సంబంధం కుదిరి, ఆగిపోయిన ఆడబిడ్డకు – ఆ తర్వాత అంత సులభంగా పెళ్ళి కాదేమోనన్న దిగులు... అతన్ని నిద్రపోనీయడం లేదు.

'ఎలాగయినా సరే.... డబ్బు తేవాలి? ఎలా.... ఎలా తేవాలి? ఎవర్నడగాలి?

– అదే ఆలోచన!

తెలిసినవాళ్ళ దగ్గరంతా అప్పటికే అప్పు చేశాడు. అప్పుమీద అప్పు యివ్వడానికి వాళ్లెవరూ వప్పుకోలేదు. కొందరయితే ఎక్కడ అప్పు అడుగుతాడోనని ముఖం చాటేసుకుని తిరగసాగారు.

ఇక ఆ ఊర్లో అతను అప్పడగని వ్యక్తి.... ఒక్క గుజ్జప్ప మాత్రమే!

ఎలా లేదన్నా పెళ్ళి ఖర్చులకి ఇరవై వేలన్నా అవుతుంది. ఎంత సర్దుకొని చేసినా పదిహేను వేలన్నా అవసరం.

ఒకరోజు రాత్రి.... పడుకుని తీవ్రంగా ఆలోచిస్తున్నాడు సిద్ధోజీ.

చివరికి – 'గురువుల తోపు అమ్మేస్తే...?' అనుకున్నాడు.

'ఎప్పుడో.... తమ తాతల నాటక కళను మెచ్చుకుని విజలాపురం జమీందార్లు ఈనాముగా ఇచ్చిన తోపు కదా అది! తమ వంశంలోని తరతరాల గురువుల జ్ఞాపక చిహ్నంగా వున్న తోపు! అంతేగాకుండా అన్నీ పోగొట్టేసినా.... యిప్పుడు ఆ ఒక్కగానొక్క ఆధారమైనా ఉండనీకుండా అమ్మేసి, కొడుకును ఏమీ లేనోన్ని చేయలేను!'

'అయినా... యిపుడు ఆ తోపు వల్లా వచ్చే వరుంబడి ఏముండాదనీ,? పేరుకది మామిడి తోటే గానీ – అందులో ఇరవై చెట్లు గూడా లేవే! అవన్నీ ఎన్నో తరాల ముందు నాటినవి, పండిపోయినవి. ఉడుబోతు పిందెల్లాంటి కాయలు కాసేటివి! అవయినా ఊరగాలయకు తప్ప దేనికీ పనికిరావడం లేదు. వాటినయినా అంత శ్రద్ధగానూ కోసుకోవడం లేదు. అలాంటి తోపుండీ ఫలమేమి?'

– రకరకాల ఆలోచనల్తో అతనికి నిద్రపట్టడం లేదు.

ఆవేళ అతని బుర్ర – కదిలించిన కందిరీగెల తుట్టే అయింది!

ఎన్నో ఆలోచనలు!!

ఒకదాని వెంట ఒకటిగా...

అతని పైన దాడి చేస్తున్నట్లుగా....

ఎడతెరపి లేకుండా... ఆలోచనల పరంపర!

అందులోనూ చిన్నప్పట్నుంచీ తన జీవితంలో ఎదురయిన పలు సంఘటనలు, భయాలు, జయాలు, అపజయాలు, మానాభిమానాలు... అన్నీ గుర్తుకురాసాగాయి.

చివరికి మళ్ళీ అతని ఆలోచనలు 'అప్పు' దగ్గరే ఆగిపోయాయి.

'పోనీ.... గుట్టప్ప నడిగితే....?' అనుకున్నాడు.

'వాడికీ, మనకీ పట్టదు కదా! యిప్పుడు అతను పలకడం కూడా లేదే! మరి, అలాంటోడు తనకు అప్పేమిస్తాడు? తనతో కొట్టాడినోన్ని 'దేహీ..' అంటూ అప్పడిగే దెట్టా?' అనుకున్నాడు.

ఆ ఆలోచనకు అతని అంతరాత్మ ఎదురు తిరిగింది.

'ఇన్నీ పెట్టుకుంటే.... బిడ్డె పెండ్లి జేసినట్టే! అవసరమైనప్పుడు శత్రువునయినా సరే ఆశ్రయించక తప్పదు. వసుదేవ దంతటోడు గాడిద కాళ్ళు పట్టుకోలేదా? అందునా మొన్న కుప్పంలో జరిగిన డ్రామారోజు వోడే పలకరించాడు గదా.... యింకెందుకు బిడియం?'

– అతని అంతరాత్మ ప్రబోధించింది.

'వోడు యిస్తాడో, యివ్వడో...?!' తనకు తాను ప్రశ్నించుకున్నాడు.

'ఏమో.... అడిగి చూడు!' అంది అంతరాత్మ.

అలా తర్కవితర్కాలతో ఎప్పుడు నిద్రపోయాడో అతనికే తెలీదు.

ఆ మరునాడే గుట్టప్ప యింటికి వెళ్ళాడు.

అతన్ని చూడగానే ఆశ్చర్యపోయాడు గుట్టప్ప!

"కూసోప్పా సిద్ధప్పా... కూసో! అమ్మీ.... కోటా.... సాపొగటి తెచ్చియ్యి అరుగు మింద!" భార్యను కేకేశాడు.

లోపల్నుంచి ఒక సిరిచాప తెచ్చి "ఏమన్నో.... యిట్టొస్తివి? బాగుండావా? కూసో...!" అంటూ అరుగుపైన చాప పరచి, తిరిగి యింట్లోకి వెళ్ళిపోయింది.

"కూసో! ఏమబ్బా... ఎబ్బుడూ రానోడివి... ఇట్టొస్తివి? మంచినీళ్ళు తాగతావా?" ఆశ్చర్యం నుంచి కోలుకుంటూ అడిగాడు గుఱ్ఱప్ప.

"ఊరికినే వస్తినప్పా... సిన్న పనుండీ...." ఇంటిని పరిశీలనగా చూస్తూ అన్నాడు సిద్ధోజీ.

"నాతోం ఏం పనబ్బా?"

"ఆడబిడ్డెకు పెండ్లి బెట్టుకున్నా.... దుడ్డు అవసరం వుండాది! యాడడిగినా దొరకలే...!" బిడియపడుతూనే చెప్పాడు.

"నీవు గ్రామానికే గురువు కదా! నీకు యాడా అప్పు దొరకలేదా?" కాస్త వెటకారంగా అన్నాడు.

"ఊర్లోవాళ్ళను గాదని ఏరే వాళ్ళని యాడడిగేదిలే గుర్రప్పా!"

తన శత్రువు చేయి కింద, తన చేయి పైనుండడంతో – చాలా ఆనందపడిపోయాడు గుఱ్ఱప్ప. తనేదో ఒక విజయం సాధించినట్టుగానూ భావించుకున్నాడు.

చెరువులో చేప తనకు తానై జాలరి వాడ్ని పిలిచి 'నీ గాలమెయ్యి... నేను మింగుతా" నని స్వయంగా కోరుకుంటున్నట్టనిపించిందతనికి.

"ఎంత గావాలేమి?" గాలం విసిరాడు.

"పదయిదు వేలు?" చేప కోరింది.

"అమ్మో! అంత దుడ్డు ఊరికే నమ్మి యట్టిచ్చేది సామీ?' అని మనసులోనే ఒకసారి గొణుక్కుని పైకి–

"ఎంతా?" అని తిరిగి అడిగింది గాలం.

"పదయిదువేలు.... మూడేండ్లలో తీర్చేస్తా!" ప్రాధేయపడింది చేప.

"అంత దుడ్డు యట్ట తీరస్తావు?"

"యట్లో వొగట్ట తీర్చేస్తాలే!"

"అదే.... యట్టాని?"

"నామీద నీకు నమ్మకం లేదా?"

"నీమీద నమ్మకం లేక గాదు. చేనా.... అమ్మేస్తివి! మడిసేద్యమయిన... లేకపాయ! కూలీనాలీ జేసి సంపాదించి సంసారమే ఈదతావా, అప్పే తీరస్తావా?"

"నీకెందుకప్పా? తల తాకట్టు పెట్టయినా సరే – యిచ్చేస్తా! కడాకు పులినోట్లో తల దూర్చయినా సరే.... మూడేండ్ల నాటికి నీ దుడ్డు నీకు పువ్వుల్లో బెట్టి చేర్చేస్తా!"

"ఏదో వెయ్యో, రెండు వేలో అయితే యట్టో వొగట్ట యివ్వచ్చు! యట్టా? ఆఁ.... యింగొక పంచెయ్యి! ఏ నగో, నట్రో వుంటే యియ్యి! కుదవనుకోద్దు.... నువ్వు మద్దెలో ఏదన్నా యిదయితే – నీకొడుకు 'నాకు తెలీదు పో....' అనొచ్చు. కీడెంచి మేలెంచమన్నారు. అందుకనీ.... అంతే.... యింగేంలా.... నమ్మకం లేక గాదు!"

ఆ మాటకు కాస్త అవమానంగా ఫీలయినా – 'నిండా మునిగినాక చలేముండాదిలే!' అనుకొని, "అంత విలువైన నగ...? నా దగ్గిరే ముండాదప్పా పెట్టేదానికి?" నిస్సహాయంగా అంది చేప. దాంతో – చేపను ఇరికించుకోవడానికిదే మంచి అదనుగా భావించింది గాలం.

"లేకేం.... గురువుల తోపు అడమానం (తనఖా) పెట్టొచ్చుగదా?" అంది గాలం.

"గురువులతోపా?" నోటమాట రాలేదు చేపకి.

"అంత దుడ్డు యివ్వాలంటే.... ఏదో వొగటి పెట్టాల్సిందే! నీపైన నాకు నమ్మకం లేక గాదు. ఈ అన్నేకారి కాలం అట్లయిపోయిండాది. ఎప్పుడేం జరగతాదో సెప్పలేం గదా!"

ఒక్క క్షణం ఆలోచించిం తర్వాత "నీ యిష్టం..." అని గాలాన్ని మింగేసింది చేప.

"నా దెగ్గిర యిప్పుడు పదివేలే వుండాది! నా పేరుతో పదిరూపాయల స్టాంపు కాగితం మీద రాయించి పెడతా.... రేపొచ్చి పది తీసకపో! వొగ వారం తాళి... మిగిలింది తీసుకపో!"

"వడ్డీ ఎంత?"

"యంతేముండాది... ధర్మవడ్డీనే! నూటికి నెలకు రెండు రూపాయలు!"

"సరేబ్బా...!" అని లేచి వచ్చేశాడు సిద్ధోజీ.

అప్పుడే గురువుల తోపు' తన వశమైపోయినట్టే – ఆ తోపులోని చెట్లని ఖండఖండాలుగా నరికి, రంపాలతో కోసినట్టే – ఆ తుండ్లు నన్నింటినీ ఒక పెద్దగుట్టగా పేర్చి నిప్పు పెట్టి కాల్చేసినట్లే – కాలుతున్న ఆ మంటల్ని చూసి తన పగ చల్లారిందని భావించుకొని, తను మీసం మెలేసి వికటాట్టహాసం చేసినట్టే – ఆ మంటల్లో పడి గురువుల గుర్తురాళ్లు, సిద్ధోజీ పడి మలమల మాడి మసైపోయినట్టే – అనిపించి, నవ్వుకుంటూ వుండిపోయాడు గుజ్జప్ప.

ఆ మరునాడు... అనుకున్న ప్రకారం పత్రం రాయించి, సంతకం చేయించుకొని యిచ్చిన గుజ్జప్ప డబ్బుతో ఎలాగో ఓలాగు కూతురి పెళ్ళి చేసేశాడు సిద్ధోజీ.

# 25

**రో**జుల అందెలు కదిలించుకుంటూ మరి రెండు వసంతాల్ని ప్రదర్శించి, మౌనంగా నిష్క్రమించింది కాలం!

ఆ ఏడూ వర్షపుచినుకు లేక మళ్ళీ కరువు పెట్టింది.

ఈ గడ్డపైన గాలి వీచినంత సహజంగా, ఎండ కాసినంత మాములుగా, యడారిలో యిసుక రేగినంత సహజంగా... కనీసం రెండేళ్లకొకసారయినా కరువు రావడం సహజమైపోయింది.

ఇక్కడ పిలవకనే వచ్చే ఏకైక అతిథి కరువే కదా!

ఆ రెండేండ్లు ప్రజలు ఎంతో కటకట పడ్డ తర్వాత జూన్ మాసంలో కుంభవృష్టి కురిసింది!

ఒక్కసారిగా పెద్ద చెరువు సగం నిండిపోయింది!!

రైతులు చేన్లు దున్నడం ప్రారంభించారు. ఎవరి పనుల్లో వాళ్ళు తీరిక లేకుండా వున్నారు.

పొలాలు దున్నే రైతుల్ని చూసి సిద్ధోజీకి మనసు విలవిలలాడింది. 'తన పొలం వుండి వుంటే.... దుక్కి దున్నుకునేవాడ్ని గదా!" అనుకున్నాడు.

అతనిలాగే – ఉన్న అరకొర పొలాల్ని అమ్ముకున్న పేద రైతులంతా అలాగే బాధపడసాగారు.

ఆ బాధ ఎక్కువయ్యో, ఏమో గానీ – సిద్ధోజీకి తీవ్రంగా జ్వరం వచ్చింది. వారం రోజుల పాటు ఇల్లు వదిలి బయటికి రాలేకపోయాడు.

నాగోజీ పదిరోజులుగా ఇంట్లో లేడు. చదుంలో భారత నాటకాలు ఆడడానికి వెళ్ళి ఆరోజే ఊర్లో దిగాడు.

అప్పటికి సుమారుగా కోలుకున్న సిద్ధోజీ – ఇంట్లో పొద్దుపోక మెల్లగా నడుచుకుంటూ పొలాలు చూసుకుంటూ గురువుల తోపు వైపు నడక సాగాడు.

అక్కడెదురుపడ్డాడు కోదండం!

"ఏం గురువా? గురువుల్తోపును గుర్రప్పకమ్మేసినావంటనే....?" అన్నాడు.

ఆ మాట వినగానే ఆశ్చర్యపోయాడు సిద్ధోజీ. అప్పుడుగానీ అతని బాకీ గుర్తుకురాలేదు.

"ఈ విషయం నీకెవరు చెప్పినారు?

"చెప్పేదేముండాది గురువా.... నీకింకా తెలిసినట్టుగా లేదే!"

ఏదో జరగరానిది జరిగిపోయిందన్న అనుమానంతో కంగారు పడ్డాడు సిద్ధోజీ.

"ఏందో కొంచెం యిలావరిగా సెప్పరా కోదండా?"

"అయ్యో.... గురువా! గుర్రప్ప గురువుల తోపులో నాలుగు దినాల నుంచీ అదేపనిగా కూలి మనుషుల్నిపెట్టించి, చెట్లన్నీ కొట్టించేసి, కుప్ప బెడతా వుండాడు!'

హతాసుడైపోయాడు సిద్ధోజీ.

అయినా తనేం చేయగలడు? అతని బాకీని గడువులోపల చెల్లించలేకపోయాడు.

గుఱ్ఱప్ప తోపును స్వాధీనపరుచుకున్నాడు. యిప్పుడు తనేం చేయాలి? సంవత్సరంగా కనీసం వడ్డీ కూడా చెల్లించే స్థితిలో కూడా లేదు. అయినా.... గుఱ్ఱప్ప ఇంత అన్యాయం చేస్తాడని తనెప్పుడూ ఊహించలేకపోయాడు.

పరుగెత్తుకుంటూ తోపు దగ్గరికి పోయి చూసి, నీరు కారిపోయాడు. మామిడిచెట్లన్నీ నేలమట్టమయ్యాయి. గురువుల గుంతలకు నీడ నిస్తున్న ఒక పెద్ద మామిడి చెట్టు తప్ప – అన్నీ నరికివేయబడ్డాయి.

పాత చింతచెట్టు, సీమరాల చెట్లు,ఊడగ చెట్లు, కానగ చెట్లు అన్నీ నరికేసి కూల్చబడ్డాయి.

అక్కడక్కడా ఒకటి రెండు చెట్లు... కొమ్మలు నరికేసి, ఊబిలో కూరుకుపోతూ నిస్సహాయంగా చేతులెత్తేసిన మనిషిలా నిలబడి వున్నాయి.

ఆ స్థితిలో తోపును చూసిన అతని మనస్సు బాధగా మూలిగింది. కళ్ళలో నీళ్ళు తిరిగాయి!

తరతరాల నుంచీ కాపాడుకుంటూ వస్తున్న గుప్తధనం లాంటి తోపు!

కొన్ని వందల సంవత్సరాల తమ వంశచరిత్రకు సాక్షీభూతంగా నిలిచివున్న తోపు!!

తమ పూర్వీకుల గొప్పతనాన్ని స్మరించుకొని, గర్వంతో పొంగిపోతూ గొప్పగా చూసుకునే తోపు!!!

ఆ మొత్తం ఊరిజనాలూ భక్తితో, అభిమానంతో అంజలిఘటించే తోపు...!!

గురువుల తోపు...!!

నేడు పరాగతమై నేలమట్టమైపోతోంది.

ఎందుకూ పనికిరాకుండా అయిపోతోంది.

అయిపోయింది.

అంతా అయిపోయింది.

ఏది జరగకూడదని తను కలలు గన్నాడో... అదే జరిగిపోయింది.

పొలాలమ్ముకొని పొట్టపోసుకున్నా, దానికి మించిన గొప్ప ఆస్తిగా భావించుకుని, ధైర్యంతో బతకడానికి కారణమైన తోపు – గురువుల తోపు.... చిత్తుచిత్తుగా, తుండ్లు తుండ్లుగా నరికివేయబడుతోంది.

దాన్ని చూసే కొద్దీ – రెక్కలు తెగిన పక్షిలా అతని హృదయం తల్లడిల్లిపోయింది.

కొందరు వ్యక్తులు యింకా చెట్లను కొడుతూనే వున్నారు. నేలకు తోసివున్న చెట్లను గొడ్డళ్ళతో నరుకుతూ, అంపాలతో కోస్తూ మరికొందరు...!

తోటల మధ్యలో... కపిల మహర్షి కోపానికి కాలిబూడిదైన సగర పుత్రుల చితాభస్మంలా గుట్ట మాదిరి వేసివున్న కట్టెలు!

అక్కడే... మరోవైపున చేతిలో ఒక గొడ్డలి పట్టుకొని, ఒక సీమరాల చెట్టును నరుకుతూ.... సిద్ధోజీని గమనించే కాబోలు –

"కానీండ్రా! కొయ్యండ్రా! వొరేఁ... నరకండ్రా! నిలవునా నరకండ్రా! నరికి నరికి పోగులు పెట్టండ్రా! కోసికోసి కూలదోసి కుప్పలెయ్యండ్రా! ముక్కలు ముక్కలుగా కత్తిరించి పారేండ్రా! తుండ్లు తుండ్లుగా జెయ్యండ్రా... తొయ్యండ్రా నేలకు...!" ఆవేశంగా అరుస్తున్నాడు.

నేరుగా అక్కడికి వెళ్ళాడు సిద్ధోజీ.

"ఏమిరా గుర్రప్పా ఈ అన్యాయం?" నిలదీసినట్టు అడిగాడు.

"ఏమన్యాయ మయ్యా.... నీ పాసుగాల! నువ్వు రాసిచ్చిందే గదా?!" – గొడ్డల్ని పైకెత్తి చెట్టు మొదట్లో గాటు పెడుతూ నింపాదిగా అన్నాడు.

ఆ గొడ్డలి గాటుకు పట్టెడు మందంతో లేచిన చెక్క ఆ విసురుకి తెగి, బారెడు దూరంలో పడింది.

ఆ దెబ్బ తన శరీరంపైన పడినట్టే బాధపడ్డాడు సిద్ధోజీ.

"రాసిచ్చినా.... కాదనలా! అది అడమానం! అంతేగానీ నీకు అమ్మలా...! దేనికయినా పట్టు విడుపులుంటాయి గదా! యింకో ఆర్నెల్లు టైమిచ్చింటే.... నీ బాకీ తీర్చేసేవోన్ని గదా!"

"నాది మాటంటే మాటే! గడువు దీరింది... తోపు నాదయింది... అంతే!"

"కనీసం గడువు అయిపోతావున్నట్టు గుర్తయినా చేయొచ్చుగదా! యింత అన్యాయం జేస్తివే?!" ఆవేశంగా అన్నాడు.

దాంతో యింకా రెచ్చిపోయాడు గుఱ్ఱప్ప.

"అసలు నీకెందుకు జెప్పాలయ్యా? దుడ్డు దొబ్బుకోని పోయినపుడు తెలీదా? వడ్డీ గట్టే సంవత్సర మైపోయనే! ప్రతిసారీ నీ యింటికి తిరిగి తిరిగి బిచ్చగాడి మాదిర్తో 'అయ్యా వడ్డీ! అయ్యా వడ్డీ!' అంటా దేవులాడాల్నా ... నాకింకేం పన్లేదా? అంతేలే.... 'తీసుకున్నోడు తిరుమల దేవుడితోను, ఇచ్చుకున్నోడు పుచ్చినోడితోను సమాన'మని ఊరికే అన్లా!" గొడ్డలి కిందపడేసి మీదిమీదికి వస్తూ అన్నాడు.

"నేను మాట్లాడేదేంది... నువ్వు పైపై కొచ్చేదేంది? ఇంత అన్యాయం కద్దా అన్నాను.... తప్పేముండాది? ఏం తోపు నరికేసేదాని కిదేమన్నా నీయబ్బ సొత్తనుకుంటివా?" కోపంగా ఊగిపోతూ అన్నాడు సిద్ధోజీ.

"ఏరా కొడకా! 'అబ్బ సొత్తు – గిబ్బ సొత్తు' అంటావ్? పదయిదు వేలు కట్ట... కట్ట దెంకపోతివే.... అది నీ యమ్మా మొగుని సొత్తనుకుంటివా?"

"తీసుకున్నా! కానీ ఎగరెయ్యలేదే! ఏం.... కొంపలేమైనా పెరుక్కొని పోతావుండామా యాడన్నా? నిదానంగా జరిగినప్పుడిస్తా!"

"ఎప్పుడు నీకు జరిగేది? సచ్చినాంకనా?"

"నేను పుట్టిండేది మా నాయనకే... కన్నోనికి (అలగా జనానికి) కాదు –నీసొత్తు ఎగరేసిపోయేదానికి!"

"యిప్పుడెగరేసినట్టు గాదంట్రా.... దర్బేసి నాకొడకా!" అశ్లీలంగా తిట్టసాగాడు గుజ్జప్ప.

"ఎవుడ్రా దర్బేసి నీకొడుకు? నువ్వేరా యబిశారి నాకొడుకువి?" మాటకు మాటా సమాధానం యిచ్చాడు సిద్ధోజీ.

మాటా మాటా పెరిగింది....

ఇద్దరికీ పెద్ద రగడ జరగసాగింది!

అది గమనించిన కూలీలు – చెట్లు నరకడం ఆపేసి వచ్చి, ఇద్దరికీ సర్దిచెప్పడానికి ప్రయత్నించారు.

కానీ, వీళ్ళు వినిపించుకోలేదు... పచ్చిగా బండబూతులు తిట్టుకోసాగారు.

ఈ విషయం.... ఎవరి ద్వారానో తెలుసుకున్న నాగోజీ పరుగున అక్కడికి చేరుకున్నాడు.

అతను వెళ్ళేసరికి ఒకరితో ఒకరు కలియబడి జుట్లు జుట్లు పట్టుకొని వున్నారు.

ఒకర్నొకరు తోసుకుంటున్నారు...

కూలీలు విడదీస్తున్నారు!

ఆ దృశ్యం చూసేసరికి – నాగోజీకి కోపం నసాలాని కంటింది. గుజ్జప్పను పక్కకు లాగి యిష్టం వచ్చినట్లు ఎక్కడబడితే అక్కడ కొట్టి తన్నసాగాడు.

ఆ రగడ గురించి తెలుసుకున్న ఊర్లోవాళ్ళు కొందరు అక్కడికి చేరుకుని ఇద్దరినీ విడదీశారు.

తనను రక్తగాయాలు అయ్యేటట్లు కొట్టారని తండ్రికొడుకుల పైన కేసు పెట్టాడు గుజ్జప్ప.

అలాగే... సిద్ధోజీ, నాగోజీలు తమ తోపు నరికేస్తుంటే – అడిగినందుకు అతనే తన మనుషుల్తో దాడిచేసి, తమని గాయపరచాడని కవుంటర్ కేసు పెట్టారు.

ఆ విధంగా మొట్టమొదట పోలీసులు ఆ ఊర్లోకి అడుగుపెట్టారు.

ఇద్దర్నీ అరెస్టు చేశారు....

ఇద్దరి దగ్గరా తిన్నారు.

పట్టడానికి అవకాశం లేక – ఎంతోకాలంగా ఎదురుచూసి – కాళ్లు సరిగ్గా శుభ్రం చేసుకోకపోవడాన్ని ఆధారం చేసుకుని నలున్ని పట్టిన శనిలా... అంతవరకూ ప్రవేశించడానికి అవకాశం లేని 'రాజకీయ జాడ్యం' 'ఆ' గలాటతో ఈ ఊర్లోకీ ప్రవేశించింది.

గుజ్జప్పకు అధికార పార్టీ నాయకులు సహాయంగా నిలిస్తే – ప్రతిపక్ష పార్టీ సిద్ధోజీకి అండగా నిలిచింది.

కేసు కోర్టు కెక్కింది!

దాంతో... ఆ 'యామిగాని పల్లె' రెండుగా చీలిపోయింది....!!

అంతకుముందున్న ప్రశాంతత, ఐక్యత, గురుభావం, నాటకాలాడడం, అన్నీ ఆ సంఘటనతో పతనమైపోయాయి.... ఒక్కసారిగా కుప్పకూలిపోయాయి.

నిర్మలంగా వున్న చెరువులో వున్నట్టుండి ఓ పెద్ద బండరాయిని వేసినట్టు – ఆ ఊరి ప్రశాంతతకు ఆ సంఘటన బండరాయిలా తగిలింది... అల్లకల్లోలమైపోయింది.

గురువుల తోపు నశించిపోవడంతో – సిద్ధోజీకి అదే మనోవ్యధ పట్టుకుంది. అదే క్రమంగా మనోవ్యాధిగా మారిపోయి, రోగగ్రస్తుడయ్యాడు.

కానీ,

గుజ్జప్ప – తనకు జరిగిన అవమానానికి వాళ్లపైన యింకా పగ పెంచుకున్నాడు. ఎలాగయినా సరే ... గురువుల తోపులో యింకా మిగిలిపోయివున్న ఆ ఒక్క పెద్ద మామిడి చెట్టునూ నరికివేయాలనుకున్నాడు.

ఆ తర్వాత సమాధి రాళ్ళను నేలమట్టం చేసేయాలనుకున్నాడు.

## 26

**గు**డిబండ నుంచి అల్లుడూ, కూతురు ఇంట్లో దిగారు....

జరిగిన సంఘటన విని అల్లుడు అగ్గిమీద గుగ్గిలమే అయ్యాడు.

"ఏంది మామా... మీ అల్లుడు సచ్చినాడనుకున్నారా? ఇంత జరిగినా నాకు మాట మాత్రమైనా తెలియజెయ్యలే?!! కాకితో కబురంపిన్నా... బాంబులు దెచ్చి, ఆనా కొడుకు యింటి మిందేసీ పేల్చేసిందును. చీల్చిపారేసిందును కొడుకుల్ని! ఇప్పుడైనా మించిపోయిందేమీ లేదు – మీరు 'ఊఁ' అనండి చాలు.... పొడిచేచ్చా కొడుకుల్ని! కడప బాంబులు దెచ్చి యేసేచ్చాం!"

– ఎగిరెగిరి పడ్డాడు సిద్ధోజీ అల్లుడు.

"అయ్యిందేదో అయిపోయింది! కేసు కోర్టు దాకా పోయిండాది..... నడవనీ! అందరూ 'మీకు న్యాయం జరగతాది' అంటావుండారు..... సూద్దాం! కోర్టులో కాకపోతే అప్పుడు సూసుకుందారి గానీ!" అంటూ సర్దిచెప్పారు సిద్ధోజీ, నాగోజీలు.

ఆవేశం అణచుకున్నాడు అల్లుడు.

వాళ్ళు వచ్చిన మూడోరోజే ప్రయాణమయ్యారు.

అప్పుడు తాము వచ్చిన పని చెప్పాడు అల్లుడు –

"గుడిబండలో వచ్చే మంగళవారం రాసీడు గంగమ్మ జాతర! శానా యేడిగ్గా జరగతాది. యింటికో యాట గొట్టి పండగ జేసుకుంటారు. మీరందరూ కడ్డాయంగా (తప్పనిసరిగా) రావాల్సిందే!".

"అంతే నాయనా! మాకు మాత్రం ఎవరుండారు? మీరు కడ్డాయంగా రావాల్సిందే! మీకు ఈ బాధ నుంచి కొంచెం మనశ్శాంతి దొరుకుతుంది.... రాండి!" శశిరేఖ చెప్పింది.

"సరే.... వస్తాములే!"

– అని భరోసా యిచ్చి అల్లుణ్ణి, కూతుర్ని సగౌరవంగా ఊరికి పంపించేశారు.

వాళ్ళు కోరినట్లే – యింటిల్లిపాదీ ఆదివారమే బయలుదేరి గుడిబండ చేరుకున్నారు.

అదే మంచి అవకాశంగా భావించాడు గుజ్జప్ప!

ఒకరోజు సంధ్యవేళ గొడ్డలి తీసుకుని, ఒక్కడే గురువుల తోపు చేరుకున్నాడు.

అక్కడ ఏ జనసంచారమూ లేదు!

మెల్లగా అడుగులు వేసుకుంటూ.. పెద్ద మామిడి చెట్టును సమీపించాడు.

దారి తప్పిపోయి కీకారణ్యంలో ఎటూ పోలేక – ఉన్నచోటే నిలబడిపోయిన ఒంటరి అనాథ బాటసారిలా....

యుద్ధభూమిలో శత్రువులతో హోరాహోరీగా పోరాడి, తన వాళ్ళందరూ హతమైపోగా– ఏకాంతంగా మిగిలిపోయి, వాళ్ళను చూస్తూ విలపిస్తున్న మహాయోధుడిలా...

నరికివేయబడిన చెట్లమధ్యన....

ఒంటరిగా నిలబడి వుంది.

పెద్ద మామిడిచెట్టు!

గురువుల గుంతల పైన స్మృతిచిహ్నాలుగా నిలబడివున్న సమాధిరాళ్ళు – జనసంచారమే లేని వనప్రదేశంలో ఏకాంతంగా కొలువుదీరిన వనదేవతల్లా కనిపిస్తున్నాయి.

వాటిని చూసిన గుజ్జప్పకు మాత్రం – భారతోత్సవాల్లో కొలువు దీరిన ధర్మరాజు లేని నలుగురి పాండువల విగ్రహాల్లా అనిపించాయి.

దాంతో – 'చీ! ఇవి పాండవులు గాదు – దుష్ట చతుష్టయం ప్రతిరూపాలు! ఏన్నో ఏండ్లుగా ఈ గ్రామాన్ని 'గురువులు' అనే పేరుతో తమ గుప్పిట్లో పెట్టుకొని ఆడించిన ముండకొడుకుల బండలు! వీటిని ముక్కలు ముక్కలుగా చెయ్యాల్సిందే! ముందు చెట్టెక్కి కొమ్మలన్నీ నరికేస్తా ఆ తర్వాత యింటికి పోతూ పోతూ ఈ బండల్ని పగులగొట్టేసి పోతా!" కసిగా అనుకున్నాడు.

సూర్యుడు అస్తమించగానే పైకెగసిన చీకటి తెరలుతెరలుగా లోకాన్ని కప్పేయసాగింది.

ఆకాశంలో.... ఒక్కొక్కటిగా దర్శనమిస్తూ.... క్రమంగా కోటానుకోట్ల నక్షత్రాలు తొంగిచూడసాగాయి.

తోపుమధ్యలో కుప్పపోసి వున్న కట్టెల గుట్ట..... మతంగ మహర్షి ఆశ్రమంలో వాలిచే చంపబడి అచేతనంగా పడివున్న దుందుభి కాయంలా ఎత్తుగా కనిపిస్తోంది.

పడమటి దిక్కు నుంచి వీచిన ఒక గాలి వీచిక ఆ చెట్టుకొమ్మల్ని తాకి పతనమైపోయి, ఆకుల్ని సుతారంగా కదిలిస్తూ వెళ్ళిపోయింది.

ఎక్కడా ఏ అలికిడీ లేదు!

కీచురాళ్ళ ధ్వనితప్ప – ఏ శబ్దమూ లేదు!!

గుఱ్ఱప్ప ఆవేశంగా గోచీ ఎగచెక్కి గొడ్డల్ని ఒకచేత బట్టుకొని, మెల్లగా చెట్టెక్కి ఒక కొమ్మ పైన కూర్చున్నాడు.

ఆ చెట్టునిండా... గింజర గోతుల (ఎఱ్ఱటి చలిచీమలు) గూళ్ళు గుత్తులు గుత్తులుగా వేలాడుతున్నాయి.

ఆ కొమ్మమీద కూర్చున్న గుఱ్ఱప్ప నెమ్మదిగా పక్కనున్న మరో కొమ్మను కొట్టసాగాడు.

గొడ్డలి పదునుగా వుండడంతొ – దెబ్బదెబ్బకూ గాటు కొమ్మలోకి దిగబడిపోతోంది.

ఆ గొడ్డలి దెబ్బలకి కదలిపోతున్న చీమల గూళ్ళలో నుంచి చీమలు – కోటను ముట్టడించడానికి సమాయత్తమవుతున్న శత్రుసైనికుల్లా.... అతని వైపుకు రాసాగాయి.

అప్పటికే కొన్ని చీమలు అతన్ని కుట్టడం ప్రారంభించాయి. అవి కుట్టిన ప్రతిచోటా మంట పుట్టి చర్మం సలపరమెక్కుతోంది. అయినా అతను వాటిని లెక్కచేయడం లేదు.

'వళ్ళంతా బూడిద పూసుకోని గనక ఎక్కింటే ఈ చీమలు కుట్టుండవు గదా!' అనుకుంటూ ఒక చేత్తో వాటిని తుడుచుకుంటూ కొమ్మను నరకసాగాడు.

కొంత సేపటికి ఆ కొమ్మ తెగి, పెద్ద శబ్దం చేసుకుంటూ కిందపడిపోయింది.

అది పడేటప్పుడు మిగిలిన కొమ్మలకు వరుసుకొనిపోవడం వల్లా... గింజర గోతుల గూళ్ళు చిట్లిపోయి, ఆ చీమలన్నీ చెట్టు మొదలు వైపుకు రాసాగాయి. ఆ కొమ్మ

పడిన ఊపుకి కదలిపోయిన చెట్లోని అన్ని గూళ్ళలో నుంచీ చీమలు బారులు తీరి.... అటువైపుకే రాసాగాయి.

కొమ్మను నరికిన విజయగర్వంతో – సంతోషంగా నవ్వుకొని, మరో కొమ్మను అదే విధంగా నరకసాగాడు.

కానీ..... చెట్లోని చీమలు గుంపులు గుంపులుగా వచ్చి అతన్ని ముసురుకోసాగాయి.

తమ మధ్యకు ఏకాకిగా జొరబడిన శత్రుయోధుడ్ని చుట్టుముట్టే సైనిక దండులా... వచ్చేస్తున్నాయి!

తమ కలుగులోకి వచ్చిపడ్డ కాలసర్పాన్ని సైతం మట్టుపెట్టగల ధైర్యం, తెగువ – ఆ దండులో కనిపించసాగాయి.

రామరావణ యుద్ధంలో రాక్షసుల పైకి దూకిన రామదండులా వందలు, వందలు... వేలకు వేలు.... మందలు మందలు వచ్చేస్తున్నాయి.

అతని శరీరాన్నంతా ఆక్రమించసాగాయి!

కుట్టికుట్టి పెడుతున్నాయి!

ఎక్కడ బడితే అక్కడ చర్మం పైపొరను తెంపిపారేస్తున్నాయి!

అవి కుట్టిన ప్రతిచోట.... మంట.... బాధ!!

తేలు కుట్టినంత సలపరం!!

కరెంటు షాక్ తగులుతున్నట్టుంది. (అందుకే వాటిని 'కరెంటు చీమ'లని కూడా అంటారు కదా!)

ఆ బాధ భరించలేక – గొడ్డలి కిందపడవేసి గబగబ చెట్టు దిగడానికి హడావిడిగా ప్రయత్నించసాగాడు.

ఆ హడావిడిలో కాలుజారి, దబ్బున కిందపడిపోయాడు.

అంతే...... ఆ తర్వాత ఏమైందో అతనికి తెలియదు...

కళ్లు తెరిచి చూసేసరికి – యింట్లో మంచం పైన తను!!

పొలాల్లో పనిచేసుకుని యింటికి వస్తున్న కొందరు రైతులు – అచేతనంగా చెట్టుకింద పడివున్న అతన్ని యింటికి చేర్చారు.

అతనికి స్పృహ వచ్చేటప్పటికి అర్ధరాత్రి దాటింది.

భార్యా బిడ్డలుఅందరూ ఏడుస్తున్నారు.

"అఁ.... అన్నేకారి తోపులోకి అసర సందేల ఎందుకు పోతివయ్యా?"

"దుడ్డుపోతే పోయింది... తిరిగి సంపాదించుకోవచ్చు! మడిసిపోతే తిరిగొచ్చునా?"

"ఆ సిద్దుగోడే... మొనసులో కసిబెట్టుకోని శాతాలం (చేతబడి) ఏదో చేసునట్టుందయ్యా! ఆయప్పకు కట్టుమంత్రాలు అవీ బాగాతెలుసు... లేకంటే ఈ మాదిరి జరుగునా?"

"అదిగాదులేబ్బా... అది ముందే సచ్చిన గురువుల్ని పూడ్చిన తావు! అందునా.... వొగబ్బుడు బల్జోళ్ళ గంగులయ్య భార్యతో సహా ఉరిబోసుకోని సచ్చిందే తావు! అట్లా సాటికి అసరసందేల బోతే ఆపితి (ఆపద) రాదా?"

"సందేలంటే.... దెయ్యాలు నిద్దర లేసే టయం గదా! ఆ టైంలో గురువుల గుంతలపై నుండే ఆసెట్టెక్కకపోతే ఏమో....?!"

"ఎక్కినాడు... పాణం మిందికి దెచ్చుకున్నాడు!"

"అది గురువుల తోపు గాదురా సామీ.... పిశాచాలుండే తావు.. అది దెయ్యాల తోపు!"

అక్కడ చేరిన వాళ్ళు రకరకాలుగా అనుకుంటున్నారు.

ఏం జరిగిందో అతనికే సరిగా తెలియడం లేదు.

నడుము నొప్పిగా సలపరం పెడుతోంది. కాళ్లు మొద్దుబారిపోయినట్టు – తిమ్మిరెక్కినట్టుగా వుంది. కాళ్ళు కదిలిద్దామని అనుకున్నాడు... కానీ, అవి కదల్లేదు.

మళ్ళీ కదిలించాడు....

ఊహుఁ.... కదల్లేదు!

ఒకటి, రెండు, మూడుసార్లు –

మళ్ళీ మళ్లీ ప్రయత్నం చేశాడు.

కదల్లేదు!

అలా చాలాసేపు ప్రయత్నం చేశాడు...

అయినా కదల్లేదు!

పోనీ, లేచి కూర్చుందామనుకున్నాడు.

ఉహుఁ.. ఆ ప్రయత్నమూ ఫలించలేదు.!

చెట్లోనుంచి కింద పడినప్పుడు నడుములు పడిపోయాయన్న సత్యాన్ని తెలుసు కోవడానికి అతనికి ఎంతోసేపు పట్టలేదు.

పౌరుషానికి పోయి తనెంత తప్పు చేశాడో, ఎంతటి ప్రమాదాన్ని తెచ్చిపెట్టుకున్నాడో.... అతనికి అప్పుడు గాని తెలిసిరాలేదు.

ఆరోజంతా ఉచ్చుకి, దొడ్డికి చాలా యిబ్బంది పడ్డాడు.

ఆ మరునాడు ఉదయాన్నే ఓ ఎద్దుల బండిలో అతన్ని కుప్పం తీసుకుపోయారు.

అక్కడ.... డాక్టర్ పరీక్షచేసి, వెన్నుపూస కింది భాగం పూర్తిగా దెబ్బతిందనీ, యింకా నడుములోని నరాలన్నీ దెబ్బతినిపోయాయనీ, వీలయినంత త్వరగా వేలూరు సి.యం.సి,.కో, లేదా తిరుపతి రూయాసుపత్రికో తీసుకుపోతేనే గానీ ఎక్కువ రోజులు బతకడని చెప్పేశాడు.

దాంతో పూర్తిగా భయపడిపోయి – అతన్ని తిరుపతి రూయా ఆసుపత్రికి చేర్చారు.

రాయచోటి నుంచి తిరిగొచ్చిన సిద్ధోజీ, నాగోజీలు ఆ విషయం తెలుసుకొని 'తగిన శాస్తి జరిగింది. ఎప్పుడూ మిడిమేళం పనికిరాదు మనిషికి!' అనుకున్నారు.

గుజ్జప్పకు తిరుపతి రూయాసుపత్రిలో... డాక్టర్లు ఆరునెలల చికిత్స చేసి, ఫిజికల్ ఎక్సర్‌సైజ్ చేయించి, రెండు కట్టెలిచ్చారు. ఎంత ప్రయత్నించినా యూరిన్ కంట్రోల్ కాకపోవడంతో – నీరుడికి 'కాథటర్' పెట్టి సంచి తగిలించారు.

ఆ తర్వాత – అతని వెంట వున్న వాళ్ళకు కొన్ని సూచనలిచ్చి, 'బెడ్‌సోర్స్' రాకుండా చూసుకోమని చెప్పారు. "జీవితాంతం ఈయనింతే! చాలా జాగ్రత్తగా చూసుకుంటే... న్యాచురల్‌గా కాళ్లు రావచ్చు... చెప్పలేం!" అని డిశ్చార్జ్ చేసి పంపించివేశారు.

ఆపైన ఎంత ప్రయత్నించినా, ఎన్నిరోజులున్నా అతని ఆరోగ్యం యింకా క్షీణించి పోయింది. రానురాను అతని మేనత్త బుడ్డమ్మను తాను చంపకముందు ఆమె ఏ స్థితిలో వుండిందో ఆ స్థితిలోకి వెళ్లిపోయాడు.

అదేచోట గొడ్లచావడిలో.... అదే స్థితిలో.... కుక్కిమంచం పైనే.... అతని జీవనం!

ప్రమాదం జరిగిన కొత్తలో 'అయ్యో.... ఈయన లేకపోతే మా గతి యట్ల?' అనుకున్నవాళ్ళే అతనికి సేవలు చేయలేక, 'ఈ మడిసి ఎప్పుడు చస్తాడా?' అన్న మానసిక స్థితికి చేరుకున్నారు.

అక్కడ... ఆ గొడ్ల చావడి లోనే.... 'బెడ్‌సోర్స్' ఏర్పడి అనతికాలంలోనే అతను చనిపోయాడు.

ఇక అప్పటినుంచి... ఎన్నో తరాలనుంచి 'గురువుల తోపు'గా గౌరవంగా పిలవబడ్డ ఆతోపు 'దెయ్యాల తోపు'గా పేరుపడి, ప్రజలు వంటరిగా ఆ పక్కకు పోవడానికే భయపడిపోసాగారు.

గుజ్జప్ప చేసిన పనికి 'గురువుల తోపు' కాస్తా 'దెయ్యాల తోపు'గా పేరు తెచ్చు కున్నందుకు యింకా కుమిలిపోయాడు సిద్ధప్ప. దాంతో అతని ఆరోగ్యమూ క్షీణించిపోసాగింది.

మాటిమాటికీ... 'ఖళ్ళుఖళ్ళు'న దగ్గుతూ ఆయాసపడిపోతున్నాడు. ఇక తను ఎన్నో రోజులు బతకనని అనిపించసాగింది.

అందుకే..... 'గురువుల చరిత్ర' పుస్తకంలో తన తండ్రి చనిపోయినప్పటినుంచీ అంతవరకు జరిగిన అనేక ముఖ్య ఘట్టాల నన్నింటినీ రాసిపెట్టేశాడు.

అలాంటి సమయంలోనే బ్రహ్మోత్సవాలొచ్చాయి!

ఎందుకో.... అతనికి ఈ బ్రహ్మోత్సవాలే తనకు చివరివనిపించింది.

"యట్టోవొగట్ట... ఈసారి భజన యాత్ర సాగించాల్సిందే!' అనుకున్నాడు.

అదే కొడుక్కి చెప్పాడు.

నాగోజీ ససేమిరా వప్పుకోలేదు.

"నాటకాలే మానేసినాం!గురువుల తోపే నాశనమైపోయి, కోర్టు కెక్కింది. 'దెయ్యాల తోపు'గా పేరు తెచ్చుకునింది. అట్టాంటబ్బుడు ఈ భజన యాత్ర మాత్రం చెయ్యకపోతే ఏం?" అన్నాడు.

అయినా... సిద్ధోజీ వినలేదు.

"న్యాయం మనపక్కే వుంది..... తోపు మనదే అవుతుంది! ఎప్పటికీ ధర్మమే గెలుస్తుంది!" అని కొడుక్కి హితబోధ చేశాడు. తాను యాత్ర పోయి తీరాల్సిందేనని పట్టుబట్టాడు.

ఆరోజు ఉదయాన....

స్నానం చేసి భోషాణం తెరిచాడు. అందులో వున్న తబలాలు, తాళాలు, నాటక పుస్తకాలు, అర్దాలం పెట్టె, వేషాల దుస్తులు, భుజకీర్తులు, కిరీటాలు, విగ్గులు, ఆయుధాలు... అన్నీ ఆ వేళ మరీ అందంగా, కొత్తగా కనిపించి– ఒక్కక్షణం మిరిమిట్లు గొలిపాయి.

మనసారా చేతుల్లో వాటిని ఒక్కసారి స్పృశించి, కొన్నింటిని పిడికిలితో ఎత్తుకొనికళ్ళ కద్దుకున్నాడు. గుండెలకు హత్తుకున్నాడు. ముద్దు పెట్టుకున్నాడు. ఆ తర్వాత మళ్ళీ అక్కడే పెట్టేశాడు.

నాటక పుస్తకాల పైనే వున్న 'గురువుల చరిత్ర' తీశాడు.

"వరే నాగా! నేను నా జీవితంలో జరిగిన కొన్ని ముఖ్యఘట్టాలన్నీ యిందులో రాసిపెట్టిండా! నా మాదిరే మా నాయనా, వాళ్ళ నాయనా, అంతకుముందు గురువులుగా వున్నోళ్ళంతా.... వోళ్ళోళ్ళ చరిత్ర రాసిపెట్టిండారు. నా తర్వాత నువ్వు అందులో రాసిపెట్టు! ఇది చినిగిపోతే ఇందులో వుండే విషయాలన్నీ యింకో నోట్సులో రాసిపెట్టు... ఈ మాదిరిగానే నీ కొడుక్కీ చెప్పు...." అంటూ దాన్ని కళ్ళకద్దుకొని, మళ్ళీ అక్కడే పెట్టేశాడు.

ఆ పెట్టెలోనే ఓ మూల... మడతపెట్టి వున్న ఎఱ్ఱటి భజన దుస్తుల్ని పైకి తీశాడు. చెక్కలు, గజ్జలు, ఎఱ్ఱ జండాలు పైకి తీశాడు. వాటినన్నింటినీ నేలపైన పెట్టి, భోషాణం మూసేశాడు.

తొడుక్కున్న బట్టలు తీసేసి, ఎఱ్ఱదుస్తులు కట్టుకున్నాడు. ఎఱ్ఱధోవతిని నడుముకు బిగించాడు. రుద్రాక్ష దండలు మెడలో వేసుకున్నాడు. కాళ్ళకు గజ్జలు కట్టుకున్నాడు.

తన ఎడమచేతి మణికట్టుకు ఎఱ్ఱజండా కొసను తీసి బిగించుకున్నాడు.

చెక్కలు చేతబట్టుకొని భోషాణం పక్కనే వున్న మరో ట్రంకుపెట్టెను తెరిచి, అందులో వున్న చిల్లర మల్లర డబ్బులన్నీ తీసి గుడ్డలో చుట్టుకొని, మరో పంచగుడ్డా, తువ్వాలుతీసి వాటిని ఒక సంచిలో పెట్టుకొని, ఆ సంచిని మెడకు తగిలించుకున్నాడు. చుట్టింట్లోకి వెళ్లి దేవుడికి మొక్కి –

"శ్రీ మద్రమారమణ గోవిందా.... గోవింద!" అంటూ గోవింద నామస్మరణ చేసి, అందర్నీ పలుకరించాడు.

యిక ఏం చేసినా వినడని నాగోజీ చూస్తూ నిలబడిపోయాడు.

"వసే పూర్ణి! భద్రంగా వుండే! నే పోయెస్తా...." అంటూ భార్యకు చెప్పాడు.

"అమ్మా నీలమ్మా! బిడ్డెలు భద్రం కొడకా!" అంటూ కోడలికి చెప్పాడు.

రంవణను, నాగోజీని దగ్గరికి పిలిచి –

"ఏమిరా.... ఈ నాటక కళను మీరు వదులద్దంద్రా..." చెమర్చుతున్న కళ్ళతో అన్నాడు.

"అవన్నీ యిప్పుడెందుకు నాయనా? అసలు వళ్ళు బాగాలేనప్పుడు యాత్ర జెయ్యకపోతే యేమి? దేవుడేమైనా కొడతావుండాడా? కాలం మారిపోయిండాది – యిప్పుడెవురూ యాత్రకు రారు' సర్దిచెప్పడానికి ప్రయత్నించాడు నాగోజీ.

"ఎవురొచ్చినా, రాకపోయినా నా యాత్ర ముగించాల్సిందే! ఇది దైవకార్యం... నన్నాపొద్దు!" – ఖచ్చితంగా చెప్పేశాడు సిద్ధోజీ.

"ఏవిరా రంవణా! నువ్వెంత చదువుకున్నా మన పూర్వీకుల నుంచి వస్తావుండే మన నాటక విద్దెను మాత్రం మరవద్దు. నా తర్వాత మీ నాయన, ఆయన తర్వాత నువ్వే గురుపీఠం తీసుకోండి!" మనవడి తల నిమురుతూ అన్నాడు.

"ఈ కాలంలో యింకా గురుపీఠాలు, నాటకాలు ఎవరు ఆదరిస్తారు తాతా? ఈ నాటకాలు నీకు ఏనాడన్నా సక్రమంగా కూడు బెట్నాయా? దరిద్రాన్ని తప్పా ఏమిచ్చినాయి? యింకా పావరం (మోహం) ఎందుకు సెప్పు తాతా?" ఎదురు ప్రశ్న వేశాడు రంవణ.

"అట్లనొద్దురా రంవణా! ఆచారం నిలబెట్టంద్రా.... గురుతనం పోగొట్టుకోవద్దురా!" ప్రాధేయపూర్వకంగా అన్నాడు సిద్ధోజీ.

"ఈ నాటకాలు, గురుతనాలు... ఇవన్నీ మనవల్ల గాదులే తాతా! నేను కర్నాటక

దేశానికి టీచర్ ట్రైనింగ్ పొయ్యి టీచర్‌నవుతా... అదే నిజమైన గురుతనం! సరే.... నువ్వు యాత్రకు బయల్దేరినావు గదా.... పోయిరా పో! వచ్చినాంక మాట్లాడుకుందాం! నడు... నడు...!" తొందరించాడు రమణ.

ఆపైన మారుమాట్లాడలేదు సిద్ధోజి.

ఒక్కక్షణం తర్వాత – "అట్టా చూస్తావుంటే... ఈ కళలు, గురుపీఠాలు నాతోనే కడైపోయేట్టుగా వుండాయే....?!" వదరుతున్నట్లు గొణుక్కుంటూ వీధిలో కొచ్చేశాడు.

ఆనారోగ్యంతో... ఒకడే... బయలుదేరుతుంటే... చూస్తూ ఉండలేకపోయాడు నాగోజీ

గబగబ ఊర్లోకి వెళ్లి, ఎలాగో ఓ పదిమంది యువకుల్ని అతిబలవంతాన ఒప్పించి, వాళ్లతోబాటు అతనికి తోడుగా నడిచాడు నాగోజీ.

సిద్ధోజీ యాత్ర కొస్తున్నాడని తెలిస్తే –కుప్పం వరకు దారిపక్కనున్న పల్లెల దగ్గర తండోప తండాలుగా ఒకప్పుడు ప్రజలు నిలబడి చూసేవాళ్లు. కానుక లిచ్చేవాళ్ళు, హారతులు పట్టేవాళ్ళు!

కానీ, యిప్పుడు ఆ జనసమర్థం లేదు...

ఆ అభిమానమూ లేదు...

ఆ కోలాహలమూ లేదు!

"రంగూ జండాల భజన... రంజమైన రంగని భజన...

రయామున పోవుచున్నదే పండారి జేర...

ప్రబలముగా పోవుచున్నదే..."

– చేతులు పైకెత్తి పాండురంగ భజన కీర్తన ఆలపిస్తూ ముందుకు సాగుతున్నాడు సిద్ధోజీ.

అదే నుడుగు నాలపిస్తూ.... నాగోజీ, అతని అనుచరులు అతన్ననుసరించారు.

దారి పక్కన నిలబడివున్న ఒక్కరిద్దరు హారతులిచ్చి, పసుపు కుంకాలు పెట్టారు. కానుక లిచ్చారు.

ఎంతో భక్తి తన్మయత్వంలో మునిగిపోయి పాడుకుంటూ ముందుకు నడుస్తున్నారు వాళ్లు.

అప్పుడప్పుడు కుళ్ళుదగ్గు దగ్గుకుంటూ, ఆయాసపడిపోతూ ముందర వెళుతున్నాడు సిద్ధోజీ.

అనతికాలంలోనే ఆ బృందం వైపు పరుగెత్తుతుంటే... సిద్ధోజీ బుఱ్ఱలోకి ఏవేవో ఆలోచనలు జొరబడ్డాయి. బస్సు చంద్రగిరిని సమీపిస్తుండగా... పక్కనే కూర్చొని వున్న నాగోజీతో అన్నాడు –

“వొరేఁ... నాగా! చంద్రగిరిలో దిగి మంగాపురం దారింటీ నడిచిపోదామా....ఎగవ తిరుపతి దారి గుండా పోదామా?”

“మంగాపురం దారి యిప్పుడు పాడుబడి పోయుండాది...ఆ దారెంట యిప్పుడెవురూ నడవడం లేదు. అందునా కొండల్లో ఏదో పులి తిరగతా వుండాదనీ, అప్పుడప్పుడూ దొంగతనాలు కూడా జరగతా వుండాయనీ మొన్న పేపర్లో యేసిండారు. అంతేగాకుండా ఎర్రచందనం దొంగలుంటారు. పైగా నీకు ఆరోగ్యం బాగాలేదు గదా... కొండపైకి నడిచెందుకు? బస్సులో పోదాము!” అన్నాడు నాగోజీ.

“వద్దురా!మనం యాత్ర జేసిన ప్రతిసారీ నడిచి పోతుండాము. ఈసారీ అట్లే పోదాం!”

“అదిగాదప్పా.. నా మాటిను! నువ్వు నడవలేవు. మధ్యలో ఏదన్నా యిదయితే కష్టం గదా!”

“మద్దెలో ఏమవుతాది? అంతగా అయితే పాణం పోతాది... అంతేగదా! కొండపైన – అదీ బెమ్మోత్సావాల్లో పాణంపోయే అదురుష్టం ఎందరికొస్తాది? మనం నడిచి పోవాల్సిందే!”

“ఈ ముసిలోడు ఏది పట్టుకుంటే అదే...!” అనుకుని, “నీ యిష్టం!” అన్నాడు నాగోజీ.

వాళ్లు ఇలా మల్లగుల్లాలు పడుతుండగానే... బస్సు తిరుపతి బస్టాండ్లో ఆగింది.

సరిగ్గా అప్పటికి మధ్యాహ్నం మూడు గంటలయింది!

బస్సు దిగి నేరుగా అలిపిరి దారిపట్టారు.... అతికష్టం మీద చుక్కల పర్వతం దాటారు.

పళ్ళ బిగువుతో నడుస్తున్నాడు సిద్ధోజీ!

అతను తన అనారోగ్యం కూడా లెక్క చెయ్యడం లేదు... ఏదో మొండిధైర్యం అతన్ని ఆవహించి నడిపిస్తోంది.

అప్పుడప్పుడు ఆయాసం, దగ్గు తన్నుకొస్తున్నా – ఊపిరాడని ‘గస’ నడవనీయలేక పోతున్నా – అతను పట్టించుకోవడం లేదు.

“ఎంత దూరమో! పందరిఎంత దూరమో?”

నడకతో బాటు ఆ కీర్తనా అతని నోటివెంట వెలువడి ఆ ఏడుకొండల్లో ప్రతిధ్వనించ సాగింది.

నడిచేంతసేపు... అతను అలా కీర్తనో, దరువో, పద్యమో ఏదో ఒకటి నిరంతరంగా పాడుతూనే వున్నాడు.

వారితోబాటు నడుస్తున్న ఓ భక్తుడు – “ఏడుకొండల వాడా.... ఎక్కడున్నావయ్యా...

ఆ...ఆ...! ఎన్ని మెట్లెక్కినా కానా రావేమయ్యా... ఆఁ...” అంటూ అతిమధురంగా పాడుకుంటూ ఎక్కుతున్నాడు.

అతని పాట వింటుంటే... సిద్ధోజీకి తన్మయత్వం కలుగుతోంది.

గడ్డమూ, మీసాలు పెంచుకున్న ఏభై ఏళ్ళ అజ్ఞాత భక్తుడతను. జుట్టు కూడా మూరెడు పొడవు పెంచాడు. ఆ పాటైపోతూనే మరో పాటెత్తుకున్నాడతను...

“నడిరేయి ఏ జాములో.... స్వామి – నిన్ను చేర దిగివచ్చునో...!”

‘అబ్బ! ఏమి కంఠ్లం! ఏమి పాట! అపర ఘంటసాల మాదిరి పాడతా వుండాడు... మహన్నభావుడు! దేవుడు ఆయప్పకు మంచి కంఠ్ల మిచ్చినాడు... ఏ ఊరోడో?!’ అని మనసు అని మనసులోనే అనుకొని, “అయ్యా... కొంచెముండు!” అన్నాడు.

“ఏ ఊరు సామీ నీది? అంత బాగా పాడతా వుండావు?”

– పక్కనే వున్న పిట్టగోడమీద కూర్చుంటూ అడిగాడు సిద్ధోజీ.

“మాది పులిచెర్ల కుప్పల్లె” అంటూ – అతనూ అక్కడే కూర్చున్నాడు.

“నీ పేరు?” అతని ముఖంలోకి చూస్తూ అదిగాడు సిద్ధోజీ.

“రాసాని వీరయ్య” అని వీరయ్య “సరే మీదేవూరు పెద్దాయనా” సిద్ధోజీని ఎగాదిగా చూశాడు.

“మాది కుప్పం దెగ్గిర యామిగానిపల్లె! ఈళ్ళందరికీ నేను గురువును!”అంటూ తమ యాత్ర గురించిన విశేషాలన్నీ వివరించాడు సిద్ధోజీ.

నాగోజీ, అతని అనుచరులు కూడా అక్కడికి వచ్చి కూర్చొని, విశ్రాంతి తీసుకోసాగారు.

“నువ్వేమన్నా నాటకా లాడతావా?” అడిగాడు సిద్ధోజీ.

“ఓఁ... అప్పుడప్పుడు ఆడినాన్లే పెద్దాయనా!”

“ఏమేమాడినావు?

“సుక్కులూరి రామనాటక మాడినా! మైరావణ చరిత్ర, శశిరేఖా పరిణయం, సంతవేలూరి లవకుశ, యిరాటపర్వం.. ఇంకా ఆడినాన్లే!”

“సరేప్పా ఈరప్ప! పులిసెల్లలో పెసిరింటు కిష్టారెడ్డి అంగిడెంకటముని, వోటల్ సిద్ధారెడ్డి, మిల్లులో గుర్రప్ప, కల్లంగాడ వెంకట మునినాయుడు.... అందరూ బాగుండారా?”

“వోళ్ళెట్ల తెలుసు పెద్దాయనా నీకు?” ఆశ్చర్యంగా అడిగాడు వీరప్ప.

మిగిలినవాళ్ళు ఉత్సాహంగా వినసాగారు.

“తెలీకేమి నాయనా....ఎన్నో ఏండ్లు ఆడ భారతా లాడినా!”

“ఓహోఁ.... యిప్పుడు గుర్తుకొచ్చిందిలే! ఎక్కడ భారతా లాడినా ఈ పక్క... కంగుందోళ్ళనే గదా పిలుస్తారు!యింతకూ... నువ్వు ఏ కంపెనీలో ఆడినావు?”

“వొగరి కంపెనీ అంటా ఏమీ లేదు నాయనా! నేనే మా ఊరోళ్ళతో నాటక కంపెనీ నడపతా! అస్సలు కంగుందోళ్ళమంటే మేమే!” వారి గురు పరంపర గురించి, ఉగాది నాటకాల గురించి అన్నీ వివరించాడు సిద్ధోజీ.

“సిద్ధప్ప కంపెనీ అంటే మీదేనా?” అనుమానంగా అడిగాడు వీరప్ప.

“సిద్ధప్పంటే ఆయప్పే! మా గురువు!” ఓ కళాకారుడు చెప్పాడు.

“ఆఁ.. అట్ట జెప్పు! నువ్వు తెలీందెవురికి లేన్నా! ఉడాందాసు హరికథన్నా, సిద్ధప్పోళ్ళ నాటకాలన్నా మా పక్క వేళంవెర్రి గదా! ఏమైనా నాటకాలంటే మీ కంగుందివే లేన్నా! అసలొగ తూరి వారణావతంలో... నువ్వు భీముడిగా ఏసింటివి – సుందరిడింబిగా నారాయణో, ఎవరో అనుకుంటా – నువ్వు స్టేజీమింద కూసోని – ‘యిడింబీ... ఇన్నెందుగ్గానీ – నన్ను గనక నవ్వించినావంటే సాలు.... పెండ్లి జేసుకుంటా! లేకుంటే లే...!’ అంటా బిగుసుకోని కూసుంటివి.యిడింబి ఎన్ని జెప్పినా, ఏం జేసినా నవ్వకపోతివి! జనాలకు నీ ఆకర్సన (యాక్షన్) వొగ వింతై పూడిశ! ఎందురో నీకు దుడ్లు యినాముగా ఇచ్చుకుండ్రి. అప్పుడు నేను కూడా అయిదు రూపాయల నోటు నీ భుజకీర్తికి పిన్నీసేసి కుడితిలే! ఇది పదయిదేండ్ల ముందు మాట – అది యింకా నాకు గ్యేఁవనమే!”

– ఎంతో అభిమానంగా చెప్పాడు వీరప్ప.

సిద్ధప్ప మనసు ఆనందంతో నిండిపోయింది.

అలా ఏవేవో మాట్లాడుకుంటూ తిరిగి నడక ప్రారంభించాడు.

దారిలో వీరప్ప ఏవేవో కబుర్లు చెప్పాడు. ఎన్నెన్నో సంఘటనలు వివరించాడు. సిద్ధోజీ గురుపీఠం స్థితిగతుల్ని వివరించి బాధపడ్డాడు. ఆ సందర్భంగా వీరప్ప –

“బాధపడవద్దు పెద్దాయనా! ప్రతి మనిషి పుటకకు వొగ కారణం వుంటుందంటారు. మడిసై పుట్టినందుకు ఆ పనేదో నెరవేర్చి పోవాల! ఆ పని నువ్వు పూర్తి చేసినావు లేన్నా... దిగులు పడాల్సిన పనిలేదు!” అన్నాడు.

ఆ మాటలు అతని మనసు పైన బాగా పనిచేశాయి...

అతనికి కాస్తంత ఊరట కలిగించాయి! అంతవరకు మనస్సులో వున్న అశాంతంతా... ఏదో అజ్ఞాతహస్తం పెకలించి తీసేసి నట్టనిపించింది.

ఎలాగయితేనేం – అర్థరాత్రి వేళకు తిరుమల చేరుకున్నారు.

తిరుమలలో ఎక్కడ చూసినా లైట్లే! రంగురంగుల లైట్లు!!

శంఖుమిట్టన లైట్లు! గాలిగోపురం పైన లైట్లు! ఘంటసాల పైన లైట్లు! ఎటు చూస్తే అటు లైట్లు! ప్రతి ప్రదేశం లోను... చివరికి చెట్లల్లో కూడా లైట్లే!

లైట్లు! లైట్లు! లైట్లు!!!

ఒకటే లైట్లు!

ఆకాశంలోని తారలన్నీ నేలకు దిగిపోయి, అక్కడ వొదిగిపోయినట్లు.. అంతా లైట్లమయం!

ఎక్కడ చూసినా... జనమే!

జనం! జనం!!... ఒకటే... జనం!!!

నేల ఈనినట్లు... అక్కడంతా జనాల మయం!

ఆ లైట్లను, జనాన్ని చూసుకుంటూ... చెక్కభజన చేసుకుంటూ... వాళ్ళ బృందం ముందుకు సాగిపోతోంది.

భక్తులు వాళ్ళ భజనను చూడసాగారు.

వీరప్ప ఎప్పుడో భక్తుల్లో కలిసిపోయాడు.

"అన్న రావణ ఆలకింపుము – విన్నవించెద నా విధీ!

చిత్రకూట అడవిలోన జరిగినా సంగతీ!

దశరథ పుత్రులంట రామలక్ష్మణులిద్దరూ....

కామకేళికి కలియరమ్మని కష్టపెట్టిరి మనుజులు!

బలమున నను బట్టిరీ... పలు భంగములు గావించిరి!"

– శూర్పణఖ రావణుడికి చేసే దుర్బోధ.... పాటరూపంలో అందర్నీ అలరింపజేస్తోంది.

తిరువీధుల్లో దారిపొడవునా వీళ్ళ భజనలు సాగాయి.

మొదట శంఖుమిట్ట దిగి, దక్షిణ మాడవీధి గుండా గుడికి ఎడమవైపు నుంచి పడమటి వీధిలోకి వాళ్ళ భజన సాగింది. ఆ గుడి వెనుక నుంచి దక్షిణ మాడవీధిని దాటి, అక్కడనుంచి కోనేరు కవతల వరదరాజ స్వామి ఆలయం ప్రక్కగా తేరువీధిలోకి వచ్చింది.

వాళ్ళ భజనలు చూస్తున్న భక్తులు "శభాష్" అంటున్నారు.

గుడి దగ్గరయ్యే కొద్దీ... రద్దీ... రద్దీ... ఒకటే రద్దీ!

ఎక్కడ చూసినా సందోహమే... జన సందోహం!!

ఎక్కడ చూసినా కోలాహలమే... భక్తుల కోలాహలం!!

నది పొంగినట్టుగా... వందలు వేలుగా... లక్షల మంది జనం..!

ఎంత దూరం చూసినా మనుషుల తలలే.... మానవాకారాలే! మనుషుల మొండేల పైన తలకాయలు ఆరబోసినట్టుగా వుంది – 'నడిచే నల్లమేఘంలా మనుషుల కదలిక!

మెల్లగా నర్తించుకుంటూ గుడి ముందరికొచ్చారు వాళ్ళు.

సీరియల్ లైట్లతో, కళ్ళు మిరిమిట్లు గొలుపుతూ... గుడి ప్రాకారాలు!

అంతటి లైట్ల అలంకరణ వాళ్లు ఎన్నడూ చూసి ఎరుగరు.

ఆ ఏడు మరీ గొప్ప అలంకరణ!

గుడి ముందర లైట్లతోనే.... శంఖుచక్రాలు మంటపానికి ఆరుతూ వెలుగుతున్న లైట్లతో 'ధర్మో రక్షతి రక్షితః, ఓం నమో నారాయణాయ' అష్టాక్షరీ మంత్రం! గుడిపైన శ్రీమన్నారాయణుడు శేషతల్పం పైన పడుకుని చిద్విలాసంగా నవ్వుతున్నట్లు, లక్ష్మీదేవి కాళ్లు వత్తుతూ కూర్చున్నట్లు రంగురంగుల లైట్లతోనే ఏర్పాటు!

ఆ లైట్లు ఆరుతూ, వెలుగుతుంటే.... ఉండుండి ఆ దృశ్యం కనిపిస్తూ మాయమై పోతుంటే.... దానికి నీలాకాశమే అగాధ జలధి క్షీర సముద్రంగా అమరిపోయి, ఆకాశంలో నుంచి ఆ జగన్నాటక సూత్రధారి దర్శనమిస్తున్నట్లుగా వుంది.

మరోవైపు ఆ వేంకట నాయకుడ్నీ లైట్లతోనే అమర్చారు.

ఆ రెండు దృశ్యాల మధ్యలో 'ధర్మాన్ని రక్షించండి. అది మిమ్మల్ని రక్షిస్తుంది' అన్న పెద్ద పెద్ద అక్షరాలు.... రంగు రంగుల బల్బుల్లో ఆరుతూ, వెలుగుతూ కనిపిస్తున్నాయి.

అక్కడ...

ఆ గుడి కుడ్యాలకు, ఆకాశంలోని నక్షత్రాలు తారామణి హారంగా వ్రేలాడదీసినట్లు లైట్లు!

అందమైన సప్తవర్ణాల ఇంద్రధనుస్సును ఆకాశం నుంచి అమాంతం లాక్కొచ్చి గుడి గోడల అంచులకి అలంకరించినట్లు లైట్లు!

ఆ వేళ..... ఆలయాన్ని చుక్కలతోనే చెక్కినట్లు లైట్లు!

తాము సరాసరి వైకుంఠంలోకి అడుగుపెట్టినట్లు అనుభూతి!!

అవన్నీ చూసేటప్పటికి ఇంకా ఉత్సాహం పుంజుకుంది వాళ్ళకి! ఒకదాని తర్వాత ఒకటిగా పాటలు పాడుతూ, వీరావేశంతో నర్తిస్తున్నారు.

"ఏమమ్మా... సీతమ్మ – పిలిచిన పలుకవు!

పిలిచిన పలుకవు... కనులెత్తి చూడవు!

దీవించి నను బంపమ్మా.... ఓ సీతమ్మా!

సెలవిచ్చి నను బంపమ్మా.... ఓ సీతారో...."

హనుమత్సందేశాన్ని చిత్రించిన ఆచెక్క భజన పాటతో వేగాన్ని పుంజుకుని నర్తించసాగారు. వాళ్ళ భజన అక్కడి జనాలను ఆకర్షిస్తోంది. ప్రజలు అక్కడే గుమికూడి తిలకించసాగారు.

పాట ఆది కెక్కించబడింది. నర్తన వేగాన్నందుకుంది!

"మాయమ్మ సెలవిచ్చు.... నాకేమి భయమింక...

వనమంత పెరికేశ.... తల్లాకిందులు జేశ....

బోతాడే హాంజనేయుడు... సప్త సముద్రాలు దాటి...

సీతా హానబాలు.... రాముల కిస్తాడే... బోతాడే హాంజనేయులు"

– ధృతగతిలో సాగిపోతున్న ఆ పాటకు తగిన విధంగానే అడుగులు ఎత్తి ఎత్తి వేస్తున్నారు.

వాళ్ళు అడుగులు వేస్తుంటే.... గాలిలో తేలిపోతూ ఎగురుతున్నట్టుంది. వాళ్ళ ఆకారాలు గాలిలో కదులుతున్నట్లుంది.

వాళ్ళ అడుగులకి అక్కడి భూమి అదురుతున్నట్లనిపిస్తోంది.

సిద్ధోజీకి ఆయాసం ఎక్కువైంది!

ప్రజలు చూస్తూనే వున్నారు.

ఆయాసాన్నణుచుకుంటూనే తన వంటిలోని శక్తినంతా కూడదీసుకుని వాళ్ళతో బాటుగా ఎగురుతున్నాడు సిద్ధోజీ.

అది పేరుకు అడుగే గానీ, అదొక పరుగు లాగుంది!

అలా గంతులు వేయనూ వేయనూ అతనికి దగ్గు ముంచుకొచ్చింది.....

గుండె దడ పుట్టింది.... ఊపిరి బిగతన్నింది.... అంతే....

ఉన్నట్టుండి తూలి.... కిందపడ్డాడు!

నర్తన ఆగిపోయింది!!

అందరూ గురువును చుట్టుముట్టారు.

సిద్ధోజీ ఆయాసంతో రొప్పుతూ మెలికలు తిరిగిపోతున్నాడు!

ఆ స్థితిలో తండ్రిని చూసి కళ్ళనీళ్ళు పెట్టుకున్నాడు నాగోజీ.

ఆ సమయంలో అప్రయత్నంగా వీరప్ప కోసం అతని కళ్లు వెదకసాగాయి.

ఎక్కడా వీరప్ప ముఖమే కనిపించలేదు.... 'బహుశా ఈ వేల్టికి గుండు కొట్టుకోనుం టాడు. ఈ గుండ్లలో కలిసిపోయుంటాడు. వీరప్పది ఏ గుండని గుర్తుపట్టేది?' అనుకున్నాడు.

ఆ వేళ.... దారిలో వీరప్ప చెప్పిన మాటలు గుర్తుకొచ్చాయి....

"బాధపడవద్దు పెద్దాయనా! ప్రతిమనిషి పుట్టకకు వొగ కారణం వుంటుందంటారు. మడిసై పుట్టినందుకు ఆ పనేదో నెరవేర్చి పోవాల! ఆ పని నువ్వు పూర్తి చేసినావు లేన్నా... దిగులుపడాల్సిన పని లేదు!"

అదే సమయంలో..... చనిపోయే ముందు తన తండ్రి చెప్పిన మాటలూ చప్పున గుర్తుకొచ్చాయి సిద్ధోజీకి. ఆ మాటలే ఆ వేళ.... కొండల్లో పెట్టిన కేకలా పదే పదే వినిపిస్తూ, చెవుల్లో ప్రతిధ్వనిస్తూ గింగురుమన్నాయి.

"ఏడవద్దురా.... ఇదంతా ఒక నాటకం! ఈ నాటకంలో ఎవరి పాత్ర వాళ్ళు ముగించుకోని పోతావుంటారు. నా పాత్ర అయిపోయింది. నువ్వేం దిగులుపడొద్దు. నీకు రెండు మాటలు సెప్తా యినుకో? మన వంశాచారం ప్రకారం ప్రతీ ఉగాదికీ ఊర్లో 'ఆట' యేపించు. ప్రతి బెమ్మోత్సవానికీ తిరుపతి కొండకు యాత్ర సాగించు!"

– అవే మాటలు... తన తండ్రి తనకు అప్పుడు చెబుతున్నట్లే అనిపించింది.

ఆ మాటలు అలాగే తన కొడుకు నాగోజీకి చెప్పి,. "నా హయాంలో... ఈ చివర కొన్నేండ్లు ఉగాది నాటకం ఆపేసినాం! నువ్వు తిరిగి నిలబెట్టు. అట్లాగే... ఈ భజన యాత్ర నిలపొద్దు!" అన్నాడు.

ఆ మాటకు నాగోజీ కుళ్ళికుళ్ళి ఏడ్చాడు.

కొడుకు కళ్ళనీళ్ళు తుడిచి, "చింతపడొద్దు! ఇక్కడ ఈ నరపాత్ర చాలించే అదృష్టం ఎందరి కొస్తుంది చెప్పు?!" అన్నాడు.

అందరూ అతన్నే చూడసాగారు.

ఎవరో సప్తగిరి ఆసుపత్రికి పరుగెత్తారు... అంబులెన్సుకోసం!

కళాకారులందరూ అతని దగ్గరగా కూర్చున్నారు.

"గురువా?" అంటూ దుఃఖపడ్డారు.

'వద్దు... నాకోసం ఏడవద్దు! భజన మానొద్దు! ఎత్తండి జండాలు, యెయ్యండి పండరి భజన! ఎఱ్ఱజండాల భజన కానీఁ... ఊఁ..." ప్రోత్సహించాడు.

అందరూ చేతుల్లో ఎఱ్ఱజండాలు పట్టి పైకి లేచారు. వలయాకారంగా నిలబడ్డారు.

"నిలపొద్దు... కానీఁ....." అంటూ అరిచాడు గురువు.... ఆపైన సంజ్ఞలు చేశాడు.

నాగోజీ తండ్రి తలను తన వడిలో చేర్చుకొని అక్కడే కూర్చున్నాడు.

అలాగే నర్తిస్తూనే మరో పాటందుకున్నారు భజనగాళ్ళు!

మద్దెల, తాళాలూ శ్రుతి కలిపాయి.

అందరూ చూస్తూనే వున్నారు....

"శ్రీ పాండురంగ విఠలా....

కరుణా తరంగ విఠలా....

సంసార సాగరాన నిను మరిచీ నామయ్యా.... రంగా!" ॥శ్రీ॥

వాళ్ళ నర్తన సాగిపోతూనే వుంది.

"నీకే తగురా రంగా... నీకే తగురా కృష్ణా!

దీనుల రక్షింప బిరుదు నీకే తగురా రంగా!"

పాట తర్వాత పాట.... అడుగు తర్వాత అడుగు...

వేగంగా సాగిపోతూనే వుంది భజన!

తబలా, తాళాలూ ఆ పాటకు మధురత్వాన్ని కల్పిస్తున్నాయి.

ఆ పాట వింటూ, ఆ నర్తన చూస్తూ.. ఒక్కసారి వైకుంఠ మహద్వారం వైపు తలతిప్పి చూసి, రెండు చేతులెత్తి ఒక్కసారి నమస్కారం చేసి, అలాగే నేలకు వరిగిపోయాడు సిద్ధోజీ.

అతని పరిస్థితినంతా గమనించి అంబెలెన్సు కోసం వెళ్ళిన వ్యక్తి డాక్టరుతో సహా అక్కడికి వచ్చాడు. అక్కడి అంబులెన్సు వచ్చి ఆగగానే.... భజన ఆగిపోయింది!

వచ్చిన అంబులెన్సులో నుంచి గబగబ దిగి, ప్రజల్ని తోసుకుంటూ ముందుకు వచ్చి సిద్ధోజీ చేతిని తనచేతిలోకి తీసుకొని నాడి చూసి, పరీక్షించి పెదవి విరిచాడు డాక్టరు.

"సార్!" అన్నాడు నాగోజీ.

"లాభంలేదు... పోయాడు!!"

తిరిగి అదే అంబులెన్సులో వెళ్ళిపోయాడు డాక్టర్.

చిన్న వయస్సులోనే గురుపీఠ మెక్కి దాదాపు నలభై అయిదేండ్లకు పైగా 'గురువు'గా వ్యవహరించి తన చివరి యాత్రను చాలించాడు సిద్ధోజీ.

## 27

**గు**రువుల తోపులోనే అతని తండ్రి ప్రక్కనే సిద్ధోజీని పూడ్చారు.

అతని గుంతపైనా - అతని పేరు, జననం, మరణం చెక్కించిన నిలువు బండను నాటించాడు నాగోజీ.

ఇప్పుడా తోపులో పంచపాండవుల్లా అయిదు రాళ్ళయ్యాయి.

సెకనులతో ప్రారంభమైన కాలం, నిముషాలుగా, గంటలుగా రోజులుగా, నెలలుగా, చివరికి సంవత్సరాలుగా వేగంగా గడిచిపోతోంది.

గురువుల తోపు పైన కోర్టులో వేసిన యాజ్యం వగతెగలేదు.

ఆ తోపులోకి ఎవ్వరూ వెళ్ళలేదు!

ఏండ్లు గడిచిపోతూనే వున్నాయి!

సిద్ధోజీ పేరు కూడా ఆ ఊరి ప్రజల జ్ఞాపకాల పొరల్లోకి జారిపోసాగింది.

నాగోజీ కూడా ముసలివాడైపోయాడు.

రంవణ పెళ్ళి చేసుకుని, టీచరుగా పనిచేస్తున్నాడు. రంవణ వెనక పుట్టిన ఇద్దరి ఆడపిల్లలకు ఎప్పుడో పెళ్ళిళ్ళయిపోయాయి.

వాళ్లందరికీ పిల్లలు పుట్టారు.

వాళ్లూ పెద్దవాళ్లవుతున్నారు!

ఊరు రెండింతలు పెరిగింది!!

రంవణ ఉద్యోగరీత్యా ఇల్లూ వాకిలీ అమ్మేసి, పట్నంచేరిపోయాడు.

'కుప్పం' టవున్ కూడా పెరిగి పెద్దదయింది.

పట్నానికి కావాల్సిన అన్ని హంగులూ వచ్చాయి. చుట్టుపక్కలా ఎన్నో చిన్నచిన్న పరిశ్రమలు నెలకొల్పబడ్డాయి.

ఆ పట్నంలో రంవణ సంసారం సజావుగానే సాగిపోతోంది!

కానీ, 'గురువుల తోపు' మాత్రం అలాగే వుండిపోయింది.

అయినా ఎవ్వరూ ఆ తోపులోకి పోలేదు.

ఉగాది నాటకాలూ లేవు.... తిరుమల యాత్రలూ లేవు....

ఆ ఊర్లో నాటకా లాడేవాళ్ళే లేకపోయారు!

'గురు పరంపరా' ఆగిపోయింది!!

కానీ... వాటన్నింటికీ చిహ్నంగా ఆ తోపు అలాగే నిలిచివుంది!!!

దట్టంగా, చెట్లుచేమలు బలిసిపోయి, చీకిపొదలు నిండిపోయి అడుగు పెట్టడానిక్కూడా వీలులేని ఓ కీకారణ్యాంలా... చివరికి కుక్కలు, కోళ్ళు సైతం చొరబడలేని ఒక దండకారణ్యంలా మారిపోయి... అలాగే నిలిచిపోయి వుంది.

ఇప్పుడది మామూలు తోపు కాదు...

నరులెవ్వరూ అడుగు పెట్టడానికే సాహసించలేని దట్టమైన తోపు!

చీకిచెట్లు, సీమరాలచెట్లు, మామిడిచెట్లు, కానగచెట్లు, జెముళ్ళు, నాగదార్లు, జిల్లేళ్ళు ... అన్నీ ఒకదానితో ఒకటిగా కలిసిపోయి, పెనవేసుకుపోయి, ముడివేసుకుపోయి, బలిసిపోయి చిక్కబారిపోయిన తోపు!

నాటకం ముగిసినా, నటులు పోయినా.... అక్కడే నిలబడిపోయే రంగస్థలంలా, అయిదు తరాల చరిత్రకు సాక్షీభూతంగా నిలబడిపోయిన తోపు!

దానిపేరు ఇప్పుడు 'గురువుల తోపు' కాదు....

కేవలం.... 'దయ్యాల తోపు!'

## 28

**మ**ళ్ళీ రెండు తరాలు గడిచాయి!

నాగోజీ ఎప్పుడో చనిపోయాడు.....

రంవణ బిడ్డలు పెరిగి పెద్దవాళ్ళయి, పెళ్ళిళ్ళు చేసుకుని, పిల్లల్ని కూడా కన్నారు.

అప్పటికా ఊర్లో 'గురువుల తోపు' గురించి గానీ, దానికున్న చరిత్ర గురించి కానీ తెలిసినవాళ్ళే లేకపోయారు.

గురువుల పరంపరా, తోపు ప్రాధాన్యత అంతా ఇప్పుడొక ఇతిహాసంగా మారిపోయింది. ఒకప్పుడు ఆ పల్లెలో జరిగిన ఒక కథగా నిలిచిపోయింది.

'కుప్పం' యిప్పుడు పెద్ద పట్నంగా ఎదిగిపోయింది! రోడ్లు వెడల్పయ్యాయి... కాలేజీలు వచ్చాయి. అన్నివిధాలా అభివృద్ధి చెంది, జిల్లాలోనే ఒక ముఖ్య వ్యాపార కేంద్రంగా మారిపోయింది. పట్నంలో కొత్తగా ఒక యూనివర్శిటీ కూడా స్థాపించబడింది.

'యామిగానిపల్లె' ఇప్పుడు 'చిన్న పల్లె' కాదు... ఓ మోస్తరు పేట!

ఒకరోజు ఉదయాన...

ఎవ్వరో 'దెయ్యాల తోపు'ను నరికేస్తున్నారన్న వార్త – ఆ ఊర్లో దావానలంలా వ్యాపించింది.

"ఉండుండి ఆ దెయ్యాల తోపును ఎవరు కొన్నారబ్బా? ఎందుకు కొన్నారు? అసలెందుకు నరుకుతున్నారు?" అంటూ ఊరు ఊరే ఆశ్చర్యపోసాగింది.

చరిత్ర సృష్టించేవాళ్లు కొందరుంటే – అదే చరిత్రను ధ్వంసం చేసి దానిస్థానే సరికొత్త చరిత్రను సృష్టించేవాళ్ళూ వున్నట్లే... అందులోని పాత పుటలకు వెల్లవేసి కొత్త చరిత్రను కొత్తసిరాతో రాసేవాళ్ళు వుంటారు.

అలాగే... ఒక వీడియో క్యాసెట్‌లో అంతకుముందు చిత్రించిన బొమ్మల్ని చెరిపేసి, దానిపైన మళ్ళీ మళ్ళీ ఎన్నో కొత్తకొత్త చిత్రాల్ని చిత్రించకున్నట్లే – ఈ రోజుల్లో స్మశానాల్ని సైతం ఆక్రమించుకొని, అందులోని సమాధుల్ని పడగొట్టి చదునుచేసి, ఆ సమాధుల

పైనేగుడిసె లేసుకుంటున్నారు. వేసిన ఆ గుడిసెల్నీ కూలదోసి పెద్ద పెద్ద భవంతుల్ని, అపార్టుమెంటుల్ని లేపుతున్నారు.

మరి... ఒకప్పటి గురువుల తోపైన – ఆ 'దయ్యాల తోపు'ను నరికేస్తున్నారంటే...
మరి – ఏ కొత్త నిర్మాణం అందులో ఆకారం దిద్దుకోబోతోందో ...
ఏ కొత్త నందన వనాలు అందులో ప్రాణం పోసుకోనున్నాయో ...
ఏ కొంగ్రొత్త అంశం ఆ స్థానంలో ఊపిరి పోసుకోబోతున్నదో ...
ఏ కఠిన శిలల సిమెంట్ కీకారణ్యాలు అవతరించబోతున్నాయో ...
కొందరి సమాధులే... మరికొందరి పునాదు లైనట్టు!!.

*The stage constitutes a very important chapter in the social and political life of a people.*
*- prof. H.N. Das Gupta*





# BATHUKATA

*A Noval by Dr. V.R. RASANI*

రాసాని గారి 'బతుకాట' నవల నిజంగా దృశ్యకావ్యం. ఆయన శైలి, కథనం ఎంతో ఉన్నతంగా ఉన్నాయి. పుస్తకం మొదలు పెడితే చివరివరకు ఆపకుండా చదివిస్తుంది. త్రీ-డి సినిమాలు చూసిన ప్రేక్షకులకి మామూలు సినిమాలకీ, త్రీ-డి సినిమాలకూ గల తేడా అర్థమవుతుంది. త్రీ-డి చిత్రాలలో లోతు వుంటుంది. అంటే.... దృశ్యం ఒక కాన్వాస్ మీద గీసిన బొమ్మలాగా కాకుండా, మన ముందరే జరుగుతున్నట్లుంటుంది. రాసానిగారి కథనంలో ఈ త్రీ-డి ఎఫెక్టు వుంది. చదువుతుంటే ప్రతి సంఘటనా మన కళ్ళముందే జరుగుతున్నట్లుంటుంది. ఆ పాత్రలను, సంఘటనలనూ మౌనంగా చూస్తున్న పాత్ర అయిపోతాం మనం. ఈ అద్భుత శిల్పాన్ని కథనంలో ప్రవేశపెట్టడం – ప్రజ్ఞ, ఉపజ్ఞ ఉండి, బాగా చేయి తిరిగిన రచయితకే సాధ్యం...

'బతుకాట' నాటి రంగస్థల నాటకాలకు సంబంధించిన ఒక ఎన్‌సైక్లోపీడియా వంటిది.

బతుకాట పేరుకు నవలే కానీ, నిజానికి ఇది నిజమైన వ్యక్తుల జీవిత గాథ. నిజ జీవితాలను కథాత్మకంగా మలచి, నవలీకరణ చేసినట్లు స్పష్టమవుతుంది.

జగన్నాటకంలో జీవన నాటకం ఒక అంతర్భాగం. ముఖానికి రంగులేసుకుని, రంగస్థలంపైన గొంతు విప్పి 'అడుగులు' వేయకపోతే తమ బతుకు బండి ఒక అడుగు కూడా ముందుకు సాగలేని కుటుంబాలు ఎన్నో వున్నాయి. తమ బతుకులు కొవ్వొత్తిలా కాలి, కరిగిపోతున్నా ప్రజల్ని ఆనందింప చేయడంలోనే పరమార్థాన్ని వెతుక్కునే... అసలు సిసలైన కళాకారుల యథార్థ వ్యథార్థ జీవనగమనమే 'బతుకాట'.

– కె.ఆర్.కె. మోహన్

విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్
చంద్రం బిల్డింగ్స్, చుట్టుగుంట, విజయవాడ-520 004